ఈనాడు

కరీంనగర్ 20-1-2019 ఆదివారం సిటీ సంపుటి 45 సంచిక 160

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00. పేజీలు 20+16+32 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

TG

ఈనాడు

కరీంనగర్ 20-1-2019 ఆదివారం సిటీ సంపుటి 45 సంచిక 160
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00. పేజీలు 20+16+32 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



కాచుకో.. మోదీ!

ఎన్డీయే సర్కారు ఇంటికి పోవడం ఖాయం

- విభేదాలను పక్కన పెడతాం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తాం
- 'ఐక్యతా భారత్' బహిరంగ సభలో గళమెత్తిన 22 పార్టీల నేతలు
- కేంద్ర సర్కారు తీరుపై మూకుమ్మడిగా ధ్వజం
- కోల్‌కతాలో భారీ ర్యాలీ

సార్వత్రిక ఎన్నికల ముంగిట విపక్షాలు ఏకతాటి పైకి వచ్చాయి. కాంగ్రెస్ సహా ఎకాఎకి 22 పార్టీలకు చెందిన అగ్రనేతలు కోల్‌కతా వేదికగా కేంద్ర సర్కారు తీరుపై గళమెత్తారు. ఇక మోదీ సర్కారుకు మూడిందని, రాబోయే ఎన్నికల్లో భాజపాకు మిగిలేది ఓటమేనని తేల్చిచెప్పారు. ప్రజలంతా మార్పును కోరుకుంటున్నారని, విజయ దుందుభి మోగించేది విపక్షాల కూటమేనని ఢంకా బజాయించారు. తమ మధ్య విభేదాలేమైనా ఉన్నా వాటిని విడనాడి, ఏకతాటిపైకి వచ్చి మోదీని ఇంటిదారి పట్టిస్తామని ఆయా పార్టీల నేతలు చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో జరిగిన ప్రతిపక్షాల 'ఐక్యతా భారత్' ర్యాలీలో వారు పాల్గొని శంఖారావం చేశారు. ఎన్నో కీలక సమావేశాలకు వేదికగా నిలిచిన ఈ మైదానం నుంచి మోదీ సర్కారుపై పెద్దఎత్తున ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. భాజపా సర్కారును ఇంటికి సాగనంపడమే తమ ఉమ్మడి లక్ష్యమని ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత విజయోత్సవం జరిగేది ఇదే వేదికపైనంటూ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఎన్నికలకు ముందు అమరావతి సహా దేశ వ్యాప్తంగా పలుచోట్ల ఇదే తరహా బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు.

పూర్తి వివరాలు 11లో



కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన విపక్షాల 'ఐక్యతా భారత్' బహిరంగ సభ వేదికపై చేతులు కలిపిన 22 విపక్షాల అగ్రనేతలు



ముంబయిలో ఇటీవల ప్రారంభించిన భారతీయ సినిమా మ్యూజియంలో ఏర్పాటు చేసిన రాజ్‌కపూర్ విగ్రహాన్ని తిలకిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

దోపిడీదార్లంతా చేతులు కలిపారు

- లూటీని అడ్డుకున్నందునే భయంతో ఒక్కటయ్యారు
- మహాకూటమి ప్రజలకు వ్యతిరేకం
- సొంత కుటుంబాల సంక్షేమమే వాటి ధ్యేయం
- ప్రతిపక్షాలపై ప్రధాని ఘాటు విమర్శలు

12 లో

ప్రగతికి పునరంకితం

- సంక్షేమఫలాల లబ్ధిదారుల దీవెనలతోనే మళ్లీ అధికారం
- ప్రజలు అందించిన అపూర్వ విజయమే పునాది
- వారికిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- నిరుద్యోగులకు నెలకు రూ.3,016 ఇచ్చేందుకు చర్యలు
- రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ వేతనం
- ఐకేపీ ఉద్యోగాల క్రమబద్ధీకరణకు యోచన
- జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

ఈనాడు – హైదరాబాద్

గత నాలుగున్నరేళ్లలో తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించకుండానే అనేక ప్రజోపయోగ, సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చిందని గవర్నర్ నరసింహన్ చెప్పారు. రానున్న ఐదేళ్లలోనూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన లక్ష్యాలను, ప్రణాళికలను, పథకాలను నిర్దేశించుకుంటూ తమ ప్రభుత్వం పురోగమిస్తుందని ప్రకటించారు. ఎన్నికల్లో ప్రజలు అందించిన అపూర్వ విజయమే పునాదిగా వారి బతుకుల్లో సుఖ సంతోషాలు వెల్లివిరిసే బంగారు తెలంగాణ నిర్మాణం కోసం పాటుపడతామని హామీ ఇచ్చారు. ఈ లక్ష్యసాధనకు తమ ప్రభుత్వం పునరంకితమవుతుందని ఉభయసభల సాక్షిగా నిండు విశ్వాసంతో ప్రకటిస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా పురోగమిస్తోందని పేర్కొన్నారు. శనివారం శాసనసభ, శాసనమండలి సభ్యుల (మిగతా 2లో)



ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్. పక్కన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో ఇంటింటికీ నల్లా సౌకర్యం కల్పించి శుద్ధమైన తాగునీటిని అందించే బృహత్తర పథకం మిషన్ భగీరథ. దీనికింద 66 మున్సిపాలిటీలకు, 23,968 జనావాసాలకు నీళ్లి వ్వాలన్నది లక్ష్యం. ఇప్పటికే 56 మున్సిపాలిటీలకు, 18,612 జనావాసాలకు నీరందుతోంది. మార్చి చివరికల్లా వంద శాతం ఇళ్లకు నల్లాలు బిగించి నీళ్లిస్తాం.



ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు

- రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం
- వివక్ష లేకుండా అన్నిచోట్లా పనులు
- సీఎం కేసీఆర్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం తరువాత రహదారులకే అత్యధిక ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. రానున్న రెండేళ్లలో రహదారులన్నీ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటైన వాటితో సహా 12,751 గ్రామ పంచాయతీలకు బీటీ రోడ్డు సౌకర్యం (మిగతా 2లో)

'లోక్‌పాల్' కోసం మరో సత్యాగ్రహం

- స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో 30 నుంచి నిరాహార దీక్ష
- సామాజిక కార్యకర్త అన్నా హజారే వెల్లడి
- మోదీ కావాలనే జాప్యం చేస్తున్నారని ధ్వజం

2 లో



హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు సందర్భంగా గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సామాజిక కార్యకర్త అన్నా హజారే, ఎంపీ కవిత

ఇదీ సంగతి!



అంతా వేస్తు మేడం, భోజనాలు చేశారు, ఉపన్యాసాలు చెప్పారు, కాని ఒక్కరూ మీరే ప్రధాని అని అనలేదు... అంతా వ్యర్థ ప్రయాస.

సొంత జిల్లాల్లో ఎన్నికల విధులొద్దు

- మూడేళ్లు ఒకేచోట పనిచేసిన అధికారుల్నీ బదిలీ చేయాలి
- రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ

ఈనాడు, హైదరాబాద్: సార్వత్రికంతోపాటు వివిధ రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పలు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణతో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న ఏ అధికారీ సొంత జిల్లాలో పని చేయడానికి వీల్లేదని స్పష్టంచేసింది. వచ్చే మే 31 నాటికి ఒకే చోట మూడేళ్ల సర్వీసు పూర్తికానున్న అధికారులు సైతం ఆయా జిల్లాల్లో పని చేయడానికి వీల్లేదని ఈసీ తెలిపింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర ఎన్నికల సంఘం రెండు రోజుల క్రితం లేఖ రాసింది. ఈ బదిలీలన్నీ ఫిబ్రవరి 28వ తేదీలోగా పూర్తి చేయాలని.. వివరాలను మార్చి మొదటి వారంలోగా తమకు అందజేయాలని పేర్కొంది. లోక్‌సభ ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసనసభలకు ఎన్నికల నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శి నరేంద్ర ఎన్ బుటోలియా ఈ లేఖ రాశారు.

- జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి, పోలీసు ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులను 2017 మే 31వ తేదీకి ముందు జరిగిన సాధారణ లేదా ఉపఎన్నికల (మిగతా 2లో)

హాయ్ వెంకీ



విక్టరీ వెంకటేష్ సినిమాల్లో పాత్రోచితంగా కనిపిస్తాడు. క్రికెట్ చూస్తుంటే సగటు అభిమానిగా మారిపోతాడు. సంక్రాంతి వచ్చిందంటే థియేటర్‌లో హిట్లు కొట్టేస్తాడు. తాజాగా ఎఫ్2తో సంక్రాంతి అల్లుడిగా వచ్చి ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నవాళ్లకి 'ఫన్'టాస్టిక్ నవ్వులు పంచాడు. వెండితెరపై నవ్వులు పంచే వెంకీలోకి తొంగిచూస్తే అంతర్లీనంగా ఓ అద్భుతం కనిపిస్తుంది. ఓ ఆధ్యాత్మికత కోణం గోచరం అవుతుంది. జీవితంపై ఆయనకున్న పార్శ్వాలు దర్శనమిస్తాయి. ఆ విశేషాల సమాహారం చదివేయండి హాయ్‌లో



హైదరాబాద్‌కు చెందిన భావనాకస్తూరి... ఆర్మీలో అధికారి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇరవైమూడేళ్ల తరువాత ఆర్మీలోని ఆమె పనిచేసే విభాగం కూడా పాల్గొంటోంది. ఆ బృందానికి ఆమె నాయకత్వం వహిస్తోంది. అలాగే శిఖ అనే మరో అధికారి కూడా జనవరి 26న స్టంట్ చేయబోతోంది. వసుంధరలో

జేఈఈ మెయిన్‌లో తెలుగు హవా

- దేశవ్యాప్తంగా 15 మందికి 100 పర్సంటైల్
- అందులో ఏపీ విద్యార్థులు ముగ్గురు.. తెలంగాణ నుంచి ఇద్దరు
- పేపర్-1 ఫలితాలు విడుదల చేసిన ఎన్‌టీఏ
- రెండో విడతకు ఫిబ్రవరి 8 నుంచి దరఖాస్తుల ప్రక్రియ

10 లో

సంరక్షణ 'చారిత్రక' అవసరం

- ప్రాచీన కట్టడాల్ని కాపాడుకోవాలి
- అంతర్జాతీయ సదస్సులో వక్తలు

ఈనాడు, హైదరాబాద్: వేల సంవత్సరాల క్రితం నాటి చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానాలను కళ్ల ముందు ఆవిష్కరించే ప్రాచీన కట్టడాలు కనుమరుగైపోతున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్న కొద్దిపాటి కట్టడాలపై నేటి తరానికి అవగాహన కల్పించాలని. . వాటిని కాపాడుకోవడంలో వివిధ వర్గాలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. 'దక్షిణాపథంలో సామ్రాజ్యాలు, రాజులు.. నాటి కట్టడాలు' అంశంపై 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్' నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శనివారం ప్రారంభమైంది. వివిధ దేశాలకు చెందిన చరిత్రకారులు సదస్సులో పాల్గొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న దక్కన్ కాలేజ్-పుణె డీమ్డ్ వర్సిటీ ఉపకులపతి వసంత్‌షిండే మాట్లాడుతూ.. "వ్యవసాయం, పట్టణీకరణ కారణంగా వేలాది చారిత్రక కట్టడాలు కనుమరుగైపోయాయి. మిగిలిన కట్టడాలు, స్థలాల్ని సంరక్షించాలి. ఇందుకోసం గ్రామకమిటీలు ఏర్పాటుచేయాలి. వర్సిటీల పరిశోధక విద్యార్థుల్ని భాగస్వాములను చేయాలి" అని సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. తెలంగాణకు గొప్ప చరిత్ర ఉందని, ఈ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి వెలుగులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం క్యూరేటర్ జాన్ గయ్ మాట్లాడుతూ. . తెలంగాణలో సూర్యాపేట జిల్లాలో ఫణిగిరి బౌద్ధ క్షేత్రం చారిత్రకంగా ఎంతో గొప్పదన్నారు. వేములవాడ భీమేశ్వర ఆలయ ఆర్కిటెక్చర్ ప్రత్యేకతల గురించి ప్రఖ్యాత నర్తకి, యునెస్కో కన్సల్టెంట్ చూడామణి నందగోపాల్ వివరించారు. పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూరు తవ్వకాలపై మధ్యంతర నివేదికతో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్' అసిస్టెంట్ డైరెక్టర్ రాములునాయక్ రచించిన పుస్తకాన్ని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో బయటపడ్డ శాసనాలపై మరో పుస్తకాన్ని వసంత్‌షిండే ఆవిష్కరించారు. పెద్దబొంకూరులో పురావస్తు శాఖ గతేడాది జరిపిన తవ్వకాల్లో బయటపడిన చారిత్రక ఆధారాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగాప్రదర్శించారు.

ఆధునికత అండతో చేనేత డిజైన్లు

- రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ ఆకాంక్ష

మాదాపూర్, న్యూస్‌టుడే: చేనేత కళాకారులు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సరికొత్త డిజైన్లపై దృష్టి సారిస్తే వారి ఉత్పత్తులకు మరింత ఆదరణ లభిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. ఈ కామర్స్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించే సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైక్రోసాఫ్ట్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా చేనేత కళాకారులకు కోసం చేపట్టిన రీవీవ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేనేత కార్మికుల కోసం ఈకామర్స్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. మాదాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన ఈకామర్స్ వెబ్‌సైట్‌ను ముఖ్యఅతిథి జయేష్‌రంజన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు మైక్రోసాఫ్ట్ చేపట్టిన రీవీవ్ ప్రాజెక్ట్ అద్భుతంగా కొనసాగుతోందన్నారు. ఆధునిక కంప్యూటర్ టెక్నాలజీని ఉపయోగించుకొని సరికొత్త డిజైన్లు రూపొందించేలా చేనేత కార్మికులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్ అండ్ డీ విభాగం బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ చిత్రాసూద్, మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్ అండ్ డీ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ భన్సాలీ, నిఫ్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివలింగం, చైతన్యభారతి సంస్థ ప్రతినిధి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

భారత్, చెక్ రిపబ్లిక్‌లు ఉమ్మడిగా ఆయుధ ఉత్పత్తి చేయాలి

- రాష్ట్రపతి కోవింద్ ఆకాంక్ష

దిల్లీ: భారత్, చెక్ రిపబ్లిక్ మధ్య మైత్రికి రక్షణ విభాగంలో సహకారమే కీలక పునాది అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. ఆయుధాల రూపకల్పన, ఉత్పత్తిలో రెండు దేశాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. భారత్‌లో పర్యటిస్తున్న చెక్ రిపబ్లిక్ ప్రధాన మంత్రి ఆంద్రేజ్ బాబిస్ శనివారం ఇక్కడ రాష్ట్రపతి భవన్‌లో కోవింద్‌తో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ప్రస్తుతమున్న 'విక్రేత-కొనుగోలుదారు' సంబంధాలు ఉమ్మడి ఆయుధ ఉత్పత్తి స్థాయికి విస్తరించాలని కోవింద్ అభిలషించారు. భారత వృద్ధి పథంలో చెక్ రిపబ్లిక్ కీలక భాగస్వామి అని గత ఏడాది ఆ దేశాన్ని సందర్శించినప్పుడు తాను పేర్కొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మరోవైపు ఆంద్రేజ్ పుణెలోని సింబయాసిస్ సెంటర్ ఫర్ యూరోపియన్ స్టడీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారత్‌లో తయారీ'ని అద్భుత వ్యూహంగా అభివర్ణించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు.




ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ నరసింహన్‌కు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, సభ్యులు

ప్రగతికి పునరంకితం

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. ప్రసంగంలో ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

"ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన శాసనసభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ పదవీకాలం దిగ్విజయంగా సాగాలని, మీరంతా అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నం కావాలని మనసారా ఆకాంక్షిస్తున్నా. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం మా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల జీవన ప్రమాణాల్లో మెరుగుదలను సాధించాయి. కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వ సమర్థ పరిపాలన వల్ల రాష్ట్రం దేశంలోనే అనేక రంగాల్లో అగ్రగామిగా పురోగమిస్తోంది. అందువల్లనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారు. నాలుగింట మూడొంతుల స్థానాలు గెలిపించి తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారు. ఈ విజయాన్ని వినమ్రంగా స్వీకరిస్తూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ

పటుతరమైన పరిపాలనా విధానంతో కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ అవినీతిరహిత పరిపాలనను అందించడంలో ప్రభుత్వం గొప్ప విజయం సాధించింది. తత్ఫలితంగా రాష్ట్ర సొంత ఆదాయ వనరులు గణనీయంగా అభివృద్ధి చెందాయి. దేశంలోని 29 రాష్ట్రాల్లో మరే రాష్ట్రానికి సాధ్యం కాని స్థాయిలో ఆర్థిక వృద్ధిని తెలంగాణ సాధించింది. 2014-18 మధ్యకాలంలో వార్షిక వృద్ధి రేటు 17.17 శాతం కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబరు నాటికి 29.93 శాతం సాధించిందని సగర్వంగా తెలియజేస్తున్నాను. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

కనీస అవసరాలు తీర్చేలా పింఛన్లు

ప్రజా సంక్షేమానికి అత్యధిక శాతం బడ్జెట్ వినియోగిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ప్రత్యేక గుర్తింపును పొందింది. సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజల దీవెనల వల్ల తెరాస పార్టీ అత్యధిక మెజార్టీతో రెండోసారి అధికారంలోకి వచ్చింది. వృద్ధులు, వితంతువులు తదితర వర్గాల వారికి గతంలో కంటి తుడుపుగా కొంత మొత్తం పింఛన్ల రూపంలో అందేది. కానీ మా ప్రభుత్వం వారి కనీస అవసరాలు తీర్చేలా, జీవన భద్రత చేకూర్చేలా ఈ పింఛన్ల మొత్తాన్ని గణనీయంగా పెంచింది. ఆసరా పింఛన్లను రూ.1,000 నుంచి 2016కు, దివ్యాంగులకు రూ.1,500 నుంచి 3016కు పెంచాలని నిర్ణయించింది. వృద్ధాప్య పింఛను పొందే అర్హత వయోపరిమితిని 57కు తగ్గించనుంది. నిరుద్యోగులకు నెలకు రూ.3,016 భృతి అందించనుంది. రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ భృతి అందిస్తాం. సొంత స్థలం ఉన్న పేదలకు రెండు పడకగదుల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల నుంచి 6 లక్షల వరకూ సాయం చేస్తాం.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రంతో పోరాడతాం

ఎస్టీలకు 10, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. వీటికి కేంద్రం ఆమోదం కోసం ప్రభుత్వం పోరాటం చేస్తోంది. చట్టసభల్లో బీసీలకు 33, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు పోరాడుతుంది. సందర్భోచితంగా ఐకేపీ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెద్ద ఎత్తున ఆహారశుద్ధి యూనిట్లను నెలకొల్పాలని ఆలోచిస్తోంది. మహిళా సంఘాలు, ఐకేపీ ఉద్యోగులు కలిసి ఈ యూనిట్లు నిర్వహిస్తాయి.

సభ వాయిదా

ఉదయం 11.30 గంటలకు ఉభయ సభాపతులు, ముఖ్యమంత్రి సభలోకి గవర్నర్‌ను తోడ్కొని వచ్చారు. వెంటనే గవర్నర్ ప్రసంగం ప్రారంభమైంది. 35 నిమిషాల్లో 15 పేజీల ప్రసంగ పాఠం చదివిన నరసింహన్.. తెలుగులో ప్రసంగాన్ని ముగించారు. జాతీయగీతాలాపన అనంతరం సభ వాయిదా పడింది.

విద్యుత్ ఉద్యోగులకు అభినందనలు

దేశంలో వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పడానికి నేనెంతో సంతోషిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి విద్యుత్ రంగం అధ్వాన స్థితికి చేరింది. తీవ్రమైన కరెంటు కోతలు, షాకులతో రైతుల మరణాలు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, కాలే మోటార్లతో వ్యవసాయం దారుణంగా దెబ్బతింది. కానీ రాష్ట్రం ఏర్పడిన 9 నెలల్లోనే నిరంతరాయమైన విద్యుత్‌ను 24 గంటలూ సరఫరా ప్రారంభించింది. మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. 28 వేల మెగావాట్ల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా తలపెట్టిన కొత్త విద్యుత్కేంద్రాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యమున్న కేటీపీఎస్ 7వ దశ ప్లాంటు నిర్మాణాన్ని కేవలం 42 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాం. 1080 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న భద్రాద్రి ప్లాంటును ఈ ఏడాదిలోనే పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మరో నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి ప్లాంటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. విద్యుత్ రంగంలో అద్భుత విజయాలు సాధించేందుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల ఉద్యోగులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను" అని గవర్నర్ అన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం

సమైక్య రాష్ట్రంలో జరిగిన వనరుల, సంస్కృతి నిర్లక్ష్య కోణాన్ని పరిగణనలోకి తీసుకుని ఆనాటి పరిస్థితుల్లో అవలంబించాల్సిన పంథాను నిర్దేశించుకుని ప్రభుత్వం తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అన్ని రంగాల్లో పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించింది. పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిచ్చింది. జటిలంగా మారిన విద్యుత్ సంక్షోభాన్ని విజయవంతంగా పరిష్కరించింది. కోటి ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టింది. ఇటీవలే ముఖ్యమంత్రి స్వయంగా ప్రాజెక్టులను సందర్శించి నిర్దేశిత సమయంలోగా వాటిని పూర్తి చేసి నీరందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఐదేళ్లలో పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం పనిచేస్తోంది. నీటిపారుదల రంగానికి గత నాలుగున్నరేళ్లలో రూ.77,777 కోట్లు ఖర్చు చేసింది. రాబోయే కాలంలో రూ.1,17,000 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేస్తోంది.

- పరిశ్రమలు, ఐటీ రంగ విస్తరణ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. కుదేలైన కులవృత్తులను పునరుద్ధరించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే కార్యక్రమాలను అమలు చేసింది. వ్యవసాయం దండగ అని నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయిన రైతాంగానికి ధైర్యం, స్థైర్యం కల్పించే అనేక చర్యలను ప్రభుత్వం చేపట్టింది.

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి

ఈనాడు, హైదరాబాద్ : బంగాళాఖాతం ఆగ్నేయ ప్రాంతంలో అండమాన్ వద్ద అల్పపీడన ద్రోణి ఏర్పడింది. అయితే తెలంగాణపై దీని ప్రభావం ఏమీ ఉండదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. రాష్ట్రంలో పగటిపూట పొడి వాతావరణం కొనసాగుతోందని వివరించారు. రాత్రిపూట చలి ప్రస్తుత స్థాయిలోనే ఉంటుంది. ఆది, సోమవారాల్లో పలుచోట్ల పొగమంచు కురిసే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. చలి మరింత తీవ్రమయ్యే అవకాశాలు పెద్దగా లేవని వివరించారు. గాలిలో తేమ అధికంగా ఉంటోంది. శనివారం తెల్లవారుజామున ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 10 డిగ్రీలు నమోదైంది.

'లోక్‌పాల్' కోసం మరో సత్యాగ్రహం

హైదరాబాద్: లోక్‌పాల్ బిల్లు అమల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 30 నుంచి మహారాష్ట్రలోని తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టబోతున్నానని సామాజిక కార్యకర్త అన్నా హజారే వెల్లడించారు. ఉద్దేశ పూర్వకంగా దిల్లీ పాలకులు ఈ వ్యవహారాన్ని తొక్కిపెడుతున్నారని ఆరోపించారు. మోదీ వస్తే అవినీతి అంతమవుతుందనే తన ఆశలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం లోక్‌పాల్, లోకాయుక్తల వంటి రాజ్యాంగ సంస్థలను ఏర్పాటు చేసే పరిస్థితిలో లేదని ఆక్షేపించారు. 2011లోనే దేశమంతా లోక్‌పాల్, లోకాయుక్తల నియామకం చేపట్టాలని ముక్త కంఠంతో నినదించినా ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోలేదో అర్థం కావడం లేదన్నారు. "2013లో లోక్‌పాల్ చట్టం రూపుదిద్దుకుంది. 2014లో అవినీతి రహిత ప్రభుత్వం అనే నినాదంతో మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆయన లోక్‌పాల్ బిల్లును అమలు చేస్తారని, తద్వారా దేశంలో అవినీతికి కళ్లెం పడుతుందని ఆశించా. ఐదేళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌పాల్ బిల్లును అమలు చేయాలని కోరుతూ ప్రధాని మోదీకి తాను 32 లేఖలు రాశానని, ఒక్కదానికి కూడా సమాధానం రాలేదని వాపోయారు. అందుకే గాంధీజీ వర్ధంతి రోజైన జనవరి 30 నుంచి ఇదే డిమాండ్‌తో నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు.



ఎర్రవల్లిలో సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమైన యాగశాలలు

మహా రుద్ర సహిత సహస్ర చండీ యాగానికి సర్వం సిద్ధం

- 21 నుంచి 25 వరకు నిర్వహణ
- 3 యాగశాలలు, 27 హోమగుండాలు
- సీఎం వ్యవసాయ క్షేత్రానికి చేరిన 200 మంది రుత్వికులు

మర్కూక్, న్యూస్‌టుడే: సీఎం కేసీఆర్ నిర్వహించనున్న మహా రుద్ర సహిత సహస్ర చండీ యాగానికి సర్వం సిద్ధమైంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో సీఎం వ్యవసాయ క్షేత్రంలో యాగానికి సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. యాగశాల పనులను శారదా పీఠం వేద బ్రాహ్మణులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు మహా రుద్ర సహిత సహస్ర చండీ యాగం నిర్వహించాలని పండితులు నిర్ణయించారు. శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో వారి శిష్య బృందం ఆధ్వర్యంలో క్షేత్రంలో దక్షిణ ద్వారాన్ని ఆనుకొని యాగశాలను నిర్మిస్తున్నారు. 3 యాగశాలలతో పాటు 27 హోమ గుండాలు ఏర్పాటు చేస్తున్నారు. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో మూడేళ్ల కిందట అయుత చండీయాగం, ఎన్నికల ముందు రాజశ్యామల యాగం నిర్వహించిన విషయం విదితమే. యాగం పనులను అష్టకాల రామ్మోహన్ శర్మ, శృంగేరి పీఠం పండితులు ఫణిశశాంక శర్మ, గోపికృష్ణ శర్మ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. శృంగేరి పీఠం, కర్ణాటక నుంచి సుమారు 200 రుత్వికులు శనివారం వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. వారితో పాటు స్థానికంగా ఉన్న కొంతమంది వేద పండితులు యాగంలో పాల్గొననున్నట్లు సమాచారం.

ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలని సూచించారు. రోడ్లను ప్రభుత్వ శాఖల మధ్య బదిలీ చేసినపుడు వాటి నిర్వహణ విధానం ఖరారు చేయాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన ఎమ్మెల్యేల నివాసగృహాలను త్వరలోనే కేటాయించనున్నట్లు వెల్లడించారు. శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్.. రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై ఆ శాఖ ముఖ్య కార్యదర్శులు సునీల్‌శర్మ, రామకృష్ణారావు, ఈఎన్‌సీ గణపతిరెడ్డి, ఎస్ఈ చంద్రశేఖర్, సీఎంఓ అధికారులు స్మితాసబర్వాల్, రాజశేఖర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. రహదారుల ప్రస్తుత పరిస్థితి, వాటిని తీర్చిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటు తరువాత రికార్డు స్థాయిలో జాతీయ రహదారులు సాధించుకున్నామని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పెద్దఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. పలుచోట్ల రహదారులు, వంతెనలకు మరమ్మతులు, వెడల్పు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీ, ఆర్‌అండ్‌బీ నుంచి జాతీయ రహదారులకు రోడ్లను బదిలీ చేసిన తరువాత నిర్వహణ, మరమ్మతుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి ప్రకటించారు. కొత్త రోడ్ల నిర్మాణం పూర్తయ్యేవరకు పాడైన రోడ్లను పట్టించుకోకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారుల అభివృద్ధి కోసం ఈఎన్‌సీ నుంచి ఎస్ఈ స్థాయి వరకు అధికారులతో సదస్సు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతి రోడ్డు పరిస్థితి సమీక్షించి, తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించాలని కోరారు. జిల్లా, మండలం, ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యమన్న తేడాలు లేకుండా అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని, స్థానిక ప్రజాప్రతినిధులు పనులు చేయించుకోవాలని సూచించారు.

కాల్వల కింద భూమి కోల్పోతే పరిహారం: సీఎం

కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. తమ నియోజకవర్గ పరిధిలోని రైతులకు పరిహారం ఇప్పించాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం సీఎంకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం తగిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. చిన్న సుద్దవాగు ప్రాజెక్టు నిర్మాణంతో ముంపుబారిన పడుతున్న భూములకు పరిహారం, ప్రజలకు పునరావాస ప్యాకేజీని అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ అర్హతలుంటేనే సంఘసేవకు రండి!

1916 ఫిబ్రవరి 16న మద్రాసులో సోషల్ సర్వీస్ లీగ్ వార్షిక సమావేశం జరిగింది. ఆండర్సన్ హాల్‌లో జరగనున్న ఈ సమావేశానికి గాంధీజీ వస్తున్నారని తెలియటంతో జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. దీంతో వేదికను క్రైస్తవ కళాశాల ప్రాంగణానికి మార్చారు. నాటి సభలో గాంధీజీ.. సంఘసేవ చెయ్యటానికి తప్పనిసరిగా కొన్ని అర్హతలు ఉండాలంటూ ఇలా ప్రసంగించారు..

"సంఘసేవ కానీండి, మరో సేవకానీండి.. ఈ ప్రపంచంలో ఏ సేవ చెయ్యటానికైనా తగిన అర్హతలు ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి మనమెంత సదుద్దేశంతో సంఘసేవకు దిగినా అందుకు కావాల్సిన అర్హతలు లేకపోతే సమాజానికి ఉపకారానికి బదులు అపకారం చేసినవాళ్లమవుతాం. మరి ఆ అర్హతలేమిటి? ఒకటి సత్యసంధత. రెండోది నిర్భీతి. సత్యసంధత అనే కాగడా మన చేతుల్లో లేకుంటే మనముందు ఏమున్నదో కూడా మనకు తెలీదు. ఇక నిర్భీతి అనే సుగుణం లేకపోతే.. భయం గుప్పిట చిక్కి.. మనం సరైన సమయంలో ఇవ్వాల్సిన సందేశాన్ని ఇవ్వలేం. కాబట్టి ఇక్కడ సమావేశమైన మనందరం ఈ రెండు అర్హతలూ మనకు ఉన్నాయా? అన్నది ప్రశ్నించుకోవాలి. అయితే ఈ రెండు అర్హతలనూ సంపాదించుకునేందుకు కూడా ఒక క్రమం ఉంది. ఈ సందర్భంగా రామాయణంలోని లక్ష్మణ, ఇంద్రజిత్తులను ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకుందాం. ఇద్దరూ సమానార్హతలున్న వాళ్లే. ఇద్దరూ తపస్సు చేశారు, కొంత వరకూ ఇద్దరూ ఆత్మనిగ్రహం సాధించారు. కాబట్టే ఇంద్రజిత్తును జయించటం కష్టతరమైంది. అయితే లక్ష్మణునికి అధికంగా ఉన్న సుగుణమేమిటి? ఆయనకు ధార్మిక దృష్టి ఉంది. ఆయన జీవితం ఒక నియమంపైనా, ధార్మిక దృక్పథంపైనా ఆధారపడి ఉంది. కానీ ఇంద్రజిత్తు జీవితం ధర్మవిరుద్ధమైంది. ధార్మిక దృష్టిలేకపోతే జీవితానికి నీతినియమాలుండవు. అది చుక్కాని లేని పడవలా అటూఇటూ తిరుగుతూ ఎటైనా పోవచ్చుగానీ.. గమ్యాన్ని మాత్రం చేరుకోదు. అలాగే ధార్మిక నిష్ఠ లేని మనిషి ఈ సంసార సాగరంలో అటూఇటూ ఊగిసలాడుతుంటాడేగానీ ఎప్పటికీ గమ్యాన్ని చేరలేడు. కాబట్టి ముందు చెప్పుకొన్న రెండు అర్హతలూ ధార్మిక దృష్టితో పునీతం కాకపోతే మనం సేవ చేయగలగటమన్నది వట్టి భ్రమే అవుతుంది. ధార్మిక దృష్టితో ఆ రెండు సుగుణాలను మనం అలవరచుకున్న రోజున మన తప్పులు కూడా మనకు అపకీర్తి తెచ్చిపెట్టేవిగాగానీ, మనం సేవ చేయదలచుకున్న సమాజానికి హాని కలిగించేవిగాగానీ ఉండవు!

– మహాత్మా గాంధీ

సొంత జిల్లాల్లో ఎన్నికల విధులొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో నియమించి ఉంటే వారినీ ప్రస్తుతం కొనసాగించడానికి వీల్లేదని ఈసీ స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు ఎన్నికల కోసం నియమించే అధికారులందరికీ వర్తిస్తాయని తెలిపింది.

- కంప్యూటరైజేషన్, స్పెషల్ బ్రాంచి, శిక్షణ విభాగాల్లో పని చేసే పోలీసులకు ఇవి వర్తించవని ఈసీ పేర్కొంది. ఎస్సైలు, ఆ పై అధికారులను సొంత జిల్లాల్లో నియమించరాదని, ఎస్సైలు ఒక సబ్ డివిజన్ పరిధిలో మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకొంటే వారిని అదే అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఇంకో సబ్ డివిజన్‌లోనూ నియమించరాదని సూచించింది.
- ఎవరైనా ఉద్యోగి పక్షపాతంతో వ్యవహరించినట్లు ఫిర్యాదు వస్తే వారిని విచారించి బదిలీ చేయడమే కాకుండా చర్యలు కూడా తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న వారిని ఎన్నికల విధుల్లో నియమించొద్దని ఈసీ సూచించింది.
- వచ్చే ఆరు నెలల్లో పదవీ విరమణ చేసే అధికారులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని, వారినీ జిల్లా నుంచి మాత్రం బదిలీ చేయాలని ఈసీ పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

20–1–2019 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
పుష్య శుక్ల చతుర్దశి: మ. 1.53 తదుపరి పూర్ణిమ
ఆర్ద్ర నక్షత్రం: ఉ. 7.42 తదుపరి పునర్వసు తె. 6.15
అమృత ఘడియలు: తె. 3.59 నుంచి 5.29 వరకు
వర్జ్యం: రా. 6.58 నుంచి 8.28 వరకు
దుర్ముహూర్తం: సా. 4.15 నుంచి 5.00 వరకు
రాహుకాలం: మ. 4.30 నుంచి 6.00 వరకు
సూర్యోదయం: ఉ.6-39; సూర్యాస్తమయం: సా.5-44

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.0	30.5
మెదక్	13.0	32.9
రామగుండం	13.0	30.2
హన్మకొండ	15.0	30.0
హైదరాబాద్	16.0	29.4
నిజామాబాద్	15.8	31.1
మహబూబ్‌నగర్	17.1	33.6
నల్గొండ	17.4	30.0
కరీంనగర్	17.5	31.0

ఎస్టీ నియోజకవర్గాల్లో పర్యటిస్తా

- సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తా
- ఆ నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- ఆదివాసీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి
- సీఎం కేసీఆర్‌ను కలిసిన సీతక్క, కాంతారావు, ఆత్రం సక్కు, పొదెం వీరయ్య



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన కాంగ్రెస్‌కు చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, రేగా కాంతారావు, సీతక్క, ఆత్రం సక్కు

ఈనాడు, హైదరాబాద్: గిరిజన నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఫిబ్రవరిలో తాను గిరిజన నియోజకవర్గాలన్నింటిలో పర్యటించి, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు (పినపాక), ఆత్రం సక్కు (ఆసిఫాబాద్), సీతక్క (ములుగు), పొదెం వీరయ్య (భద్రాచలం) శనివారం శాసనసభా ప్రాంగణంలో సీఎంను కలిశారు. పోడు భూములు, ఆదివాసీలకు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దాదాపు గంటసేపు వారి వినతులను సీఎం విన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఫిబ్రవరి మొదటి వారంలో ఎస్టీ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత నియోజకవర్గాల్లో పర్యటిస్తానని తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోడుభూముల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చానని, దానిని కట్టుబడి ఉన్నానన్నారు. గిరిజన రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో గెలిచినందుకు గిరిజన ఎమ్మెల్యేలను సీఎం అభినందించగా.. తమ వినతులపై స్పందించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు

సీఎం సానుకూలంగా స్పందించారు: ఎమ్మెల్యేలు

సీఎంతో భేటీ అనంతరం ఎమ్మెల్యేలు విలేకరులతో మాట్లాడారు. కాంతారావు మాట్లాడుతూ ఆదివాసుల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎంను కోరామని తెలిపారు. పోడు భూములు విషయంలో పోలీసులు అత్యుత్సాహం చూపించారని ఆయన దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. సక్రు మాట్లాడుతూ, ఆదివాసీలు విద్య, వైద్యపరంగా పడుతున్న ఇబ్బందులను కేసీఆర్‌కు వివరించామన్నారు. తమ సమస్యలను సీఎం గంటసేపు సావధానంగా విన్నారని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీలకు సంబంధించిన అన్ని రకాల కష్టాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆదివాసీలు సాగు చేస్తున్న భూమిని హరితహారం పేరుతో అధికారులు లాక్కున్నారని చెప్పామన్నారు. ములుగు జిల్లా ఏర్పాటు చేయడంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపానని సీతక్క వెల్లడించారు.

శాసనసభాపతికి కడియం అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ నూతన శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, పూల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ గొడిశాల రాజేశంగౌడ్, క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు శనివారం ఆయనను శాసనసభా కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.

వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీ

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ వీపీ గౌతమ్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు.

అధికార, విపక్ష సభ్యుల భిన్నాభిప్రాయాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగంపై అధికార, విపక్ష సభ్యులు స్పందించారు. గవర్నర్ ప్రసంగం అద్భుతంగా ఉందని అధికారపక్షం అంటుంటే.. కొత్త సీసాలో పాత సారాయిలా ఉందని విపక్ష సభ్యులు విమర్శిస్తున్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎవరేమన్నారంటే...

గవర్నర్ ప్రసంగం అద్భుతం

గతంలో గవర్నర్ ప్రసంగంలో సభ్యులు బల్లలు చరిచి ఆటంకాలు కలిగించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. అభివృద్ధి అందరికీ అందుతుందని ఒప్పుకోవాల్సిందే. గవర్నర్ ప్రసంగానికి సభ పూర్తి స్థాయి మద్దతు పలికింది. రానున్న అయిదేళ్లు సభ ఇలాగే జరిగేలా అందరూ సహకరించాలని కోరుతున్నా.

– వి.శ్రీనివాస్‌గౌడ్, తెరాస ఎమ్మెల్యే

తెరాస మేనిఫెస్టోను చదివారు

గవర్నర్ తెరాస ఎన్నికల మేనిఫెస్టోను చదివారు. ప్రసంగ పాఠం కొత్త సీసాలో పాత సారాలా ఉంది. హైదరాబాద్ గురించి ప్రస్తావనే లేదు. భారతమాతకు జై అనని ఎంఐఎం ప్రొటెం స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేయనన్న నా నిర్ణయానికి ప్రజల మద్దతు లభించింది. దీన్ని కేసీఆర్ పరిగణనలోకి తీసుకోవాలి. కేసీఆర్ గతంలో చాలా అభివృద్ధి చేశారు. మరింత అభివృద్ధి చేయాలంటే ప్రజల మనోభావాలను గమనించాలి.

– రాజాసింగ్, భాజపా శాసనసభ్యుడు

మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం

ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని గవర్నర్ ఉభయసభలకు చాలా స్పష్టంగా చెప్పారు. రాబోయే ఐదేళ్లలో మా ప్రభుత్వం చేపట్టబోయే పనులనూ చక్కగా వివరించారు. అయిదేళ్లలో అన్ని పనులూ పూర్తి చేస్తాం. ప్రజలకు మాపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం.

– కర్నె ప్రభాకర్, తెరాస ఎమ్మెల్సీ

గవర్నర్ ప్రసంగంలో అర్ధసత్యాలు

గవర్నర్ ప్రసంగంలో అర్ధసత్యాలున్నాయి. మిషన్ భగీరథకు తవ్విన పైపులను ఇప్పటికీ పూడ్చలేదు. పెంచిన పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలి. సత్తుపల్లి, అశ్వారావుపేట కలిపి జిల్లాగా ఏర్పాటు చేయాలి. వర్షాభావ పరిస్థితులతో 18 జిల్లాల్లో రైతుల పరిస్థితి బాగాలేదు. అమాయక ప్రజలను మోసం చేసి వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ

నిరాశపరిచిన ప్రసంగం

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం నిరాశపరిచింది. నిరుద్యోగ సమస్య ప్రస్తావనే లేదు. ఇచ్చిన హామీలు ఎప్పటి వరకు పూర్తి చేస్తారో స్పష్టతివ్వలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన ఒక్క పథకం కూడా గవర్నర్ ప్రసంగంలో చెప్పలేదు. పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలిచే ఆయుష్మాన్‌భవ పథకం గురించి కూడా ప్రసంగంలో లేదు. రెండు పడకగదుల ఇళ్ల విషయంలో స్పష్టత లేదు. ప్రభుత్వ మాటకారితనం గవర్నర్ ప్రసంగంలో బయటపడింది.

– రామచందర్‌రావు, భాజపా ఎమ్మెల్సీ

కొత్తదనం ఏముంది?

- కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడినట్లు గవర్నర్ ప్రసంగం
- హామీలపై సభలో సీఎం స్పష్టత ఇవ్వాలి
- సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, షబ్బీర్‌అలీ, శ్రీధర్‌బాబు, గండ్ర

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ శనివారం చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ నేతలు పెదవి విరిచారు. ప్రసంగంలో కొత్తదనం లేదని, కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడినట్లుందని విమర్శించారు. ఎన్నికల హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో చెప్పలేదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సమయంలో సీఎం కేసీఆర్ వీటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష కార్యాలయంలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ..ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడటం కోసం కేసీఆర్ రాసుకున్న ప్రసంగ పాఠాన్ని గవర్నర్ చేత సభలో చదివించారన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు విషయం ఎక్కడా ప్రతిబింబించలేదన్నారు. 2018 ఎన్నికల ప్రధాన హామీలైన పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతి, రెండుపడక గదుల ఇళ్లు, ఉద్యోగాల కల్పన, రుణమాఫీ తదితర హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టత లేదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో ఈ అంశాలను ప్రధాన ప్రతిపక్షంగా సభలో లేవనెత్తుతామని చెప్పారు. కొత్త పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం చెప్పలేదని ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు ప్రస్తావనే లేదన్నారు. 'ముస్లిం రిజర్వేషన్ల కోటాకు సంబంధించి ప్రసంగం బుక్‌లెట్‌లో మైనార్టీ రిజర్వేషన్లు అని ముద్రించారు..ఇది తప్పు, కావాలనే చేశారా? పొరపాటుగా జరిగిందా? అనే విషయంపై సభలో సీఎం కేసీఆర్ వివరణ ఇవ్వాలి' అని షబ్బీర్ అలీ కోరారు. ప్రభుత్వం ఏం చెప్పదలచుకుందో దానినే గవర్నర్ చేత చెప్పించే ప్రయత్నం చేశారని...కొత్తదనం లేదని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధర వంటి విషయాలను ప్రస్తావించకుండా..రైతు బంధు పథకమే అన్నదాతలకు సంజీవని అన్నట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు.

గవర్నర్ ప్రసంగానికి ఉభయసభల్లో నేడు ధన్యవాదాలు

పంచాయతీరాజ్ చట్ట సవరణపై బిల్లులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలిలో ఆదివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలు జరగనున్నాయి. ఉదయం 10.30 గంటలకు రెండు సభలు ప్రారంభమవుతాయి. శాసనసభలో మిగిలిన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం కేసీఆర్ పంచాయతీరాజ్ చట్టసవరణ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును ప్రవేశపెడతారు. పంచాయతీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్లను 50శాతంగా నిర్ధారిస్తూ గత నెలలో ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తెచ్చింది. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ప్రారంభమవుతుంది. ధర్మపురి ఎమ్మెల్యే కె.ఈశ్వర్ తీర్మానాన్ని ప్రతిపాదిస్తారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దానిని బలపరుస్తూ ప్రసంగిస్తారు. విపక్ష సభ్యులు మాట్లాడతారు. చివరలో సీఎం ప్రసంగిస్తారు. మండలిలోనూ 'పంచాయతీరాజ్' బిల్లును ప్రవేశపెడతారు. అనంతరం విప్ రాజేశ్వర్‌రెడ్డి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెడతారు. దాన్ని బలపరుస్తూ మరో విప్ వెంకటేశ్వర్లు ప్రసంగిస్తారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వైఎస్ జగన్ లేఖ

అంతర్రాష్ట్ర ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలని వినతి

ఈనాడు, హైదరాబాద్: వైకాపా అధినేత, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. మానవతా దృక్పథంతో ఆలోచించి బదిలీలు చేపట్టాలని, పరస్పర బదిలీలపై కమిటీ సవరణ ఉత్తర్వులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంను కలిసిన పాలమూరు నేతలు

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలు శనివారం ప్రగతిభవన్‌లో కలిశారు. ఎంపీ జితేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, మర్రి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి పి.రాములు కేసీఆర్‌తో సమావేశమై జిల్లా సమస్యలపై చర్చించారు. సీఎంను పాలమూరు పర్యటనకు రావాలని కోరారు.



సభలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం

- ప్రజా సమస్యలను వినిపిస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవరూ పార్టీని వీడరు
- సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క



గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కలను గజమాలతో సత్కరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కిషన్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి సురేష్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ ప్రధాన ప్రతిపక్షంగా శాసనసభలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా కలసి పార్టీ భావజాలాన్ని, ప్రజల సమస్యలను అసెంబ్లీలో వినిపిస్తారన్నారు. తనపై నమ్మకంతో సీఎల్పీ బాధ్యతలు అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీలోని ముఖ్యనేతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సీఎల్పీ నేతగా నియమిస్తూ పార్టీ ఇచ్చిన లేఖను శనివారం శాసనసభలో సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి భట్టి విక్రమార్క అందజేశారు. ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, వనమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారితో కలిసి సీఎల్పీ కార్యాలయంలో భట్టివిక్రమార్క విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం, రైతుల సంక్షేమం, అభివృద్ధికి రాహుల్‌గాంధీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని..కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రైతు రుణమాఫీపై తొలి సంతకం చేశారన్నారు. తెలంగాణలోనూ అదే స్ఫూర్తితో సీఎల్పీ పని చేస్తుందని చెప్పారు. సాగు నీటి ప్రాజెక్టులపై లోతుగా అధ్యయనం చేసి రాష్ట్రానికి ఉపయోగపడేలా ప్రతిపక్ష పాత్ర పోషిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళికల అమలు, డ్వాక్రా సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించడం కోసం సీఎల్పీ పని చేస్తుందన్నారు. 2014, 2018 ఎన్నికల సమయంలో తెరాస ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. స్పీకర్ సభను హుందాగా, ప్రజాస్వామ్యయుతంగా నడుపుతారని ఆశిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు తెరాసలో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని...ప్రతిపక్షం బలహీనంగా ఉండాలని తెరాస మైండ్ గేమ్ ఆడుతోందని భట్టివిక్రమార్క విమర్శించారు. అంతకుముందు అసెంబ్లీ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్కలు గాంధీభవన్‌కు వచ్చారు. సీఎల్పీ నేతగా ఎన్నికైన తర్వాత తొలిసారి గాంధీభవన్‌కు వచ్చిన సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, ఉపాధ్యక్షుడు ఉద్దమర్రి నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను గజమాలతో సత్కరించి సన్మానించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై తెరాస దృష్టి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మార్చిలో జరగనున్న శాసనమండలి ఉపాధ్యాయ ఎన్నికలపై తెరాస దృష్టి సారించింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం శాసనసభాపక్ష కార్యాలయంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్దన్‌రెడ్డి, శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తదితరులతో సమావేశమై ఎన్నికల వ్యూహంపై చర్చించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ పూల రవీందర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ, తెరాస చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డిలు వచ్చే మార్చిలో పదవీ విరమణ పొందనున్నారు. ఈ రెండు స్థానాలకు మళ్లీ ఎన్నికలు జరగనుండగా వాటిలో పోటీ చేయాలని పూల రవీందర్, పాతూరి భావిస్తున్నారు. దీనికి ఇప్పటికే అధిష్ఠానం నుంచి హామీ వచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే పూల రవీందర్‌ను పీఆర్‌టీయూ తమ అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు పాతూరి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనూ రఘోత్తమరెడ్డిని పోటీకి నిలిపింది. అక్కడ పీఆర్‌టీయూను పోటీ నుంచి విరమింపజేసి, పాతూరికి మద్దతు సమీకరించాలని కేటీఆర్ భావిస్తున్నారు. దీనిపై శనివారం జరిగిన సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. త్వరలోనే పీఆర్‌టీయూ నేతలతోనూ ఈ అంశంపై చర్చిస్తామని కేటీఆర్ చెప్పినట్లు తెలిసింది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా పీఆర్‌టీయూ ఎమ్మెల్సీలు రవీందర్, జనార్దన్‌రెడ్డిలు ఉపాధ్యాయ సమస్యలపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. పీఆర్‌సీ ప్రకటించాలని, పదవీ విరమణ వయస్సు పెంచాలని, పదోన్నతులు కల్పించాలని కోరగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

వరంగల్ మేయర్‌గా ఓసీ అభ్యర్థి!

- తెరాస అధిష్ఠానం నిర్ణయం
- అభ్యర్థి ఎంపికకు కేటీఆర్ సమాలోచనలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్ నగరపాలక సంస్థ మేయరు పదవిని ఓసీ అభ్యర్థికి ఇవ్వాలని తెరాస అధిష్ఠానం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. వరంగల్ మేయరుగా ఉన్న నన్నపనేని నరేందర్ వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి మేయర్ పదవికి రాజీనామా చేశారు. ఆ పదవిని భర్తీ చేసే ప్రక్రియను సీఎం కేసీఆర్.. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అప్పగించారు. ఆయన ఇప్పటికే పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో చర్చలు ప్రారంభించారు. 58 మంది కార్పొరేటర్లున్న నగరపాలక సంస్థలో తెరాసకు సంపూర్ణ మెజారిటీ ఉంది. ఓసీ స్థానమైనప్పటికీ గతంలో బీసీ అభ్యర్థి నన్నపనేనికి పార్టీ ఈ పదవిని ఇచ్చింది. గత శాసనసభ ఎన్నికల్లో వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ తూర్పు, పశ్చిమ స్థానాలను బీసీలకు ఇచ్చింది. స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేటల్లో ఎస్సీ అభ్యర్థులు, పరకాలలో ఓసీ అభ్యర్థి గెలిచారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలు, శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈసారి ఓసీలకు స్థానం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తోంది. మేయరు పదవికి మొత్తం 8 మంది పోటీపడుతున్నట్లు తెలిసింది. తెరాస మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి శనివారం కేటీఆర్‌ను కలిసి మేయర్ పదవిని తన కోడలికి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఆశావహులైన కార్పొరేటర్లు.. జిల్లాల ఎమ్మెల్యేల ద్వారా తమ వినతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. వరంగల్ వ్యాపార, వాణిజ్య రంగాలకు ప్రసిద్ధి చెందినందున ఆ సామాజికవర్గం అభ్యర్థికి మెరుగైన అవకాశాలున్నట్లు సమాచారం.

కేటీఆర్‌తో చందూలాల్ భేటీ

కేటీఆర్‌ను శనివారం మాజీమంత్రి చందూలాల్ కలిశారు. ములుగు జిల్లా ఏర్పాటుపై కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తుపై చర్చించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ కూడా కేటీఆర్‌ను కలిసి మాట్లాడారు.



ఈనాడు

గంగమ్మకు వందనం


గాలి తెమ్మెరలకు పుట్టే చిరుకెరటాల మిలమిలలతో నిండుగా గంభీరంగా సాగిపోతుండే నదీ ప్రవాహాలను అలా చూస్తూ కూర్చోవడం ఒక అందమైన అనుభవం. 'నిను వీక్షించుచు కూరుచుండుటది అంతేచాలునో తల్లి' అన్నారు బేతవోలు కవి- గోదావరితో సంభాషిస్తూ! 'బంధు నికాయంబులు చూడవచ్చినటు, మిత్రుల్ చేరి ఆత్మీయ భాషణముల్ చేసినయట్లు, సత్కవుల వాచా మాధురుల్ విన్నయట్లు అనుభూతుల్ కలిగింతువు ఈ ఎడద' అంటూ పొంగిపోయారు. 'నిన్ను చూచుటొకటి, నిన్ను తల్చుటొకటి, నీదు నీట మునిగి నిలుచుటొకటి' అనేది సర్వసాధారణ ప్రజానాడికి ప్రతిధ్వని. నీరు భగవంతుడు అనుగ్రహించిన ఐశ్వర్యం. జీవులందరికీ నీరే ప్రాణాధారం. కాబట్టే నీటికి 'జీవనం' అని పేరొచ్చింది. ఆ మాటకు గల నీరు, బతుకు అనే రెండర్థాలను స్ఫురింపజేస్తూ వసుచరిత్రలో 'జీవనమెల్ల సత్కవి నిషేవితము, ఆశయమెల్ల అచ్యుతా పావనతా గభీరతల పట్టు' అంటూ భట్టుమూర్తి శుక్తిమతీ నదిని వర్ణించాడు. దాహం తీర్చడానికే కాదు, మన నిత్యనైమిత్తిక కార్యకలాపాలన్నీ నీటితో ముడివడి ఉన్నాయి. ఆచమనం మొదలు తర్పణం వరకు నీటితోనే పని. పంటలు పండటానికి ప్రధాన ఆధారమూ నీరే, పదార్థాన్ని ప్రక్షాళన చేసి ప్రసాదంగా మార్చేదీ నీరే. నదులంటే భారతీయుల దృష్టిలో దేవతా స్వరూపాలు. 'నదీమతల్లులు' అనేది ఆ అనుభూతికి అక్షరాకృతి. 'విశ్వధాత్రీ వలయ త్రికాల ఫల దేశికముల్...' సమస్త భూమండలంలో మూడు కాలాలలోను, పంటలకు కారణమవుతున్నాయి కనుక నదులకు- అన్నం పెట్టే అమ్మతో ఆ పోలిక. 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు' ఎక్కడుందో అక్కడ స్థిరపడమని సుమతీ శతకకర్త బద్దెన సలహా. చివరలో తులసి తీర్థమై గొంతు దిగాలన్నా నీటి చుక్కే సాయం చేస్తుంది మనిషికి!

పుష్కరాలు, కుంభమేళాలు వంటివి జలదేవతకు జనాలర్పించే నీరాజనాలు. పుష్కరుడి రాకతో పులకించే పుణ్యజలాలు, భక్తులతో కిటకిటలాడే స్నానఘట్టాలు, వేదఘోష ప్రతిధ్వనించే యాగవాటికలు, తీరాలకు పోటెత్తే జనసంద్రాలను చూసి మురిసిపోయే పుణ్యతీర్థాలు- ప్రజల సమష్టి చైతన్యపు విరాట్ స్వరూపానికి ఆనవాళ్లు. జాతి జీవనాడికి చేవ్రాళ్లు. భారతీయతకు చిరునామాలు. 'సకల తీర్థమయుడు సన్మార్గ సంధాత పుష్కరుండు చేరు పుణ్యతిథిని' నదులకు భక్తితో అంజలించడం చూస్తే- జనానికి జలదేవతలకు గల ఆత్మీయ అనుబంధం అవగతమవుతుంది. అలాంటి ప్రత్యేక సందర్భాల్లో నదీతీరాల్లో గీర్వాణ యక్ష ఉరగ సిద్ధ సాధ్య గంధర్వ విద్యాధరాది సమస్త దేవతా గణాలు విడిది చేస్తాయని సప్తరుషులు ప్రకటించారు. 'బహుజన్మ కృత పుణ్య పరిపాకమున చేసి గంగమ్మ ఈనేల కొలువు దీరె' అని మన పుణ్యాన్ని శ్లాఘించారు. 'మరో జన్మంటూ ఉంటే గంగ ఒడ్డున పుట్టించమని ప్రభువును అభ్యర్థిస్తాను' అని పాశ్చాత్య తత్వవేత్త మేక్స్ ముల్లర్ ప్రకటించడాన్ని మనం ఈ కోణంలోంచే అర్థం చేసుకోవాలి. 'అమెరికాలో స్థిరపడుదువుగాని రా' అంటూ ఆహ్వానిస్తే 'నాతో ఈ గంగామాయి ఎలా వస్తుంది' అని ప్రశ్నించిన సంగీత రససిద్ధుడు బిస్మిల్లాఖాన్ ఆంతర్యం బోధపడితే- గంగమ్మతో మనిషికి ఏర్పడిన అనుబంధ సుగంధం, అందులోని తాదాత్మ్యం తెలుస్తాయి. ఈ దేశంలో నదులు నేలమీద కాదు, దేహాల్లోని రక్తనాళాల్లో ప్రవహిస్తాయన్నది నిజం. 'భక్తమిది నాకు, నాలోని రక్తమిదియె పానమిది నాకు మాటాడ ప్రాణమిదియె' అన్న సన్నిధానం శర్మ మాట- పరిమళాలు వెదజల్లే సింహాచలం సంపెంగల మూట!

'ఏ పుణ్యనది వీచికా పరంపర సాగర స్వర్గ సోపాన రాజియయ్యె...' ఏ నది పుణ్యమా అని సగరుడి సంతానానికి స్వర్గం దక్కిందో- ఆ మందాకిని ప్రస్తుతం అర్ధ కుంభమేళా శోభతో అలరారుతోంది. కోట్ల సంఖ్యలో భక్తుల తాకిడి ఆరంభమైంది. అర్ధ కుంభమేళాకు ప్రధాన ఆతిథ్య కేంద్రం త్రివేణీ సంగమం. 'యమునా సరస్వతీ యమళ సంగన్, రంగత్ అనుపమ భూరి తరంగన్, గంగన్' సేవించి తరించాలని జనం ఉవ్విళ్లూరుతున్నారు. 'భారతీయ ఆత్మ అవగతం కావాలంటే కుంభమేళాను సందర్శించాలి' అన్నది పాశ్చాత్యుల మనోగతం. 'భారతీయాత్మకు ప్రతిబింబమే నీవు ధర్మమూర్తిగ తోచు తరుణివమ్మ' అనేది కవుల స్వగతం. మనిషి ప్రమేయం లేకుండానే మానవ దేహాల్లోని జీవాణువులు ఈ జలాల్లోంచి ఏ తరహా చైతన్య విశేషాన్ని పీల్చుకుంటున్నాయో, మానవత్వపు మహా ఇతిహాసాల సారమైన ఏ వివేకం జాతి గుండెల్లో ఏకత్వ భావనను స్థిరపరచి 'భారతీయత' అనేదాన్ని అనుభూతం చేస్తోందో అర్థం చేసుకోవాలంటే ఇది అద్భుతమైన అవకాశం. 'పరమ పవిత్రమై శ్రుతిరవ శ్రవణీయ' జలప్రవాహ సౌందర్యానుశీలనకు సైతం ఇది అనువైన సందర్భం. అటు జల ప్రవాహాన్ని ఇటు జన ప్రవాహాన్ని జమిలిగా దర్శించే సందర్శనాభిలాష తీర్చుకోవడానికి ఇదే అదను. అయితే ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో కొట్టొచ్చినట్లు అగుపించే శ్రద్ధాసక్తులు, భక్తి- మిగిలిన రోజుల్లో కలికానికైనా కానరాకపోవడమే సామాజికవేత్తలను కలవరపరుస్తోంది. సహజ జల వనరుల స్వచ్ఛతను పవిత్రతను అనునిత్యం కాపాడుకోవాలన్నదే- కుంభమేళాల సందేశంగా గ్రహించి ఉంటే, మన నదులు ఇలా కాలుష్య కాసారాలుగా మారిపోయి ఉండేవి కావన్న ఆవేదన సహేతుకమేననిపిస్తుంది!

అంతరిక్షం నయా యుద్ధక్షేత్రం

ఇవాళ చరవాణి చేతపట్టిన పిల్లలు, వృద్ధులు, వైద్యులు, డ్రైవర్లు, బట్వాడా (డెలివరీ)కుర్రాళ్లు, సముద్రంలో చేపల వేటకు వెళ్లే జాలర్లు, విమాన పైలట్లు, సైనికులు, నావికులకు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) లేనిదే పని జరగదు. భూమికి 20వేల కిలోమీటర్ల ఎత్తున కక్ష్యలో తిరిగే 30 ఉపగ్రహాల రేడియో సంకేతాలతో జీపీఎస్ పనిచేస్తుంది. దీని సొంతదారు అమెరికా ప్రభుత్వమైతే, నిర్వహణదారు అమెరికా వైమానిక దళం. అమెరికాకు ఇష్టం లేకుంటే ఇతరులకు జీపీఎస్ వినియోగాన్ని నిరాకరిస్తుంది. కార్గిల్ యుద్ధ సమయంలో జరిగింది అదే. అమెరికా అప్పట్లో భారత సేనలకు జీపీఎస్ సేవలను అనుమతించకపోవడంతో దిల్లీ సొంత జీపీఎస్ వ్యవస్థ 'నావిక్' రూపకల్పన చేపట్టింది. ఏడు ఉపగ్రహాల నావిక్ వ్యవస్థ ఇంకా పూర్తిస్థాయిలో పని ప్రారంభించనందువల్ల ప్రస్తుతం భారత్ తన సరిహద్దుల్లో చైనా సేనల కదలికలను పసిగట్టడానికి అమెరికా జీపీఎస్ సాయం తీసుకొంటోంది. ఇప్పుడు భారత్-అమెరికాల మధ్య వ్యూహాత్మక బంధం బలపడుతున్నందున జీపీఎస్ సేవలు భారత్‌కు అందుతున్నాయి. అయితే భావి అవసరాల కోసం నావిక్ వ్యవస్థను 11 ఉపగ్రహాలకు విస్తరించడంతోపాటు జపాన్, ఫ్రాన్స్ వంటి మిత్ర దేశాల ఉపగ్రహాలనూ ఉపయోగించుకోవాలని భారత్ యోచిస్తోంది. రష్యాకు గ్లోనాస్, చైనాకు బైడూ, ఐరోపా సమాఖ్యకు గెలీలియో పొజిషనింగ్ సిస్టమ్, జపాన్‌కు క్యూజడ్ఎస్ఎస్ పేరిట సొంత వ్యవస్థలు ఉన్నాయి. ఈ ఉపగ్రహ యంత్రాంగాలు నేల, నింగి, సముద్రాలలో సాయుధ బలగాలకు దారి చూపడమే కాదు, పౌర జీవనానికి దిక్సూచిగా నిలుస్తున్నాయి. నేడు కక్ష్యలో తిరుగుతున్న ఉపగ్రహాల్లో 95 శాతం సైనిక, పౌర అవసరాలకు పనికొచ్చేవే!



ఉపగ్రహాల మోహరింపులు

కిక్కిరిసిపోతున్న భూకక్ష్య

ప్రపంచ ఆధిపత్యానికి మొదట్లో సముద్రతలం (నౌకా బలం), తరవాత గగన తలం (వైమానిక బలగం) ప్రాతిపదిక అయితే, 21వ శతాబ్దిలో అంతరిక్షమే వేదిక కానుంది. రోదసిలో పైచేయి సాధించడానికి ఉపగ్రహాలు, వ్యోమనౌకలే ఆలంబన. ఈ సందర్భంగా అమెరికా ఎక్స్-37బి పేరుతో సృష్టించిన రెండు హైటెక్ రోదసి విమానాల గురించి చెప్పుకోవాలి. వీటిలో ఒకటి రెండేళ్లపాటు భూమికి దిగకుండా కక్ష్యలోనే తిరిగి కిందకు వచ్చింది. ఇది అంతరిక్షంలో ఏం చేసిందో, ఏం చేయగలదో ఎవరికీ తెలియదు. దానిలో వాడిన సాంకేతికతలూ రహస్యమే. ఎక్స్ 37బిని మళ్ళీ మళ్ళీ కక్ష్యలోకి ప్రయోగించవచ్చు. దాన్ని ఉపయోగించి ప్రత్యర్థుల ఉపగ్రహాలను పేల్చేయవచ్చు. చైనా సైతం ఇటీవల ఉపగ్రహ విధ్వంస (ఏశాట్) అస్త్రాన్ని పరీక్షించింది. ఉపగ్రహాలు లేకుండా ముందుకు కదలని ఆధునిక జీవనం ఇలాంటి అస్త్రాల వల్ల పూర్తిగా స్తంభించిపోతుంది.

నిరుడు నవంబరు 30నాటికి 1,957 ఉపగ్రహాలు భూమి చుట్టూ తిరుగుతుండగా, వాటిలో 849 (43 శాతం) ఉపగ్రహాలు అమెరికాకు చెందినవే. 284 ఉపగ్రహాలతో చైనా రెండోస్థానంలో ఉంది. తరవాతి స్థానాలను రష్యా (152), జపాన్ (75), భారత్ (57) ఆక్రమిస్తున్నాయి. పౌర జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల వాడకం రోజురోజుకూ పెరిగిపోతున్నందువల్ల ముమ్ముందు మరెన్నో ఉపగ్రహాలతో భూకక్ష్య కిక్కిరిసిపోనుంది. వాటిని ఎవరైనా పేల్చేస్తే అంతా అస్తవ్యస్తమే. 2007లో చైనా కాలంచెల్లిన తన వాతావరణ ఉపగ్రహాన్ని తానే పేల్చేసింది. అన్ని దేశాలూ అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాలకు వినియోగిస్తామంటాయి. చివరకు దేశాల ఉద్దేశాల కన్నా వాటి పోరాట సామర్థ్యమే అంతిమ ఫలితాలను నిర్ణయిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా, రష్యాలకు దీటుగా చైనా అంతరిక్ష సమర సామర్థ్యం పెంచుకొంటోంది. అది సహజంగానే భారత్, జపాన్‌లకు ఆందోళనకరం. ఒకటి మాత్రం నిజం. కక్ష్యలో పెరిగిపోతున్న రద్దీని తగ్గించాలంటే కాలంచెల్లిన ఉపగ్రహాలను పేల్చేయాలి. లేదా మరమ్మతులు చేసి మళ్ళీ వినియోగించాలి. కాలంచెల్లిన ఉపగ్రహాల శకలాలు నేడు కక్ష్యలో చెల్లాచెదురుగా వేలాడుతున్నాయి. వీటిని తొలగించకపోతే కొత్త ఉపగ్రహాలకు చోటు దొరకదు. 2016లో చైనా వేగంగా శిథిలాలను తొలగించే ఏడీఆర్ నౌక అవోలాంగ్-1ను ప్రయోగాత్మకంగా రోదసిలోకి పంపింది. అమెరికా, రష్యా, ఐరోపా సమాఖ్య (ఈయూ)లూ ఏడీఆర్ తయారీని చేపట్టాయి. కక్ష్యలోనే ఉపగ్రహాల మరమ్మతుకు ఓఓఎస్ నౌకల రూపకల్పన కొనసాగుతోంది. 2020కల్లా ఏడీఆర్, ఓఓఎస్ నౌకలు సాకారమవుతాయని, వీటిని సైనిక, పౌర ప్రయోజనాలకు వినియోగించవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

మరోవైపు చైనా ప్రపంచంలో మొట్టమొదటిసారిగా చంద్రుడి అవతలివైపు తన వ్యోమ నౌకను దింపింది. 2020కల్లా కుజ గ్రహానికి అన్వేషక నౌకను పంపడానికి, 2022కల్లా మానవ సిబ్బందితో భూకక్ష్యలో తిరిగే అంతరిక్ష వేదికను నిర్మించడానికి సమాయత్తమవుతోంది. ఇదంతా శాంతియుత ప్రయోజనాల కోసమేనని చైనా చెబుతున్నా, అంతరిక్షంలో ఆ దేశ సాంకేతిక పటిమ, పోరాట అవసరాలకూ ఉపయోగపడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతరిక్ష సాయుధ బలగ అధిష్ఠానాన్ని (స్పేస్ కమాండ్) ఏర్పరచాలని రక్షణ శాఖను ఆదేశించారు. చైనా ధాటికి భారత్, జపాన్ అప్రమత్తమయ్యాయి. 2017 సెప్టెంబరులో ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని షింజో అబే అంతరిక్ష సహకారానికి అంగీకారం కుదుర్చుకున్నారు. తదనుగుణంగా భారత్, జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థలైన ఇస్రో, జాక్సా ఈ ఏడాది మార్చిలో చర్చలు జరపనున్నాయి. చంద్ర మండల అన్వేషణ, జాతీయ భద్రత, భూతల, సముద్రతల నిఘాను సంయుక్తంగా చేపట్టడంపై ఈ భేటీలో చర్చిస్తారు. హిందూ మహాసముద్రం, దక్షిణ, తూర్పు చైనా సముద్రాలపై పట్టు బిగించడానికి చైనా సాగిస్తున్న కార్యకలాపాలు అమెరికాతోపాటు జపాన్, భారతదేశాలకూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సముద్ర జలాల్లో చైనా కార్యకలాపాలపై అంతరిక్షం నుంచి నిఘా వేయడానికి భారత్, జపాన్ నడుంకడుతున్నాయి. తూర్పు చైనా సముద్రంలో ప్రస్తుతం జపాన్ అధీనంలో ఉన్న కొన్ని దీవులు తనవేనంటున్న బీజింగ్, దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ దీవులను నిర్మిస్తోంది. హిందూ మహాసముద్రంపై పట్టుకు జిబూటీ, పాకిస్థాన్‌లలో నౌకా స్థావరాలను నిర్మించి, శ్రీలంక, మాల్దీవుల్లోనూ పాగా వేస్తోంది.

అపార ఖనిజ సంపద రాశులు



16 సైకి గ్రహశకలం

అంతరిక్షంలో పైచేయి సాధించే దేశాలు చంద్రుడు, కుజుడిపై మానవ నివాసాలు ఏర్పరచి, అక్కడి అమూల్య ఖనిజ వనరులను సొంతం చేసుకుని ఆర్థిక ఆధిపత్యం సాధించగలుగుతాయి. కుజుడి మీద నుంచి గ్రహశకలాలకు పయనించి అక్కడి నుంచి విలువైన ఖనిజాలను భూమికి తీసుకురావచ్చు. ఉదాహరణకు కుజ-గురు గ్రహాల మధ్యనున్న 16 సైకి అనే గ్రహశకలం మీద 10,000 క్వాడ్రిలియన్ డాలర్ల విలువైన ఖనిజాలు ఉన్నాయని అంచనా. (ఒకటి పక్కన 15 సున్నాలు పెడితే ఒక క్వాడ్రిలియన్ అవుతుంది. లక్ష కోట్లు అంటే ఒకటి పక్కన 12 సున్నాలు మాత్రమే). 200 కిలోమీటర్ల వెడల్పు ఉన్న 16 సైకి గ్రహ శకలంలో ఇనుము, నికెల్, బంగారం, ప్లాటినం వంటి విలువైన లోహ నిక్షేపాలున్నాయి. దీనిమీదకు అమెరికా 2023లో పరిశోధక నౌకను పంపనుంది. గ్రహాంతర ఖనిజాల అన్వేషణలో జపాన్ ఇప్పటికే ముందడుగు వేసింది. జపాన్ అంతరిక్ష సంస్థ జాక్సా గతేడాది రైయుగు అనే గ్రహ శకలం మీద హయబుసా-2 అంతరిక్ష వాహనం సాయంతో రెండు రోబో రోవర్లను దింపింది. అవి సేకరించే మచ్చులను తీసుకుని హయబుసా 2020కల్లా భూమికి తిరిగొస్తుంది. ఇలాంటి ప్రయోగం జరగడం ప్రపంచంలో ఇదే ప్రథమం.

నిఘా అస్త్రాలు

నేడు హిందూ మహాసముద్ర జలాల్లో ఏటా సుమారు లక్ష నౌకలు తిరుగుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాలో 66 శాతం, సరకుల రవాణాలో 33 శాతం, కంటైనర్ రవాణాలో 50 శాతం ఈ జలాల ద్వారానే జరుగుతోంది. తీరదేశాల అభివృద్ధికి హిందూ మహాసముద్రం ఎంత కీలకమో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. భూతల, సముద్రతలాలపై నిఘాకు అంతరిక్షంలోని ఉపగ్రహాలను మించిన సాధనాలు లేవు. అందుకే భారత్ నిరుడు డిసెంబరులో తన మూడో సైనిక ఉపగ్రహం జీశాట్-7ఏను కక్ష్యలోకి ప్రయోగించింది. అది సైనిక స్థావరాలను, విమానాలను, భూతల రాడార్లను, డ్రోన్ యంత్రాంగాలను అనుసంధానిస్తుంది. విద్యుదయస్కాంత ఆఘాతాలతో ఉపగ్రహాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలను ధ్వంసం చేసే పరిజ్ఞానాల్లో, అంతరిక్షం, సైబర్ రంగాల్లో పైచేయి సాధించడానికి నేడు పోటీ నడుస్తోంది. ఆ బరిలోకి తామూ ప్రవేశిస్తామని జపాన్ రక్షణమంత్రి గత డిసెంబరులో ప్రకటించారు. అమెరికా, రష్యాలకు దీటుగా చైనా మరికొన్నేళ్లలో ఉపగ్రహ విధ్వంస అస్త్రాల (ఏశాట్)ను రంగంలోకి దింపనున్నందువల్ల జపాన్, భారత్ త్వరగా మేల్కొంటున్నాయి. నిజానికి కక్ష్యలో ప్రత్యర్థుల ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఏశాట్ అస్త్ర తయారీ భారత్ చేతిలోని పనే. కానీ, అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాలకే వినియోగించాలన్న భారత్ విధానానికి ఈ తరహా అస్త్రాలు పూర్తి విరుద్ధం. అందుకే ఇతర మార్గాలను అన్వేషిస్తూ జపాన్‌ను కలుపుకొనిపోతోంది. కక్ష్యలో తమ ఉపగ్రహాలకు ముప్పు ఎదురైతే వెంటనే పసిగట్టి ప్రతిచర్యలు తీసుకోవడానికి భూమి మీద సెన్సర్లు, రాడార్లను నియోగించాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. తదనుగుణంగా భారత్ తన భూభాగంపై అయిదు ఉపరితల రాడార్ కేంద్రాలను భూటాన్, నేపాల్, మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంకలలో 500 చిన్న కేంద్రాలను స్థాపించనుంది. ఫ్రాన్స్, అమెరికాలతో కలిసి దక్షిణ, తూర్పు చైనా సముద్రాలపై, హిందూ మహాసముద్రంపై అంతరిక్షం నుంచి నిఘా వేయడానికి భారత్, జపాన్‌లు సంప్రతింపులు జరుపుతున్నాయి. దీనికితోడు 2022కల్లా ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపాలని భారత్ లక్షిస్తోంది. ఏతావతా ఆసియాలో సరికొత్త అంతరిక్ష పోటీకి రంగం సిద్ధమవుతోంది!

– ఏఏవీ ప్రసాద్


దశాబ్దాల నిరీక్షణ... అన్యాయం!

ఎప్పుడు ఒక కొలిక్కి వస్తుందో అంతుచిక్కని పనిపై సర్వశక్తులూ కేంద్రీకరించి ఆర్థిక వనరుల్ని హరాయింపజేసుకునే తదేక దీక్షను ఏమంటారో తెలుసా? భారత గడ్డమీద అయితే ఆ అపార శ్రమకు పేరు- న్యాయం కోసం సుదీర్ఘ నిరీక్షణ! అవును... న్యాయం కోరి కోర్టుకు ఎక్కడమే పాపమై దశాబ్దాలుగా జీవితాలు కమిలి కుమిలిపోతున్న కక్షిదారులు ఎందరో పోగుపడ్డ దేశం మనది. ఒక్కో కేసు పరిష్కరణకు ఇక్కడ తీసుకుంటున్న వ్యవధిని పరికించి యావత్ ప్రపంచమే విస్తుపోతోంది. 'మా తాతలు న్యాయపోరాటం ప్రారంభించారు... మేం ఇప్పటికీ కొనసాగిస్తున్నాం... ఎప్పటికి తెములుతుందో ఏమో' అని వాపోతున్న మనవళ్ల ఉదంతం ఏళ్లూపూళ్లూ దేకుతున్న వ్యాజ్యాల బాగోతానికి మచ్చుతునక.

మహారాష్ట్రలోని అకోలా ప్రాంతంలో ఎనిమిది వందల చదరపు గజాల స్థలానికి సంబంధించి 1949 ఆగస్టులో విక్రయ ఒప్పందం కుదిరేటప్పటికి, ఆ భూమి విలువ అక్షరాలా నాలుగు వందల రూపాయలు. సరిహద్దుల విషయంలో పొరుగువారు అభ్యంతర పెట్టడంతో 1952 డిసెంబరులో వివాదం కోర్టుకు చేరింది. కేసు పెట్టిన దంతవైద్యుడు డాక్టర్ కేశవ్ తుంకీకర్, ప్రతివాది జబూజీ ఇంగ్లే అనంతర కాలంలో తనువు చాలించాక న్యాయవివాదాన్ని వారి భార్యలు కొనసాగించారు. వారూ కన్నుమూశాక తరవాతి తరానికి ఆ బాధ్యత దఖలుపడింది. ఇప్పటికి అరవై ఆరేళ్లు గతించాయి. తొలుత వ్యాజ్యం వేసినవారు, వకాల్తా పుచ్చుకొని వాదించినవారు, ఆ వాదనను తిప్పికొట్టినవారు కాలం చేసినా ఆ స్థల వివాదం నేటికీ అంతులేని కథను తలపిస్తోంది. సంబంధిత సిబ్బంది భూమి కొలతల్ని సక్రమంగా నమోదు చేసి ఉంటే ఇన్నేళ్లు వ్యాజ్యమిలా ఇరు కుటుంబాల ఆర్థిక సత్తువను కుంగదీసేదే కాదని న్యాయ కోవిదులు సెలవిస్తున్నా- వాయిదాలపై వాయిదాల పీడ ఎప్పటికి విరగడ అవుతుందో చెప్పగల నాథుడు లేడు.

ఆరు దశాబ్దాలకు పైబడింది అకోలా కేసు ఒక్కటే కాదు. అరవై ఏళ్లకుపైగా అపరిష్కృత దశలో శ్లేష్మంలో ఈగల్లా చిక్కి గిజగిజలాడుతున్న కేసులు దేశంలో 140 దాకా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 48-58 సంవత్సరాలుగా మోక్షం కోసం ఎదురుతెన్నులు కాస్తున్న వ్యాజ్యాలు సుమారు 18 వందలుగా లెక్క తేలుతున్నాయి. మూడున్నర దశాబ్దాలుగా పెండింగ్‌లో పడినవాటి సంఖ్య 51 వేలు! దిగువ న్యాయస్థానాల అంచెను అధిగమించి అవెప్పటికి పరిష్కారానికి నోచుకుంటాయని అడిగితే, ఉద్దండ జ్యోతిష నిపుణులూ చేతులెత్తేయక తప్పదేమో!

దేశంలో సివిల్ దావాల పరిష్కరణకు సగటున పదిహేనేళ్ల వ్యవధి పడుతోంది. క్రిమినల్ కేసులు తెమలడానికైనా అయిదు నుంచి ఏడేళ్లు ఎదురుచూడాల్సి వస్తోంది. కొన్ని హైకోర్టుల్లో నెలకొన్న రికార్డులు పరికిస్తే కళ్లు బైర్లు కమ్మక మానవు. ముప్పై ఏళ్లకు పైబడిన అపరిష్కృత వ్యాజ్యాలు అలహాబాద్ ఉన్నత న్యాయస్థానంలో సుమారు 38వేలు. కోల్‌కతా హైకోర్టులో ఇంచుమించు పదివేలు. పట్నా, పంజాబ్-హరియాణా వంటి ఉన్నత న్యాయస్థానాల్లోనూ అటువంటి కేసులు భారీగానే పేరుకుపోయాయి. దేశవ్యాప్తంగా ఇరవైనాలుగు హైకోర్టుల్లో పదేళ్లకు పైగా అపరిష్కృతంగా పడిఉన్న వ్యాజ్యాలు పది లక్షలకు మించిపోయాయి.



పుణ్యభూమి

అసత్య ఆరోపణలతో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొలువు నుంచి తొలగించిన యాజమాన్యంపై విశాఖకు చెందిన పార్వతీశం 1982లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాలుగేళ్ల తరవాత కేసులో గెలుపొందిన ఆయన పింఛన్ కోసం సర్కారీ కార్యాలయాల మెట్లు ఎక్కీ దిగుతూనే 2004 సంవత్సరంలో మరణించారు. కుటుంబ పింఛన్ కోసం రెండేళ్ల తరవాత కోర్టు తలుపు తట్టిన ఆయన భార్య కేసు గెలిచినా తీర్పు అమలుకాక మరో వ్యాజ్యం వేయాల్సి వచ్చింది. 2017 జులైలో విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చొరవతో లోక్‌అదాలత్‌లో ఎనభైఆరేళ్ల వయోధికురాలికి చెక్కు ప్రదానం జరిగింది. ఆ సందర్భంగా మూడు దశాబ్దాల పోరాట స్ఫూర్తికి జడ్జి పాదాభివందనం చేశారు. అన్నేళ్ల పోరాటం తరవాత బాధితురాలికి అంతిమంగా 'న్యాయం' జరిగినా, అప్పటిదాకా అన్యాయాన్ని ఎదిరిస్తూ అలా పంటి బిగువున పోరాడే శక్తి ఎంతమందికి ఉంటుంది? సత్వరం న్యాయం చేయకపోవడం అన్యాయమే కదా! ధర్మబద్ధంగా దక్కాల్సింది దక్కలేదన్న ఆవేదనతో తమకు న్యాయం చేయండంటూ దశాబ్దాల తరబడి పోరాడాల్సి రావడం... ఏ విధంగా న్యాయం?

చివరి పంక్తిలోని కడపటి వ్యక్తికీ అన్యాయం జరగరాదని స్వతంత్ర భారత ప్రప్రథమ ప్రధాని నెహ్రూ ఆకాంక్షించారు. ముమ్మందు ముప్పై, నలభై ఏళ్లకుపైగా న్యాయపోరాటం కొనసాగించాల్సి వచ్చే దురవస్థ వేలాది భారతీయులకు దాపురిస్తుందని నాడాయన ఊహించి ఉండరు. దరిమిలా గద్దెలెక్కినవారు దీటైన సంస్కరణలకు ఉపక్రమించకపోవడం అసంఖ్యాక న్యాయార్థులను ఎన్నోవిధాల కుంగదీస్తోంది. దిగువ న్యాయస్థానాల్లో పెద్దయెత్తున పేరుకుపోయిన కేసుల్ని ఇప్పటి వేగంతోనే విచారిస్తూపోతే పెండింగ్ కొండలు కరగడానికి 324 సంవత్సరాలు పడుతుందని అంచనా. మరేదీ దారి? ప్రతి పది లక్షల జనాభాకు 50మంది చొప్పున న్యాయమూర్తులను నియమించాలని 1987లోనే న్యాయసంఘం (లా కమిషన్) చేసిన సిఫార్సుకిప్పటికీ అతీగతీ లేదు. రాష్ట్రాలవారీగా పోగుపడిన వ్యాజ్యాలను పరిష్కరించి, కేసులు మళ్ళీ పేరుకుపోయే దయనీయావస్థ దాపురించకుండా జాగ్రత్తపడటానికి దేశంలో 70వేల మంది దాకా జడ్జీలు ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీఎస్ ఠాకుర్ మూడేళ్లనాడే సూచించారు. న్యాయసంఘం నాలుగు నెలలక్రితం వెల్లడించిన లెక్కల ప్రకారం, ప్రతి పది లక్షల జనాభాకు ఉండాల్సిన రాశిలో ముప్పైమంది దాకా న్యాయమూర్తులు తరుగుపడ్డారు. ఏటా 75-85 మంది న్యాయమూర్తులు పదవీ విరమణ చేస్తుండటాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అన్ని ఉన్నత న్యాయస్థానాల్లోనూ పూర్తిస్థాయి నియామకాలకు అధమపక్షం పదిహేను సంవత్సరాలు పడుతుందన్న కథనాలు కక్షిదారుల గుండెలు మండించేవే. ఖాళీల భర్తీ చురుకందుకొనకపోతే 2040 నాటికి దేశంలో పెండింగ్ కేసులు 15కోట్లకు ఎగబాకుతాయన్న అంచనాలు గంగవెర్రులెత్తించేవే.

కొన్నేళ్లక్రితం వరకు అమెరికా, ఆస్ట్రేలియాల్లో పదిహేను, ఇరవై సంవత్సరాలపాటు కేసులు తెమిలేవి కాదు. మధ్యవర్తిత్వానికి, రాజీ పద్ధతులకు వీలు కల్పించాక అక్కడ పెండింగ్ వ్యాజ్యాల బెడద అదుపులోకి వచ్చింది. అంచెలవారీగా కోర్టుల్ని సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించిన చైనాలో విచారణ దశనుంచి మూడు నెలల లోపు శిక్షలు ఖరారవుతున్నాయి. అందుకు విరుద్ధంగా దేశీయ న్యాయ విచారణ విధివిధానాలు మందకొడితనంలో నత్తలతో పోటీపడుతున్నాయి.

నేర విచారణను చురుగ్గా పూర్తిచేయకుండా వ్యక్తి స్వేచ్ఛను తొక్కిపట్టడం ఇరవైఒకటో రాజ్యాంగ అధికరణను ఉల్లంఘించడమేనని సాక్షాత్తు సర్వోన్నత న్యాయస్థానమే స్పష్టీకరించింది. దశాబ్దాల తరబడి కేసుల విచారణను కొనసాగదీయడంలో బాధ్యులందరూ ఉల్లంఘనులుగానే లెక్కలోకి వస్తారు. వకీళ్లు కోరిందే తడవుగా ఉదారంగా వాయిదాలు మంజూరవుతుండటం, సత్వర న్యాయాన్ని ఎండమావి చేస్తోంది. ఏ కేసులోనైనా గరిష్ఠంగా మూడే వాయిదాలు ఉండాలని గతంలో సూచించిన 'సత్వర న్యాయ వేదిక' (ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్) మరో షరతునూ విధించాలని సిఫార్సు చేసింది. పరిమితికి మించి వాయిదాలు కోరేవారు అవతలి పక్షానికయ్యే కోర్టు ఖర్చులు, ప్రయాణ భత్యాలు, న్యాయవాది రుసుమును భరించేలా చూడాలన్నది మేలిమి సలహా. కాలదోషం పట్టిన చట్ట నిబంధనలను విచారణ ప్రక్రియను ప్రక్షాళించి, ప్రతి వివాదమూ కోర్టుదాకా వెళ్ళకుండా కాచుకుంటూ, వాయిదాల్ని కనిష్ఠ స్థాయికి నియంత్రించాలి.

ఎక్కడ ధర్మం ఉంటుందో విజయం అక్కడే ఉంటుంది (యతో ధర్మ స్తతో జయః) అన్నది మహాభారత సూక్తి. దాన్నే భారత న్యాయపాలిక మకుటంగా స్వీకరించింది. ఆ స్ఫూర్తి వమ్ము కారాదంటే ధర్మం కోరి కోర్టుల్ని ఆశ్రయించేవారు అన్యాయానికి గురికాకుండా చర్యలు చేపట్టాలి. కొరగాని చట్టాలకు అగ్ని సంస్కారం చేయాలి. కేసుల విచారణలో జాప్యానికి బాధ్యులైనవాళ్ల భరతం పట్టాలి. నిరర్థక లిటిగేషన్ల వడపోత ద్వారా కోర్టుల్నీ తెరిపిన పడేయాలి. అలాగైతేనే దశాబ్దాలపాటు న్యాయార్థుల జీవితాలు గుల్లబారే దౌర్భాగ్యం సమసిపోయేది. ఏమంటారు?

– బాలు

గురు పరంపర

నేర్చుకొనే స్వభావం ఉన్నవాడికి, లోకం అంతా గురువులే.

సజ్జనులందరూ మనిషికి గురువులే. వారి ప్రవర్తనే మనకు పాఠం. 'చల్లగా సవ్యంగా బతకాలంటే శ్రీరామచంద్రుణ్ని ఆదర్శంగా తీసుకొని, ఆయనలా జీవించేందుకు ప్రయత్నించు. అన్ని విధాలా బాగుపడతావు. రావణుడి లాగా జీవించకు. నాశనమైపోతావు' అని రామాయణం లాంటి గ్రంథాలు బోధించే నీతి. ఇది, 'నాయనా, మీ బడిలో ఫలానా మంచి కుర్రవాడున్నాడన్నావే, వాడిలా చదువు. వాడితో తిరుగు. వాడిని అనుకరించు, విద్యాబుద్ధులు అలవడతాయి!' అని తల్లిదండ్రులు తరచుగా తమ పిల్లలకు ఏదో ఒక రూపంలో చెప్పటం లాంటిదే. మంచివాడిని అనుసరిస్తే మనమూ మంచి మార్గంలోనే నడుస్తాం. మన పురాణాల్లో ఇతిహాసాల్లో కనిపించే కథలన్నీ చేసే ఉపదేశం ఇదే.

సజ్జనులు గురువులంటే, దుర్జనులు కూడా గురువులే అవుతారు. రాముడు గురువైతే, రావణుడూ గురువే. ఒకరు ఎలా నడుచుకొంటే బాగుపడతావో నేర్పిస్తారు. మరొకరు ఏం చేస్తే నాశనం కొని తెచ్చుకోవచ్చో చూపిస్తారు.

ఆ మాటకొస్తే- అటు పూర్తిగా సజ్జనులు, ఇటు పూర్తిగా దుర్జనులు కాని అత్యధిక శాతం మధ్యస్థులూ గురువులే. లోకంలో లోకులెవరో చేస్తున్న పనుల్లో మంచి చెడ్డలు వేడిగా వాడిగా విశ్లేషిస్తూ మనం జరుపుకొనే తెరపి లేని చర్చల వెనక ఉద్దేశం మంచిని గుర్తించి, దాన్ని సమర్థించాలనే. మనం ఎరిగిన బంధుమిత్రులో, ఎరుగని మరెవరో చేసిన పనుల్ని చెరగటంలో, జల్లెడ పట్టడంలో అర్థవంతమైన ప్రయోజనం ఒక్కటే. రేపు మనకు అలాంటి పరిస్థితి ఎదురైతే, వాళ్లు చేసిన 'పొరపాట్లు' మనం చేయకుండా, వాళ్ల అనుభవం నుంచి మనకు తోచిన పాఠం మనం నేర్చుకోవటం. ఈ పాఠాలన్నీ కలిస్తే అదే లోకానుభవం, లోకజ్ఞానం, లోకజ్ఞత. ఈ జ్ఞానం కలిగించే లోకులు గురువులు కాదనలేం!

ఇతరులు నేర్పేవేకాక, మన సొంత గుణగణాలూ మనకు చాలా నేర్పుతాయి. మన సద్గుణాలు మన గురువులు. ఉదాహరణకు, కష్టపడటం అనే సుగుణం వల్ల సత్ఫలితాలను, సంతృప్తిని పొందుతున్నామంటే- ఇక్కడ కృషి అనే సద్గుణం, 'కృషి వల్ల సంతృప్తి కలుగుతుంది' అన్న పాఠాన్ని మనకు నేర్పిస్తున్నట్టే. పట్టుదల వల్ల కార్యసిద్ధి పొందవచ్చు అనే పాఠాన్ని పట్టుదల అనే సద్గుణమే మనకు బోధిస్తున్నది.



అంతర్యామి

సద్గుణాల్లాగే దుర్గుణాలూ గురువులే! మితిమీరి తినటం వల్ల, తాగటం వల్ల వెంటనే దుష్ఫలితాలు అనుభవిస్తాం. అలాంటి బాధాకరమైన అనుభవాలు మళ్ళీ ఎదురుకాకుండా జాగ్రత్త పడమని, 'అతి భోగం' అనే దుర్గుణం మనకు సోదాహరణంగా నేర్పుతున్నట్టే. అతి వ్యయం వల్ల అప్పులపాలై అష్టకష్టాలు పడ్డవాడికి 'ముందెప్పుడూ ఆదాయాన్ని మించిన వ్యయం కూడదు!' అన్న పాఠం నేర్పేది- దుబారా ఖర్చులు చేసే దుర్గుణమే! కోపం వల్ల మనకు కలిగే అనర్థాల ద్వారా, కోపం అనే దుర్గుణం 'నన్ను వదిలిపెట్టు మిత్రమా సుఖపడతావు!' అని గురువులా బోధ చేస్తుంటుంది.

గురువుల రూపంలోనే తారసిల్లి మార్గదర్శనం చేయించే మహనీయులు సరేసరి. వారిలో కొందరు లౌకిక విద్యలు నేర్పి పుణ్యం కట్టుకొనే ఉపాధ్యాయులు. మరి కొందరు, జ్ఞాన నేత్రాన్ని తెరిపించే సద్గురువులు. సద్గురువులు శిష్యులనుంచి ఏ ప్రతిఫలమూ ఆశించకుండా, నిస్వార్థంగా కేవలం లోకోపకార దృష్టితో తమ అనుభవాలను పంచుకొంటారు. అలాంటి సద్గురువులు దొరకటం అరుదైన మహాభాగ్యం.

కొన్ని సందర్భాల్లో అతి సామాన్యులైన సాటి మనుషులే గురువులుగా నిలుస్తారు. కొన్ని విపత్సమయాల్లో సాటివారిపట్ల సామాన్యుల ప్రవర్తనలో కనిపించే భావౌన్నత్యం లోకానికే గుణపాఠంగా నిలుస్తుంది.

ఒక్కొక్కప్పుడు, అధ్యాపక వృత్తిలో ఉండి శిష్యులకు పాఠాలు నేర్పుతూ ఉండే అయ్యవారు తమ శిష్యుల నుంచి ఎంతో నేర్చుకొంటారు. వినయంగల విద్వాంసుడికి ఒక్కోసారి శిష్యుడు కూడా గురువే!

– మల్లాది హనుమంతరావు

లక్ష్యమేవ జయతే!

◆ లక్ష్యం నిర్దేశించుకుని ముందుకెళ్తే అద్భుతాలు సాకారం ◆ యువ జాగృతితోనే దేశ పురోగతి ◆ యువత గ్రామాల దత్తతకు ముందుకు రావాలి
◆ సామాజిక కార్యకర్త అన్నా హాజారే పిలుపు ◆ ప్రారంభమైన తెలంగాణ జాగృతి అంతర్జాతీయ నాయకత్వ సదస్సు


అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో మాట్లాడుతున్న అన్నా హజారే

ఈనాడు డిజిటల్ - హైదరాబాద్

యువత ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే పిలుపునిచ్చారు. యువతీ, యువకులు ఏడాది, ఐదేళ్లు, పదేళ్ల ప్రాతిపదికగా లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలపై స్పష్టత, ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనకడుగు వేయకూడదనే సంకల్పం, నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకుంటే విజయం సాకారమవుతుందని పేర్కొన్నారు. యువశక్తే జాతీయ శక్తి అని, యువత జాగృతంగా ఉంటేనే దేశం పురోగమిస్తుందని అభిప్రాయపడ్డారు. సరైన మార్గనిర్దేశం లభిస్తే యువత అద్భుతాలు చేస్తుందని, ప్రభుత్వాలు ఆ దిశగా విధానాలు రూపొందించాలని కోరారు. ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన, జనాభా నియంత్రణ, సుస్థిరాభివృద్ధి, కాలుష్యం లేని నగరాలు, లింగ సమానత్వం, పునరుత్పాదక ఇంధనాలు వంటి 17 అంశాల్లో ప్రపంచ దేశాలు పురోగతి సాధించాలని ఐక్యరాజ్య సమితి నిర్దేశించింది. ఆయా లక్ష్యాలను గాంధేయ మార్గంలో ఎలా సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు శనివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో జరిగింది. 'గాంధేయ మార్గంలో సుస్థిరాభివృద్ధి, ఆవిష్కరణలు' అనే అజెండాతో సమావేశం సాగింది.

జరుగుతున్న అభివృద్ధి, ఆవిష్కరణలు భవిష్యత్తు తరాల మీద ఎలాంటి ప్రభావం చూపకుండా ప్రగతి సాధించడమెలా? అనే అంశాలపై చర్చలు సాగాయి. ఈ సందర్భంగా అన్నా హజారే ముఖ్యోపన్యాసం చేశారు.

సమాజాన్ని దేవాలయంగా భావించండి

"గ్రామాలే దేవాలయాలు. భగవంతుడు పుణ్యక్షేత్రాల్లోనే కాదు. అన్నిచోట్లా ఉంటాడు. ప్రజలకు, సమాజానికి సేవ చేస్తే దేవుడిని ఆరాధించినట్లేనన్న భావన యువతకు రావాలి. సమాజాన్నే తమ కుటుంబంగా మార్చుకోవాలి. గ్రామాలు మారకపోతే దేశం మారదు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది.

గాంధేయ మార్గంతో అన్నీ సాధ్యమే

పాతికేళ్ల వయసులో నేను ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా. గాంధీజీ చరిత్రను చదివిన తర్వాత నాలో మార్పు వచ్చింది. గాంధేయ మార్గంలో ప్రయాణించి రాలేగావ్‌సిద్ధి గ్రామాన్ని అభివృద్ధి చేశా. అహింసాయుత పద్ధతిలో పోరాడే సమాచార హక్కు చట్టం, 8 అవినీతి నిరోధక చట్టాలు తీసుకువచ్చాం' అని హజారే గుర్తు చేశారు.

సాంకేతికతతో మార్పులు రావు..

సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ థాపా మాట్లాడుతూ.. కేవలం సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలు మాత్రమే సమాజంలో మార్పులు తీసుకురాలేవని అభిప్రాయపడ్డారు. ప్రజల విద్య, ఆర్థిక, సామాజిక అంశాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత వ్యక్తిగత విషయాల గురించే ఆలోచించడం మాని, గొప్ప ఆలోచనలు ఉన్న రిజర్వాయర్‌లా తమను తాము రూపుదిద్దుకోవాలని సూచించారు. సదస్సుకు 110 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు, 15 దేశాలకు చెందిన 70 మంది వక్తలు, వివిధ దేశాల పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు.

మలావత్ పూర్ణకు యూత్ అచీవ్‌మెంట్ అవార్డు

సదస్సును పురస్కరించుకుని ఎనిమిది మందికి ఉపకార వేతనాలు, ప్రోత్సాహకాలు అందించారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణకు తెలంగాణ జాగృతి యూత్ అచీవ్‌మెంట్ అవార్డును అన్నా హజారే చేతుల మీదుగా అందించారు.


సదస్సులో ఎంపీ కవితతో సెల్ఫీ తీసుకుంటున్న ఓ యువతి

పోరాడండి.. సాధించండి

- ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపడమే సదస్సు లక్ష్యం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

యువత కలిసికట్టుగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సదస్సులో మాట్లాడుతూ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, లింగ అసమానత్వం వంటి సమస్యల పరిష్కారానికి అందరం ఐకమత్యంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత, మేధావులు ఈ అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది ఆకలితో బాధపడుతున్నారని, ఏటా లక్షలాది మంది చిన్నారులు వివిధ రకాల వ్యాధులతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవుల వల్ల తలెత్తిన ఇలాంటి కొన్ని సమస్యలకైనా ఈ సదస్సులో పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో యువత భాగస్వామ్యం, వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే సదస్సు లక్ష్యమని స్పష్టం చేశారు.

కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

- అక్కడి పరిస్థితిని మార్చే ఉద్దేశం దిల్లీ పాలకులకు లేదు
- గాంధీ కన్నా అంబేడ్కర్‌నే ఎక్కువగా అభిమానిస్తా
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


రాజకీయాల్లో యువత అంశంపై జరిగిన చర్చలో ప్రసంగిస్తున్న ద ప్రింట్ ఎడిటర్ ఇన్ చీఫ్ శేఖర్‌గుప్తా. చర్చలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు సీమా మల్హోత్రా, గౌరవ్ గగోయ్, అసదుద్దీన్ ఒవైసీ, కవిత

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశంలో కశ్మీరు, కశ్మీరు ప్రజలు ముమ్మాటికీ అంతర్భాగమేనని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. తాను గాంధీజీ కన్నా అంబేడ్కర్‌నే ఎక్కువగా అభిమానిస్తానని వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అంతర్జాతీయ నాయకత్వ సదస్సులో భాగంగా రాజకీయాల్లో యువత అనే అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో ఎంపీలు కవిత, అసదుద్దీన్ ఒవైసీ, అసోం రాష్ట్ర ఎంపీ గౌరవ్ గగోయ్, యూకే లేబర్ పార్టీ ఎంపీ సీమా మల్హోత్రా, ది ప్రింట్ ఎడిటర్ ఇన్ చీఫ్ శేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. గాంధీ బాటలో నడుస్తామని చెబుతూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఎందుకు ఇస్తారని ఓ యువకుడు అడిగిన ప్రశ్నకు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సమాధానం ఇచ్చారు. "మీకు నచ్చినా నచ్చకపోయినా నా వ్యక్తిగత అభిప్రాయం మేరకు గాంధీ కన్నా బీఆర్ అంబేడ్కర్ గొప్ప వ్యక్తి. ఆయన్నే నేను ఎక్కువగా అభిమానిస్తాను" అని తెలిపారు. కొన్ని సందర్భాల్లో తన వ్యాఖ్యలు ఎదుటి వారికి ఇబ్బంది కలిగిస్తాయన్న విషయం తనకు తెలుసన్నారు. ఆయా అంశాలపై చర్చ జరగాలన్న ఉద్దేశంతోనే అలా మాట్లాడతానని వివరణ ఇచ్చారు. కశ్మీర్‌లో పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకువచ్చే స్పష్టమైన విధానం, దృక్కోణం దిల్లీలో కొలువుదీరే పార్టీలకు లేదని ఆరోపించారు. ఇప్పటివరకు పాలించిన ప్రభుత్వాలు కశ్మీరీ పండిట్ల కోసం ఏమీ చేయలేదని, శరణార్థుల లెక్కలు సేకరించలేదని ఆక్షేపించారు. 'మన దేశంలో రాజకీయ నాయకులకు ఎప్పటికీ వయసు మీదపడదు. 48 ఏళ్లు వచ్చినా, వాళ్లే యువజన నాయకులుగా కొనసాగుతుంటారు. ఈ పరిస్థితి మారాలి. అందుకే ఎమ్మెల్యే, ఎంపీగా పోటీచేసే కనీస అర్హత వయసు 25 నుంచి 20 ఏళ్లకు తగ్గించాలని ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టానని' తెలిపారు.

యువ సమస్యల పరిష్కారానికి విధానాలు ఉండాలి

ప్రస్తుతం యువత ఎక్కువగా ఉన్న దేశం 30 ఏళ్ల తరువాత వృద్ధులున్న దేశమవుతుంది. ఇప్పుడు యువత సమస్యలు పరిష్కరించేలా విధానాలు లేకుంటే, తరువాత వృద్ధుల సమస్యలు పరిష్కరించలేం. విధానాలు ఎప్పటికీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించాలి. దేశ జీడీపీకి దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువ ఆదాయాన్ని ఇస్తున్నాయి. ఆ ఆదాయాన్ని అభివృద్ధికి దూరంగా ఉన్న రాష్ట్రాలకు పంచుతున్నారు. తొలుత అందరికీ ఆహారం, విద్య, ఉపాధి ప్రధానం. ఈ సౌకర్యాలు కల్పించేటప్పుడు రాష్ట్రాల కోణంలో చూడకూడదు. మొత్తం దేశం అభివృద్ధిగా పరిగణించాలి. ముందుగా పేదలకు లబ్ధి చేకూర్చిన తర్వాతే రాష్ట్రాల గురించి ఆలోచించాలి.

- ఎంపీ కవిత

ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధికి దూరం

దశాబ్దాలుగా ఈశాన్య రాష్ట్రాలు ఆర్థికాభివృద్ధిని కోల్పోయాయి. ఆయా రాష్ట్రాల జీడీపీ 2 నుంచి 3 శాతం వద్ద ఆగిపోయింది. ఈ రాష్ట్రాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన యువతను దేశద్రోహులుగా చిత్రీకరించడం సరికాదు. రాజకీయాల్లో విద్యార్థుల పాత్ర పెరగాలి.

- గౌరవ్ గగోయ్ అసోం ఎంపీ

యువతే ప్రపంచ భవిష్యత్తు

యువతే ప్రపంచ భవిష్యత్తు. వారికి సరైన ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది యువత మానసిక సమస్యలతో బాధపడుతోంది. జీవితంపై ఆశను కోల్పోతూ ఆత్మహత్యలకు పాల్పడుతోంది. ఇది చాలా పెద్ద సమస్య. ఆసియా దేశాల్లోని ప్రజలు దీని గురించి మాట్లాడం కూడా ఓ లోపంగా చూస్తున్నారు. ఈ పరిస్థితులు మారాలి. అంతర్జాతీయ సమాజం దీనిపై దృష్టి సారించాలి. బ్రిటన్‌లో యువతను, పారిశ్రామిక రంగాన్ని అనుసంధానించాం. అన్నిచోట్లా ఆ ఏర్పాటు జరగాలి.

- సీమా మల్హోత్రా, ఎంపీ లేబర్‌పార్టీ, యూకే

పత్రికల్లో గ్రామాలకు ప్రాధాన్యమేదీ!

ప్రముఖ పాత్రికేయుడు పాలగుమ్మి సాయినాథ్



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశంలో 69 శాతం జనాభా నివసించే గ్రామీణ ప్రాంతాలకు జాతీయ పత్రికల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రముఖ పాత్రికేయుడు, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. మంథన్ సంస్థ, అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల ఫలితంగా వర్షపాతం తగ్గి వ్యవసాయం, అనుబంధ రంగాలు కరవులో కూరుకుపోతున్నాయన్నారు. కొన్ని పత్రికలు వాణిజ్య వార్తలకు రిపోర్టర్లను నియమిస్తున్నాయే తప్ప వ్యవసాయ, కార్మిక వార్తల కోసం ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. గ్రామీణ ప్రజల స్థితిగతులను అధ్యయనం చేసేవారు లేక, ప్రజల ఆలోచనలను పత్రికలు తెలుసులేకపోతున్నాయని, అందుకే ఎన్నికల ఫలితాలను అంచనా వేయడంలో విఫలం అవుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లోంచి జర్నలిజాన్ని విడిపించి, ప్రజల చేతుల్లో పెట్టాలనే లక్ష్యంతో తాను స్థాపించిన పీపుల్స్ ఆర్కైవ్స్ ఆఫ్ రూరల్ ఇండియా (పారీ) పని చేస్తుందన్నారు. గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా 250 భాషలు అంతరించాయన్నారు. 883 మిలియన్ల మంది గ్రామీణ ప్రజలు 780 భాషలు మాట్లాడుతున్నారని గుర్తించి.. వెలికితీసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కోట్లాది మంది ప్రజల జీవనశైలిని ప్రతిబింబించేలా రూపొందించిన సినిమాలు, నివేదికలు, కథనాలు, డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. రానున్న మూడేళ్లలో 1871 నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వెలువడిన ముఖ్యమైన సర్వే రిపోర్టులన్నీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మంథన్ సంస్థ ప్రతినిధి అజయ్‌గాంధీ, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులవ్వండి.. మార్పదే వస్తుంది

- అవినీతి నిర్మూలన అందరి బాధ్యత
- యువతతో ముఖాముఖిలో అన్నా హజారే

మాదాపూర్, న్యూస్‌టుడే: ఉపన్యాసాలతో సమాజంలో మార్పు రాదని, యువత కొవ్వొత్తులుగా మారి వెలుగునిస్తేనే మార్పు సాధ్యమని అన్నా హజారే అన్నారు. అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సుకు హాజరైన ఆయన యువతతో కాసేపు ముచ్చటించారు. యువతీ యువకులు అడిగిన ప్రశ్నలకు సమాధాలు చెప్పారు.

● ఒక్కొకరు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని చెప్పారు. గ్రామ స్వరూపం ఒక్కరితో మారుతుందా?

గ్రామాన్ని దత్తత తీసుకోవడమంటే గ్రామానికి వెళ్లి ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. మనం కొవ్వొత్తులా వెలుగుతూ..కరుగుతూ వారికి వెలుగునిచ్చేలా పనిచేయాలి. ఎదుటి వారు ఎన్ని విమర్శలు చేసినా తట్టుకొని నిలబడినప్పుడే గ్రామంలో అందరి సహకారం అందుతుంది. నేను కూడా మొదట గ్రామ వీధుల్లో ఎవరూ మల,మూత్ర విసర్జన చేయవద్దని సూచించా. ఎవరూ వినలేదు. నేనే స్వయంగా చీపురుపట్టి రోడ్లు శుభ్రం చేయడం మొదలు పెట్టా. ఏడాది పాటు ఇలా చేయడంతో గ్రామస్థుల్లో మార్పు వచ్చింది.

● దేశంలో అవినీతి పెరిగిపోతుంది. దీన్ని నిర్మూలనకు ఏం చేయాలి?

అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. ఎవరికి వారు తాము అవినీతికి పాల్పడకూడదన్న నిర్ణయానికి రావాలి. అలాగే ఇతరులు అవినీతికి పాల్పడకుండా చూడాలి. అప్పుడే దాన్ని సమూలంగా అంతమొందించవచ్చు.

● మధ్య తరగతి కుటుంబాలు ఆడ పిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యం ఇవ్వవు. పెళ్లి చేసి పంపించాలనే ఆలోచనే తల్లిదండ్రులకు ఉంటుంది. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలంటే ఏం చేయాలి?

ముందుగా మహిళలంతా సంఘటితం కావాలి. ఆ దిశగా సదస్సులు, అవగాహన శిబిరాలు నిర్వహించాలి. అవసరమైతే పోరాడాలి. సంఘటితంగా ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చు. నేనూ మొదట ఒక్కడినే. నా దగ్గర పడుకునేందుకు చాప, తినేందుకు పళ్లెం తప్ప ఏమీ లేవు. అయినా ఉద్యమాన్ని నడిపా. అందరినీ సంఘటితం చేయడం ద్వారానే ఇది సాధ్యమైంది.

● పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగిపోతున్నాయి. వ్యవసాయం చేసే వారి సంఖ్య తగ్గిపోతుంది. దీనికి పరిష్కారం?

ప్రభుత్వాలు ఉద్యోగుల సంక్షేమం మీద చూపుతున్న ఆసక్తి రైతాంగం మీద చూపడం లేదు. అదే అసలు సమస్య. వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద రైతులకు ఏడాదికి రూ.8 వేలు ఇస్తుంది. ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఇక్కడ రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండదు.

5 రకాల యుద్ధాలకు సన్నద్ధం కావాలి

- అధునాతన ఆయుధాలను రూపొందించాలి
- రక్షణ రంగంలో సాంకేతికత, నవకల్పనలకు పెద్దపీట
- డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి


హైదరాబాద్‌లో జరిగిన రక్షణరంగ సదస్సులో పాల్గొన్న డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారు ఆర్.ఎన్.రవి

ఈనాడు, హైదరాబాద్: భారతదేశానికి రక్షణ రంగంలో స్వావలంబన చాలా ముఖ్యమని రక్షణ శాఖ పరిశోధన అభివృద్ధి కార్యదర్శి, డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు జరిపి.. అధునాతన ఆయుధాలను రూపొందించడం కీలకమన్నారు. దేశ రక్షణ అవసరాలకు తగిన ఆయుధాలు, సాంకేతికత భారత్‌లోనే తయారు చేయాలనే 'మేకిన్ ఇండియా' సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని చెప్పారు. ఫోరం ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ(ఎఫ్ఐఎన్ఎస్) ఆధ్వర్యంలో 'రక్షణ రంగంలో స్వావలంబన; దేశరక్షణలో సాంకేతికత, నవకల్పన, పారిశ్రామిక వ్యూహాలు' అంశంపై హైదరాబాద్‌లో శనివారం ప్రారంభమైన రెండురోజుల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. గతంలో భూమి, నీరు, వాయు మార్గాల్లో యుద్ధాలు జరిగేవని.. ప్రస్తుతం అంతరిక్షం, సైబర్ ప్రపంచం కూడా తోడై ఐదు రకాల యుద్ధాలకు దేశాలు సన్నద్ధం కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రియల్‌టైం, ఆన్‌లైన్‌లో కచ్చితమైన సమాచారం సేకరించగలిగితేనే ఈ ఐదు యుద్ధాల్లో విజయం సాధ్యమవుతుందన్నారు. సైబర్ యుద్ధంలో సాంకేతికతదే పైచేయి అని.. ఈ విషయంలో ఇజ్రాయెల్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో కృత్రిమమేధ, మానవ రహిత ఆయుధాలు రాబోతున్నట్లు చెప్పారు. డీఆర్‌డీవోనే అన్నీ చేయలేదని. .నవకల్పనలపై పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు కలసి పనిచేయాల్సి ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలను తీర్చే వస్తువులను గుర్తించి వాటిని దేశీయంగా ఉత్పత్తి చేయగలిగితేనే రక్షణరంగంలో స్వావలంబన సాధ్యమవుతుందని వివరించారు. జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారు, జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ ఛైర్మన్ ఆర్.ఎన్. రవి మాట్లాడుతూ.. జాతీయ భద్రత అంటే కేవలం సరిహద్దు రక్షణ మాత్రమే కాదని, ఆర్థిక వ్యవస్థలు, సంస్థలు, సామాజిక సామరస్యం, విలువలు కాపాడుకోవడం కూడా అని పేర్కొన్నారు. సైబర్ యుద్ధాలపై జరిగిన చర్చలో నేషనల్ సైబర్ సెక్యూరిటీ సమన్వయకర్త(పీఎంవో) ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ గుల్షన్ రాయ్ మాట్లాడారు. సదస్సు కన్వీనర్ మేజర్ జనరల్ ఎ.బి.గోత్రి, ఎఫ్ఐఎన్ఎస్ అధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ బి.శేఖర్, ఎన్ఎస్‌సీఎస్ మిలటరీ సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ వి.జి.ఖండారి, డీఆర్‌డీవో అదనపు డైరెక్టర్ డాక్టర్ అమిత్‌శర్మ, లెఫ్టినెంట్ జనరల్ ఎస్.ఎస్. హస్బినిస్ తదితరులు మాట్లాడారు.

అసెంబ్లీ సమావేశాల వల్లే కోల్‌కతా ర్యాలీకి హాజరు కాలేదు: కవిత

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న కారణంగానే టీఆర్ఎస్ పార్టీ కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆధ్వర్యంలో జరిగిన విపక్షాల ర్యాలీకి హాజరు కాలేకపోయిందని కవిత అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ.. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో టీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కాంగ్రెస్, భాజపాలు లేని ప్రత్యామ్నాయం దేశానికి అవసరమని ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన అవకాశాలను వినియోగించుకోవడంలో భాజపా, కాంగ్రెస్ విఫలమయ్యాయని, అందుకే దేశ రాజకీయాల్లో మార్పు అవసరమని తాము భావిస్తున్నామన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌కు ఓ రూపు తీసుకొస్తున్నామని, ఇతర ఫ్రంట్‌ల మాదిరిగా నాయకుడిని ప్రకటించబోమని స్పష్టం చేశారు.

'మీసేవ'లో అక్రమాలపై ఉక్కుపాదం

ఫిర్యాదులపై చర్యలకు అధికారుల నియామకం

ఈనాడు, హైదరాబాద్: మీసేవ కేంద్రాల ద్వారా పౌరసేవలు అందించడంలో అధిక వసూళ్లకు పాల్పడుతున్న నిర్వాహకులపై ఉక్కుపాదం మోపనున్నట్లు తెలంగాణ మీసేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇద్దరు ఉన్నతస్థాయి అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. మీసేవ నిర్వాహకులు రెండు పడక గదుల పథకంతో పాటు వివిధ పౌరసేవలకు ఈఎస్‌డీ నిర్ణయించిన పరిమిత రుసుం కన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు ఐటీశాఖ దృష్టికి వచ్చిందని కమిషనర్ పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండుపడక గదుల ఇళ్ల పథకం దరఖాస్తు కోసం రూ.35 కన్నా ఎక్కువ తీసుకుంటే, ఆ కేంద్రాల నిర్వాహకులపై ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదులకు మీసేవ డిప్యూటీ డైరెక్టర్ పి.విజయ్‌భాస్కర్ (9701308181), రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ బి.నరసింహారావు (8008022188)ను వ్యక్తిగతంగా లేదా ఫోనులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

TG



వధువు కావలెను

ఆ రాళ్లు.. వాడిపోని ఆశీస్సులు!



నూతన వధూవరులిద్దరూ కలిసి జీవించబోయే ప్రతిక్షణం సంతోషంతో నిండిపోవాలి. కాలం గడిచేకొద్దీ వారి బంధం మరింత బలపడాలని మనసారా దీవించే అయినవాళ్లంతా వివాహానికి హాజరవ్వాలి. తరతరాలుగా తాము అనుసరిస్తున్న సంప్రదాయాలకు ఏ మాత్రం భంగం కలగకూడదు.

వివాహ క్రతువు విషయంలో అందరి ఆలోచనా ఇదే! పెళ్లి జరిగే అపురూప క్షణాలు తమ జీవితాల్లో చిరకాలం నిలిచిపోవడం కోసం ప్రతిజంటా తాపత్రయ పడుతుంది. ఒక్క మనదేశంలోనే కాదు, విదేశాల్లోనూ వివాహ పద్ధతులూ సంప్రదాయాలూ వేటికవే ప్రత్యేకం. అవేంటో ఓసారి చూసొద్దామా!

కలిసికట్టుగా దుంగను కోయాలి!

కష్టమైనా, నష్టమైనా సమానంగా తీసుకుంటామని తెలియజెప్పేందుకు సంకేతంగా జర్మనీలో వధూవరులు వివాహం తర్వాత ఓ దుంగను రంపంతో కోస్తారు. దంపతులిరువురూ దుంగకు చెరోవైపు నిలబడి దీన్ని నిర్వహిస్తారు. బంధుమిత్రులు చప్పట్లతో ప్రోత్సహిస్తుంటే వారిద్దరూ ఈ 'కోత' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేస్తారు. ఇప్పటికీ జర్మన్ ప్రజలు ఈ సంప్రదాయాన్ని పాటిస్తుండటం విశేషం.

జంట కపోతాలకు స్వేచ్ఛ!

ఫిలిప్పైన్స్ దేశంలో కొత్తజంట వివాహమైన తరువాత ఓ పావురాల జంటను నింగిలోకి విడిచిపెడతారు. 'లవీ-డవీ'గా పిలుచుకునే ఈ సంప్రదాయం ప్రకారం కలకాలం తమ వివాహ బంధం హాయిగా, స్వేచ్ఛగా సాగిపోవాలని కాంక్షిస్తూ వరుడు మగ పావురాన్ని, వధువు ఆడ పావురాన్ని ఒకేసారి ఆకాశంలోకి వదిలి వేస్తారు. ఫిలిప్పైన్స్‌లో వివాహ ఖర్చులన్నీ వరుడి తరఫువారే భరించాల్సి ఉంటుంది. 'ఫిలిపినో వెడ్డింగ్' పేరిట జరిగే ఈ వివాహం క్యాథలిక్ సంప్రదాయ పద్ధతిలో చర్చిలో జరుగుతుంది. వధూవరులు ఇద్దరిమధ్యా ఆనందోత్సాహాలు శాశ్వతంగా నిలిచి ఉండాలని దీవిస్తూ సుఖసంతోషాల అపరిమితత్వానికి సంకేతంగా మత పెద్ద 8 ఆకారంలో ఉండే తాడును ఆ దంపతుల మెడలో వేస్తారు.

ఎరుపు రంగుపై గురి ఎక్కువే!

అట్టహాసంగా జరిగే చైనా వివాహ సంప్రదాయాల గురించి బోలెడన్ని ముచ్చట్లున్నాయి. చైనాదేశస్థులు ముఖ్యంగా ఎరుపు రంగును అదృష్టం, ప్రేమకు చిహ్నంగా భావిస్తారు. వివాహం రోజున వధువు ధరించే మేలిముసుగు కూడా ఎరుపు రంగుదే కావడం విశేషం. వధువు తరఫు బంధువులు వివాహవేదిక వరకు ఆమెను ఎరుపురంగు గొడుగునీడలో తీసుకువస్తారు. అంతేనా అనుకోకండి. వివాహ వేదిక, హాజరయ్యే బంధుగణం కూడా దాదాపుగా ఎరుపుదనం ఉండేలా అలంకరించుకుంటారు.

పెళ్లివేడుకకు గుర్తుగా రాళ్లు!

కంగారూల దేశంగా ప్రఖ్యాతిగాంచిన ఆస్ట్రేలియాలోనూ విభిన్నమైన వివాహ సంప్రదాయాలు మనుగడలో ఉన్నాయి. వాటిలో 'ఐక్యతాపాత్ర'గా ప్రజలు పిలుచుకునే పద్ధతి ఒకటి. పెళ్లివేడుకకు హాజరైన బంధుమిత్రగణానికి ప్రత్యేకమైన రాళ్లను ఇచ్చి వేడుక పూర్తయ్యే వరకు చేతిలోనే ఉంచుకోమని పెళ్లిపెద్దలు విజ్ఞప్తిచేస్తారు.

పెళ్లి అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన పాత్రలో అతిథులందరూ ఆ రాళ్లను పడేయాలి. తర్వాత వధూవరులు తమ ఇంట ఆ రాళ్లపాత్రను జాగ్రత్తగా భద్రపరుచుకుంటారు. వివాహానికి వచ్చినవారి ఉనికిని, ఆశీస్సులను ఎల్లప్పుడూ గుర్తు చేసుకొనేందుకే వారిలా చేస్తారు.

చక్కని సంతానంతో సంతోషం రెట్టింపవ్వాలని..

చెకోస్లోవేకియా దేశస్థులు దాంపత్యజీవనం సంపూర్ణమవ్వాలంటే సంతానం కూడా ఉండాలని నమ్ముతారు. అందుకే నూతన దంపతులకు బహూకరించే మంచం మీద తొలుత ఓ శిశువును తెచ్చి కొంతసేపు పడుకోబెడతారు. వివాహ సమయంలో బంధుమిత్రులంతా బియ్యం, చిరుధాన్యాలను వధూవరుల తలలపై పోస్తారు. ఇలా చేయడం వలన ప్రకృతి కూడా వారి వివాహబంధాన్ని అంగీకరించి, ఆశీస్సులిస్తుందని వారి ప్రగాఢ విశ్వాసం.

ఇలాంటి విలక్షణమైన ఆచారాలు ప్రపంచవ్యాప్తంగా లెక్కకుమించి ఉన్నాయి. భాషలేవైనా, పద్ధతులేవైనా వాటి సారం మాత్రం ఒకటే. వివాహబంధం తుది వరకు బలపడుతూనే ఉండాలి. జీవితాంతం ఆ జంట ఒకరికొకరై జీవిస్తూ సంతానవంతులవ్వాలి.

- భానుప్రకాష్ కర్నాటి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

'పెళ్లిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

రెడ్డి/ మోటాటి 42 సం॥ల 7 Cr ఆస్తి హైద్రాబాద్ ఇన్ఫోసిస్ పోచారం దగ్గర 2, 1/4 ఎకరా ల్యాండ్, 12 లక్షల సం॥ర ఆదాయం కలిగిన విడో వరునికి తగిన వధువు కావలెను. ✆ 7674972466 (A)




వరుడు కావలెను

యాదవ/ B.Tech/ Govt బ్యాంక్ P.O (ఇండియన్ బ్యాంక్)/ 45,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9515755529 (A)

యాదవ, డైవర్సీ కులప్రసక్తి లేని 29, 5'3" Fr డిగ్రీ, ఓన్లీ H.W చాలా అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన అందమైన వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9705844329 (A).

నాయీబ్రాహ్మణ, 24, 5'5", B.Tech, SWE, Wipro, 35,000/- PM, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246964555 (A)



వివాహ వేదిక

గమనిక

'సిమ్ స్వాప్'తో సొమ్ము స్వాహా

- నెట్ బ్యాంకింగ్ కంపెనీల ఖాతాల్లోంచి రూ.1.98 కోట్లు బదిలీ
- నైజీరియా కేంద్రంగా సైబర్ నేరాలు.. ఆరుగురి అరెస్ట్

ఈనాడు - హైదరాబాద్





సిమ్ స్వాప్ వివరాలు తెలుపుతున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ ★ నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి

చరవాణికి అనుసంధానమైన బ్యాంకు ఖాతాలున్న ప్రైవేటు సంస్థల యజమానులను లక్ష్యంగా చేసుకుని అంతర్జాతీయ సైబర్ నేరస్థులు రూ.కోట్లు కొల్లగొట్టారు. వారి సిమ్ కార్డులను తాత్కాలికంగా బ్లాక్ చేసి.. కొత్త సిమ్ కార్డు తీసుకుని.. ఆ సిమ్ ద్వారా బాధితుల ఖాతాల్లోంచి రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. రూ.9 లక్షలు నష్టపోయిన పంతం వెంకటకృష్ణ ఫిర్యాదుతో సైబరాబాద్ పోలీసులు పరిశోధించారు. నైజీరియా కేంద్రంగా కొనసాగుతున్న ఈ ఘరానా మోసాన్ని సైబరాబాద్ పోలీసులు గుర్తించారు.. కోల్‌కతాలో ఉంటున్న నైజీరియన్ ఒడాఫే హెన్రీతో పాటు మరికొందరిని అరెస్ట్ చేశారు. నైజీరియాలో నివాసముంటున్న ఎబిగో ఇన్నోసెంట్ దీనికి సూత్రధారిగా తేల్చారు. వీరు మొత్తం 13 ప్రైవేటు కంపెనీల యజమానుల సిమ్ కార్డులను స్వాప్ చేసి రూ.1.98 కోట్లు స్వాహా చేశారు. ఏసీపీ శ్రీనివాస్ బృందం రెండు నెలలు పరిశోధించి ఆరుగురు నిందితులను శుక్రవారం రాత్రి కోల్‌కతాలోని జగదాల్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తెలిపారు. వీరినుంచి 17 చరవాణులు, ల్యాప్‌ట్యాప్, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకుని.. జైలుకు తరలించామని వివరించారు.

ఫుట్‌బాల్ ఆడేందుకు వచ్చి

నైజీరియాకు చెందిన ఒడాఫే హెన్రీ మూడున్నరేళ్ల క్రితం ఫుట్‌బాల్ ఆడేందుకు కోల్‌కతాకు వచ్చి అక్కడే నివాసం ఏర్పరచుకున్నాడు. హెన్రీ వచ్చిన కొద్దినెలల తరువాత ఎబిగో ఇన్నోసెంట్ అతడికి ఫోన్ చేశాడు. 'సిమ్ స్వాప్' ద్వారా రూ.లక్షలు స్వాహా చేయవచ్చని, కోల్‌కతాలో స్థానికంగా ఉండేవారిని భాగస్వాములుగా చేర్చుకుందామన్నాడు. సైబర్ నేరస్థులకు అవసరమైన బ్యాంకు ఖాతాలను సమకూర్చుతున్న కోల్‌కతా వాసి సంతోష్ బెనర్జీని హెన్రీ కలుసుకున్నాడు. తాము చేయబోతున్న నేరాలను చెప్పగా.. బెనర్జీ తనతో పాటు అంకన్ సాహా, రజత్ కుందు, చందన్ వర్మ, సంజిబ్ దాస్‌లు తమతో కలుస్తారని చెప్పారు. ఈ విషయాలను ఎబిగో ఇన్నోసెంట్‌కు వివరించాడు. కోల్‌కతా, హైదరాబాద్, ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నైలలోని కొన్ని బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలంటూ ఒబిగో చెప్పాడు.

స్పైవేర్ ద్వారా లక్ష్యాలు ఎంచుకుని

అంతర్జాల పరిజ్ఞానంలో పండిపోయిన ఎబిగో.. దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబయిలలో రూ.కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీల వివరాలు, అధికారిక ఈ-మెయిల్స్‌ను డార్క్‌నెట్ ద్వారా కొనుగోలు చేశాడు. ఈ జాబితాను పరిశీలించి ఆయా కంపెనీలు, సంస్థల అధికారిక మెయిల్స్, యజమానుల ఈ-మెయిల్ చిరునామాలకు స్పైవేర్ ఉన్న మెయిల్స్‌ను పంపించాడు. వారు మెయిల్స్ తెరవగానే కంపెనీల యజమానుల పేర్లు, బ్యాంకుల ఖాతాల వివరాలు ఎబిగో చేతుల్లోకి వెళ్లాయి. ఈ వివరాలు హెన్రీకి చెప్పడంతో అతను ఖాతాల్లోంచి నగదు బదిలీ చేసుకున్నాడు.



నిందితులు ఒడాఫే హెన్రీ, సంతోష్ బెనర్జీ, అంకన్ సాహా, రజత్ కుందు, చందన్ వర్మ, సంజిబ్‌దాస్

సిమ్ స్వాప్ అంటే

చరవాణిలో ఉన్న సిమ్ కార్డును వేరే వ్యక్తి దుర్వినియోగం చేయడమే సిమ్ స్వాప్ అంటారు. నగదు స్వాహా చేయాలనుకున్న సైబర్ నేరస్థులు బాధితుల చరవాణి నంబరు తెలుసుకుని.. సిమ్ కార్డు పనిచేయడం లేదని, కొత్త కార్డు ఇవ్వాలంటూ సెల్‌ఫోన్ నెట్‌వర్క్ వారికి ఫిర్యాదు చేస్తారు. అనంతరం చరవాణి సొంతదారుడి పేరుతో సిమ్ కార్డు తీసుకుని తమ చరవాణిలో వేసుకుంటారు. 10 నుంచి 15 బ్యాంకు ఖాతాలను వాటికి అనుసంధానిస్తారు. అరగంట పూర్తికాగానే.. చరవాణి సొంతదారుడి బ్యాంకు ఖాతాల్లో సొమ్మును తమ ఖాతాల్లోకి మళ్లిస్తారు. సిమ్ కార్డును నాశనం చేస్తారు. ఇదంతా తెలియని చరవాణి సొంతదారుడు కొత్త సిమ్ కార్డు తీసుకుంటాడు.

శనివారాలు జాగ్రత్త

అంతర్జాల ఆధారిత బ్యాంకు లావాదేవీలు నిర్వహిస్తున్న వారు శనివారాలు జాగ్రత్తగా ఉండాలంటూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ హెచ్చరించారు. సైబర్ నేరస్థులు శనివారం సాయంత్రం నుంచి రాత్రిలోపు 'సిమ్ స్వాప్' కోసం కొత్త సిమ్ కార్డులు తీసుకుంటున్నారని, గంటల వ్యవధిలో రూ.లక్షలు కొల్లగొడుతున్నారని వివరించారు. బాధితులు స్పందించేలోపు సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కంపెనీల పనివేళలు పూర్తవుతాయని, బ్యాంకులు ఆదివారం పనిచేయబోవని గుర్తు చేశారు. ఏడాది క్రితం రూ.24 లక్షలు పోగొట్టుకున్న గిరి కొండవీటి, తాజాగా తమకు ఫిర్యాదు చేసిన పంతం వెంకటకృష్ణల సిమ్ కార్డులను శనివారమే నేరస్థులు బ్లాక్ చేశారని గుర్తు చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కండి: సీఎస్

ఈనాడు, హైదరాబాద్: రాబోయే పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు అధికారయంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఎస్ శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఇటీవలి శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల బదిలీలు జరిగినందున, ఇక బదిలీలుండవని సీఎస్ వెల్లడించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైతే అదనపు బలగాలు అడుగుతామన్నారు.

నమోదు గడువును పొడిగించాలని కోరాం: రజత్‌కుమార్

రజత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటరు జాబితా నమోదు ప్రక్రియ జరుగుతోందని, ఇప్పటి వరకు 13 లక్షలపైగా అభ్యర్థనలు వచ్చాయని తెలిపారు. ఇందులో కొత్త ఓటర్లు ఎక్కువగా ఉన్నారన్నారు. 'ఓటర్లకు 40 లక్షల కార్డులు రాశాం. ఇంకా రాస్తున్నాం. కొందరు మాకు సమాచారం ఇస్తున్నారు. నమోదుకోసం కేంద్ర ఎన్నికల కమిషన్ జనవరి 25 వరకు గడువు ఇచ్చింది. ఫిబ్రవరి 4 వరకు గడువు పొడిగించాలని కోరాం. గ్రాడ్యుయేట్ ఎన్నికల షెడ్యూల్ ఇంకా రాలేదు. దాని ఏర్పాట్లు చేస్తున్నాం. శాసనమండలి పట్టభద్ర నియోజకవర్గానికి ఓటరు నమోదుకు సమయం ఉంది.' అన్నారు.

ఎన్నికల నిర్వహణకు సమన్వయాధికారుల నియామకం

లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, ఇతర అంశాలకు సంబంధించి సమన్వయాధికారులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కోసం అదనపు సీఈవో జ్యోతి బుద్ధప్రకాశ్, ఐజీ సంజయ్‌కుమార్‌జైన్, ఆబ్కారీ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆదాయపు పన్ను అదనపు సంచాలకుడు సతీష్ కుమార్‌లను నియమించారు. ఇతర సమన్వయాధికారులుగా పోలీసు అదనపు సంచాలకుడు జితేందర్ (శాంతిభద్రతలు), సంయుక్త సీఈవో రవికిరణ్ (ఎన్నికల నిర్వహణ), ఉపకలెక్టర్ కిషన్‌రావు (ఈవీఎంలు), దివ్యాంగుల శాఖ సంచాలకురాలు శైలజ (దివ్యాంగ ఓటర్లు), యాదగిరి (పరిశీలకులు), సూర్యభాస్కర్ (శిక్షణ)లకు బాధ్యతలు అప్పగించారు.

తోబుట్టువులకు అశ్రు నివాళి

దేవరకొండ, నేరడుగొమ్ము, న్యూస్‌టుడే: అమెరికాలో మృతిచెందిన ముగ్గురు తోబుట్టువులు కేతావత్ సాత్విక, సుహాస్ నాయక్, జోయ్ అంత్యక్రియలు శనివారం బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య నల్గొండ జిల్లా నేరడుగొమ్ము మండలం గుర్రపు తండాలో జరిగాయి. తండా వాసి శ్రీనివాస్ నాయక్, సుజాత దంపతుల ముగ్గురు పిల్లలూ పైచదువులకు అమెరికా వెళ్లి, క్రిస్మస్ వేడుకల తర్వాత అగ్నిప్రమాదంలో మరణించడం విదితమే. తెలంగాణ ప్రభుత్వంతో పాటు 'తానా', ఇండియన్ క్రిస్టియన్ సంస్థల సహకారం వల్ల మృతదేహాలు ఇక్కడికి చేరాయి. హైదరాబాద్‌లో ప్రార్థనల అనంతరం తండాకు తరలించి అంత్యక్రియలు జరిపారు. నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో పాటు పిల్లలకు అమెరికాలో విద్యాబోధన చేసిన ఫ్రెంచ్ క్యాంప్ అకాడమీ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

పన్ను ఎగవేతపై జీఎస్టీ కమిషనరేట్ దాడులు

ఈనాడు, హైదరాబాద్: డొల్ల కంపెనీల ద్వారా నకిలీ బిల్లులు (ఇన్‌వాయిస్) రూపొందించి లబ్ధి పొందుతున్న బడా వ్యాపారులపై హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ ఉక్కుపాదం మోపింది. దాదాపు రూ.500 కోట్ల ఉక్కు వ్యాపార టర్నోవర్ కలిగిన సంస్థ, ఆ సంస్థ యజమాని ఇంటిపై దాడులు నిర్వహించింది. శంకరంపేట, నాచారం యూనిట్లలో సోదాలు జరపగా, అక్రమాలు వెలుగుచూశాయి. మూడు డొల్ల కంపెనీల ద్వారా రూ.40కోట్ల విలువైన నకిలీ బిల్లులు జారీచేసినట్లు గుర్తించారు. ఆ బిల్లులతో ప్రభుత్వ ఆదాయానికి దాదాపు రూ.4కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. కేసులో సంస్థ యజమానిని అరెస్టుచేసి రూ.3కోట్లు రికవరీ చేశారు. మిగతా మొత్తం వారంలో చెల్లించేలా పూచీకత్తు తీసుకున్నారు.

ప్రజలకు సేవచేసే ప్రతి ఒక్కరూ ప్రముఖులే

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్
- లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం



లోక్‌నాయక్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో కేరళ హైకోర్టు జస్టిస్ శేషాద్రినాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, పురస్కార గ్రహీతలు మంగాదేవి, అంపశయ్య నవీన్, వంశీ రామరాజు. పక్కన లక్ష్మీప్రసాద్ కుటుంబీకులు

ఈనాడు, విశాఖపట్నం: ప్రజలకు ఉపయోగపడే పనులు చేసిన ప్రతి ఒక్కరూ ప్రముఖులేనని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. విశాఖపట్నంలో శనివారం నిర్వహించిన లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రచనల ద్వారా, సంఘసేవ కార్యక్రమాల ద్వారా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నవారూ సెలెబ్రిటీలేనని, అలాంటి వారికి లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాలు ఇస్తుండటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ సేవ చేయడాన్ని సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దామా శేషాద్రినాయుడు మాట్లాడుతూ తెలుగుభాషను కాపాడటాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. 2017లో అమెరికాలో ఎక్కువగా విస్తరించిన భాషగా తెలుగును ప్రకటించారని చెప్పారు. కేరళ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ ఆంటోని డొమెనిక్ కూడా కార్యక్రమంలో మాట్లాడారు.

ముగ్గురికి పురస్కారాలు

'ఆంధ్ర జ్ఞానపీఠ్' పురస్కారాన్ని వరంగల్‌కు చెందిన రచయిత అంపశయ్య నవీన్‌కు, జీవిత సాఫల్య పురస్కారాన్ని గుంటూరుకు చెందిన సంఘసేవకురాలు ఎన్.మంగాదేవి, హైదరాబాద్‌కు చెందిన సంఘసేవకులు వంశీ రామరాజుకు అందజేశారు. న్యాయమూర్తులతో కలిసి లోక్‌నాయక్ ఫౌండేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పురస్కారాల్ని అందజేశారు.

22న బీసీ ఉద్యమ జాతీయ సదస్సు

కవాడిగూడ, న్యూస్‌టుడే: "రాజ్యాంగాన్ని రక్షించండి.. .సామాజిక న్యాయం అమలుచేయండి" అనే నినాదంతో ఈనెల 22న దిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో 29 రాష్ట్రాల బీసీ ఉద్యమకారుల జాతీయ సదస్సు జరగనుంది. ఈ సమాచారాన్ని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్... శనివారం దోమల్‌గూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటైన అనుబంధ సంఘాల సమావేశంలో తెలిపారు. రిజర్వేషన్లకు మొత్తంగా గండికొట్టేందుకే ఈబీసీ చట్టం తెచ్చారన్న అనుమానం కలుగుతోందన్నారు. అన్ని రాష్ట్రాల బీసీ ఉద్యమకారులతోనూ సదస్సు నిర్వహించి, జాతీయస్థాయి కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. రాష్ట్ర బీసీ కులాల ఐకాస కన్వీనర్ కుందారం గణేశ్‌చారి, బీసీ సంఘాల నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రంగౌడ్, పి.లక్ష్మీనారాయణ, కనకాల శ్యాం,మహేశ్, సంపత్, లింగంగౌడ్ పాల్గొన్నారు.

షర్మిలపై వ్యాఖ్యలు.. 14మందికి తాఖీదులు

ఈనాడు, హైదరాబాద్: వైకాపా నేత షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేసి, వాటికి వీడియోలు రూపొందించి, యూ ట్యూబ్‌లో ఉంచినవారిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే 14మందికి తాఖీదులు పంపించారు. తాము సూచించిన సమయాల్లో విచారణకు హాజరుకావాలన్నారు. యూ ట్యూబ్‌లో షర్మిల పరువుకు భంగం కలిగించిన ఓ ఛానెల్ ప్రతినిధిని శనివారం పోలీస్ అధికారులు ప్రశ్నించారు. పోలీసుల తాఖీదులకు యూ ట్యూబ్ ప్రాంతీయ ప్రతినిధులు స్పందించలేదు.

దివ్యాంగులకు ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు

- ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడి వెల్లడి
- సుధాచంద్రన్ స్ఫూర్తిప్రదాత అని ప్రశంస
- శిల్పకళా వేదికలో ఆకట్టుకున్న నృత్య కార్యక్రమం



శిల్పకళా వేదికలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శన సందర్భంగా సినీ నటి, భరతనాట్య కళాకారిణి సుధా చంద్రన్‌తో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సమితి ప్రతినిధులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సమాజం కూడా వారి అభివృద్ధికి చేయూతనందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం 2022 నాటికి 25 లక్షల మంది దివ్యాంగులకు శిక్షణ ఇచ్చేలా నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. వచ్చే నెలలో నెల్లూరులో ఓ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల రిజర్వేషన్లను మూడు నుంచి నాలుగు శాతానికి పెంచిందన్నారు. మాదాపూర్ శిల్పకళా వేదికలో శనివారం రాత్రి భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయతా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటి, భరతనాట్య కళాకారిణి సుధాచంద్రన్ నృత్య ప్రదర్శన నిర్వహించారు. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలు పోగొట్టుకున్నా దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసంతో జైపూర్ కృత్రిమ కాలుతో భరతనాట్యాన్ని కొనసాగించి నాట్య మయూరిగా ఎదిగిన సుధాచంద్రన్ దేశానికే ఆదర్శమని కొనియాడారు. సుధాచంద్రన్ కథతో 'రామోజీ' గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు తీసిన 'మయూరి' సినిమా అందరి మన్ననలందుకుందన్నారు. ఆ సినిమా మరో రెండు భాషల్లోనూ తెరకెక్కిందని చెప్పారు. దివ్యాంగుల కోసం పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థలకు చేయూత అందించేందుకు ఆమె 30 దేశాల్లో 1000 ప్రదర్శనలిచ్చారన్నారు. డీఆర్ మెహతా..భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయతా సమితిని స్థాపించి 26 దేశాల్లో కృత్రిమ అవయవాలను అందజేస్తుండడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పీసీ పరేఖ్, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం, లక్ష్మీనివాస్ శర్మ, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన నృత్య ప్రదర్శన

వివిధ అంశాలపై సుధాచంద్రన్, బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆహూతులను అబ్బురపరిచింది. 'స్వప్నోంకా భారత్' పేరిట దేశ స్వాతంత్ర్య పోరాటం, భిన్నత్వంలో ఏకత్వం, తీవ్రవాదుల దాడులను దీటుగా ఎదుర్కోవడం తదితరాలను వివరిస్తూ చక్కటి ప్రదర్శన ఇచ్చారు. జైపూర్ కృత్రిమ అవయవాలు దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న తీరును కళ్లకు కట్టారు. రెండు చేతులూ లేని యువకుడు మనోజ్ నోటితో కుంచె పట్టి అప్పటికప్పుడు గణపతి, కృతిమ కాలు బొమ్మలను చిత్రీకరించి ఆకట్టుకున్నారు.





హకీంపేట్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు

ప్రదర్శనలో ఉంచిన కిరణ్ ఎంకె-1 విమానం

ఆకట్టుకున్న 'వాయుసేన' ప్రదర్శన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా భారతీయ వాయుసేన 'నో యువర్ ఫోర్సెస్' కార్యక్రమాన్ని హకీంపేట్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అక్కడి కేంద్రంలో జరిగే శిక్షణ తదితర కార్యక్రమాలను తెలిపేందుకు విమానాల ప్రదర్శన ఏర్పాటు చేసింది. అగ్నిమాపక చర్యలు, రాడార్ వ్యవస్థ పనితీరు సంబంధించిన వాహనాలతో పాటు చేతక్ హెలికాప్టర్, కిరణ్ ఎంకె-1, పీసీ7ఎంకె-2 విమానాలను ప్రదర్శనలో ఉంచారు. భావితరాలకు రక్షణ రంగంలో వాయుసేన పని తీరుపై కనీస జ్ఞానం పొందేలా నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి శిక్షణ కేంద్రంలో జరిగే విషయాలపై అవగాహన వాయుసేన కల్పించింది. విమానాల పనితీరు, రక్షణ వ్యవస్థలో ఎయిర్‌ఫోర్స్ భాగస్వామ్యం, వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు తదితర విషయాలపై విద్యార్థులు అక్కడి సిబ్బందిని సందేహాలు అడిగి తెలుసుకున్నారు.

తారక్ నుంచి ఆ రెండూ నేర్చుకోవాలి

- 'మిస్టర్ మజ్ను' వేడుకలో నాగార్జున



అఖిల్, అక్కినేని నాగార్జున, ఎన్టీఆర్, నాగచైతన్య

"ఏ నటుడికైనా ఆత్మ విమర్శ చేసుకోవడం చాలా అవసరం. అఖిల్ అలా తనని తాను విమర్శించుకోగలడు. అదే తనని ఓ గొప్ప నటుడిగా మారుస్తుంది" అని అన్నారు ప్రముఖ కథానాయకుడు ఎన్టీఆర్. అఖిల్ నటించిన 'మిస్టర్ మజ్ను' విడుదల ముందస్తు వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. నిధి అగర్వాల్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ అతిథిగా విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సంపాదించిన ప్రతి రూపాయినీ మళ్లీ సినిమాకే అందించే నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్. నేను పరిశ్రమకొచ్చిన కొత్తలో చాలా తక్కువ మంది స్నేహితులు ఉండేవారు. వాళ్లలో వెంకీ అట్లూరి ఒకరు. తను నాకో నటుడిగా పరిచయం, తరవాత రచయితగా, దర్శకుడిగా పరిచయయ్యాడు. సుదీర్ఘమైన చలన చిత్రసీమలో ఎన్నో ప్రేమకథ చిత్రాలొచ్చాయి. తను 'తొలిప్రేమ'లో కొత్తగా ఏం చూపిస్తాడో అనే బెరుకు ఉండేది. ఆ చిత్రం చూసిన తరవాత గర్వంగా అనిపించింది. ఓ కమర్షియల్ సినిమా తీయడం కన్నా కేవలం కథతో సినిమా తీయడం కష్టమైన పని. మొదటి చిత్రంతోనే అది సాధించాడు వెంకీ. రాసిపెట్టుకోండి.. అఖిల్ ఏదో ఓ రోజు టాలీవుడ్‌లో మంచి నటుడిగా నిలిచిపోతాడు. అదెంతో దూరంలో లేద"న్నారు. అఖిల్‌ని ఓ ప్రేమకథలో చూడాలన్న కోరిక ఈ సినిమాతో తీరిందన్నారు నాగచైతన్య. 'శివ' సినిమా చూసి చాలా స్ఫూర్తి పొందానని, 'ప్రేమనగర్'లోని కథానాయకుడి పాత్ర నుంచి ప్రేరణ పొంది ఈ కథ రాసుకున్నానని దర్శకుడు వెంకీ అట్లూరి తెలిపారు.

ఆరు పాటలూ బాగున్నాయంటే అదంతా చిత్ర బృందం చేసిన సమష్టి కృషే అని చిత్ర సంగీత దర్శకుడు తమన్ చెప్పారు. "వెంకీతో నాకు పదేళ్ల నుంచీ స్నేహం ఉంది. మూడేళ్ల క్రితం ఈ కథ చెప్పాడు. నా కోసం ఇంతకాలం ఆగాడు. నేను తారక్‌ని టైగర్ అనే పిలుస్తా. నిజంగా తను పులి. ఆయన ఉత్సాహాన్ని ఎవ్వరూ అందుకోలేరు" అని అన్నారు. "నటన, మాస్.. ఈ రెండూ తారక్ నుంచి అఖిల్ నేర్చుకోవాలి. వెంకీ తీసిన 'తొలిప్రేమ' చూశాను. ప్రేమకథకు ఏం కావాలో తనకు బాగా తెలుసు. పాటలు బాగున్నాయి. 'మజ్ను' టైటిల్ నాన్నగారిది. ఆ తరవాత నా దగ్గరకు వచ్చింది. ఆ రెండు చిత్రాలూ ఎంత పెద్ద విజయాలు సాధించాయో ఈ మజ్ను కూడా అలాంటి విజయాన్నే అందుకోవాలి" అన్నారు నాగార్జున.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

టీఆర్‌టీ ఎంపిక జాబితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్షలో వివిధ కేటగిరీల్లో 925 పోస్టులకు నిర్వహించిన పరీక్షలో అర్హులైన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ ప్రకటించారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ పోస్టులున్నాయి. ఎస్జీటీ ఉర్దూ మీడియం కింద 636 పోస్టులను పేర్కొంటే.. 320 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో ఖాళీగా మిగిలాయి. ఇందులో 35 మంది దివ్యాంగుల ఫలితాలను తరువాత ప్రకటిస్తామని కమిషన్ కార్యదర్శి వెల్లడించారు. స్కూల్ అసిస్టెంట్ గణితం తెలుగు మీడియంలో 215 పోస్టుల్లో 16 దివ్యాంగ పోస్టుల ఫలితాలు వైద్య నివేదికల తరువాత వెల్లడిస్తామని చెప్పారు. ఇందులో మరో 8 ఖాళీల ఫలితాలు న్యాయవివాదాల కారణంగా నిలిపివేసినట్లు వివరించారు. వివిధ మీడియం, సబ్జెక్టుల్లో అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో 16 పోస్టులు భర్తీకాలేదన్నారు.

ఫలితాలు వెల్లడించిన పోస్టులు

స్కూల్ అసిస్టెంట్ (సోషల్ - ఆంగ్ల మాధ్యమం)	04
స్కూల్ అసిస్టెంట్ (సోషల్ - హిందీ మాధ్యమం)	01
స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్ - తెలుగు మాధ్యమం)	09
పీఈటీ (ఉర్దూ మాధ్యమం)	04
పీఈటీ (ఇంగ్లిష్ మాధ్యమం)	01
ఎస్జీటీ (ఉర్దూ)	281
స్కూల్ అసిస్టెంట్ (గణితం - తెలుగు మాధ్యమం)	191

ఎంపికైన అభ్యర్థుల వివరాలను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచామని వివరించారు.

'ఆదర్శ' ప్రవేశానికి 28 నుంచి దరఖాస్తులు


ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 192 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ ఈనెల 28వ తేదీన మొదలవుతుంది. 7నుంచి పదో తరగతి వరకు గల ఖాళీల భర్తీకి కూడా ఫిబ్రవరి 1వ తేదీనుంచి దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాలవిద్యా సంచాలకుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తారు. జిల్లాకేంద్రాల్లో పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేస్తారు.

- **జనవరి 21:** నోటిఫికేషన్ విడుదల
- **జనవరి 28-ఫిబ్రవరి 28 మధ్య:** 6వ తరగతికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- **ఫిబ్రవరి 1-28 వరకు:** 7 నుంచి 10వ తరగతి దాకా ఖాళీలకు దరఖాస్తులు స్వీకరిస్తారు
- **ఏప్రిల్ 9-12:** హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- **ఏప్రిల్ 13(రెండో శనివారం):** ప్రవేశ పరీక్ష (6వ తరగతికి 10-12 గంటల మధ్య; మిగిలినవాటికి మధ్యాహ్నం 2-4 గంటల మధ్య)
- **మే 18:** పాఠశాలలవారీగా మార్కుల వెల్లడి
- **మే 19-26:** ఎంపికైనవారి తుది జాబితా సిద్ధం
- **మే 27:** ఎంపికైన జాబితాను ఆయా పాఠశాలల నోటీసు బోర్డుల్లో ఉంచుతారు
- **మే 28-30 వరకు:** ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశాలు

★ దరఖాస్తుల డౌన్‌లోడ్‌కు, సమర్పణకు వెబ్‌సైట్: telanganams.cgg.gov.in

చదవనివ్వలే.. ఎదగనివ్వలే

- మనోవేదనతో ఓ యువతి ఆత్మహత్య
- బాల్యవివాహాలు చేయొద్దని తల్లిదండ్రులకు సూచన



గీతాంజలి (పాత చిత్రం)

చైతన్యపురి, న్యూస్‌టుడే: "నాకు ఉన్నత చదువులు చదువుకోవడంతోపాటు మంచి ఉద్యోగం సంపాదించి పెళ్లి చేసుకుని భర్తతో కలిసి తిరగాలని ఉండేది. కాని మానాన్న 16 సంవత్సరాలకే పెళ్లి చేసి పంపాడు. చదువు ఇంటర్‌తోనే ఆపాల్సి వచ్చింది. నా జీవితంలో చాలా కోల్పోయాను. తల్లిదండ్రులెవరూ బాల్యవివాహాలు చేయకండి. మామయ్య(భర్త తండ్రి) నా పిల్లలను మాత్రం బాగా చదివించండి. బిట్టు, సాయి బాగా చదువుకోండి" అంటూ లేఖ రాసి ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చైతన్యపురి ఠాణా పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన గీతాంజలి(26)కి 16 సంవత్సరాల వయస్సులోనే నిర్మల్ లక్ష్మీపురానికి చెందిన శంకర్(30)తో వివాహమైంది. భర్త ప్రైవేటు ఉద్యోగ రీత్యా ముంబయిలో ఉంటారు. ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె హైదరాబాద్‌లోని కొత్తపేటలో అద్దెకు ఉంటూ దిల్‌సుఖ్‌నగర్‌లో పోలీస్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండుగకు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిన గీతాంజలి వారిని తల్లిదండ్రుల వద్దే ఉంచి శుక్రవారం కొత్తపేటకు చేరుకుంది. జీవితంలో తాను అనుకున్నది ఏదీ సాధించలేకపోతున్నాననే వేదనతో గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టింది. తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆత్మహత్య లేఖను స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఎల్ అండ్ టీ బైబ్యాక్‌కు
సెబీ నిరాకరణ

దిల్లీ: ఎల్ అండ్ టీ ప్రతిపాదించిన రూ.9000 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలు(బైబ్యాక్) ఆఫర్‌కు సెబీ అనుమతి నిరాకరించింది. 'బైబ్యాక్ తర్వాత(అన్ని షేర్లకూ దరఖాస్తు వస్తాయని అనుకుంటే) సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ డెట్‌లకు మధ్య ఉన్న సగటు నిష్పత్తి కంపెనీ చెల్లించిన మూలధనం, నగదు నిల్వలతో పోలిస్తే రెండింతలుగా ఉంది. ఇది సెబీ నిబంధనలకు, కంపెనీల చట్టం నియమావళికి విరుద్ధమ'ని కంపెనీకి రాసిన లేఖలో సెబీ పేర్కొంది. ఇదే విషయాన్ని ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో ఎల్ అండ్ టీ తెలిపింది. ఒక్కోటి రూ.1475 చొప్పున మొత్తం 6.1 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయాలని ఎల్ అండ్ టీ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. .

సోమవారం షేర్ల పరిస్థితి ఏమిటో?: బైబ్యాక్‌కు సెబీ నిరాకరించిన నేపథ్యంలో సోమవారం ఎల్ అండ్ టీ షేర్లు నష్టాలతో మొదలవ్వొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. స్వల్పకాలం పాటు ఈ పరిణామం ప్రభావం కనిపించవచ్చని టార్గెట్ ఇన్వెస్టింగ్‌కు చెందిన సమీర్ కర్లా అంటున్నారు. స్వల్ప, మధ్య కాల వాటాదార్లు 'విక్రయించొచ్చ'ని సిఫారసు చేస్తున్నామని తెలిపారు. భారీ అప్పుల్లో ఉన్న కంపెనీలు బైబ్యాక్‌కు వెళ్లరాదని దీన్ని బట్టి తెలుస్తోందని అభిప్రాయపడ్డారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 20% వృద్ధి

- అక్టోబరు- డిసెంబరులో రూ.5,585 కోట్లు
- వడ్డీ ఆదాయం అండ

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.5,585.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2017లో ఇదే కాలంలో నమోదైన రూ.4,642.60 కోట్లతో పోలిస్తే ఈసారి లాభం 20.3 శాతం పెరగడం గమనార్హం. ప్రధానంగా వడ్డీ ఆదాయంలో వృద్ధి ఇందుకు దోహదం చేసింది. సమీక్ష త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 21.9 శాతం పెరిగి రూ.10,314.30 కోట్ల నుంచి రూ.12,576.80 కోట్లకు చేరింది. దీంతో మొత్తం ఆదాయం కూడా రూ.24,450.44 కోట్ల నుంచి రూ.30,811.27 కోట్లకు పెరిగింది. మరోవైపు ఏడాదిక్రితంతో పోలిస్తే స్థూల నిరర్థక ఆస్తులు 1.29 శాతం నుంచి 1.38 శాతానికి పెరగగా.. నికర నిరర్థక ఆస్తులు 0.44 శాతం



నుంచి 0.42 శాతానికి తగ్గాయి. అయితే ఈసారి బ్యాంకు కేటాయింపులు గణనీయంగా పెరగడం గమనార్హం. 2017 అక్టోబరు- డిసెంబరులో కేటాయింపుల కోసం రూ.1,351.44 కోట్లను పక్కకు పెట్టగా.. ఈసారి ఈ విలువ రూ.2,211.53 కోట్లకు చేరింది. వీటిలో మొండి బాకీల కోసం రూ.1,734.60 కోట్లు, సాధారణ కేటాయింపుల కోసం రూ.476.90 కోట్లను పక్కకు పెట్టింది. ఇతర ఆదాయం విషయానికొస్తే ఏడాదిక్రితం రూ.3,869.17 కోట్లుగా ఉండగా, ఈసారి రూ.4,921.01 కోట్లకు పెరిగింది.


సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభంలో 27% క్షీణత

డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికానికి సౌత్ ఇండియన్ బ్యాంక్ రూ.83.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కిందటేడాది ఇదే సమయంలో ఆర్జించిన రూ.115 కోట్లతో పోలిస్తే ఇది 27% తక్కువ. మొత్తం ఆదాయం మాత్రం రూ.1,735.77 కోట్ల నుంచి పెరిగి రూ.1,921.93 కోట్లకు పెరిగింది. అదే సమయంలో స్థూల నిరర్థక ఆస్తులు 3.4 శాతం నుంచి 4.88 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు 2.35 శాతం నుంచి 3.54 శాతానికి పెరిగాయి.

ఈనాడు బిజినెస్ వారాంతం

రాజు గతేడాది స్టాక్ మార్కెట్లో రూ.1,00,000 వరకు నష్టపోయాడు. ఇందులో రూ.30,000 వరకు బ్రోకరేజీగానే చెల్లించాడు.

శ్రీనుకి గతేడాది షేర్లపై రూ.50,000 వరకు లాభం వస్తే.. బ్రోకరేజీకి రూ.20,000 చెల్లించగా మిగిలింది రూ.30,000 మాత్రమే.



వీళ్లే కాదు షేర్లు ట్రేడింగ్ చేసే ప్రతి ఒక్కరికీ ఇలాంటి అనుభవాలు సర్వసాధారణం. ముఖ్యంగా చిన్న మదుపర్లు తమ పెట్టుబడిలో ఎక్కువ భాగం ఇలా బ్రోకరేజీకే అర్పించేసుకుంటారు. బ్రోకరేజీ రుసుమును మినహాయించుకునే లాభాన్ని లెక్కేసుకోవాల్సి ఉండటంతో వచ్చిన ఆ కాస్త లాభాన్నైనా వెనక్కి తీసుకోలేని పరిస్థితి వారిది. పోనీ ఇంకాస్త లాభం వచ్చేవరకైనా వేచిచూద్దామా అనే లోపే పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది. లాభమంతా పోయి నష్టాల్లోకి వెళ్లడం.. చేసేదేమీలేక చివరకు ఎంతోకొంత నష్టానికి అమ్మేసుకోవడం.. ఇలా అన్నీ ఒకదానికొకటి చకాచకా జరిగిపోతాయి. దీంతో పెట్టుబడంతా హారతి కర్పూరంలా కరిగిపోతుంది. మరి దీనికి పరిష్కారం చూపేందుకే డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థలు ముందుకొచ్చాయి. వాటిల్లో మొదటగా చెప్పుకోవాల్సింది జెరోధానే.

పెద్ద పెద్ద కలలు కనండి.. ఆ కలలు నిజం చేసుకునేవరకు శ్రమించండి. పెద్దలు చెప్పిన మాట ఇది. కాని చాలామంది మొదటి పని మాత్రమే చేస్తారు. రెండో దాని జోలికి అసలే వెళ్లరు. అందుకే వాళ్ల కలలు ఎప్పటికీ కల్లలుగానే మిగిలిపోతాయి. ఇంకొందరేమో.. కలలను నిజం చేసుకునేందుకు మొదట్లో బాగానే ప్రయత్నిస్తారు. కాస్త విజయం సాధించగానే దానికే సంతోషపడిపోయి పూర్తిగా సాధించేశామనే ఊహల్లో ఉంటూ అసలు లక్ష్యాన్ని మరుస్తారు. దీంతో మొదట్లో చేసిన శ్రమ కూడా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అందుకే ఆరు నూరైనా నూరు ఆరైనా మొక్కవోని దీక్షతో కలను పూర్తిగా నిజం చేసుకునేవరకు పట్టు వదలకుండా ప్రయత్నించాలి. అప్పుడే మనల్ని విజయలక్ష్మి వరిస్తుంది. స్టాక్ మార్కెట్‌లో లక్ష్మీ కటాక్షం లభించాలంటే కూడా ఇంతే. అదెలాగంటే..



పండంటి కల కనండి

పిట్టకథ

ఓ ఊరిలో రాజయ్య, రమణమ్మ దంపతులుండేవారు. వారికి పదేళ్ల కొడుకున్నాడు. అతని పేరు రాము. రాజయ్య కోడిగుడ్ల వ్యాపారం చేసేవాడు. తన ఇంటిపక్కనున్న చిన్నపాటి స్థలంలో కోళ్లను పెంచేవాడు. అవి పెట్టే గుడ్లలో కొన్నింటిని పొదిగించేందుకు వాడేవాడు. మిగిలిన వాటిని ఊరూరా తిరుగుతూ అమ్మేవాడు. రానురాను వ్యాపారం బాగా వృద్ధి చెందడంతో అతనికి తీరికనేదే లేకుండా పోయింది. ఓ రోజు రమణమ్మకి పుట్టింటి నుంచి ఓ కబురు వచ్చింది. ఆమె తల్లి తీవ్ర అస్వస్థతకు లోనైందని, ఒకటి రెండు రోజులకు మించి బతకదని ఆ కబురు సారాంశం. అది విన్న రమణమ్మకు కన్నీళ్లు ఆగలేదు. వెక్కివెక్కి ఏడుస్తున్న భార్యను ఓదార్చి వెంటనే మీ అమ్మను చూడటానికి వెళ్లు అని అంటాడు రాజయ్య. ఆ మాటకు రమణమ్మ ఒక్కసారిగా కన్నీళ్లు తుడుచుకొని 'ఏం మీరు రారా. చావుదశలో ఉన్న అత్తను చూడటానికి కూడా మీ ఆయనకు సమయం లేదా అని వాళ్లు వీళ్లు అంటుంటే నేను ఏం సమాధానం చెప్పాలి. అదేమీ కుదరదు మీరు రావాల్సిందేన'ని రమణమ్మ భీష్మించుకుని కూర్చుంది. చేసేదేమీలేక సరే వెళ్దామన్నాడు. ఆ మాటయితే అన్నాడు కాని అతని మనసంతా కోళ్లపైనే ఉంది. వాటిని చూసుకునే పని ఎవరికి అప్పగించాలనే దాని చుట్టూనే రాజయ్య ఆలోచనలు తిరిగాయి. అది గమనించిన కొడుకు రాము 'నాన్న మీరు నిశ్చింతంగా వెళ్లి అమ్మమ్మను చూసి రండి. కోళ్ల గురించి ఆందోళన వద్దు. మీరు తిరిగి వచ్చేవరకు నేను చూసుకుంటాన'ని చెప్తాడు. దాంతో రాముకి కోళ్ల బాధ్యతను అప్పగించి ఊరికి బయలుదేరాడు. రాముకు సంతకు వెళ్లాలని ఎప్పటి నుంచో కల. వాళ్ల నాన్న చదువుకు తప్పించి వేరేవాటికి డబ్బులు ఇచ్చేవాడు కాదు. దాంతో రాజు కల.. కలలాగే ఉండిపోయింది. ఇప్పుడు నాన్న ఊరికి వెళ్లడంతో కోడిగుడ్లను అమ్మి వాటితో తన కలను నిజం చేసుకోవచ్చని అనుకున్నాడు. అమ్మానాన్నలు వెళ్లాక.. రోజంతా కోళ్లకు గింజలు వేసుకుంటూ, నీళ్లు పెడుతూ జాగ్రత్తగా వాటిని చూసుకున్నాడు. కోళ్లు పెట్టిన గుడ్లను సేకరించి మర్నాడు వాటిని అమ్మేందుకు పక్క ఊరికి వెళ్లాడు. కాసేపటికి ఇద్దరు ముగ్గురు కొనడంతో మనోడి చేతిలోకి కొంత డబ్బులు వచ్చాయి. అప్పటినుంచి ఆ డబ్బులను ఏం చేద్దామనే ఆలోచన అతని బుర్రలో తిరిగింది. 'ఈ డబ్బులతో సంతకు వెళ్లి తినుబండారాలు కొనుక్కోవచ్చు. రంగుల రాట్నం తిరగొచ్చు. సర్కస్‌కు వెళ్లి ఒంటె, ఏనుగు ఎక్కొచ్చ'ని కలలు కంటూ నడుస్తున్నాడు. చూపంతా పైనే ఉండటంతో కింద ఉన్న రాయిని చూసుకోలేదు. దాంతో దానికి తగిలి కింద పడ్డాడు. నెత్తిమీద ఉన్న గంపలోని కోడిగుడ్లన్నీ కింద పడి పగిలిపోయాయి. అది చూసి అప్పటివరకు కన్న కలలు పక్కకుపోయి నాన్న ఏమంటాడోననే భయం అతణ్ని వెంటాడింది. ఆ విషయమే ఆలోచించుకుంటూ బాధగా ఇంటి దారి పట్టాడు.



మార్కెట్ కథ

కోటీశ్వరుడు అయిపోదామనే కలతో స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టాడు శివ. షేర్లపై అవగాహన లేకపోయినా కూడా రోజూ ట్రేడ్ చేసేవాడు. వరుసగా వారం పది రోజుల పాటు నష్టాలొచ్చినప్పుడు పడే బాధ కంటే.. లాభం వచ్చే ఆ ఒకటి రెండు రోజుల్లో అతను చేసే హడావుడి మామూలుగా ఉండేది కాదు. లాభం వచ్చిన డబ్బులను తన భార్యకు ఇచ్చి అది కొను ఇది కొను అని చెప్పేవాడు. డబ్బులెక్కడ నుంచి వచ్చాయని అడిగితే 'ఆ విషయం నీకెందుకు. ఇప్పుడేం చూశావు. ముమ్ముందు మరిన్ని డబ్బులు వస్తాయి. త్వరలోనే కోటీశ్వరులం అయిపోతామ'ని అనేవాడు. దాంతో ఆమెకూడా మనకెందుకులే అనుకొని ఆ డబ్బులను అవసరం లేని వాటికి ఖర్చుపెట్టేసింది. ఇక లాభం వచ్చిన రోజు రాత్రి శివ నిద్రపోయేవాడే కాదు. 'మనకు చేయి తిరిగింది. ఇక తిరుగులేదు. ఒకటి రెండు నెలల్లో కోటీశ్వరులం అయిపోవడం ఖాయం. ఫలానా కారు కొందాం. బంగ్లా ఇలా కట్టించుకుందాం' అని ఆలోచిస్తూ ఊహల్లో తేలిపోయేవాడు. ఆ ఉత్సాహంతో మర్నాడు మరింత దూకుడుగా షేర్లు కొనేవాడు. దాంతో ముందు రోజు వచ్చిన లాభాన్ని పోగొట్టుకోవడమే కాకుండా నష్టాన్ని చవిచూడాల్సి వచ్చేది. ఇలా కొన్ని రోజులు గడిచింది. చేతిలో పెట్టుబడి డబ్బులు అయిపోవడం దగ్గరపడింది. ఓ రోజు ఆ లెక్కలన్నీ చూసుకునేసరికి శివకు అసలు నిజం బోధపడింది. ఇలా అయితే మనం ఎప్పటికీ కోటీశ్వరులం కాలేమనుకొని.. తాను చేస్తున్న తప్పులేమిటో ఆలోచించడం మొదలుపెట్టాడు. ఫలానా రోజు లాభం ఎందుకు వచ్చింది? ఫలానా రోజు నష్టానికి కారణమేమిటి? ఇలా మనసులోనే విశ్లేషించుకున్నాడు. అప్పటినుంచి స్టాక్ మార్కెట్‌ను అతను చూసే కోణం మారిపోయింది. నష్టాలను, లాభాలను ఒకేలా స్వీకరించేవాడు. ప్రతి రోజు బిజినెస్ వార్తా పత్రికలు, వెబ్‌సైట్‌లు చదివి కంపెనీలకు చెందిన సమాచారాన్ని ఓ పుస్తకంలో రాసుకునేవాడు. మూడు నెలలకోసారి కంపెనీల ఆర్థిక ఫలితాలపైనా శ్రద్ధపెట్టాడు. ఏ షేర్లు బాగా పెరిగాయి.. ఏ షేర్లు బాగా నష్టపోయాయని కూడా గమనించాడు. వీటన్నింటి ఆధారంగా షేర్లు కొనేవాడు. పూర్తి పరిశీలనతో షేర్లు కొనడం వల్ల నష్టాల ముప్పు తగ్గింది. లాభాలు రావడం మొదలయింది. అత్యాశకు పోకుండా అవసరమైతే తక్కువ లాభాన్నైనా వెనక్కి తీసుకోవడాన్ని అలవాటుగా మార్చుకున్నాడు. నష్టమొస్తుందని తెలిస్తే దానిని ఎలా తగ్గించుకోవాలో తెలుసుకున్నాడు. అలా చిన్నచిన్నగా తన లాభాల ప్రయాణాన్ని మొదలుపెట్టి చివరకు 'కోటీశ్వరుడు' అయిపోవాలనే కలను నెరవేర్చుకున్నాడు.

నీతి

పిట్టకథలో రాము తన కలను నెరవేర్చుకోవడానికి ప్రయత్నించినా చేతిలో కొన్ని డబ్బులు కనిపించేసరికి అతని కాళ్లు నేలమీద నిలవలేదు. ఆ వచ్చిన కొద్ది డబ్బులతోనే తన కల నెరవేరిపోయినట్లుగా ఊహల్లో మునిగితేలాడు. ఫలితంగా కోడిగుడ్లన్నంటినీ నేల మీద జార్చుకుని కలను కలలాగా మిగుల్చుకున్నాడు. మార్కెట్ కథలో శివ కూడా కొన్ని రోజుల పాటు రాజులాగానే అసలు లక్ష్యాన్ని మరిచి కొద్ది లాభానికే సంబరపడి డబ్బులను పోగొట్టుకున్నాడు. కాని ఆ తర్వాత తేరుకొని లక్ష్యం దిశగా అడుగులు మొదలుపెట్టాడు. తీవ్రంగా కష్టపడ్డాడు. అత్యాశ.. అరకొరా ఆనందానికి తావివ్వలేదు. అలా మొత్తానికి పగటి కలగానే మిగిలిపోతుందనుకున్న తన కలను పండంటి కలగా మార్చుకున్నాడు.

జై..జెరోధా

- ఇష్టమైన బ్రోకరేజీ సంస్థగా మదుపర్ల నుంచి మన్ననలు
- క్లయింట్ల సంఖ్యలో అగ్రస్థానం
- ఐదేళ్లలో 200-300% వార్షిక వృద్ధి

జెరోధా.. 2018లో ఎక్కువ మంది మదుపర్లు ఇష్టపడిన బ్రోకరేజీ సంస్థ. ప్రస్తుతం అత్యధిక మంది వినియోగదారులు (క్లయింట్లు) ఉంది కూడా దీనికే. గతేడాది మార్చిలో జెరోధాకు 5 లక్షల వరకు క్లయింట్లు ఉండగా. . డిసెంబరు నాటికి ఈ సంఖ్య 8 లక్షల మైలురాయిని దాటింది. అంటే 57 శాతం మేర పెరిగారన్నమాట. దేశీయ బ్రోకరేజీ సంస్థ ఏదీ కూడా ఇంత తక్కువ కాలంలో ఈ ఘనతను సాధించలేదనే చెప్పాలి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) వద్ద లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం 8.47 లక్షల మంది క్రియాశీలక క్లయింట్లతో ప్రస్తుతం జెరోధా అగ్ర స్థానంలో ఉంది. కొన్నేళ్లుగా ఈ స్థానంలో ఐసీఐసీఐ డైరెక్టు కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడది రెండో స్థానానికి దిగింది. మూడో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్, నాలుగో స్థానంలో షేర్‌ఖాన్ ఉన్నాయి. కోటక్ సెక్యూరిటీస్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, కార్వే స్టాక్ బ్రోకింగ్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లాంటి ప్రముఖ బ్రోకరేజీ సంస్థలన్నీ కూడా ఇప్పుడు జెరోధా వెనకాలే. క్లయింట్ల సంఖ్య విషయంలో వీటికి జెరోధాకు చాలానే వ్యత్యాసం ఉండటం గమనార్హం.

ఐదేళ్లుగా దూకుడే..: 2010లో జెరోధాను నితిన్ కామత్, నిఖిల్ కామత్ సోదరులు స్థాపించారు. దేశంలో తొలి డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థగా దీనికి పేరు. దేశీయ బ్రోకరేజీ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు రావడంలోనూ జెరోధాది కీలక పాత్రే. తొలుత దిగ్గజ బ్రోకరేజీ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ.. గత ఐదేళ్లుగా తన సత్తాను చాటుతూ వచ్చింది. అప్పటినుంచి దూకుడును పెంచి వార్షిక ప్రాతిపదికన క్లయింట్ల సంఖ్యను 200-300 శాతం మేర పెంచుకుంది. గత రెండేళ్లలో జెరోధా క్లయింట్ల సంఖ్య రెట్టింపు అవ్వడం గమనార్హం. జెరోధా అడుగుపెట్టాక.. దానిని ఆదర్శనీయంగా తీసుకొని మరికొన్ని డిస్కౌంటు బ్రోకరేజీ సంస్థలు రంగప్రవేశం చేశాయి. వాటికి కూడా క్లయింట్ల నుంచి మంచి ఆదరణే లభిస్తుంది.

ఏమిటి తేడా..: డిస్కౌంటు బ్రోకరేజీ సంస్థలకు, సాధారణ బ్రోకరేజీ సంస్థలకు తేడా ఏమిటి? ఎందుకు ఎక్కువ మంది చిన్న మదుపర్లు డిస్కౌంటు బ్రోకరేజీల వైపే మొగ్గు చూపుతున్నారు? ఈ ప్రశ్నలకు ఒకే ఒక్క సమాధానం.. బ్రోకరేజీ రుసుములు తక్కువగా ఉండటమే. ఇవి ఇంత తక్కువగా ఇవ్వడానికి కారణాలూ లేకపోలేదు. సాధారణ బ్రోకరేజీ సంస్థలు క్లయింట్లకు షేర్ల సిఫారసులు, పరిశోధన నివేదికలను ఇస్తుంటాయి. వీటికయ్యే ఖర్చును క్లయింట్ల నుంచి వసూలు చేసే బ్రోకరేజీ రుసుములో చేరుస్తాయి. అదే డిస్కౌంటు బ్రోకరేజీలు సిఫారసులు, పరిశోధన నివేదికలు ఇవ్వవు. దాంతో వాటికి అయ్యే ఖర్చు లేకపోవడంతో.. తక్కువ బ్రోకరేజీ రుసుమును ఇవి వసూలు చేస్తుంటాయి. అయితే సిఫారసులు ఎక్కడ నుంచైనా పొందే వీలుండటంతో, తక్కువ బ్రోకరేజీ రుసుము ఉందనే కారణం వల్ల ఎక్కువ మంది డిస్కౌంటు బ్రోకరేజీ సంస్థల వైపు మొగ్గు చూపుతున్నారు.. జెరోధా విజయ రహస్యం కూడా ఇదే.

జెరోధా గురించి..

- ✦ బెంగళూరు కేంద్రంగా ఇది కార్యకలాపాలు సాగిస్తోంది.
- ✦ 2010లో నితిన్, నిఖిల్ కామత్ సోదరులు దీనిని స్థాపించారు.
- ✦ ఐదుగురు సిబ్బందితో ప్రారంభమైన జెరోధా సంస్థలో ప్రస్తుతం దాదాపు 1300 మంది వరకు పనిచేస్తున్నారు.
- ✦ మిగతా సంస్థలు మాత్రం ట్రేడింగ్ విలువపై ఇంత శాతం చొప్పున బ్రోకరేజీని వసూలు చేస్తుండగా.. ఏ ట్రేడింగ్‌కైనా, ఎంత పరిమాణమైనా రూ.20 మాత్రమే రుసుము వసూలు చేస్తుండటం జెరోధా ప్రత్యేకత.
- ✦ జెరోధా ప్లాట్‌ఫాంపై ప్రతి రోజు 20-30 లక్షల ట్రేడింగ్‌లు జరుగుతుంటాయి. ఇదే ఇప్పుడు జెరోధాను ప్రపంచంలోనే అగ్రగామి రిటైల్ బ్రోకరేజీ సంస్థగా నిలబెట్టింది.
- ✦ నెలకు 50,000 నుంచి 75,000 వరకు కొత్త వినియోగదారులు జతవుతున్నారు.


నితిన్ కామత్


నిఖిల్ కామత్

క్లయింట్ల సంఖ్య పరంగా తొలి 10 బ్రోకరేజీ సంస్థలు

బ్రోకరేజీ	క్లయింట్ల సంఖ్య
జెరోధా	8,47,016
ఐసీఐసీఐ సెక్యూరిటీస్	8,44,853
హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్	6,74,495
షేర్‌ఖాన్	5,48,873
యాక్సిస్ సెక్యూరిటీస్	4,16,707
ఏంజెల్ బ్రోకింగ్	4,15,572
కోటక్ సెక్యూరిటీస్	4,09,619
మోతీలాల్ ఓస్వాల్	3,28,145
కార్వే స్టాక్ బ్రోకింగ్	2,70,521
ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్	2,32,344

ఫలితాలనిస్తున్న దివాలా స్మృతి

- అనైతిక చర్యలకు పాల్పడే ఆర్‌పీలపై చర్యలు
- 'ఈనాడు'తో ఐబీబీఐ ఛైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.సాహు


మాట్లాడుతున్న ఐబీబీఐ ఛైర్మన్ ఎం.ఎస్.సాహు, సీపీ హైదరాబాద్ కన్వీనర్ వి.వి.ఎస్.ఎన్.రాజు

ఈనాడు – హైదరాబాద్

రెండేళ్ల క్రితం అమల్లోకి వచ్చిన ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ (దివాలా స్మృతి-2016)తో వ్యాపార రంగంలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని అంటున్నారు ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) ఛైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.సాహు. ఐబీ కోడ్ వల్ల దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐలు) పెరిగాయని, చైనాకంటే ముందున్నామని చెప్పారు. నిర్వహణా లోపంతో చేతులెత్తేసిన కంపెనీలను కొత్త యాజమాన్యాల సారథ్యంలో పునరుద్ధరించడానికి ఈ కోడ్ ఉపయోగపడుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో సొసైటీ ఆఫ్ ఇన్‌సాల్వెన్సీ ప్రాక్టీషనర్స్ ఆఫ్ ఇండియా (ఎస్ఐపీఐ) నిర్వహించిన సమావేశానికి హాజరైన డాక్టర్ సాహు 'ఈనాడు'తో మాట్లాడారు. ఐబీ కోడ్ కింద 1500 కంపెనీలు దాఖలు చేసిన కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ) దరఖాస్తులను జాతీయ కంపెనీ లా ట్రైబ్యునళ్లు అనుమతించాయన్నారు. దాదాపు 350 కంపెనీల్లో సీఐఆర్‌పీ పూర్తయిందని, 80 కంపెనీలు పునరుద్ధరణకు నోచుకున్నాయని చెప్పారు. మరో 300 కంపెనీలు లిక్విడేషన్‌కు వెళ్లాయని చెప్పారు. రుణదాతలకు 50 శాతం వసూళ్లు నమోదైనట్లు చెప్పారు. పదేళ్లుగా మూతపడిన కంపెనీలు రుణ పరిష్కారంలో భాగంగా ఈ కోడ్ పరిధిలోకి రావడంతో లిక్విడేషన్‌కు వెళ్లాయని చెప్పారు.

పరిశ్రమల ప్రోత్సాహానికే: చేతులెత్తేసిన యాజమాన్యాలను తప్పించి ఆ స్థానంలో కొత్త యజమానిని తీసుకువచ్చి ఎన్నో కంపెనీలను పునరుద్ధరించినట్లు ఆయన చెప్పారు. కంపెనీని నిర్వహించే సామర్థ్యం లేని యజమాని బయటికి వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయత్నాలన్నీ విఫలమయ్యాకే లిక్విడేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. విఫల యత్నాల నుంచే విజయం తద్వారా అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందన్నారు. వ్యాపారాల్లో పోటీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందులో భాగంగా కొన్ని వ్యాపారాలు మూసివేయాల్సి వస్తుందని అన్నారు.

కుమ్మక్కైనట్లు ఆధారాలుంటే చర్యలు: రుణగ్రస్తులతో రెజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ-పరిష్కార నిపుణుడు) కుమ్మక్కైనట్లు ఆధారాలులంటే చర్యలుంటాయని ఆయన వెల్లడించారు. సాధారణంగా బ్యాంకర్లు, రుణగ్రస్థ కంపెనీలు కుమ్మక్కవుతుంటాయని, ఇలాంటి వాటికి అవకాశం ఇవ్వకుండా ఆర్‌పీ నియంత్రించాల్సి ఉందన్నారు. ఒక్కోసారి ఆర్‌పీ కూడా వారితో చేరిన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, అలాంటివాటిపై ఆధారాలుంటే చర్యలు తప్పవన్నారు. ఈ కోడ్ వల్ల బ్యాంకులు కూడా ప్రయోజనం పొందుతున్నాయన్నారు.

సవాళ్లున్నాయి: చర్చలో అభిప్రాయాలు

ఐబీబీఐ ఛైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.సాహు, సీపీ అధ్యక్షుడు సుమంత్ బత్రా నేతృత్వంలో ఐబీ కోడ్ అమలు తీరుతెన్నులపై సొసైటీ ఆఫ్ ఇన్‌సాల్వెన్సీ ప్రాక్టీషనర్స్ ఆఫ్ ఇండియా (సీపీ) శనివారం ఇక్కడ ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో డాక్టర్ సాహు మాట్లాడుతూ దివాలా కంపెనీలకు సంబంధించి రుణ పరిష్కార ప్రణాళికలు కొన్ని వస్తున్నప్పటికీ ఒక్కదాన్నే రుణదాతలు ఆమోదిస్తున్నారని, అలా కాకుండా దీర్ఘకాల ప్రయోజనాలుండే మరో రుణ పరిష్కార ప్రణాళికను రుణదాతల ముందుంచాలన్నారు. స్వయంగా రుణ పరిష్కార ప్రణాళికను సమర్పించే అవకాశం దివాలా కంపెనీకి ఇవ్వాలన్నారు. లిక్విడేషన్‌కు వెళ్లిన కంపెనీని విక్రయించడానికి అవకాశం ఉండాలన్నారు. ప్రధాన కంపెనీ, దానికి చెందిన పలు అనుబంధ కంపెనీల యాజమాన్యాలు, వ్యాపారాలు ఒక్కటే అయినపుడు అందులో ఒక కంపెనీ దివాలా ప్రక్రియ చేపట్టాలంటే ఇబ్బందులున్నాయన్నారు. దివాలా కంపెనీ నుంచి నిధులు ఇతర అనుబంధ కంపెనీల్లోకి మళ్లించి ఇవి చేతులెత్తేస్తున్నాయని చెప్పారు. ఇలాంటప్పుడు అదే గ్రూపులో లాభాల్లో ఉన్న కంపెనీల నుంచి రుణాలను రాబట్టే అవకాశం ప్రస్తుత చట్టం వల్ల సాధ్యం కాదన్నారు. కొన్ని యూరోపియన్ దేశాల్లో ఇలాంటి చట్టం అమల్లో ఉందన్న విషయాన్ని ప్రస్తావించారు. దివాలా కంపెనీలను వారికి చెందిన బినామీలు చేజిక్కించుకుంటున్నారని, దీన్ని నియంత్రించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ హైదరాబాద్ కన్వీనర్ వి.వి.ఎస్.ఎన్.రాజుతోపాటు పలువురు చార్టర్డ్ అకౌంటెంట్‌లు, కంపెనీ సెక్రటరీలు, ఆర్‌పీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.



కోడిగుడ్లు

19న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	405	వరంగల్	407
చిల్లరగా (ఒక గుడ్డు)	4.65	విశాఖపట్నం	425
బెంగళూరు	435	చెన్నై	440
20వ తేదీకి		చిత్తూరు	433
విజయవాడ/గోదావరి	425	నమక్కల్	425

సిరి

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో, ఇంటి నుంచే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునే సౌలభ్యం అందరికీ చేరువయ్యింది. డిజిటల్ వ్యవహారాలు పెరగడంతో, వాటి ఆధారంగా జరుగుతున్న మోసాలు అధికమవుతున్నాయి. వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, అక్రమ ఆన్‌లైన్ లావాదేవీలతో డబ్బు కాజేస్తున్న సంఘటనలు తరచూ వింటూనే ఉన్నాం. ఫలితంగా చాలామందికి ఆన్‌లైన్ అంటేనే భయం పట్టుకుంది. ఖాతాదారులకు ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలపై ఉన్న అనసవర భయాలు పోగొట్టేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టింది. ఖాతాదారుల నష్టభయాన్ని తగ్గించేందుకూ, మోసపూరిత లావాదేవీల్లో గరిష్ఠ బాధ్యతను పరిమితం చేస్తూ మార్గదర్శకాలు రూపొందించింది. నిర్భయంగా ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించుకునే భరోసానిచ్చే ఆ వివరాలు తెలుసుకుందాం.



గ్రాఫిక్: సుధాకర్

సైబర్ మోసాలు..

బాధ్యత.. బ్యాంకుదా? మనదా?

డెబిట్, క్రెడిట్, ప్రీ పెయిడ్ కార్డులూ... ఇంటర్నెట్ బ్యాంకింగ్.. మొబైల్ బ్యాంకింగ్.. ఇలా బ్యాంకింగ్ స్వరూపం పూర్తిగా మారిపోయిందిప్పుడు. వీటితోపాటే.. ఖాతాదారుల రహస్య సమాచారాన్ని తస్కరించి, వారి ఖాతాలను నిలువు దోపిడీ చేస్తున్న సైబర్ నేరగాళ్లూ ఎక్కువ అవుతున్నారు. చాలా సందర్భాల్లో ఖాతాదారులు తాము నష్టపోయినప్పటికీ అటు బ్యాంకులకూ, ఇటు పోలీసులకూ ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోతున్నారు. ఇలా ఊరుకుంటుండటంతోనే వారు మరింత మందిని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్‌బీఐ ఇటీవల తీసుకొచ్చిన మార్గదర్శకాల్లో మోసపూరిత లావాదేవీల సందర్భంలో బ్యాంకులు, ఖాతాదారుల బాధ్యత ఎంత మేరకు ఉంటుందనే విషయంలో స్పష్టతనిచ్చింది.

పూర్తి భరోసా...

బ్యాంకుల నిర్లక్ష్యం లేదా లోపం వల్ల అక్రమ లావాదేవీ జరిగితే, ఖాతాదారుడు ఫిర్యాదు చేసినా చెయ్యకపోయినా పూర్తి బాధ్యత బ్యాంకులదే. అలాంటి లావాదేవీల మొత్తాన్ని ఖాతాదారుడు పూర్తిగా తిరిగి పొందవచ్చు. ఖాతాదారుడు ప్రమేయంగానీ, బ్యాంకుల నిర్లక్ష్యం గానీ లేకుండా కేవలం మూడో పార్టీ మోసం లేదా వ్యవస్థాగత లోపం వల్ల జరిగిన అనధీకృత లావాదేవీ విషయాన్ని, ఖాతాదారుడు బ్యాంకు నుంచి సమాచారం వచ్చిన మూడు పనిదినాల్లోగా ఫిర్యాదు చేసిన పక్షంలో ఆ లావాదేవీ మొత్తానికి ఖాతాదారుడి బాధ్యత లేదు. ఈ పూర్తి మొత్తానికి బ్యాంకులు భరోసానిస్తాయి. అక్రమ లావాదేవీల విషయంలో ఖాతాదార్ల ప్రమేయాన్ని రుజువు చేసే బాధ్యత బ్యాంకులపైనే ఉంటుంది.

అప్రమత్తంగా లేకపోతే..

ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించేందుకు అవసరమైన వ్యక్తిగత సమాచారాన్ని రహస్యంగా ఉంచుకోవాల్సిన పూర్తి బాధ్యత ఖాతాదారుడిదే. అతని/ఆమె నిర్లక్ష్యం వల్ల లేదా అవగాహనా లోపం వల్ల వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుకోలేకపోతే.. ఫిర్యాదు చేసే వరకూ జరిగిన లావాదేవీలకు పూర్తి బాధ్యత ఖాతాదారుడిదే. బ్యాంకులు ఆ లావాదేవీలకు సంబంధించిన నష్టాన్ని భరించవు. ఫిర్యాదు చేసిన తర్వాత ఏదైనా అక్రమ లావాదేవీ జరిగితే ఖాతాదారుడికి ఎటువంటి బాధ్యత ఉండదు. ఆ తర్వాత జరిగే లావాదేవీల్లో నష్టపోయిన సొమ్మును తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకులదే.

ఆలస్యం చేయొద్దు...

ఖాతాలో అనధీకృత, మోసపూరిత లావాదేవీ జరిగిందని గుర్తించిన తక్షణమే సంబంధిత బ్యాంకుకు ఫిర్యాదు చేయాలి. ఆలస్యం చేస్తే మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. అక్రమ లావాదేవీ జరిగిన వెంటనే ఖాతాను స్తంభింపచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.


పున్నమరాజు

- మీరు చేయని వ్యవహారానికి సంబంధించి 4 నుంచి 7 పనిదినాల్లోగా ఫిర్యాదు చేసినప్పుడు ఖాతా రకాన్ని అనుసరించి ఖాతాదారుడికి ఈ కింద పేర్కొన్న విధంగా పరిమిత బాధ్యత ఉంటుంది. ఆ పైబడిన మొత్తాన్ని ఖాతాదారుడు తిరిగి పొందవచ్చు.
- **ప్రాథమిక పొదుపు ఖాతాలు:** రూ. 5,000
- అన్ని ఇతర పొదుపు ఖాతాలు/ప్రీపెయిడ్ చెల్లింపు పత్రాలు/గిఫ్ట్ కార్డులు, ఎంఎస్ఎంఈల కరెంట్, క్యాష్-క్రెడిట్, ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాలు/ వ్యక్తుల వార్షిక సగటు బ్యాలెన్సు (మోసం జరగడానికిఇ ముందు 365 రోజులలో) పరిమితి రూ. 25లక్షల వరకూ ఉన్న కరెంట్ ఖాతాలు, క్యాష్ క్రెడిట్, ఓవర్ డ్రాఫ్ట్ ఖాతాలు/ రూ. 5లక్షల వరకూ పరిమితి ఉన్న **క్రెడిట్ కార్డులు:** రూ. 10,000 వరకూ
- **అన్ని ఇతర కరెంట్/క్యాష్-క్రెడిట్/ఓవర్ డ్రాఫ్ట్ ఖాతాలు:** రూ. 25,0000 వరకూ
- అక్రమ లావాదేవీ జరిగిన 7 రోజుల తర్వాత ఫిర్యాదు చేస్తే, ఆయా బ్యాంకుల బోర్డు ఆమోదం పొందిన విధాన నిర్ణయం ప్రకారం ఖాతాదారుడి బాధ్యత ఎంత అనేది నిర్ణయిస్తారు. ఫిర్యాదు ఎన్ని రోజుల్లో చేశారనది నిర్ధరించడానికి ఖాతా ఉన్న శాఖ పని దినాల్ని, ఫిర్యాదు తేదీ, సమయాన్ని పరిగణనలోనికి తీసుకుంటారు. రోజుల్ని లెక్కించేప్పుడు, ఫిర్యాదు చేసిన రోజును మినహాయిస్తారు.

పరిష్కారం ఎలా?

- ఖాతాదారుడి ఫిర్యాదు అందిన 10 పని దినాల్లోపు, బీమా క్లెయిం పరిష్కారంతో సంబంధం లేకుండా అక్రమ డిజిటల్ లావాదేవీల నిబంధనల మేరకు పరిహారానికి అర్హత ఉన్న మొత్తాన్ని ఖాతాదారుడు పొందవచ్చు. అక్రమ లావాదేవీ జరిగిన తేదీ నాటికి, అదే తేదీతో, అంతే విలువ మొత్తాన్ని ఖాతాదారునికి బ్యాంకులు జమ చేయాలి.
- ఖాతాదారుడు నిర్లక్ష్యంగా ఉన్న సందర్భాల్లో కూడా బ్యాంకులు తమ విచక్షణతో ఏ ఖాతాదారు బాధ్యతనైనా పూర్తిగా రద్దు చేసి, లావాదేవీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేయవచ్చు.
- బ్యాంకు బోర్డు ఆమోదిత విధానాన్ని అనుసరించి, ఫిర్యాదు అందుకున్న తేదీ నుంచి 90 రోజులు మించకుండా ఫిర్యాదు పరిష్కారం అయ్యేట్టు చూడాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉంది. ఏ కారణంతోనైనా 90 రోజుల్లో ఫిర్యాదు పరిష్కరించలేకపోతే, ఖాతాదారుడికి వడ్డీ రూపంలో ఎలాంటి నష్టం రాకుండా బ్యాంకులు చర్యలు తీసుకోవాలి.

బ్యాంకులు ఏం చేయాలి?

ఆన్‌లైన్ లావాదేవీలకు అధిక రక్షణ కల్పించేందుకు రిజర్వు బ్యాంకు బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

- బ్యాంకులు తమ ఖాతాదారులకు డిజిటల్ లావాదేవీల్లో జరిగే మోసాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలి.
- లావాదేవీ జరిగిన ప్రతిసారీ ఖాతాదారుడి మొబైల్ నెంబరుకు సంక్షిప్త సందేశం కోసం నమోదు చేసుకునేలా ఖాతాదారుల్ని ప్రోత్సహించాలి. అవసరమైన వివరాలను ఈమెయిల్ ద్వారా పంపించాలి.
- డెబిట్, క్రెడిట్ కార్డుల్లాంటివి పోగొట్టుకున్నామనీ, లేదా అక్రమ లావాదేవీ గురించి ఫిర్యాదు చేయడానికి అవసరమైన సౌలభ్యం ఉండాలి. అది ఖాతాదారులకు 24 గంటలూ అందుబాటులోకి రావాలి.
- అక్రమ లావాదేవీల ఫిర్యాదులు నమోదు చేయడానికి, వెబ్‌సైట్లలో ఒక ప్రత్యేక ప్రత్యక్ష లింకు స్పష్టంగా కనిపించాలి.
- ఖాతాదారుడి బాధ్యతను అంచనా వేసేందుకు వీలుగా ఫిర్యాదు అందిన సమయాన్ని నమోదు చేయాలి. నమోదైన ఫిర్యాదు సంఖ్యతోపాటు తక్షణ ప్రతిస్పందనను ఖాతాదారులకు పంపే ఏర్పాటు ఉండాలి.
- అనధికారిక లావాదేవీల నివారణ కోసం పటిష్ఠమైన, క్రియాశీలకమైన యంత్రాగాన్ని ఏర్పాటు చేయాలి.

డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతం కావాలంటే మోసపూరిత లావాదేవీలను అడ్డుకునేందుకు బ్యాంకులు నిరంతరం పటిష్ఠమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. ఖాతాదారులు కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తే, డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా నిర్వహించుకోవచ్చు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

- లావాదేవీలకు సంబంధించిన అన్ని సంక్షిప్త సందేశాలు మీ బ్యాంకు ఖాతాలో నమోదైన మొబైల్‌కు వచ్చేలా చూసుకోండి.
- అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి, డెబిట్/క్రెడిట్ కార్డు నెంబరు, సీవీవీ, పాస్‌వర్డ్, ఓటీపీ, మొబైల్ సిమ్ నెంబరు వంటివి అడుగుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వీరికి సమాధానం ఇవ్వొద్దు.
- తరచూ మీ ఏటీఎం/మొబైల్ బ్యాంకింగ్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు మార్చేయాలి.
- తక్షణమే ఫిర్యాదు చేయడానికి వీలుగా, మీ ఖాతా ఉన్న బ్యాంకు టోల్ ఫ్రీ నెంబరు, వెబ్‌సైటు తదితర వివరాలు అందుబాటులో ఉంచుకోండి.
- మీ డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌ల వంటి వ్యక్తిగత సమాచారం అందరికీ అందుబాటులో ఉండేలా పెట్టకండి. ముఖ్యంగా కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లలో భద్రపర్చడం ప్రమాదకరం.
- హోటళ్లు, పెట్రోలు బంకుల్లో లావాదేవీలు నిర్వహించేప్పుడు, మీరే స్వయంగా పిన్ నమోదు చేయండి.
- సామాజిక మాధ్యమాల్లో మీ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే సమాచారాన్ని తెలియచేయవద్దు.
- ఉచిత వైఫై కేంద్రాల్లోనూ, నెట్ సెంటర్లలోనూ, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు నిర్వహించవద్దు. మీ స్మార్ట్ ఫోన్‌కు తప్పనిసరిగా పాస్‌వర్డ్ ఉండాలి.
- మోసపూరిత లావాదేవీ జరిగినట్లు భావిస్తే, వెంటనే ఫిర్యాదు నమోదు చేయడంతోపాటు మీ ఖాతాను స్తంభింప చేయండి.

మార్పులతో మేలైన యులిప్‌లు...

యూనిట్ ఆధారిత బీమా పాలసీలు.. యులిప్‌లుగా ప్రసిద్ధి పొందిన ఈ పాలసీలు.. ఒకే సమయంలో జీవిత బీమా రక్షణ, మార్కెట్లో పెట్టుబడికి అవకాశం ఉండటం వీటి ప్రత్యేకత. అయితే, వీటిలో రుసుములు, కమిషన్లు అధికంగా ఉండటంతో.. ఏజెంట్లు వీటిని మోసపూరితంగా అంటగట్టిన సందర్భాలు ఉండేవి. ఇలా పలు కారణాలతో చాలా మంది ఈ పాలసీలపై అంత ఆసక్తి చూపేవారు కాదు. కానీ, ఇప్పుడు ఈ పాలసీల్లోనూ కొన్ని మార్పులు వచ్చాయి.

అధిక ఖర్చులు ఉండటంతోనే పాలసీదారులు యులిప్‌లను తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారని గుర్తించిన బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ), బీమా సంస్థలు కలిపి వీటిలో పలు మార్పు చేర్పులు తీసుకొచ్చాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు ఇవి పాలసీదారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో.. తక్కువ ఖర్చులతో అందుబాటులోకి వచ్చాయి.

సాధారణంగా యులిప్‌లపైన ఉన్న అపోహలు.. వాస్తవాలు ఏమిటి? తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!

అపోహ: యులిప్‌లు చాలా ఖరీదు..

చాలామంది ఇప్పటికీ యులిప్‌లు చాలా ఖరీదనే భావనతోనే ఉన్నారు. దీన్ని సరిదిద్దేందుకు ఐఆర్‌డీఏ పలు చర్యలు తీసుకుంది. ప్రీమియం మొత్తంలో 1.35శాతానికి మించి నిర్వహణ ఖర్చులు వసూలు చేయకూడదని నిబంధన విధించింది. దీంతోపాటు అలొకేషన్ రుసుములను కూడా తగ్గించింది. ఇప్పుడు చాలా యులిప్ పాలసీల్లో అతి స్వల్పంగా ఈ రుసుములు ఉంటున్నాయి. కొన్నింటిలో ఈ రుసుములు పూర్తిగా ఉండటం లేదు. ప్రతి ఏటా ఎంత రుసుము విధించాలనే విషయంలోనూ పరిమితి ఉంది. ప్రస్తుతం ఈ కొత్తతరం యులిప్‌లను ఆన్‌లైన్‌లోనూ తీసుకునే వీలుంటోంది. దీంతోపాటు ప్రీమియం అలొకేషన్ ఛార్జీలు కూడా ఉండటం లేదు.



కొన్ని జీవిత బీమా సంస్థలు తాము అందించే యులిప్‌లలో మోర్టాలిటీ ఛార్జీలను కూడా పాలసీ వ్యవధి పూర్తయ్యాక తిరిగి చెల్లించేస్తున్నాయి. దీనిని బీమా పరిభాషలో 'రిటర్న్ ఆఫ్ మోర్టాలిటీ ఛార్జెస్' అంటారు. చాలామంది పాలసీదారులను ఆకర్షిస్తున్న అంశం ఇప్పుడు ఇదే.

అపోహ: యులిప్‌లు తక్కువ రాబడినిస్తాయి..

సాధారణంగా మార్కెట్లో దీర్ఘకాలం కొనసాగినప్పుడు మంచి రాబడి వచ్చేందుకు అవకాశం ఉంటుంది. మార్కెట్ ఆధారంగా పనిచేసే యులిప్‌లకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. యులిప్‌లను దీర్ఘకాలం అంటే.. 10 ఏళ్లకు మించి కొనసాగించినప్పుడు ఇవి మంచి రాబడినే అందించాయని చెప్పొచ్చు. వీటి నుంచి వచ్చే రాబడికి దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను వర్తించదు. వీటన్నింటికీ మించి, యులిప్ మీ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుంది. అదే సమయంలో మీ దీర్ఘకాలిక లక్ష్యాలకు తోడుగా ఉంటుంది.

అపోహ: నష్టభయం ఎక్కువగా ఉంటుంది

మీ ఆర్థిక లక్ష్యాలు, నష్టభయం భరించే సామర్థ్యాన్ని బట్టి, యులిప్‌లో ఏ తరహా పెట్టుబడి విధానం కావాలన్నది ఎంచుకోవచ్చు. ఈక్విటీ, డెట్, బ్యాలెన్స్‌డ్ ఫండ్లలో ఏది ఎంచుకోవాలన్నది పాలసీదారుడి ఇష్టాన్ని బట్టి ఉంటుంది. పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండేలా ఇది దోహదపడుతుంది. వీలు, మార్కెట్ పనితీరును బట్టి, పెట్టుబడులను ఎప్పటికప్పుడు మార్చుకునేందుకు వెసులుబాటు కూడా ఉంటుంది. నష్టభయం భరించగలిగిన వారు ఈక్విటీలను ఎంచుకోవచ్చు. నష్టభయం ఉండకూడదు అనుకుంటే.. డెట్ లేదా బ్యాలెన్స్‌డ్ ఫండ్లను పరిశీలించవచ్చు.

అపోహ: మార్కెట్ అనిశ్చితి వల్ల బీమా తగ్గుతుంది

యులిప్‌లు స్టాక్ మార్కెట్ ఆధారంగా పనిచేస్తాయి కాబట్టి, మార్కెట్ తగ్గినప్పుడు ఆ ప్రభావం పాలసీ పరిహారంపై పడుతుందని అనుకుంటారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. మీరు ఎంత మొత్తానికి బీమా తీసుకోవాలని అనుకునేది ముందే నిర్ణయించుకుంటారు. దీన్ని పాలసీ వ్యవధిలో మార్చడం సాధ్యం కాదు. మార్కెట్ పెరిగినా, తగ్గినా బీమా విలువ తగ్గదు. పెరగదు. పాలసీ వ్యవధిలో పాలసీదారుడు మరణిస్తే.. బీమా మొత్తం లేదా ఫండ్ విలువ ఈ రెండింటిలో ఏది అధికంగా ఉంటే దాన్ని చెల్లిస్తారు. కొన్ని బీమా సంస్థలు.. పాలసీదారుడు మరణించినప్పుడు.. బీమా పరిహారంతోపాటు, ఫండ్ విలువను కూడా అదనంగా చెల్లిస్తున్నాయి. మీ ఇష్టానుసారం ఏ రకం పాలసీ కావాలన్నది ఎంచుకోవచ్చు.

- ధీరజ్ సెహ్‌గల్, చీఫ్ ఇన్‌స్టిట్యూషనల్ బిజినెస్ ఆఫీసర్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్.

డెంగీ కోసమే ఈ పాలసీ..

దోమలు, ఈగలు తదితర వాటి నుంచి వ్యాప్తి చెందే వ్యాధుల చికిత్సకు పరిహారం అందించే కొత్త పాలసీని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ తీసుకొచ్చింది. దీని పేరు 'ఎం-కేర్'. డెంగీ, మలేరియా, చికున్‌గన్యా, కాలా అజార్, మెదడు వాపు వ్యాధి, బోదకాలు, జికా వైరస్‌ల చికిత్సకు ఇది వర్తించనుంది. కుటుంబంలోని ఆరుగురికి కలిపి ఒకే పాలసీగా తీసుకోవచ్చు. కనీసం రూ. 10,000 నుంచి రూ. 1,00,000 వరకూ ఈ పాలసీని ఎంచుకోవచ్చు. ఎంచుకున్న జబ్బులను బట్టి రూ. 160 నుంచి రూ. 3,000 వరకూ ప్రీమియం ఉంటుంది. వ్యక్తిగతంగానూ, కుటుంబం అంతటికీ వర్తించేలా (తల్లిదండ్రులనూ చేర్చవచ్చు) కలిపి ఈ పాలసీని ఎంచుకోవచ్చు. ఈ పాలసీ తీసుకున్న వారు.. దాదాపు 37 దేశాల్లో ఎక్కడికి వెళ్లినా.. అక్కడ ఈ వ్యాధులు సోకినప్పుడు చికిత్స చేయించుకునే వీలుంది.

కొత్త పథకం

చిన్న కంపెనీల్లో పెట్టుబడి...

చిన్న తరహా కంపెనీల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతో ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా స్మాల్ క్యాప్ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఆయా కంపెనీల షేర్లు గత కొంతకాలంగా తక్కువ ధరకు లభిస్తున్నాయనీ, ముున్ముందు వాటిలో వృద్ధి బాగుంటుందనే పెట్టుబడి వ్యూహంతో ఈ ఫండ్‌ను తీసుకొచ్చినట్లు సంస్థ పేర్కొంది. ఈ పథకంలో డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్లతోపాటు, డివిడెండ్, గ్రోత్ ఆప్షన్లను ఎంచుకునే అవకాశం ఉంది. కనీస పెట్టుబడి రూ. 5,000. ఓపెన్ ఎండెడ్ పథకం కాబట్టి, సిప్ చేసుకునే అవకాశం ఉంది. కనీసం రూ. 500లతో సిప్ చేసుకోవచ్చు. ఏడాదిలోపు పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే 1శాతం రుసుము వర్తిస్తుంది. నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 సూచీ ప్రామాణికంగా పనిచేసే ఈ ఫండ్‌కు మేనేజర్‌గా హర్షద్ పాట్వర్ధన్ వ్యవహరిస్తున్నారు. ఎన్ఎఫ్ఓ ఫిబ్రవరి 1 వరకూ అందుబాటులో ఉంది.

బాండ్లలో..

సాధారణ ఫిక్స్‌డ్ డిపాజిట్లకన్నా కాస్త అధిక రాబడి ఆశించేవారు కార్పొరేట్ బాండ్లను ఎంచుకుంటారు. ఇదే వ్యూహంతో వచ్చిన ఫండ్ ఎస్‌బీఐ కార్పొరేట్ బాండ్ ఫండ్. ఏఏ+ అంతకు మంచి రేటింగ్ ఉన్న బాండ్లలో మదుపు చేసే ఫండ్ ఇది. ఓపెన్ ఎండెడ్ పథకంలో కనీస పెట్టుబడి రూ. 5,000. జనవరి 29 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది.

అమ్మాయి చదువు.. ఆటంకం లేకుండా..



» మా పాప వయసు 5 ఏళ్లు. తన ఉన్నత చదువుల కోసం ఉపయోగపడేలా కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాం. సురక్షితంగా ఉండే పథకాల్లో మదుపు పథకాలను ఎంచుకోవాలని ఆలోచన. పీపీఎఫ్ లేదా సుకన్య సమృద్ధి యోజనల్లో ఏది మేలు. నష్టభయం తట్టుకోలేం. నెలకు రూ.3వేలు పెట్టుబడి పెట్టగలం. - అర్చన

» మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ. 3వేలను ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) కంటే.. సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)లో జమ చేసేందుకు ప్రయత్నించండి. ప్రస్తుతం పీపీఎఫ్‌లో 8శాతం వడ్డీ లభిస్తోంది. ఎస్ఎస్‌వైలో 8.5శాతం వడ్డీ ఇస్తున్నారు. ఎస్ఎస్‌వైను ప్రభుత్వం ప్రత్యేకంగా 10 ఏళ్ల వయసు లోపు ఉన్న అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ప్రవేశ పెట్టింది. కాబట్టి, ఇందులో భవిష్యత్తులో కూడా అధిక వడ్డీ ఇచ్చే అవకాశం ఉంది. అమ్మాయి వయసు 21 ఏళ్లు వచ్చే దాకా ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 18 ఏళ్ల వయసప్పుడు 50 శాతం వరకూ వెనక్కి తీసుకోవచ్చు.

» నేను ఒక డెట్ ఫండ్‌లో మంత్లీ డివిడెండ్ ఆప్షన్‌తో మదుపు చేశాను. దీనిని రెగ్యులర్ నుంచి డైరెక్ట్‌కు మారిస్తే.. నా డివిడెండ్ మొత్తం పెరిగే అవకాశం ఉంటుందా? ఒక ఈక్విటీ ఫండ్‌లో గత రెండేళ్ల నుంచి సిప్ చేస్తున్నాను. దాన్ని నిలిపివేసి, ఆ పెట్టుబడిని అలాగే కొనసాగించే వీలుంటుందా? - ప్రసాద్

» రెగ్యులర్‌తో పోలిస్తే.. డైరెక్ట్ ఐచ్ఛికంలో ఫండ్ల ఖర్చు నిష్పత్తి తక్కువగా ఉంటుంది. అయితే, ఇందులో డివిడెండ్ ఆప్షన్‌కు బదులు సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ఆప్షన్‌ను ఎంచుకుంటే మంచిది. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ దాదాపు 29.12% వరకూ ఉంది. దీనివల్ల డివిడెండ్ తక్కువగా ఉంటుంది. డివిడెండ్ ఆప్షన్‌ను ఎంచుకున్నంత మాత్రాన, తప్పనిసరిగా ప్రతి నెలా డివిడెండ్ ఇస్తారని చెప్పలేం. నెలనెలా డబ్బు కావాలనుకుంటే ఎస్‌డబ్ల్యూపీ ఎంచుకోండి. మీ మొత్తం పెట్టుబడిలో 6-7 శాతం లోపే వెనక్కి తీసుకుంటే మంచిది. మీరు సిప్‌ను ఆపేసినా.. అందులో జమ అయిన డబ్బును తప్పనిసరిగా వెనక్కి తీసుకోవాలనే నిబంధన ఏమీ లేదు. మీకు అవసరమైనప్పుడు తీసుకోండి.

» ఈ నెలలో పదవీ విరమణ చేయబోతున్నాను. ప్రయోజనాల కింద వచ్చే రూ.11 లక్షలను డెట్ ఫండ్లలో మదుపు చేయడమా, సీనియర్ సిటిజన్ సేవింగ్ ఖాతాలో వేయాలా అనే ఆలోచనతో ఉన్నాను. క్రమం తప్పకుండా ఆదాయం రావాలంటే ఏది మేలు? - శర్మ

» మీకు వచ్చిన డబ్బును పెద్దల పొదుపు ఖాతా (సీనియర్ సిటిజన్ సేవింగ్స్ అకౌంట్)లో జమ చేసుకోండి. ఇందులో ప్రస్తుతం 8.7శాతం వడ్డీ ఇస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తారు. మీరు రూ. 11లక్షలు మదుపు చేస్తే.. రూ. 23,925 వచ్చే అవకాశం ఉంది. ఈ పథకం వ్యవధి ఐదేళ్లు. మీరు డెట్ ఫండ్లలో మదుపు చేస్తే.. కచ్చితంగా ఇంత రాబడి వస్తుందని చెప్పలేం.

» ఆదాయపు పన్ను మినహాయింపు కోసం సెక్షన్ 80సీలో ఇంకా రూ.40వేల వరకూ అవకాశం ఉంది. నేను 20శాతం పన్ను శ్లాబులో ఉన్నాను. బ్యాంకులో పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను ఎంచుకోవచ్చా? జాతీయ పొదుపు పత్రాలు (ఎన్ఎస్‌సీ) మేలా? - శివ కుమార్

» పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్లలో దాదాపు 7 శాతం వరకూ వడ్డీ ఉంది. ఎన్ఎస్‌సీలో 8శాతం వడ్డీ ఇస్తున్నారు. కాబట్టి, ఫిక్స్‌డ్ డిపాజిట్లకంటే ఎన్ఎస్‌సీలే మేలనుకోవచ్చు. ఈ రెండింటిలోనూ ఐదేళ్ల వరకూ పెట్టుబడిని వెనక్కి తీసుకోవడం కుదరదు. వచ్చిన వడ్డీపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాస్త నష్టభయం భరించగలను అనుకుంటే.. ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలను పరిశీలించండి. వీటి వ్యవధి మూడేళ్లు. దీనికి మీరు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ట్యాక్స్ రిలీఫ్ 95ని పరిశీలించవచ్చు.

» జీవిత బీమా పాలసీ వ్యవధి ముగియడంతో రూ. 2,50,000 వచ్చాయి. నా వయసు 54 ఏళ్లు. ఈ మొత్తాన్ని ఒకేసారి ఏదైనా పథకంలో మదుపు చేసి, మరో 6 ఏళ్ల తర్వాత వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నాను. మంచి పెట్టుబడి మార్గాన్ని సూచించండి. - యాదగిరి

» మీకు ఆరేళ్ల వ్యవధి ఉంది కాబట్టి, కాస్త అధిక రాబడి కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవచ్చు. ఈ ఆరేళ్లలో మీ డబ్బు రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. దీనికోసం ఫ్రాంక్లిన్ ఇండియా ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్, యాక్సిస్ ఫోకస్డ్ 25 ఫండ్లను పరిశీలించవచ్చు.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

కొత్త ప్రధాని ఖాయం

- మోదీ పతనానికి ఈ సభ నాంది పలుకుతోంది
- కులాలు, మతాలు, రాష్ట్రాల మధ్య ఆయన చిచ్చుపెడుతున్నారు
- రైతులను నిలువునా మోసగించారు
- కోల్‌కతా సభలో ఏపీ సీఎం చంద్రబాబు ధ్వజం
- ఇది దేశాన్ని ఏకం చేసే వేదికని వ్యాఖ్య
- అమరావతిలోనూ భారీ సభ నిర్వహించనున్నట్లు వెల్లడి

ఈనాడు - దిల్లీ



ఐక్యతా భారత్ ర్యాలీలో మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవె గౌడతో కరచాలనం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పక్కన కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఛైర్‌పర్సన్ ఫరూక్ అబ్దుల్లా

కులాలు, మతాలు, రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని పాలించాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ రోత రాజకీయాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రధానే కొత్త సమస్యలు సృష్టించి, ఒకరిపై మరొకరిని ఎగదోసే కుట్రలు పన్నుతున్నారన్నారు. ఆయన నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్నిరంగాల్లోనూ విఫలమైందని దుయ్యబట్టారు. ఆయన్ను సాగనంపాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ప్రజల మనోభావాలు చూస్తుంటే ఈ ఏడాది దేశానికి కొత్త ప్రధాని రావడం ఖాయమని, అందులో ఏమాత్రం అనుమానం లేదని పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నేతృత్వంలో శనివారం జరిగిన భారీ బహిరంగసభలో చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే...

“ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తెచ్చి, లక్షలాదిమందితో బ్రిగేడ్ గ్రౌండ్‌లో ఇంతటి భారీ సభ నిర్వహించిన మమతాబెనర్జీకి ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ ప్రజల తరఫున అభినందనలు. ఈ మైదానానికి గొప్ప చరిత్ర ఉంది. దేశానికి ఎప్పుడు సంక్షోభం తలెత్తినా ఇక్కడ సమావేశాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. తర్వాత దేశం మొత్తం దాన్ని అనుసరించడం అలవాటు చేసుకొంది. దానివల్ల ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇది చారిత్రక దినం. జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన ఉద్దండ నేతలంతా ఇక్కడున్నారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే మా అందరి ఏకైక లక్ష్యం. అందుకే మేమంతా కలిసి దేశాన్ని ఏకం చేయాలనుకుంటున్నాం. ఈ ఎన్డీయే, భాజపాలు దేశాన్ని విభజించాలని చూస్తుంటే మేం జోడించే ప్రయత్నం చేస్తున్నాం. అందుకే ‘సేవ్ ఇండియా సేవ్ డెమొక్రసీ’ అనే ఒకే నినాదంతో మేమంతా ఇక్కడికొచ్చాం. భారతదేశ ఐక్యతే ఈ సమావేశం ఉద్దేశం. అయిదేళ్ల క్రితం ఈ దేశ ప్రజలు ఎన్డీయే, భాజపా ప్రభుత్వానికి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. కానీ వాళ్లు దేశాన్ని మోసం చేశారు. నాలుగేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పి ప్రధానమంత్రి రైతులను పూర్తిగా మోసగించారు. ఈ ప్రభుత్వం చేతకానితనం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతుల పేరుచెప్పి చేస్తున్న మోసాల ఫలితంగా... అన్నదాతలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయారు. ఇస్తామని చెప్పిన కనీస మద్దతు ధర లభించడంలేదు. వ్యవసాయ సగటు వృద్ధిరేటు 1.9 శాతానికి పడిపోయింది. చరిత్రలో ఇంత దారుణం ఎప్పుడూ లేదు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటకలాంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం కంటే ఎంతో బాగా పనిచేస్తున్నాయి.

‘రఫేల్’ భారీ కుంభకోణం..

రఫేల్ ఒప్పందంలో పెద్ద కుంభకోణం జరిగింది. యూపీయే హయాంలో 1.4 బిలియన్ డాలర్లకు 126 విమానాలు కొనుగోలుచేయాలని ఒప్పందం చేసుకుంటే ఇప్పుడు అదే మొత్తానికి 36 విమానాలు మాత్రమే కొంటున్నారు. సెలెక్షన్ కమిటీలోని మెజార్టీ సభ్యులు ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించినా మోదీ ప్రభుత్వం బలవంతంగా కొనుగోళ్లు చేపట్టింది. సుప్రీంకోర్టుకు కూడా ఈ ప్రభుత్వం తప్పుడు అఫిడవిట్ సమర్పించింది. రఫేల్ కుంభకోణాన్ని కప్పిపుచ్చడానికి మోదీ ప్రభుత్వం యావత్ జాతిని తప్పుదోవ పట్టించింది. అత్యంత ప్రముఖమైన ప్రభుత్వరంగ సంస్థ హెచ్‌ఏఎల్‌కు రఫేల్ కాంట్రాక్ట్ ఇవ్వకుండా అసలు మనుగడలో నేలేని స్టార్టప్ కంపెనీ రిలయన్స్‌కు అప్పగించింది. దీన్నిబట్టి ఈ ప్రభుత్వం దేశాన్ని ఎలా మోసగిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

> మోదీ ప్రచారానికే పరిమితం. ఆయన పనిచేసే ప్రధానికాదు. మనకు పనిచేసే ప్రధాని కావాలి. పేదలు, సమాజం పట్ల సహృదయంతో ఆలోచించగల నాయకుడు కావాలి. దేశ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఒక్కటై ఎన్డీయే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన తరుణం ఆసన్నమైంది.

> ఎన్డీయే, భాజపాలు దేశాన్ని విభజించాలని చూస్తుంటే మేం జోడించే ప్రయత్నం చేస్తున్నాం. అందుకే ‘సేవ్ ఇండియా– సేవ్ డెమొక్రసీ’ అనే ఒకే నినాదంతో మేమంతా ఇక్కడికొచ్చాం. భారతదేశ ఐక్యతే ఈ సభ ఉద్దేశం.
>
> **- కోల్‌కతా సభలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు**

వృద్ధి రేటు పతనం..

పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకుల్లో డబ్బు లేని పరిస్థితి నెలకొంది. నల్లధనం వెలికితీత కోసం నోట్లు రద్దుచేశామన్నారు. కానీ చివరికి ఏమీ పట్టుకోలేకపోయారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి, ఆర్థిక విధానాలు అమలుచేయడం మానేసి కేవలం రాజకీయాలకే పరిమితమైంది. జీఎస్టీ కూడా మోసపూరితంగా తయారైంది. అందుకే గతంలో ఎన్నడూలేనంత తక్కువ స్థాయికి వృద్ధిరేటు పడిపోయింది. దీనవల్లే నిరుద్యోగంతోపాటు, ఎన్నో సమస్యలు తలెత్తాయి. అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం హద్దుల్లేకుండా పెట్రో ధరలు పెరుగుతున్నాయి. ధరలను నియంత్రించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది.

రాష్ట్రాలకు వేధింపులు..

కేంద్ర ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థలో జోక్యం చేసుకొని రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రాలను వేధిస్తోంది. కశ్మీర్ విషయంలో ఎలా వ్యవహరించిందో అంతా చూశారు. కర్ణాటకలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రపన్నారు. ఒకవేళ కర్ణాటక ప్రభుత్వాన్ని ఏమైనా చేయాలని చూస్తే కేంద్ర ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఈ సభాముఖంగా మేం హెచ్చరిస్తున్నాం. ఎమ్మెల్యేలను పశువుల్లా కొనడానికి పెద్దమొత్తంలో డబ్బు కుమ్మరిస్తున్నారు. ఇటీవల విద్వేష ప్రచారం మొదలుపెట్టారు. ఇది దేశానికి ఏమాత్రం మంచిదికాదు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి విభజించు పాలించు సూత్రాన్ని అమలు చేయాలనుకుంటున్నారు. రాష్ట్రాల మధ్యా చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి వాటిని ఎగదోసే రాజకీయాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాడే వారిపైకి సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను శాఖలను ఉసిగొల్పుతున్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో మీడియా కూడా దాడులకు గురవుతోంది.

ఏపీకి వీసమెత్తు సాయం చేయలేదు..

నాలుగున్నరేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌ను విభజించినప్పుడు చట్టపరంగా కొన్ని హామీలు ఇచ్చారు. ప్రత్యేకహోదా ఇస్తామని సభాముఖంగా చెప్పారు. కానీ ఈ ప్రభుత్వం వీసమెత్తు సాయం కూడా చేయలేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్ విషయంలోనే కాకుండా ప్రతి ఒక్కరికీ అన్యాయం చేస్తున్నారు. ఈ బహిరంగ సభ మోదీ పతనానికి ప్రారంభం. 2019లో దేశానికి కొత్త ప్రధాని రావడం ఖాయం. అందులో ఏమాత్రం అనుమానంలేదు. ఈ వేదికపై ఉన్న నాయకులమంతా దేశం ముందు, వ్యక్తులు తర్వాత అన్న నినాదంతో ముందుకెళ్తున్నాం. దేశం, ప్రజాస్వామ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ చేతులు కలిపి పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్.టి.రామారావు నేషనల్‌ఫ్రంట్ పెట్టినప్పుడు తొలి సమావేశం విజయవాడలో పెట్టి రెండో మీటింగ్ కోల్‌కతాలో పెట్టారు. అదే విధంగా మేం మిత్రపక్షాల తదుపరి సమావేశం అమరావతిలో భారీఎత్తున నిర్వహించాలనుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం.”

బెంగాలీలో శుభాకాంక్షలు

చంద్రబాబు తొలుత బెంగాలీలో మాట్లాడి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రసంగం చివరలో మోదీ, అమిత్‌షాలు పోవాలా? వద్దా? అని అడిగినప్పుడు సభలో ఉన్నవారంతా పోవాలి అని గట్టిగా బదులిచ్చారు. అప్పుడు మమతాబెనర్జీ జోక్యం చేసుకొని ఇంకా గట్టిగా చెప్పండి అని ఉత్సాహ పరిచారు.

గాయాలపై కారం చల్లడమే ఏపీకిచ్చే ప్రాధాన్యమా?

- భాజపా నేతల మాటలు హాస్యాస్పదం
- ఏపీపై ద్వేషంతో కేసీఆర్, కవిత, కేటీఆర్, హరీశ్
- ‘ఎన్నికల మిషన్ 2019’పై టెలికాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు-అమరావతి: ‘ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం (ట్రీట్‌మెంట్) ఇస్తున్నామని భాజపా నేతలు చెప్పడం హాస్యాస్పదం. 29సార్లు దిల్లీకి వెళ్తే మొండిచేయి చూపడం. గాయాలపై కారం చల్లడమే ప్రత్యేక ప్రాధాన్యమా...?’ అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలదీశారు. ‘ఎన్నికల మిషన్ 2019’పై తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ పార్టీల బాధ్యులతో శనివారం ఉదయం కోల్‌కతా నుంచి ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్ణాటకలో భాజపా దుర్మార్గపు రాజకీయాలు చేస్తోందని, శబరిమలలో ఉద్రిక్తతలు సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. రామాలయ నిర్మాణ అంశాన్ని మళ్లీ తెరమీదకు తెస్తోందని గుర్తుచేశారు. వీటన్నింటిని ప్రజలకు వివరించి చెప్పాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు. ప్రతి కార్యకర్త ఒక మొబైల్ మీడియాగా మారి ప్రచారం చేయాలన్నారు. ఏపీలో 25 ఎంపీ, 150 ఎమ్మెల్యే స్థానాల్లో విజయమే లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ‘కోల్‌కతా ర్యాలీకి కేసీఆర్, జగన్ తప్ప అందరూ వచ్చారు.. వీరిద్దరూ మోదీ వెంట ఉన్నారనేది సుస్పష్టం....’ అని పేర్కొన్నారు. ‘ఈ ర్యాలీకి 20కు పైగా పార్టీల నాయకులు హాజరయ్యారు. వారంతా మోదీ వ్యతిరేకులే. ఫెడరల్ ఫ్రంట్ అనేదొక శూన్యం. అదసలు భాజపాకు ప్రతిపక్షమే కాదు. మోదీకి మద్దతు కోసమే...’అని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్‌పై తెరాస నేతల ద్వేషం

ఆంధ్రప్రదేశ్‌పై తెరాస నేతల ద్వేషాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ నేతలకు సీఎం సూచించారు. కేసీఆర్, కవిత, కేటీఆర్, హరీశ్‌రావుల దుర్భాషలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వారితో అంటకాగే జగన్ వైఖరిని ఎండగట్టాలని నిర్దేశించారు. వరంగల్‌లో తనపై రాళ్లేసిన వారితో జగన్ లాలూచీ పడ్డారని విమర్శించారు. కేసుల కోసం మోదీతో .. అక్రమాస్తుల కోసం కేసీఆర్‌తో లాలూచీ పడిన తీరును రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. ‘ఆదాయం ఎక్కువగా ఉన్న తెలంగాణలో పల్లెలెలా ఉన్నాయి? అక్కడి పట్టణాల్లో ఏం అభివృద్ధి జరిగింది? ఆదాయం లేకున్నా ఆంధ్రప్రదేశ్‌లో పల్లెలు, పట్టణాల్లో వసతులు ఎలా పెంచామనేది ప్రజల్లోకి తీసుకెళ్లాలి...’ అని సూచించారు.

జగన్‌పై దాడి కేసు.. ‘ఎన్ఐయే’కు అప్పగింతపై హైకోర్టుకు ఏపీ సర్కారు

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి కేసు దర్యాప్తును ఎన్ఐయేకు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ జారీచేసిన ఉత్తర్వులతో పాటు హైదరాబాద్ ఎన్ఐయే ఠాణాలో నమోదు చేసిన కేసును సవాలు చేస్తూ ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనూరాధ శనివారం హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. చట్ట నిబంధనల ను పక్కన పెట్టి కేంద్ర హోంశాఖ వ్యూహాత్మకంగా దర్యాప్తును ఎన్ఐయేకు అప్పగించిందని అందులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తును ఎన్ఐయేకు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ 2018 డిసెంబర్ 31న జారీచేసిన ఉత్తర్వులు, వాటి ఆధారంగా ఎన్ఐయే పోలీసులు జనవరి 1న నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి, రద్దుచేయాలని కోరారు. వాటి అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. కేంద్రహోంశాఖ కార్యదర్శి, ఎన్ఐయే డైరెక్టర్ జనరల్, హైదరాబాద్‌లోని ఎన్ఐయే డిప్యూటీఐజీనివ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

అత్యవసర విచారణ ఎందుకు?

హైకోర్టుకు సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శనివారం ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని ప్రభుత్వం హైకోర్టును కోరింది. అందుకు నిరాకరించిన న్యాయమూర్తి అత్యవసర విచారణ అవసరం ఏముందని ప్రశ్నించారు. హైకోర్టు పునఃప్రారంభం నాడు (సోమవారం) విచారణకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీకి సూచిస్తామన్నారు.

వీవీప్యాట్‌లు 100% లెక్కించాలి

- విపక్షాల డిమాండ్
- ఎన్నికల సంఘాన్ని కలవాలని తీర్మానం
- పార్లమెంటు సమావేశాల్లోపు దిల్లీలో భేటీ
- ఎన్నికల తర్వాతే ప్రధాని అభ్యర్థిపై నిర్ణయం

ఈనాడు-దిల్లీ, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో మోసం జరిగే ఆస్కారం ఉన్నందున వచ్చే ఎన్నికల్లో వీవీప్యాట్ చీటీలు 100% లెక్కించే విధంగా కేంద్ర ఎన్నికలసంఘంపై ఒత్తిడి తీసుకురావాలని... కోల్‌కతాలో సమావేశమైన విపక్ష నేతలు నిర్ణయించారు. దీనిపై ఒక కార్యాచరణ రూపొందించుకొని అన్ని పార్టీల నేతలూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని నిర్ణయించారు. దీనిపై ఒక నివేదిక రూపొందించేందుకు నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఇచ్చే నివేదికను ఎన్నికల సంఘానికి సమర్పిస్తారు. కమిటీలో అభిషేక్ మనుసింఘ్వీ (కాంగ్రెస్), అఖిలేష్ యాదవ్ (ఎస్పీ), సతీష్ మిశ్ర (బీఎస్పీ), కేజ్రీవాల్ (ఆప్) సభ్యులుగా ఉంటారు. శనివారం మమతాబెనర్జీ నేతృత్వంలో బహిరంగసభ ముగిసిన తర్వాత



కోల్‌కతాలో శనివారం బహిరంగ సభ ముగిసిన అనంతరం జరిగిన సమావేశంలో జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

అన్ని పార్టీలనేతలూ అక్కడి ఓ హోటల్‌లో సమావేశమై సుమారు గంటపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈనెల 31న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నందున ఆలోపు దిల్లీలో ఒకసారి అన్నిపార్టీల నేతలూ కలిసి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. ప్రధానమంత్రి అభ్యర్థి గురించి ఎన్నికల అనంతరమే ఒక నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. ఇదే అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. దేశ ప్రయోజనాలకోసం తామంతా ఒక్కటిగా ఉన్నామని, ప్రధానమంత్రి పదవి కంటే దేశ భవిష్యత్తే తమకు ముఖ్యమన్న సందేశాన్ని ప్రజలకు చెప్పాలని తీర్మానించారు. ఈ సభ విజయవంతం అయిన నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ ప్రతిపక్షాలపై మరింత కక్ష పెంచుకొనే ప్రమాదం ఉందన్న అభిప్రాయం కొందరు నేతల్లో వ్యక్తమైంది. ఇప్పటికే అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్‌లాంటి వారిపై కేసులు పెట్టి వేధిస్తున్న అంశంపై చర్చించారు. ఇకమీదట ఎవరిమీద కేసులుపెట్టినా అంతా సంఘటితంగా పోరాడటంతోపాటు, అండగా నిలవాలని నిర్ణయించారు. ప్రతిపక్ష నాయకులపై కక్షపూరితంగా ఐటీ, ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తున్నారని, సాధారణ ఎన్నికల సమయంలో వాటికి అవకాశమివ్వరాదంటూ... సంబంధిత విభాగాల బాధ్యుల్ని కలిసే అంశంపై కూడా దిల్లీలో జరిగే భేటీలో తుది నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

ఇక భారీ ర్యాలీలు...

లోక్‌సభఎన్నికలకు సమాయత్తమయ్యే క్రమంలో దేశవ్యాప్తంగా వరసగా భారీ ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాలని భాజపా వ్యతిరేక పక్షాలన్నీ కలిసి నిర్ణయించాయి. అమరావతి, దిల్లీ, చెన్నై, బెంగళూరుల్లో వరసగా ర్యాలీలు, సభలు నిర్వహిస్తారు. కోల్‌కతా సభలో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అమరావతిలో తదుపరి ర్యాలీ నిర్వహిస్తానని ప్రకటించారు. ఇలాంటి ర్యాలీని దిల్లీలో జరిపేందుకు ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్, చెన్నైలో నిర్వహించేందుకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, బెంగళూరులో జరిపేందుకు జేడీ(ఎస్) అధ్యక్షుడు దేవెగౌడ, కర్ణాటక సీఎం కుమారస్వామిలు సంసిద్ధత తెలిపారు. దీంతో ప్రణాళిక ప్రకారం వీటిని నిర్వహించేందుకు దిల్లీలో త్వరలోనే సమావేశం కావాలని నిర్ణయించారు. రఫేల్ విమానాల కొనుగోలు వ్యవహారాన్ని ఎన్నికల అంశంగా చేయటంపైనా చర్చించనున్నారు. తాజా సమావేశంలో చంద్రబాబు (తెదేపా), మమతా బెనర్జీ (టీఎంసీ), మల్లిఖార్జున ఖర్గే (కాంగ్రెస్), అఖిలేష్ యాదవ్ (ఎస్పీ), స్టాలిన్ (డీఎంకే), దేవెగౌడ (జేడీ-ఎస్), కేజ్రీవాల్ (ఆప్), తేజస్వి యాదవ్ (ఆర్‌జేడీ), సతీష్ మిశ్ర (బీఎస్పీ), ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ), శరద్‌యాదవ్ (లోక్‌తాంత్రిక్ జనతాదళ్), అజిత్‌సింగ్ (ఆర్ఎల్‌డీ), కేంద్ర మాజీ మంత్రులు అరుణ్‌శౌరి, యశ్వంత్ సిన్హా, ఎంపీ శత్రుఘ్నసిన్హా, అరుణాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం అపాంగ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి హాజరయ్యేందుకు శుక్రవారం రాత్రే కోల్‌కతా చేరుకున్న చంద్రబాబు ఆరోజు రాత్రి, శనివారం ఉదయం పలువురు జాతీయ నాయకులతో భేటీ అయ్యారు.

డ్వాక్రా మహిళలకు రూ.10 వేలు, స్మార్ట్ ఫోన్!

ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయం

ఈనాడు-అమరావతి: స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా గ్రూపుల) మహిళలు ఒక్కొక్కరికీ పది వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయించారు. వీరికి స్మార్ట్ ఫోన్ కూడా అందించనున్నారు. రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఈనెల 26న స్వయం సహాయక సంఘాల మహిళలతో బహిరంగ సభ ఏర్పాటుచేసి అందులోనే ఈ నిర్ణయాల్ని ప్రకటించాలని సీఎం సూత్రప్రాయంగా నిర్ణయించారు. 2014లో తెదేపా అధికారంలోకొచ్చాక సంఘాల మహిళలకు పసుపు-కుంకుమ పేరుతో ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున అందించింది. ఒకేసారి కాకుండా 4 విడతల్లో పంపిణీ చేసింది. సకాలంలో రుణం చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కింద నిధులు విడుదల చేస్తున్నా...2016 ఆగస్టు నుంచి ఆమొత్తం పెండింగ్‌లో ఉంది. ఈనెల వరకు ఇది రూ.2,300కోట్లకు చేరుకుంది. ఇది కూడా ఒకేసారి మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమాచార మార్పిడికి స్మార్ట్ ఫోన్ అత్యున్నత సాధనంగా మారిన నేపథ్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ స్మార్ట్ ఫోన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇక రెండుసార్లు ‘నాటా’

- ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశానికి కొత్త విధానం
- ఏప్రిల్ 14, జులై 7న ప్రవేశ పరీక్షలు
- జేఈఈ మెయిన్ బాటలోనే ఆర్కిటెక్చర్ కౌన్సిల్

ఈనాడు - హైదరాబాద్

దేశవ్యాప్తంగా బ్యాచులర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా)ను ఇక రెండు సార్లు నిర్వహించన్నారు. ఇప్పటివరకు ఒకేసారి ప్రవేశ పరీక్ష ఉండేది. ఇక నుంచి మొదటిసారి పరీక్షను ఏప్రిల్ 14న, రెండోసారి జులై 7న నిర్వహిస్తారు. ఈ మేరకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నాటా ర్యాంకుల ఆధారంగా ఆయా రాష్ట్రాలు కౌన్సెలింగ్ నిర్వహించుకుంటాయి. వాటిద్వారా ఆయా రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో బీఆర్క్, బ్యాచులర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఆర్కిటెక్చర్ కళాశాలలో సీట్లను కూడా ఈ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేస్తారు. ఈ విశ్వవిద్యాలయంలో ఏపీ విద్యార్థులకు కొన్ని సీట్లు కేటాయిస్తారు. జేఈఈ మెయిన్, ఇతర పలు పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుండగా.. నాటాను మాత్రం ఆర్కిటెక్చర్ కౌన్సిల్ జరపనుంది. ఈ నెల 21 నుంచి నాటా కరపత్రం, ఇతర వివరాలను www.nata.in వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉంచుతారు. జేఈఈ మెయిన్ మాదిరిగా ఒక విద్యార్థి ఒకటి లేదా రెండు పరీక్షలను రాసుకోవచ్చా? లేదా ఏదైనా ఒక్కటే రాయాలా? అన్న దానిపై స్పష్టత రాలేదు.

దరఖాస్తుల ప్రక్రియ

పరీక్ష	దరఖాస్తుల గడువు
మొదటి పరీక్షకు	జనవరి 24 నుంచి మార్చి 11 వరకు
రెండో పరీక్షకు	జనవరి 24 నుంచి జూన్ 12 వరకు

నాటా పరిస్థితి..

★ నాటాకు ఏటా హాజరయ్యే విద్యార్థుల సంఖ్య	: **సుమారు లక్ష**
★ ఉత్తీర్ణులయ్యే వారి సంఖ్య	: **35 వేలు**
★ తెలుగు రాష్ట్రాల్లో బీఆర్క్ సీట్లు	: **దాదాపు 1,200**

తెలుగు విద్యార్థుల హవా

- జేఈఈ మెయిన్ ఫలితాల వెల్లడి


ఈనాడు – హైదరాబాద్, అమరావతి

జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించే దిశగా ప్రతిభ కనబరుస్తున్నారు. దేశవ్యాప్తంగా మెయిన్ పేపర్-1 ఫలితాల్లో 15 మంది 100 పర్సంటైల్ సాధించగా, అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ఇద్దరు విద్యార్థులు ఉండటం విశేషం. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) మాత్రం తెలంగాణ అగ్రగణ్యులుగా నలుగురు విద్యార్థులను, ఏపీ టాపర్‌గా బొజ్జా చేతన్ రెడ్డిని ప్రకటించింది. ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశంకోసం.. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొందేందుకు జనవరి 9-12 తేదీల మధ్య ఎన్‌టీఏ జేఈఈ మెయిన్ పేపర్-1 ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించింది. ఆ ఫలితాలను శనివారం వెల్లడించింది. ఆన్‌లైన్‌లో ఎక్కువ రోజులు పరీక్షలు జరిగితే ఫలితాలకు పర్సంటైల్ విధానాన్ని అవలంబిస్తారు. పేపర్-1ను రోజుకు రెండుసార్లు చొప్పున మొత్తం ఎనిమిది సార్లు నిర్వహించారు. ఎనిమిది ప్రశ్నపత్రాలు ఉండటంతో ఒకటి కఠినంగా.. మరొకటి సులభంగా ఉండొచ్చు కాబట్టి, విద్యార్థులకు నష్టం జరగకూడదని పర్సంటైల్ విధానాన్ని పాటిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రెండుసార్లు పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్‌లో మరోసారి ఈ పరీక్షలు జరుపుతారు. ఆసక్తి ఉన్నవారు ఆ పరీక్షకూ హాజరుకావొచ్చు. ఈ రెండింటిలో వచ్చిన ఉత్తమ పర్సంటైల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయిస్తారు. దేశవ్యాప్తంగా మొదటి పరీక్షకు 8,74,469 మంది హాజరయ్యారు. ఏపీ, తెలంగాణల నుంచి సుమారు 1.40 లక్షల మంది రాసి ఉంటారని అంచనా. 100 పర్సంటైల్ సాధించిన తెలుగు విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు హైదరాబాద్‌లోనే ఇంటర్ చదువుతూ ఇక్కడే పరీక్ష రాశారు. దాంతో జాతీయ పరీక్షల సంస్థ వారిని తెలంగాణకు చెందినవారిగా ప్రకటించింది. మిగిలిన 10 మందిలో మహారాష్ట్రకు చెందిన వారు ముగ్గురు, రాజస్థాన్ నుంచి ఇద్దరు, ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఇద్దరు, మధ్యప్రదేశ్, కర్ణాటక, పంజాబ్‌కు చెందిన వారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. జేఈఈ మెయిన్ పేపర్-2 (ఆర్కిటెక్చర్ కోర్సులకు) పరీక్ష జనవరి 8న జరగగా, వాటి ఫలితాలను తర్వాత ప్రకటిస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది.

ఇదీ లెక్క

★ పరీక్షకు దరఖాస్తు చేసినవారి సంఖ్య	:**9,29,198**
★ హాజరైనవారి సంఖ్య	:**8,74,469**
★ ఏప్రిల్ పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం	:**ఫిబ్రవరి 8 నుంచి మార్చి 7 వరకు**
★ ఏప్రిల్ పరీక్ష తేదీలు	: **6-20 తేదీల మధ్య**


రోజుకు 13 గంటలు చదివా



జేఈఈ మెయిన్‌లో 350 మార్కులు రావడం ఆనందంగా ఉంది. అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందని నమ్మకంగా ఉంది. రోజుకు 13 గంటల చొప్పున చదివాను. కాన్సెప్ట్స్‌పై అవగాహనతో సాధన చేశాను. ఐఐటీ బొంబాయి లేదా దిల్లీలో కంప్యూటర్‌సైన్సు చదవాలనేది లక్ష్యం.

–బొజ్జా చేతన్‌రెడ్డి

అడ్వాన్స్‌డ్‌లో 100లోపు ర్యాంకు ఆశిస్తున్నా



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 100లోపు ర్యాంకు తెచ్చుకొని ఐఐటీలో చదవాలన్నది లక్ష్యం. జేఈఈ మెయిన్‌లో 100 పర్సంటైల్ రావడం ఆనందంగా ఉంది. అమ్మానాన్నలు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

– అడెల్లి సాయికిరణ్



కె.విశ్వంత్ | బట్టేపాటి కార్తికేయ | వై.జయంత్ ఫణిసాయి

100 పర్సంటైల్ స్కోర్ పొందిన ఏపీ, తెలంగాణ విద్యార్థులు

పేరు	ప్రాంతం
అడెల్లి సాయికిరణ్	పాములపర్తి, సిద్దిపేట జిల్లా, తెలంగాణ
బొజ్జా చేతన్‌రెడ్డి	తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఏపీ
వై.జయంత్ ఫణిసాయి	విజయవాడ, ఏపీ
కె.విశ్వంత్	సూర్యాపేట, తెలంగాణ
బట్టేపాటి కార్తికేయ	నరసాపురం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా, ఏపీ

ఢీకొట్టిన బ్రిగేడ్

- వచ్చే ఎన్నికల్లో గెలుపు విపక్షానిదే
- ప్రధాని ఎవరనేది ఆ తర్వాత నిర్ణయించుకుంటాం
- 'ఐక్యతా భారత్' బహిరంగ సభలో నేతల ఉద్ఘాటన

భాజపా ఇక రోజులు లెక్క పెట్టుకోవాల్సిందే. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి అధికారం సాధించబోయేది విపక్షమే. దీనికి తగ్గట్టుగా మేమంతా కలిసి పనిచేస్తాం. ప్రధానమంత్రి ఎవరనేది సమస్యే కాదు. ఎన్నికల తర్వాత మేం నిర్ణయించుకుంటాం.



హాజరైన నేతలు వీరే...

మమతా బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), చంద్రబాబు (తెలుగుదేశం), మల్లికార్జున్ ఖర్గే, సింఘ్వీ (కాంగ్రెస్), హెచ్‌డీ దేవెగౌడ (జేడీ (ఎస్), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), శరద్ పవార్ (ఎన్‌సీపీ), శరద్ యాదవ్ (లోక్‌తాంత్రిక్ జనతాదళ్ పార్టీ), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), ఎం.కె.స్టాలిన్ (డీఎంకే), సతీష్ చంద్ర మిశ్ర (బీఎస్పీ), హేమంత్ సొరేన్ (జేఎంఎం), శత్రుఘ్న సిన్హా (భాజపా అసంతృప్త ఎంపీ), అజిత్ సింగ్ (రాష్ట్రీయ లోక్‌దళ్), అరుణ్‌శౌరి (కేంద్ర మాజీ మంత్రి), యశ్వంత్ సిన్హా (కేంద్ర మాజీ మంత్రి), గెగాంగ్ అపాంగ్ (అరుణాచల్ ప్రదేశ్ మాజీ సీఎం)

అధికారంలోకి రాకముందు ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని భాజపాయేతర పార్టీల నేతలు ఆరోపించారు. భాజపా సర్కారును ఇంటికి సాగనంపడమే తమ ఉమ్మడి లక్ష్యమని ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత విజయోత్సవం జరిగేది ఇదే వేదికపైనంటూ శనివారం కోల్‌కతాలో జరిగిన భారీ బహిరంగ సభలో శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఎన్నికలకు ముందు అమరావతి సహా దేశవ్యాప్తంగా పలుచోట్ల ఇదే తరహా బహిరంగ సభలు మరిన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

'భాజపా ఇక రోజులు లెక్క పెట్టుకోవాల్సిందే. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి అధికారం సాధించబోయేది విపక్షమే. దీనికి తగ్గట్టుగా మేమంతా కలిసి పనిచేస్తాం. ప్రధానమంత్రి ఎవరనేది సమస్యే కాదు. దానిని ఎన్నికల తర్వాత మేం నిర్ణయించుకుంటాం. రాజకీయాల్లో కొన్ని మర్యాదలనేవి ఉంటాయి. భాజపా వాటిని ఏమాత్రం పట్టించుకోలేదు. ఆ పార్టీతో లేనివారందరినీ దొంగలుగా పిలుస్తోంది. సొంత పార్టీలో సీనియర్ నేతలైన రాజ్‌నాథ్ సింగ్, సుష్మా స్వరాజ్, నితిన్ గడ్కరీ వంటి వారినీ గౌరవించకుండా విస్మరించింది. మోదీ, ఆయన సహచరులు ఇప్పుడు ఉమ్మడి నాయకత్వం గురించి మాట్లాడుతున్నా, లోక్‌సభ ఎన్నికల్లో ఒకవేళ ఆ పార్టీ గెలిస్తే మాత్రం సీనియర్ నేతల్ని మళ్లీ విస్మరిస్తారు. ఒకప్పుడు ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ)ని మించిన వాతావరణం ఇప్పుడు దేశంలో నెలకొంది' అని మమత ధ్వజమెత్తారు. 'విభజనవాద రాజకీయాలతో భాజపా ప్రభుత్వం మన దేశాన్ని ముక్కలు చేసింది. పాకిస్థాన్ గత 70 ఏళ్లలో చేయలేని పనిని కేవలం నాలుగేళ్లలో భాజపా విజయవంతంగా చేసి చూపింది. బ్యాంకులు, సీబీఐ, ఆర్‌బీఐ వంటి అన్ని వ్యవస్థలకు పూడ్చలేని నష్టాన్ని మిగిల్చింది. నిరర్థక ఆస్తులు, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు పరంగా పెద్దపెద్ద కుంభకోణాలు చోటు చేసుకున్నాయి. ఇన్ని జరుగుతున్నా అధికారంలో కొనసాగాలనే భాజపా ఇంకా కోరుకొంటోంది. గజదొంగకే పెద్ద గొంతుక ఉంటుందని బెంగాలీలో ఓ సామెత ఉంది. విపక్ష నేతలందరినీ మోదీ సర్కారు లక్ష్యంగా చేసుకొంది. సోనియాగాంధీ, అఖిలేశ్ యాదవ్, మాయావతిలతో పాటు నన్నూ ఈ విషయంలో విడిచిపెట్టలేదు. 2014 ఎన్నికలకు ముందు చేసిన ఏ వాగ్దానాన్నీ నిలబెట్టుకోలేదు. వచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్న మీకు (భాజపాకి) మరోసారి అచ్చే దిన్ (మంచి రోజులు) రావు' అని మమత స్పష్టంచేశారు. ఇతర పార్టీలకు చెందిన నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మోదీకి మరోసారి అధికారాన్ని అప్పగిస్తే దేశానికి తీరని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

సోనియా సందేశం

కోల్‌కతా మాదిరిగా ఎన్నికలకు ముందు పలుచోట్ల బహిరంగ సభలు నిర్వహించాలని నేతలు ప్రతిపాదించారు. దిల్లీ, ఏపీ రాజధాని అమరావతిల్లో తదుపరి సమావేశాలు జరపాలని నిర్ణయించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు ఈ సమావేశానికి హాజరుకాకపోయినా పార్టీ తరఫున మల్లికార్జున్ ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీలను పంపించారు. సోనియా సందేశాన్ని ఖర్గే చదివి వినిపించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు సామాన్యమైనవి కావని, ప్రజాస్వామ్యంపై దేశానికి ఉన్న విశ్వాసాన్ని పునరుద్ధరించేలా, లౌకిక విలువల్ని పరిరక్షించుకునేలా ఇవి మిగిలిపోతాయని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు. అహంకారపూరిత, విభజనవాద సర్కారుపై పోరాటంగా దీనిని అభివర్ణించారు. దేశంలో రైతులు, యువత, మత్స్యకారులు సహా అన్ని వర్గాలవారూ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, ఆఖరికి అది సరిహద్దుల వరకు విస్తరించిందని విమర్శించారు. విపక్షాల విభేదాలను ఖర్గే పరోక్షంగా ప్రస్తావిస్తూ... మనసులు కలవకపోయినా చేతులు కలపాల్సి ఉంటుందని అన్నారు. 'చేరాల్సిన గమ్యం ఎంతో దూరంలో ఉంది. మార్గం కఠినమైనది. అయినా మనం అక్కడకు చేరాల్సిందే. హృదయాలు కలిసినా కలవకపోయినా మనం చేతిలో చేయి కలిపి నడవాల్సిందే' అని చెప్పారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి తరఫున పార్టీ ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర మిశ్ర హాజరయ్యారు. సమావేశంలో జేడీ(యు) మాజీ నేత శరద్ యాదవ్ మాట్లాడుతూ రఫేల్ విమానాల ఒప్పందం గురించి విమర్శించబోయి పొరపాటున బోఫోర్స్ అని రెండుసార్లు అన్నారు.

– కోల్‌కతా





విభేదాలు విడనాడి... కలిసి అడుగేద్దాం...

'సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణాన విపక్షాలన్నీ విభేదాలు విడనాడి భాజపాపై ఐక్య పోరాటానికి ఒక్కతాటిపైకి రావాలి. భాజపాపై ముఖాముఖి పోరాడేలా మన మధ్య సీట్ల సర్దుబాటు జరగాలి. సంకీర్ణ ప్రభుత్వాలు స్థిరమైన పాలనను అందించగలవని రుజువు చేయాలి. ప్రజలు నూతన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. స్థిరమైన సర్కారు ఏర్పాటయ్యాక దేశాన్ని బలోపేతం చేయాల్సిన నరేంద్రమోదీ అన్ని వ్యవస్థల్ని నాశనం చేయాలని చూశారు.'

– హెచ్.డి.దేవెగౌడ, మాజీ ప్రధాని

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

'అవినీతిమయమైన మోదీ ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. మనం దొంగలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం.'

– హార్దిక్ పటేల్, పాటీదార్ నాయకుడు, గుజరాత్

మోదీ మళ్లీ నెగ్గితే దేశం నాశనమే



'మోదీ-అమిత్ షా ద్వయం మరోసారి నెగ్గితే దేశాన్ని నాశనం చేస్తారు. ముక్కలుగా విభజిస్తారు. నియంత హిట్లర్ చేసిన పనినే వారు చేస్తారు. రాజ్యాంగాన్ని మార్చేస్తారు. ఎన్నికలను రద్దు చేస్తారు. ఇప్పటికే చాలావరకు భ్రష్టు పట్టించారు. వారిని కూకటివేళ్లతో పెకిలించేయాలి.'

– అరవింద్ కేజ్రీవాల్, దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత

మరో స్వాతంత్ర్య సమరం



'లోక్‌సభకు త్వరలో జరగబోయే ఎన్నికలు మరో స్వాతంత్ర్య సమరం వంటివి. భాజపా అనుసరిస్తున్న హిందూ అతివాద వైఖరికి వ్యతిరేకంగా పోరాడి, మోదీని ఓడించి, దేశాన్ని రక్షించుకోవాలి. మోదీ మళ్లీ నెగ్గితే దేశం 50 ఏళ్లు వెనక్కి పోతుంది.'

– ఎం.కె.స్టాలిన్, డీఎంకే అధ్యక్షుడు

సోనియా, రాహుల్‌ల శుభాకాంక్షలు



'విపక్షాల ఐక్యత ర్యాలీకి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలు శుభాకాంక్షలు పంపారు. వారి దూతగా నేను వచ్చాను. మనమంతా చేతులు కలిపి నడుద్దాం.'

– మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో కాంగ్రెస్ నేత.

ఈవీఎంలు చోర యంత్రాలు



'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) చోర యంత్రాలు. వాటిని వాడుక నుంచి వైదొలగించి, బ్యాలెట్ పత్రాల పద్ధతిని ప్రవేశపెట్టాలి. నేను ముస్లింనే అయినా దేశాన్ని ప్రేమిస్తాను'

– ఫరూక్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత

70 ఏళ్ల తర్వాత బలమైన కలయిక



'దేశంలో 70 ఏళ్ల తర్వాత విపక్షాల బలమైన కలయిక ఇప్పుడు కనిపిస్తోంది. ప్రజల భావోద్వేగాలను, ప్రాంతీయ ఆకాంక్షల్ని దృష్టిలో పెట్టుకుని ప్రాంతీయ పార్టీలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ఏపీలో చంద్రబాబు, తమిళనాడులో కరుణానిధి, పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ, యూపీలో ఎస్పీ-బీఎస్పీ చేసిన కృషి ఎంతో గొప్పది. భాజపా చెప్పేదొకటి... చేసేదొకటి..'

–హెచ్.డి.కుమారస్వామి, కర్ణాటక ముఖ్యమంత్రి

పొత్తు మాకు మోదం- భాజపాకి ఖేదం

'ఎస్పీ-బీఎస్పీ పొత్తు దేశ ప్రజలకు ఆనందాన్ని, భాజపాకి కలవరాన్ని కలిగించింది. విపక్షాలకు ప్రధాని అభ్యర్థి ఎవరని భాజపా మమ్మల్ని ప్రశ్నిస్తోంది. అది ప్రజలు నిర్ణయిస్తారు. నరేంద్రమోదీ ఇప్పటికే నిరుత్సాహాన్ని మిగిల్చారు. మరి భాజపాలో ఆయన కాకుండా ప్రధాని అభ్యర్థిగా మరో పేరును వారు చెప్పగలరా?'

– అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు

"ఈవీఎంలు పెద్ద మోసపూరితంగా మారాయి. భారత్‌లో తప్ప ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఈవీఎంలు లేవు. రాజకీయ పార్టీలన్నీ కలిసి మళ్లీ పేపర్‌బ్యాలెట్ కోసం పోరాడాలి."

– చంద్రబాబు

ఉన్నది ఉన్నట్టు చెబుతా



'భాజపా నాయకత్వానికి వాస్తవాలను ఉన్నది ఉన్నట్టు చెబుతా. పార్టీ నుంచి తొలగించినా నష్టం లేదు. భారతీయ జనతా పార్టీతోకన్నా ముందు నుంచే భారత ప్రజల(భారత్ కీ జనతా)తో ఉంటున్నా.'

– శత్రుఘ్న సిన్హా, భాజపా ఎంపీ

తప్పుడు గణాంకాలతో మోసం



'బాగా అభివృద్ధి జరిగిందని చెప్పుకోవడానికి ప్రభుత్వం గణాంకాల్లో మార్పులు చేసి ప్రజలను మోసగించింది. పొగిడేవారిని దేశభక్తులని, విమర్శించేవారిని దేశద్రోహులని అంటోంది.'

– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

పోటెత్తిన కోల్‌కతా




కోల్‌కతాలోని బ్రిగేడ్ గ్రౌండ్‌లో శనివారం ర్యాలీ నిర్వహించడంతో హావ్‌డా వంతెన పరిసరాల్లో భారీగా స్తంభించిన ట్రాఫిక్

శభాష్.. దీదీ



ఐక్యతా భారత్ ర్యాలీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని అభినందిస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్ ఛైర్‌పర్సన్ ఫరూక్ అబ్దుల్లా

అబద్ధాల తయారీదారు మోదీయే



'అబద్ధాల తయారీదారు, హోల్‌సేల్ సరఫరాదారు, రిటైల్ అమ్మకందారు అన్నీ మోదీయే. ఒక అబద్ధం చెప్పి, పది అబద్ధాలను బహుమతిగా ఇస్తున్నారు. మోదీ, అమిత్ షాల కుట్రకు మా నాన్న లాలూ ప్రసాద్ బలయ్యారు.'

– తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత

భాజపా సర్కారుకు కాలం చెల్లింది

'ఎస్పీ-బీఎస్పీ పొత్తుతో భాజపా సర్కారుకు కాలం చెల్లింది. దళితులకు, మైనారిటీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న భాజపా ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేసే రోజులు ఎంతో దూరంలో లేవు. అభూత కల్పనలతో అధికారంలోకి వచ్చిన భాజపా ఆ తర్వాత ప్రజల్ని ఎన్నో విధాలా ఇబ్బందుల పాల్జేసింది.' *– సతీష్ చంద్ర మిశ్ర, బీఎస్పీ నేత*

మనందరి లక్ష్యం ఒకటే కావాలి

'భాజపాని వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపడమే విపక్షాల ఏకైక లక్ష్యంగా ఉండాలి. అవసరమైతే కొన్ని స్థానాల్లో త్యాగాలకు సిద్ధపడి, ఉమ్మడి అభ్యర్థుల్ని నిలపాలి.'

– అరుణ్‌శౌరి, కేంద్ర మాజీ మంత్రి

లౌకిక ప్రభుత్వం కోసమే కూటమి

'లౌకిక ప్రభుత్వం ఏర్పాటు కోసమే ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. ఓట్ల విభజన కారణంగా భాజపాయే అధికంగా లబ్ధి పొందుతోంది. మోదీ ప్రభుత్వం కక్షపూరిత, చిల్లర రాజకీయాలను చేస్తోంది'. –అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

దోపిడీదార్లంతా ఒక్కటయ్యారు

- కూటమిపై మోదీ ఘాటు విమర్శ

సిల్వస్సా, గాంధీనగర్, ముంబయి

ప్రతిపక్ష నాయకుల ఐక్యతా ప్రయత్నాలను ఎద్దేవా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... దోపిడీదార్లంతా కలిసి 'మహాకూటమి'ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో జరిగిన బహిరంగ సభను దృష్టిలో పెట్టుకొని ఎవరి పేరు ప్రస్తావించకుండానే ఈ విమర్శ చేశారు. శనివారం ఆయన కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా-నాగర్ హవేలీ రాజధాని సిల్వస్సాలో వైద్య కళాశాలకు



ముంబయి భారత సినిమా మ్యూజియంలో ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహం పక్కన కూర్చున్న ప్రధాని మోదీ

శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. అదే సమయంలో కోల్‌కతాలో విపక్షాల సమావేశం జరుగుతుండడంతో దానిపై విరుచుకుపడ్డారు. "నా చర్యలు కొందరికి ఆగ్రహం కలిగించాయి. ఎందుకంటే వారు ప్రజాధనాన్ని లూటీ చేయకుండా నేను అడ్డుకోవడమే కారణం. వారంతా కలిసి మహాకూటమిగా ఏర్పడ్డారు. భయంతోనే ఒకటయ్యారు. ఇది నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఏర్పడిన కూటమి కాదు. దేశ ప్రజలకు వ్యతిరేకంగా నెలకొల్పినది" అని వ్యాఖ్యానించారు. "ఆ పార్టీలన్నింటికీ ఆయా కుటుంబాల సంక్షేమమే లక్ష్యం. దేశ సంక్షేమం పట్టదు. మీ కుటుంబాల కోసం ఎన్ని కూటములనయినా పెట్టుకోండి. భయం లేదు. అయితే మీ కర్మ నుంచి తప్పించుకోలేరు. అవినీతికి వ్యతిరేకంగా నేను పోరాడడమే తప్పా? రాజకీయ దళారులను లేకుండా చేయడంతో వారు బాధపడుతున్నారు. నాపైన అందుకే కోపం. మీరు పత్రికలు, టీవీల్లో ప్రచారం పొందొచ్చేమోగానీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించలేరు. కుటుంబాల కోసం పని చేయడం మా సంస్కృతి కాదు. దేశ ప్రజలంతా మా కుటుంబమే. వారి సంక్షేమమే మా ధ్యేయం'' అని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపాకు ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్నారని, తాము న్యాయమార్గంలో నడుస్తుండడంతో తృణమూల్ కాంగ్రెస్ తమను చూసి భయపడుతోందని అన్నారు. దేశంలోని అన్ని పార్టీలను పోగుచేసి రక్షించండంటూ కేకలు వేస్తోందని వ్యాఖ్యానించారు. ఆ రాష్ట్రంలో తమ పార్టీ రథయాత్రలు నిర్వహించాలనుకుంటే అనుమతులు ఇవ్వలేదని, అలాంటి వారు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. "ఎన్నికల్లో మా పార్టీ కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఇప్పుడు వారు ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారు.



సిల్వస్సాలో వైద్య కళాశాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని

ప్రజాస్వామ్యాన్ని ఊపిరాడకుండా చేసిన వారు దాన్ని కాపాడండి అని అంటున్నారు. ప్రజలేమో నవ్వుకుంటున్నారు'' అని విమర్శించారు.

■ ఆయుధ కర్మాగార ప్రాంగణం ప్రారంభం

గుజరాత్‌లోని సూరత్‌కు 30 కి.మీ. దూరంలో ఉన్న హజీరాలో ఎల్ అండ్ టి సంస్థ ఏర్పాటు చేసిన దేశంలోని తొలి ప్రయివేటు ఆయుధ తయారీ కర్మాగారం ప్రాంగణాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు.

■ తల్లిని కలిసిన ప్రధాని

ప్రధాని మోదీ రైసన్ గ్రామానికి వెళ్లి తన తల్లి హీరాబాను కలిశారు. ఆమె ప్రస్తుతం ప్రధాని తమ్ముడు పంకజ్ మోదీ వద్ద ఉంటున్నారు. ఇతర కుటుంబ సభ్యులను కూడా కలిసి దాదాపు అరగంట సేపు ముచ్చటించారు.

■ సినిమాలు సమాజ ప్రతిబింబాలు

ముంబయిలో భారతీయ సినిమాలకు సంబంధించిన జాతీయ మ్యూజియంను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాలు, సమాజం పరస్పర ప్రతిబింబాలు లాంటివని అన్నారు. పైరసీని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని, షూటింగ్ అనుమతులు ఇచ్చేందుకు ఏకగవాక్ష విధానం తీసుకొస్తామని తెలిపారు. కొత్త ఏడాదిలో తొలి మన్ కీ బాత్ ఈ నెల 27న జరగనుంది. 1800-11-7800కు ఫోన్ చేసిగానీ, 1922కు మిస్డ్‌కాల్ ఇచ్చిగానీ, నమోయాప్ ద్వారాగానీ సలహాలు పంపించాలని ఈ సందర్భంగా ప్రధాని కోరారు.

అమెరికాలో ముదిరిన గోడవ!

వాషింగ్టన్: వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శిబిరం వినూత్న రీతిలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం అంశాన్ని ప్రధానంగా తీసుకుంది. ఈ ప్రాజెక్టుకు డెమొక్రాట్లు అంగీకరించే వరకూ స్పీకర్ నాన్సీ పెలోసీ లేదా సెనెట్ మైనార్టీ నాయకుడు చక్ షూమర్‌లకు ఇటుకల నమూనాలను పంపాలని నిర్ణయించింది. ఇందుకోసం 20.20 డాలర్ల చొప్పున విరాళం ఇవ్వాలని ట్రంప్ మద్దతుదారులను కోరింది.

ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన సరిహద్దు గోడ నిర్మాణాన్ని డెమొక్రాటిక్ పార్టీ అగ్రనేతలైన నాన్సీ, చక్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 200 మైళ్ల పొడవునా గోడను సిద్ధం చేయడానికి 570 కోట్ల డాలర్లను మంజూరు చేయాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. డెమొక్రాట్లు ఇందుకు ససేమిరా అంటున్నారు. గోడకు ప్రత్యామ్నాయంగా సాంకేతిక పరిజ్ఞానంతో సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేసేందుకు 130 కోట్ల డాలర్లు ఇస్తామంటున్నారు. ఈ నేపథ్యంలో డెమొక్రాట్లపై ఒత్తిడి పెంచేందుకు ఇటుకల వ్యూహానికి ట్రంప్ శిబిరం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఒక వెబ్‌సైట్‌ను



ప్రారంభించింది. సరిహద్దు భద్రత ఆవశ్యకతను తెలియజేసే కొన్ని వివరాలు ఈ ఇటుకల నమూనాలపై ముద్రిస్తారు.

వచ్చే నెలలో ట్రంప్-కిమ్ భేటీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌ల మధ్య రెండో భేటీ ఫిబ్రవరిలో జరగనుంది. ఆ సమావేశంలో ఉత్తర కొరియా తన అణు, క్షిపణి కార్యక్రమాలకు స్వస్తి పలకడంపై చర్చించనున్నట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇద్దరు నేతలు గత ఏడాది జూన్ 12న తొలిసారిగా సింగపూర్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే. రెండో భేటీ ఎక్కడ జరుగుతుందన్నది ఇంకా వెల్లడి కాలేదు.

ఫేస్‌బుక్‌కు భారీ జరిమానాకు అవకాశం

వాషింగ్టన్: ఒప్పంద ఉల్లంఘనలకు సంబంధించి సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్‌కు అమెరికా భారీ జరిమానా విధించే అవకాశాలున్నాయి. ఈ మేరకు ఫెడరల్ ట్రేడ్ కమిషన్ సభ్యులు సమావేశమై చర్చించారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రత ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ ఫేస్‌బుక్‌పై ఫెడరల్ ట్రేడ్ కమిషన్ దర్యాప్తు చేపట్టింది. ఈ దర్యాప్తులో తేలిన విషయాల ఆధారంగా ఫేస్‌బుక్‌కు భారీ జరిమానాకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 2012లో గూగుల్‌కు విధించిన జరిమానా కంటే ఇది ఎక్కువగా ఉండనుందని సమాచారం.

విపక్షాల కూటమి వైరుధ్యాల పుట్ట

- భాజపా నేత రూడీ విమర్శ

దిల్లీ: కోల్‌కతాలో ప్రతిపక్షాలు నిర్వహించిన 'ఐక్యతా భారత్' సమావేశం స్వార్థపూరితం, వైరుధ్యాలమయం అని భాజపా వ్యాఖ్యానించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడీ శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ "దేశ ఐక్యతకు ఎక్కడ ముప్పువాటిల్లిందో నాకు అర్థం కావడం లేదు. మమతా బెనర్జీ ఐక్య భారత్ అంటున్నారు. కానీ ఆ కూటమి నాయకులంతా విడిపోయారు. ఆ సమావేశం వైరుధ్యాలు, విభేదాలతో నిండిపోయింది. వారిది కొత్త ఫ్రంట్ అంటున్నారు. అది రెండో ఫ్రంటో, మూడో ఫ్రంటో తెలియదు. వ్యక్తిగత స్వార్థం కోసమే ఈ సభను నిర్వహించారు'' అని విమర్శించారు. విపక్షాల సమావేశానికి హాజరైన ఎంపీ శత్రుఘ్న సిన్హాపై చర్యలు తీసుకుంటామని రూడీ చెప్పారు. పార్టీ ఎంపీగా అన్ని సౌకర్యాలను అనుభవిస్తునే స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ విపక్షాలది అవకాశవాదుల కూటమి అని విమర్శించారు. మోదీని గద్దెదించాలన్న ఏకైక లక్ష్యంతో ఒకచోటకి చేరారని అన్నారు. నిజానికి ఒకరంటే మరొకరికి పడదని తెలిపారు.

పాల నాణ్యతను గుర్తించే వడపోత కాగితం

- ఐఐటీ-గువాహటి ఆవిష్కరణ

దిల్లీ: పాల నాణ్యతను గుర్తించే ఓ బయో సెన్సర్‌ను ఐఐటీ-గువాహటి పరిశోధకులు అభివృద్ధి చేశారు. పాలలో ఉండే ఆల్కలైన్ ఫాస్ఫోటేస్ (ఏఎల్‌పీ) అనే ఎంజైమ్ ఆధారంగా ఇది నాణ్యతను అంచనా వేస్తుంది. దీన్ని కొలిచే పద్ధతులు ఇప్పటికే ఉన్నప్పటికీ ఫలితం వెల్లడి కావడానికి అవి ఎక్కువ సమయం తీసుకుంటున్నాయి. ఐఐటీ-గువాహటిలో ప్రొఫెసర్ ప్రాంజల్ చంద్ర నేతృత్వంలోని ఓ బృందం ఈ సమస్యను పరిష్కరించింది. వడపోత కాగితంపై ఏఎల్‌పీ ప్రతిరక్షకాలను అతికించడం ద్వారా కొత్త బయో సెన్సర్‌ను రూపొందించింది.

66 మంది సజీవ దహనం

- మెక్సికోలో పెట్రోలు మంటలు

ట్లాహ్యూలిపన్(మెక్సికో): సెంట్రల్ మెక్సికోలో అక్రమంగా ఏర్పాటు చేసుకుని ఉన్న ఓ పెట్రోలు పైప్‌లైన్ వద్ద జరిగిన ప్రమాదంలో 66 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 76 మంది దాకా గాయపడ్డారు. శుక్రవారం జరిగిన ఈ దుర్ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మెక్సికో నగరానికి దాదాపు 105 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్లాహ్యూలిపన్‌లో దొంగచాటుగా తరలించుకునేందుకు అక్రమంగా ఏర్పాటు చేసి ఉన్న ఓ పైప్‌లైన్‌లో ఎక్కడో తలెత్తిన లోపంతో ఒక్కసారిగా అందులో నుంచి పెట్రోలు ఓ పెద్ద ఫౌంటెయిన్‌లా విరజిమ్మడం మొదలైంది. విషయాన్ని గమనించిన స్థానికులు పెద్దసంఖ్యలో అక్కడికి పరుగులు పెట్టారు. క్యాన్లు, బకెట్లతో అక్కడికి చేరుకుని ఎంతో ఆశగా వాటిల్లో పెట్రోలును నింపుకోవడం మొదలు పెట్టారు. ఇంతలో ఉన్నట్టుండి భారీ విస్ఫోటం సంభవించింది. పెట్రోలు కావడంతో క్షణాల్లో ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డాయి. కనుమూసి తెరిచేలోగా ఆ ప్రాంతమంతా ఆకాశాన్నంటుతున్న అగ్నికీలల మయమైంది. కాలిపోయి వికృతంగా తయారైన శవాలు ఎటు చూసినా చెల్లాచెదరుగా పడ్డాయి. ప్రాణభయంతో జనం గగ్గోలు పెడుతూ పరుగులెత్తారు. విపరీతంగా జరుగుతున్న పెట్రోలు చౌర్యంపై ఓ వైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్న నేపథ్యంలో దొంగచాటుగా ఏర్పాటు చేసుకుని ఉన్న ఈ పైప్‌లైన్‌లో ప్రమాదం సంభవించడం గమనార్హం.



మెక్సికోలోని ట్లాహ్యూలిపన్‌లో పైప్‌లైన్‌లో పేలుడు ఘటనలో ఎగసిపడుతున్న మంటలు

ఐఆర్‌సీటీసీ కేసులో లాలూకు బెయిలు

దిల్లీ: ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో ఆర్జేడీ అధ్యక్షుడు లాలు ప్రసాద్‌కు శనివారం దిల్లీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. రూ.లక్ష మేర వ్యక్తిగత బాండు, అంతే మొత్తానికి పూచీకత్తు సమర్పించాలని ఆయనను ఆదేశించింది. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ఆధారాలను తారుమారు చేయరాదని స్పష్టంచేసింది. ఈ కేసులో ఆయన ప్రస్తుతం తాత్కాలిక బెయిలుపై ఉన్నారు. దాణా కుంభకోణం కేసుల్లో దోషిగా తేలి, శిక్ష అనుభవిస్తున్న లాలు ప్రస్తుతం రాంచీలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో నగదు అక్రమ చలామణీ ఆరోపణలపై విడిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన కేసుపై లాలు, రబ్రీ, తేజస్వి తదితరులకు తాత్కాలిక బెయిలును ఈ నెల 28 వరకూ కోర్టు పొడిగించింది.

వాద్రా అనుచరుడికి ఊరట

దిల్లీ: యూపీయే ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా అనుచరుడైన మనోజ్ అరోరాకు నగదు అక్రమ చలామణీ కేసులో అరెస్టు నుంచి ఫిబ్రవరి 6 వరకూ రక్షణ లభించింది. ఈ మేరకు స్థానిక ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అరవింద్ కుమార్ ఉత్తర్వులిచ్చారు. దర్యాప్తునకు అరోరా సహకరిస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. న్యాయమూర్తికి తెలియజేసింది. వాదనలను వినిపించడానికి మరో రెండు వారాలు అవసరమని కోరగా, కోర్టు సమ్మతించింది. లండన్‌లో ఒక స్థిరాస్తిని కొనుగోలు చేయడానికి నగదు అక్రమ చలామణీకి పాల్పడ్డారన్నది ఈ కేసు సారాంశం. ఈ ఆస్తి వాద్రాదేనన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎన్ఎస్ఈఎల్ కుంభకోణంలో మాజీ సీఎఫ్‌వో అరెస్టు

ముంబయి: నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజీ లిమిటెడ్ (ఎన్ఎస్ఈఎల్) కుంభకోణంలో ఆ సంస్థ మాజీ సీఎఫ్‌వో శశిధర్ కొటియన్‌ను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఈ నెల 28 వరకూ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. రూ.5600 కోట్ల విలువైన ఈ కుంభకోణం 2013లో వెలుగు చేసింది.

సోమాలియాలో 73 మంది తీవ్రవాదులు హతం

మొగదిషు: సోమాలియా సైన్యం శనివారం జరిపిన దాడిలో 73 మంది అల్‌షబాబ్ తీవ్రవాదులు హతమయ్యారు. ఆఫ్రికన్ శాంతి దళాల సహకారంతో సైన్యం ఈ దాడులు చేసింది. శాంతి దళంలోని 57 మంది ఇథియోపిన్ సైనికులను కాల్చి చంపామని ఆ ఉగ్రవాద సంస్థ శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో ఈ దాడి జరిగింది.

పాక్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

లాహోర్: పాకిస్థాన్ భద్రతా దళాలు శనివారం నలుగురు ఉగ్రవాదులను హతమార్చాయి. హతుల్లో ఇద్దరు మహిళలు, స్థానిక ఐసిస్ ముఠా నాయకుడు ఉన్నారు. లాహోర్‌కు 200 కిలోమీటర్ల దూరంలోని సాహివాల్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ముష్కరులు ఒక కారు, ఒక మోటారు సైకిల్‌పై వెళుతున్నట్లు నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు టోల్ ప్లాజా వద్ద ఆ వాహనాలను అడ్డగించేందుకు ఉగ్రవాద నిరోధక విభాగం ప్రయత్నించింది. అయితే ఉగ్రవాదులు కాల్పులకు దిగారని అధికారులు తెలిపారు. భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో నలుగురు హతమయ్యారని చెప్పారు. ఇరుపక్షాల మధ్య చిక్కుకొని ఒక చిన్నారికి కూడా గాయాలయ్యాయని తెలిపారు. చనిపోయిన ఉగ్రవాదులకు ఒక అమెరికన్‌ను, పాకిస్థాన్ సైనిక ఉన్నతాధికారిని, మాజీ ప్రధాని యూసఫ్ రజా గిలానీ కుమారుడిని కిడ్నాప్ చేయడంలో ప్రమేయం ఉందని చెప్పారు.

ఎన్‌డీయే వాదన బోగస్: చిదంబరం

దిల్లీ: ఎన్‌డీయే సర్కారు హయాంలో దేశం అత్యధిక స్థాయిలో ఆర్థిక వృద్ధి రేటును సాధించిందన్న భాజపా వాదనను కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం తప్పుపట్టారు. నీతి ఆయోగ్ ఇచ్చిన 'తప్పుడు వివరాల' ఆధారంగా ఈ వాదన చేస్తున్నారని ఆరోపించారు. దీన్ని దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, గణాంక నిపుణులు తప్పుపట్టారని ట్విటర్‌లో పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక 2004-09లో యూపీయే-1 హయాంలోనే అత్యుత్తమ వృద్ధి చోటుచేసుకుందని చెప్పారు. కాంగ్రెస్‌కు చెందిన మరో సీనియర్ నేత అహ్మద్ పటేల్ కూడా ఎన్‌డీయే సర్కారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను తప్పుపట్టారు. గత నాలుగున్నరేళ్లలో భారత అప్పు 50 శాతం మేర పెరిగి, రూ.82 లక్షల కోట్లకు చేరిందన్నారు.

1 నుంచి ఉద్యోగ ప్రకటనల్లో కోటా

- 10%పై కేంద్రం ఉత్తర్వులు

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, సర్వీసుల భర్తీకి ఫిబ్రవరి 1 నుంచి జారీచేసే నోటిఫికేషన్లన్నింటికీ 10% పేదల కోటా వర్తింపజేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఉండాల్సిన ఆదాయ, ఆస్తుల పరిమితుల గురించి అందులో స్పష్టంచేసింది. 103వ రాజ్యాంగ సవరణ చట్టంలోని ఆర్టికల్ 15(6), 16(6) ప్రకారం కేంద్ర ప్రభుత్వంలోని సివిల్ పోస్టులు, సర్వీసులు, విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల కిందికి రాని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్న వారిని ఈడబ్ల్యూఎస్ లబ్ధిదారులుగా గుర్తించి ఈ రిజర్వేషన్ ఫలాలు వర్తింపజేయనున్నట్లు తెలిపింది. రిజర్వేషన్ ఫలాలు పొందాలనుకొనే వ్యక్తితోపాటు, అతను/ఆమె తల్లిదండ్రులు, 18 ఏళ్లలోపు తోబుట్టువులు, అతను/ఆమె జీవిత భాగస్వామి, వారి 18 ఏళ్లలోపు పిల్లలను కుటుంబంగా పరిగణించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీతం, వ్యవసాయం, వ్యాపారం, వృత్తి తదితర మార్గాల నుంచి వచ్చే ఆదాయాన్నంతా వార్షిక ఆదాయంగా పరిగణించనున్నట్లు స్పష్టంచేశారు. ఉద్యోగానికి దరఖాస్తు చేసే ముందు సంవత్సర ఆదాయాన్ని ఇందుకోసం పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపారు.

- 5 ఎకరాలు, అంతకు మించి వ్యవసాయ భూమి.. వెయ్యి చదరపు అడుగులు, అంతకు మించిన నివాసగృహం.. నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతంలో 100 చ.గజాలు, అంతకుమించిన నివాస స్థలం.. మున్సిపల్‌యేతర ప్రాంతాల్లో 200 చ.గజాలు, అంతకుమించి నివాస స్థలాలు ఉన్న కుటుంబాలకు ఈ రిజర్వేషన్లను వర్తింపజేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ కుటుంబాల ఆదాయం ఎంతున్నా పైన పేర్కొన్న ఆస్తి ఉంటే మాత్రం ఈడబ్ల్యూఎస్ కింద పరిగణించకూడదని స్పష్టంచేశారు.
- కుటుంబ ఆదాయం, ఆస్తుల గురించి తహసీల్దార్‌కు తక్కువకాని అధికారి ధ్రువీకరణ పత్రం జారీచేయాలని నిర్దేశించారు.
- సంబంధిత రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలు నిర్దేశించిన దస్తావేజులను పరిశీలించిన తర్వాతే అధికారులు సదరు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని స్పష్టంచేశారు.
- ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను డీఓపీటీ, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖలు జారీచేస్తాయని పేర్కొన్నారు.
- కేంద్ర ప్రభుత్వ పోస్టులు, సర్వీసుల్లో ఫిబ్రవరి 1 నుంచి నోటిఫై చేసే అన్ని పోస్టులకూ దీన్ని వర్తింపజేయనున్నట్లు స్పష్టంచేశారు.
- రోస్టర్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు విధాన ప్రక్రియ గురించి ప్రత్యేకంగా మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ముదిమి మీదపడుతోంది!

- తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధికం
- దేశంలో 27 కోట్ల మంది వయోధికులు
- 2050 నాటికి అంచనాలు

ఈనాడు, దిల్లీ: భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాల్లో వృద్ధాప్య జనాభా రేటు పెరగనుంది. రెండు రాష్ట్రాల్లోనూ 'ఒకరు లేదా ఇద్దరు' అన్నట్లు ప్రజలంతా కుటుంబ నియంత్రణ సూత్రాన్ని అనుసరిస్తుండటంతో జనాభా వృద్ధి రేటు తగ్గి వయోధికుల సంఖ్య పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈమేరకు భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఆధ్వర్యంలోని ఆర్థిక పరిశోధన విభాగం తాజాగా నివేదిక రూపొందించింది. 2050 నాటికి తెలుగు రాష్ట్రాల్లో 30.1% మంది వృద్ధులు ఉండబోతున్నట్లు అంచనా వేసింది. 2001, 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఎస్‌బీఐ ఈ విశ్లేషణ జరిపింది. కుటుంబ నియంత్రణ విధానాలు పక్కాగా అమలవుతున్న దక్షిణాది రాష్ట్రాలన్నింటా భవిష్యత్తులో వయోధికుల శాతం ఎక్కువగా ఉండనుంది. దేశాల పరంగా చూస్తే మాత్రం అమెరికా, చైనాల కంటే భారత్‌లోనే అప్పటికి యువకులు అధికంగా ఉంటారు. భారత్‌లో 2011 నాటికి 5.5% ఉన్న వయోధికుల జనాభా దాదాపు 3 రెట్లు పెరగనుంది. స్థూలంగా చూస్తే దీనివల్ల పెద్ద సమస్యలేమీ తలెత్తే అవకాశం లేకున్నా.. రాష్ట్రాల వారీగాను, దేశంలోని అంతర్గత పరిస్థితులను చూస్తే మాత్రం కొంత సంక్లిష్టంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా భవిష్యత్తులో ఎదురయ్యే జనాభా సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి గాను ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ప్రోత్సాహం ప్రారంభించింది. అయితే తగ్గిపోతున్న సంతానోత్పత్తి రేటును పెంచడం అంత సులభమేమీ కాదని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది.



- 2050 నాటికి భారత జనాభా 178 కోట్లకు చేరుతుంది. అందులో 27 కోట్ల మంది 65 ఏళ్లకు పైబడిన వారుంటారు.

సంక్లిష్టతలు

- యువ, వయోధిక జనాభా మధ్య అంతరాలు పెరగడం వల్ల సంపద పంపిణీలో అసమానతలు అధికం కానున్నాయి.
- దక్షిణాదిలో పనిచేసేవారు తగ్గిపోవడం వల్ల ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల నుంచి కార్మికుల వలస పెరిగే అవకాశం ఉంటుంది. ఫలితంగా దక్షిణాది మౌలిక వసతుల పరంగా ఒత్తిడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అది సామాజికంగా, భౌతికంగానూ ఉంటుంది.
- వయోధికులు పెరిగే కొద్దీ దక్షిణాది రాష్ట్రాల్లో పొదుపు తగ్గిపోతుంది. అంతా పింఛన్ల మీద ఆధారపడే పరిస్థితి వస్తుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. ఇది ఆయా రాష్ట్రాల జీఎస్‌డీపీపై ప్రభావం చూపుతుంది. అందువల్ల భవిష్యత్తులో భారతీయ బ్యాంకులన్నీ కొత్త లైఫ్‌సైకిల్ ఆధారిత డిపాజిట్ స్కీమ్‌లను వినియోగదారులకు అందుబాటులోకి తేవాల్సి ఉంటుంది.
- యువత ఎక్కువగా ఉండే రాష్ట్రాల్లో కార్మికుల అవసరం ఎక్కువగా ఉండే పరిశ్రమలను ఏర్పాటుచేసి పని కల్పించాల్సి ఉంటుంది.

50 ఏళ్లలో వయోధికుల పెరుగుదల

సంవత్సరం	భారత్	తెలుగు రాష్ట్రాలు
2001	4.8%	4.5%
2011	5.5%	6.0%
2020	6.6%	8.3%
2030	8.2%	12.1%
2040	10.9%	18.6%
2050	15.2%	30.1%

- దేశ సగటు వృద్ధుల శాతం భారత్‌లో 15.2, చైనాలో 32.6, అమెరికాలో 23.2గా ఉండనుంది.
- భారత్‌లో హరియాణా యువరాష్ట్రంగా నిలవనుండగా.. తెలుగు రాష్ట్రాల్లో వయోధికుల శాతం ఎక్కువగా ఉంటుంది.

శబరిమలలో మహిళలను తిప్పి పంపిన పోలీసులు

శబరిమల: అయ్యప్ప దర్శనార్థం శనివారం వచ్చిన ఇద్దరు 30 ఏళ్ల వయసు ఉన్న మహిళలను పోలీసులు తిప్పిపంపించారు. భక్తులు నిరసన తెలిపే ప్రమాదం ఉందని, తాము రక్షణ కల్పించలేమని చెప్పి వెనక్కి పంపించారు. కన్నూరుకు చెందిన రేష్మా నిషాంత్, షనీలా సాజేష్‌లు ఫేస్‌బుక్ గ్రూపునకు చెందిన మరో ఆరుగురు మహిళలతో కలిసి ఉదయం అయిదు గంటలకే నీలక్కల్ చేరుకున్నారు. తాము 41 రోజు దీక్ష తీసుకున్నామని, దర్శనానికి అవకాశం కల్పించాలని పోలీసులను కోరారు. శనివారం రాత్రి 9.50 గంటలకు ఆలయాన్ని మూసివేయనుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చారని, అందువల్ల భద్రత కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాదని చెప్పారు. దాంతో వారిద్దరితో పాటు, తోడ్పుగా వచ్చిన ఇతర మహిళలు కూడా వెనుదిరిగారు. కాగా మండల మకరవిలక్కు సందర్భంగా 10-50 ఏళ్ల వయసు ఉన్న 51 మంది మహిళలు ఆలయాన్ని సందర్శించారంటూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన సమాచారం విషయమై తమ వద్ద ఆధారాలు లేవని ట్రావంకోర్ దేవస్థానం బోర్డు సభ్యుడు కె.పి.శంకర్‌దాస్ తెలిపారు. శబరిమల వివాదం సందర్భంగా జరిగిన ఆందోళనలో 67,094 మందిపై కేసులు నమోదు చేసినట్టు కేరళ పోలీసులు సుప్రీంకోర్టుకు తెలిపారు.

సొగసిరి పుంజులివీ

చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో కోడి పుంజుల అందాల పోటీ జరిగింది. దీనిలో చిట్టి, పొట్టి దుస్తులు ధరించిన కోళ్లు ర్యాంప్‌పై బుడిబుడి అడుగులు వేస్తూ అందరి దృష్టినీ ఆకర్షించాయి.





ఆరాధ్య ఆటగాడితో కాసేపు...

ఛాంపియన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో మధుర విజయాలు అందుకున్న కెప్టెన్ విరాట్ కోహ్లి.. మరో తీపి జ్ఞాపకంతో పర్యటనను ముగించాడు. ఆస్ట్రేలియాలో తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్ సాధించిన ఆనందంలో ఉన్న అతడు శుక్రవారం తన ఆరాధ్య ఆటగాడు రోజర్ ఫెదరర్‌ను కలుసుకున్నాడు. మెల్‌బోర్న్‌లో భార్య అనుష్క శర్మతో కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు వెళ్లిన కోహ్లి.. నొవాక్ జకోవిచ్, సెరెనా మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించాడు. ఫెదరర్‌ను ప్రత్యేకంగా కలుసుకున్నాడు. అతడితో కలిసి తీసుకున్న ఫొటోను ట్విటర్‌లో పంచుకుని.. ఆస్ట్రేలియా వేసవి అద్భుతంగా ముగిసిందన్న సందేశాన్ని ఉంచాడు. ఒక్క ఫొటోలో ముగ్గురు దిగ్గజాలు అంటూ ఆ ఫొటోను ఆస్ట్రేలియన్ ఓపెన్ కూడా ట్వీట్ చేయడం విశేషం. సచిన్‌లానే కోహ్లి కూడా ఫెదరర్ అభిమాని అన్న సంగతి తెలిసిందే. 2015లో ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా ఫెదరర్‌ను కలిసినప్పుడు. "ఈ క్షణాన్ని ఎప్పటికీ మరిచిపోలేను" అని తన ఆనందాన్ని పంచుకున్నాడు కోహ్లి.

సైనా కథ ముగిసె..



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్‌లో భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. సెమీఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ కరోలినా మారిన్ చేతిలో ఓడింది. శనివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సైనా 16-21, 13-21తో నాలుగో సీడ్ మారిన్ (స్పెయిన్) చేతిలో పరాజయంపాలైంది. మ్యాచ్‌లో సైనా శుభారంభం చేసింది. 5-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఐతే ఆ తర్వాత దూకుడంతా మారిన్‌దే. వరుసగా 7 పాయింట్లు నెగ్గిన కరోలినా 11-9 ఆధిక్యంతో విరామానికి వెళ్లింది. సైనా 14-14తో స్కోరు సమం చేసింది. ఐతే పట్టువదలని మారిన్ ఆ తర్వాత వరుసగా పాయింట్లు గెలిచి గేమ్‌ను ముగించింది. రెండో గేమ్‌లో ఆమె ఆధిపత్యం ముందు సైనా తేలిపోయింది. సైనా ఓటమితో టోర్నీలో భారత కథ ముగిసింది.

ఫెదరర్ అయితే ఏంటీ?

మెల్‌బోర్న్: రోజర్ ఫెదరర్.. ఈ పేరు తెలియని టెన్నిస్ అభిమానులు ఉండరు. ప్రపంచంలో అత్యంత గుర్తింపు పొందిన క్రీడాకారుల్లో ఫెదరర్ ఒకడు. అంతటి ప్రముఖ ఆటగాడిని కూడా గుర్తింపు కార్డు చూపించమని ఆపేశాడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భద్రతా అధికారి. నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డు చూపించిన తర్వాతే అనుమతించాడు. శనివారం మెల్‌బోర్న్‌లో సాధన చేసేందుకు వచ్చిన ఫెదరర్ లాకర్ గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే అక్కడ ఉన్న భద్రతా అధికారి గుర్తింపు కార్డు చూపించమని కోరాడు. ఆ సమయంలో రోజర్ కార్డు.. వెనుక వస్తున్న సహాయక బృందం దగ్గర ఉంది. దీంతో వారు వచ్చే వరకు ఫెదరర్ అక్కడే నిలబడి అధికారికి సహకరించాడు. తన బృందం వచ్చిన తరువాత గుర్తింపు కార్డు చూపించి లోనికి ప్రవేశించాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం అంతర్జాలంలో చక్కర్లు కొడుతోంది. టోర్నీ నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డును ప్రతి ఒక్కరూ వెంట ఉంచుకోవాల్సిందే.





వాళ్లను ఆడనివ్వండి..

దిల్లీ: టీమ్‌ఇండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై సస్పెన్షన్‌ను తొలగించి వారికి మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించాలని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా పాలకుల కమిటీ (సీవోఏ)కి విజ్ఞప్తి చేశాడు. "ఆటగాళ్లిద్దరు తప్పు చేశారు. అందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు కూడా. సస్పెండైన వారిద్దరూ ఇప్పటికే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు దూరమయ్యారు. విచారణ పూర్తయ్యే వరకు వారిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసి న్యూజిలాండ్‌తో సిరీస్‌కు వెంటనే అందుబాటులో ఉండేలా చూడాలి" అని సీవోఏకు రాసిన లేఖలో ఖన్నా కోరాడు. ఐతే సుప్రీంకోర్టు నియమించే అంబుడ్స్‌మన్ పాండ్య, రాహుల్‌లపై నిర్ణయం తీసుకోవాలని సీవోఏ భావిస్తోంది. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం.. సర్వసభ్య సమావేశంలో అంబుడ్స్‌మన్‌ను నియమించే అధికారం బోర్డుకు ఉంది. ఈ నేపథ్యంలో వెంటనే ఎస్జీఎం నిర్వహించాలని 14 రాష్ట్ర సంఘాలు బోర్డు అధ్యక్షుడికి లేఖ రాశాయి. అయితే అంబుడ్స్‌మన్ నియామకానికి సంబంధించిన వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున ఎస్జీఎం నిర్వహించడం సరికాదని ఖన్నా చెప్పాడు.



రష్మిక, హుమేరా జోడీకి రజతం

ఖేలో ఇండియా యూత్ క్రీడలు

పుణె: ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో తెలంగాణ టెన్నిస్ క్రీడాకారిణులు శ్రీవల్లి రష్మిక, షేక్ హుమేరా సత్తాచాటారు. అండర్-21 మహిళల డబుల్స్‌లో పోటీపడ్డ రష్మిక-హుమేరా జోడీ రజతం సాధించింది. శనివారం ఫైనల్లో రష్మిక- హుమేరా జంట 3-6, 2-6 తేడాతో జీల్ దేశాయ్- వైదేహి చౌదరీ (గుజరాత్) ద్వయం చేతిలో ఓడింది.

ఫైనల్లో ధీరజ్: ఖేలో ఇండియా క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ క్రీడాకారుడు ధీరజ్ మెరిశాడు. అండర్-21 పురుషుల రికర్వ్ విభాగంలో ఫైనల్లో అడుగుపెట్టాడు. అండర్-17 బాలుర కాంపౌండ్ విభాగంలో వెంకటాద్రి క్వార్టర్స్ చేరాడు.

అక్కను ఓడించి చెల్లితో సై

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టాప్ సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా) ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మూడో రౌండ్లో వీనస్ విలియమ్స్‌ను ఓడించిన ఆమె వీనస్ చెల్లి సెరెనాను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. టైటిల్‌పై గురిపెట్టిన సెరెనా విలియమ్స్ కూడా మరో అడుగు ముందుకేసింది. పురుషుల సింగిల్స్‌లో ఫేవరెట్ జకోవిచ్, జర్మనీ కుర్రాడు జ్వెరెవ్ ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్

- వీనస్‌పై గెలిచిన హలెప్
- ప్రిక్వార్టర్స్‌లో సెరెనాతో ఢీ
- జకోవిచ్, జ్వెరెవ్ ముందంజ



హలెప్

మెల్‌బోర్న్



సెరెనా

ఆస్ట్రేలియన్ ఓపెన్లో సిమోనా హలెప్ జోరు మీదుంది. ఆమె పెద్దగా కష్టపడకుండానే ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించింది. శనివారం జరిగిన సింగిల్స్ మూడో రౌండ్లో హలెప్ 6-2, 6-3తో అమెరికా స్టార్ వీనస్ విలియమ్స్‌ను వరుస సెట్లలో ఓడించింది. ప్రిక్వార్టర్స్‌లో హలెప్.. వీనస్ చెల్లి సెరెనాతో పోటీకి సిద్ధమైంది. మరో మ్యాచ్‌లో సెరెనా 6-2, 6-1తో యాస్‌ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్)ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో 20 విన్నర్లు కొట్టిన ఈ అమెరికా తార.. ఎనిమిది ఏస్‌లు సంధించింది. స్పెయిన్ స్టార్ ముగురుజ కూడా ముందంజ వేసింది. ఆమె 7-6 (7-5), 6-2తో బసిన్‌స్కి (స్విట్జర్లాండ్)పై గెలిచింది. ఒసాకా (జపాన్), స్వితొలినా (ఉక్రెయిన్), ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్), మాడిసన్ కీస్ (అమెరికా), సెవత్సొవా (లాత్వియా) కూడా ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు.

చెమటోడ్చిన జకో: పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్ ప్రిక్వార్టర్స్ చేరాడు. మూడో రౌండ్లో అతను 6-3, 6-4, 4-6, 6-0తో కెనడా టీనేజర్ షపలోవ్‌పై కాస్త కష్టపడి గెలిచాడు. తొలి రెండు సెట్లను నెగ్గి జోరు మీద కనిపించిన జకో.. మూడో సెట్‌ను అనూహ్యంగా చేజార్చుకున్నాడు. అయితే అద్భుతంగా పుంజుకున్న ఈ సెర్బియా యోధుడు నాలుగో సెట్లో ప్రత్యర్థికి ఒక్క గేమ్ ఇవ్వకుండా 6-0తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. నిషికోరి (జపాన్), జ్వెరెవ్ (జర్మనీ) ముందంజ వేశారు. నిషికోరి 7-6 (8-6), 6-1, 6-2తో సౌసా (పోర్చుగల్)ను ఓడించగా.. జ్వెరెవ్ 6-3, 6-3, 6-2తో బోల్ట్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. గోఫిన్ (బెల్జియం), రోనిచ్ (కెనడా), కరెనొ బస్టా (స్పెయిన్), కొరిచ్ (చెక్ రిపబ్లిక్) కూడా ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు.


పేస్ శుభారంభం



మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత వెటరన్ స్టార్ లియాండర్ పేస్ శుభారంభం చేశాడు. సమంత స్టోసర్ (ఆస్ట్రేలియా)తో కలిసి అతను తొలి రౌండ్లో 6-4, 7-5తో పెస్కె (చెక్ రిపబ్లిక్)-కూల్‌హోఫ్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు. మరో భారత ఆటగాడు రోహన్ బోపన్న తొలి రౌండ్లోనే ఓడిపోయాడు. బోపన్న-యంగ్ (చైనా) ద్వయం 6-3, 3-6, 6-10తో గ్రొయిన్‌ఫీల్డ్ (జర్మనీ)-ఫరా (కొలంబియా) జోడీ చేతిలో పరాజయం చవిచూసింది.

ఒక్క ఫార్మాట్ కాదు.. క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో టీమ్‌ఇండియాది విజయగాథే.. మూడేళ్లుగా టెస్టుల్లో అగ్రస్థానం మనదే.. వన్డే, టీ20ల్లో నంబర్‌వన్ ర్యాంకుకు కావాల్సింది ఇంకొక్క అడుగే..! అంతేనా.. 71 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ కైవసం చేసకుంది. ద్వైపాక్షిక వన్డే సిరీస్ సాధించి చరిత్ర సృష్టించింది.. కంగారూల స్థావరంలో ఆసీస్‌పై సంపూర్ణ ఆధిపత్యం కనబరిచిన ఏకైక జట్టు కోహ్లి సారథ్యంలోని టీమ్‌ఇండియానే..! అద్వితీయ ప్రదర్శనతో కొత్త చరిత్ర సృష్టిస్తున్న టీమ్‌ఇండియాలో మన తెలుగువాడు సీనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్‌ది ముఖ్యభూమిక. సంచలన నిర్ణయాలు, సాహసోపేత చర్యలతో టీమ్‌ఇండియా ఎంపికలో తనదైన ముద్ర వేసిన ఎమ్మెస్కేతో ముఖాముఖి 'ఈనాడు'కు ప్రత్యేకం.

వారి ఘనతలో వాల్..



ఈనాడుకు ప్రత్యేకం

ఈనాడు, హైదరాబాద్

దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లలో వైఫల్యాల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టీమ్‌ఇండియా టెస్టు సిరీస్ గెలుస్తుందని ఊహించారా?

ఆసీస్ గడ్డపై టీమ్‌ఇండియా టెస్టు సిరీస్ గెలవడం ఆనందంగా.. గర్వంగా ఉంది. ఈ విజయం చారిత్రాత్మకం. భారత క్రికెట్లో ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన ఘనత అది. నాతో పాటు సెలెక్షన్ కమిటీకి ఎంతో సంతృప్తినిచ్చిన సందర్భం. ఈ సిరీస్ వెనకాల ఎంతో సన్నాహం, ప్రణాళిక, శ్రమ దాగున్నాయి. దక్షిణాఫ్రికాలో 2-1తో ఓడిపోయాం. ఇంగ్లాండ్‌లో సిరీస్ 3-1తో చేజారింది. ఈ సిరీస్‌ల్లో గెలిచే అవకాశాలు వచ్చినా.. వాటిని విజయాలుగా మలుచుకోలేకపోయాం. రెండు సిరీస్‌లలో పాఠాలు నేర్చుకున్నాం. ఆ పాఠాల్ని ఆసీస్‌లో ఆచరణలో పెట్టి విజయం సాధించాం.

టెస్టు సిరీస్ విజయంలో ఎవరి పాత్ర ఎంత?

ఈ ఘనత ఏ ఒక్కరిదో కాదు.. సమష్టి కృషితోనే విజయం సాధ్యమైంది. పేసర్లు షమి, బుమ్రా, ఇషాంత్‌లు గొప్పగా రాణించారు. బ్యాటింగ్‌లో పుజారా అదరగొట్టాడు. కెప్టెన్ కోహ్లి, రిషబ్ పంత్, రహానె రాణించారు. హనుమ విహారి పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడకపోయినా జట్టుకు ఉపయోగపడ్డాడు. ఓపెనర్‌గా బరిలో దిగి ఆకట్టుకున్నాడు. మయాంక్ అగర్వాల్ మెరిశాడు. దురదృష్టవశాత్తు పృథ్వీ షా సేవలు కోల్పోయాం. ఓ ప్రణాళిక ప్రకారం కుర్రాళ్లను టీమ్‌ఇండియాకు తీసుకొచ్చాం. సీనియర్స్, జూనియర్స్‌తో మంచి జట్టును తయారు చేశాం. దేశవాళీ క్రికెట్లో సత్తాచాటుతున్న ఆటగాళ్లను ఇండియా-ఎకు ఎంపిక చేసి కోచ్ రాహుల్ ద్రవిడ్ చేతిలో పెట్టాం. యువ ఆటగాళ్లను అతడు అద్భుతంగా సానబెట్టాడు. ఆసీస్‌లో విజయానికి ద్రవిడ్ కూడా కారణమే.

ఆసీస్ పర్యటనలో సంతృప్తినిచ్చిన విషయం?

కచ్చితంగా టీమ్‌ఇండియా బౌలర్ల ప్రదర్శనే. మొదట్నుంచి బ్యాటింగ్‌పై ఆధారపడిన జట్టు మనది. దక్షిణాఫ్రికా వెళ్తే డొనాల్డ్, స్టెయిన్.. ఆస్ట్రేలియాలో మెక్‌గ్రాత్, బ్రెట్‌లీల ఇలా పేసర్ల గొప్పలు వింటుంటాం. ఇప్పుడు ప్రపంచమంతా మన పేసర్ల గురించి గొప్పగా మాట్లాడుకుంటోంది. బుమ్రాను దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపిక చేసినప్పుడు మా నిర్ణయాన్ని చాలామంది వ్యతిరేకించారు. తెల్ల బంతి ఆటగాడు.. అతడికి గాయాలు ఎక్కువ అవుతాయి అంటూ విమర్శించారు. అయినా బుమ్రాకు మద్దతుగా నిలిచాం. ఇప్పుడు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అతడు అగ్రస్థానం దిశగా దూసుకొస్తున్నాడు.

టెస్టుల్లో పుజారా బ్యాటింగ్‌పై మీరేమంటారు..?

ఆధునిక క్రికెట్‌ను అతడిలా ప్రశాంతంగా ఆడే మరొకరు కనిపించరు. అతడు క్రీజులో అడుగుపెట్టగానే ఒక యంత్రంలా మారిపోతాడు. ప్రశాంతంగా తనపని తాను చేసుకుపోతాడు. దేశవాళీ క్రికెట్లో గంటలకొద్ది సమయం గడపడం పుజారాకు కలిసొచ్చింది. టెస్టు క్రికెట్లో అత్యుత్తమ క్రికెటర్లలో ఒకడిగా పుజారాను పరిగణించొచ్చు. టెస్టు క్రికెట్లో చివరి దశ సంప్రదాయ బ్యాట్స్‌మెన్‌లో ఒకడిగా చెప్పుకోవచ్చు.. అతడి నుంచి ఎంతోమంది స్ఫూర్తి పొందుతారనడంలో సందేహం లేదు. విహారి కూడా చక్కగా ఆడాడు. అనుభవం లేకపోయినా ఓపెనర్‌గా వెళ్లి రాణించాడు. బౌలింగ్ కూడా చేశాడు. అతడికి మంచి భవిష్యత్తు ఉంది. రాబోయే కాలంలో ఇంకా అవకాశాలు వస్తాయి.

చీఫ్ సెలెక్టర్ పదవికి న్యాయం చేశారనిపిస్తోందా?

బీసీసీఐ పెద్దలు మాకు బాధ్యతలు అప్పగించినప్పుడు చాలామంది హేళన చేశారు. అనుభవం లేదన్నారు. తేలిగ్గా తీసుకున్నారు. టెస్టుల్లో నంబర్‌వన్, టూ స్థానాల్లో ఉన్న బౌలర్లను పరిమిత ఓవర్ల క్రికెట్ నుంచి తప్పించి చాహల్, కుల్‌దీప్‌లను తీసుకొచ్చినందుకు పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొన్నాం. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వన్డేలు, టీ20ల్లో టీమ్‌ఇండియా విజయాల్లో 70 శాతం విజయాలు చాహల్, కుల్‌దీప్‌లు అందించినవే. టెస్టుల్లో స్టార్ బౌలర్లుగా ఉన్నవాళ్లను తీసేయడం మా ఉద్దేశం కాదు. స్పిన్ విభాగం మరింత పటిష్ఠం కావాలన్నదే మా తపన. మా నిర్ణయం సరైందేనని ఇప్పుడు అందరూ అంటున్నారు. మా హయాంలో ఎంతోమంది యువ ఆటగాళ్లను పరిచయం చేశాం. పృథ్వీ షా అందులో ఒకడు. కొంత ఆలస్యమైనా మయాంక్ అగర్వాల్ కూడా వచ్చేశాడు. టీమ్‌ఇండియాలో ఉన్న ఖాళీలను బట్టి యువ ఆటగాళ్లను సన్నద్ధం చేస్తున్నాం. ఇప్పటి వరకు ఒక్కరి ఎంపికలోనూ పక్షపాతం కనబరచలేదు.

అదే జట్టు ప్రపంచకప్‌కు..

ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ విజయం టీమ్‌ఇండియాకు గొప్ప ఉత్ప్రేరకంగా పని చేస్తుంది.. ప్రపంచ కప్‌కు ముందు మరో 10 వన్డేలే ఉన్నాయి. ఈ సిరీస్‌లో ప్రయోగాలు చేశాం. రాబోయే న్యూజిలాండ్ సిరీస్‌లోనూ ప్రయోగాలు కొనసాగుతాయి. భారత్‌లో ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో ప్రపంచ కప్ జట్టును బరిలో దించుతాం.

రికార్డు ఛేదనతో రంజీ సెమీస్‌లో సౌరాష్ట్ర

లఖ్‌నవూ: రంజీ ట్రోఫీలో మిగిలిన రెండు సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఇప్పటికే కేరళ..కర్ణాటక తమ స్థానాలను ఖరారు చేసుకోగా.. శనివారం సౌరాష్ట్ర, విదర్భలు కూడా తుది నాలుగులో చోటు సంపాదించాయి. ఉత్తరప్రదేశ్‌తో క్వార్టర్స్ మ్యాచ్‌లో 372 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో సౌరాష్ట్ర సంచలన విజయం నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 195/2తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్రను హర్విక్ దేశాయ్ (116; 259 బంతుల్లో 16×4) సెంచరీతో నడిపించాడు. అతను ఔటైనా.. స్టార్ ఆటగాడు చెతేశ్వర్ పుజారా (67 నాటౌట్; 110 బంతుల్లో 9×4), జాక్సన్ (73 నాటౌట్; 109 బంతుల్లో 11×4, 1×6) అజేయ అర్ధసెంచరీలు సాధించడంతో సౌరాష్ట్ర నాలుగే వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రంజీల్లో ఇదే అత్యధిక ఛేదన. 2008-09 సీజన్లో సర్వీసెస్‌పై అసోం సాధించిన ఛేదన రికార్డును (371) సౌరాష్ట్ర తుడిచి పెట్టింది. యూపీ తొలి ఇన్నింగ్స్‌లో 385 పరుగులు చేయగా.. సౌరాష్ట్ర 208కి ఆలౌటైంది. యూపీ రెండో ఇన్నింగ్స్‌లో 194 పరుగులే చేయగలిగింది. మరోవైపు ఉత్తరాఖండ్‌ను ఓడించి విదర్భ సెమీస్ చేరింది. ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో విదర్భ విజయం సాధించింది.

సెమీఫైనల్స్ (జనవరి 24 నుంచి)

కేరళ × విదర్భ

కర్ణాటక × సౌరాష్ట్ర



సౌరాష్ట్ర జట్టు విజయానందం

తొలి వన్డే పాక్‌దే

పోర్ట్ ఎలిజిబెత్: దక్షిణాఫ్రికాతో ఐదు వన్డేల సిరీస్‌లో పాకిస్థాన్ బోణీ కొట్టింది. శనివారం తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆమ్లా (108 నాటౌట్) సెంచరీ సాధించడంతో మొదట దక్షిణాఫ్రికా 2 వికెట్లకు 266 పరుగులు చేసింది. డుసెన్ (93) కొద్దిలో సెంచరీ కోల్పోయాడు. ఇమాముల్ హక్ (86), హఫీజ్ (71 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించడంతో పాక్ 49.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

యార్కర్ వేయాలంటే బుమ్రానే



దిల్లీ: ప్రస్తుత ప్రపంచ క్రికెట్లో అత్యంత ప్రభావవంతంగా యార్కర్లు వేసే నైపుణ్యం టీమ్‌ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు మాత్రమే ఉందని పాకిస్థాన్ బౌలింగ్ దిగ్గజం వసీం అక్రమ్ అంటున్నాడు. "ప్రస్తుతం బౌలర్లందరి కంటే అత్యుత్తమంగా యార్కర్లు వేసే సత్తా బుమ్రాకు మాత్రమే ఉంది. మిగతా బౌలర్ల కంటే అతని బౌలింగ్ శైలి విభిన్నంగా ఉన్నప్పటికీ బుమ్రా స్వింగ్ రాబడుతున్నాడు. పేస్‌తో బ్యాట్స్‌మన్లను తిప్పలు పెడుతున్నాడు. కానీ అతణ్ని ప్రత్యేకంగా నిలిపేది యార్కర్ మాత్రమే. వన్డేల్లోనే కాదు అతను టెస్టుల్లోనూ ఆ తరహా బంతులను విజయవంతంగా వేస్తున్నాడు. అప్పట్లో నేను, వకార్ యూనిస్ అలా చేసేవాళ్లం" అని వసీం తెలిపాడు. పాకిస్థాన్ నుంచి తనలాంటి బౌలర్ వచ్చినా.. భారత్ నుంచి బుమ్రా లాంటి పేసర్ వచ్చినా కూడా దానికి కారణం టెన్నిస్ బాల్ క్రికెట్ అని అక్రమ్ పేర్కొన్నాడు.

ఓటు జాగారం



- రేపే 3,701 పంచాయతీలకు పోలింగ్
- ఆదివారం భారీగా దావత్‌లు ఇస్తున్న అభ్యర్థులు
- అర్ధరాత్రి నగదు, మద్యం పంపిణీకి గుట్టుగా ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్: 'ఓటుకు మూడంకెల నోటు, అవసరమైతే నాలుగు అంకెల నోటైనా ఫరవాలేదు. విజయమే మన లక్ష్యం. పంచాయతీ పదవి దక్కించుకొంటేనే మనకు ప్రతిష్ఠ' అని పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు భావిస్తున్నారు. తొలివిడత ఎన్నికలకు ఒక్క రోజే సమయం ఉండడంతో ప్రలోభాల ప్రక్రియను వేగవంతం చేశారు. ఓటర్లకు మద్యం, నగదు పంపిణీకి ఆదివారం రాత్రంతా జాగారానికి సిద్ధమవుతున్నారు. రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కూడా ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు. తమను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తామంటూ కొన్నిచోట్ల ఏకగ్రీవాలు చేసుకున్నారు. మరికొన్నిచోట్ల ఆ సొమ్మును కుల, గ్రామ కమిటీలకు సంతర్పణలు చేస్తున్నారు. రాష్ట్రంలో తొలి విడతలో 3,701 పంచాయతీల్లో సోమవారం పోలింగ్ నిర్వహించనున్నారు. 12,202 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. 28,976 వార్డుల్లో 70 వేల మంది పోటీలో ఉన్నారు.

పగలు దావత్‌లు.. రాత్రి పంపిణీలు

తొలి విడత పంచాయతీ ఎన్నికలు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి ఒంటి గంట వరకు జరగనున్నాయి. దీంతో ఓటర్ల మనసు గెలుచుకోవాలంటే మిగిలింది ఆదివారం ఒక్కటే. అందుకే అభ్యర్థులు దీన్ని దావత్‌లకు అనుగుణంగా మలుచుకుంటున్నారు. శుభకార్యాల పేరుతో ఖరీదైన విందులు ఇస్తున్నారు. మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో అభ్యర్థులు పెద్ద ఎత్తున మేకలు, పొట్టేళ్లు దావత్‌ల కోసం సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నోట్లు తీసుకోనివారికి దావత్‌లు ఇచ్చి తమకు సానుకూలత తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. నాగర్‌కర్నూలు, కొల్లాపూర్, బాల్కొండ, ఆర్మూరు ప్రాంతాల్లో మోతుబరి రైతులు నగదు తీసుకోవడానికి నిరాకరిస్తుండడంతో వారిని మందు, విందులతో ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు.

★ ఖమ్మం, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో కొన్ని పంచాయతీల్లో ఓటుకు రూ.వెయ్యి వరకు పంపిణీ చేసేందుకు నాయకులు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఆదివారం నాటి వరకు ఉన్న పరిస్థితిని అంచనా వేసి ప్రతికూల ఓటును కూడా తమవైపు తిప్పుకునేందుకు పెద్ద మొత్తంలోనే పంపిణీ చేయడానికి మరికొందరు అభ్యర్థులు వ్యూహం ఖరారు చేసుకున్నారు. పెద్ద ఎత్తున మద్యం సీసాలు, నగదును గ్రామాలకు తరలించి రాత్రికి రాత్రే పంపిణీ చేసేందుకు అనుచరగణాన్ని మోహరించినట్లు సమాచారం.

పెద్దలు మెచ్చినోళ్లే..

గ్రామాభివృద్ధికి సంబంధించి ఏ పని చేపట్టాలన్నా అభివృద్ధి కమిటీలదే అంతిమ నిర్ణయం. ప్రజలతో నిరంతర సంబంధాలు ఉండటంతో ఈ కమిటీల నిర్ణయాలకు గ్రామాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో ఈ కమిటీల పెద్దలు చెప్పిందే వేదంగా మారుతోంది. కొన్నిచోట్ల తమ పంచాయతీకి ఎవరు పోటీ చేయాలి, ఎవరికి ఓట్లు వేయాలనేది కూడా ఈ కమిటీలే నిర్ణయిస్తున్నట్లు తెలుస్తోంది. కుల, గిరిజన సంఘాలు ఎక్కువగా ఉన్న ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆయా సంఘాల పెద్దల నిర్ణయం పంచాయతీ పోరును ప్రభావితం చేస్తోంది.

ఊరు మెచ్చింది అందలమెక్కించింది

ఆటోవాలాను సర్పంచిగా ఎంచుకున్న గ్రామస్థులు



అర్క శంకర్
సర్పంచి
అందుగూడ

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే: కష్టసుఖాల్లో చేదోడువాదోడుగా ఉండే స్వభావం ఓ ఆటో డ్రైవర్‌ను అందలమెక్కించింది. సర్పంచి కుర్చీలో కూర్చోబెట్టింది. ఈ ఆసక్తికర పరిణామం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం అందుగూడ పంచాయతీలో జరిగింది. కొత్తగా పంచాయతీగా ఏర్పడిన అందుగూడ పరిధిలో అందుగూడ, కొత్తగూడ, చింతకర్ర గ్రామాలున్నాయి. అందుగూడ గ్రామానికి చెందిన శంకర్(28) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అత్యవసర సమయంలో గ్రామస్థులను ఆసుపత్రులకు చేర్చడంతో పాటు..కష్టసుఖాల్లో స్థానికులకు తలలో నాలుకలా వ్యవహరించేవారు. ఆ సేవలకు గానూ గ్రామస్థులంతా ఆయన్ని ఏకగ్రీవ సర్పంచిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శంకర్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధికి కృషి చేసి, ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు.



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లిలో తనకు కేటాయించిన గుర్తు 'షటిల్ కాక్'లతో సర్పంచి అభ్యర్థిని ప్రచారం



ఉంగరం గుర్తుకు ప్రచారం పెంచేలా మల్కాపూర్‌లో ఒక అభ్యర్థిని దుకాణాల్లో దొరికే సామగ్రి తెచ్చి వాటిని తయారు చేయించి ప్రచారం చేస్తున్నారిలా..

ప్రజల్లో 'గుర్తు'ండిపోయేలా ప్రచారం!

ఈనాడు, సంగారెడ్డి: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచులు, వార్డు సభ్యులుగా బరిలోకి దిగిన వారికి బ్యాటు, బంతి, షటిల్ కాక్, కత్తెర, ఉంగరం లాంటి గుర్తులను కేటాయించడంతో అభ్యర్థులు తమ గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భిన్నంగా ప్రయత్నిస్తున్నారు. మార్కెట్లో దొరికే ఈ వస్తువులను కొనుగోలు చేసి వాటి సాయంతో ప్రచారం చేస్తున్నారు. బ్యాట్, షటిల్ కాక్, ఉంగరం.. లాంటి గుర్తులు వచ్చిన ఒక్కో సర్పంచి అభ్యర్థి వందల సంఖ్యలో వాటిని కొని ప్రచార సమయంలో పంచిపెడుతున్నారు. చిన్నారులకు బ్యాట్, బంతి ఇవ్వడంతో చాలా గ్రామాల్లో వారు ఆటలాడుతూ పనిలో పనిగా ప్రచారమూ కల్పిస్తున్నారు. అభ్యర్థులు తమ గుర్తును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నామని ఆనందపడుతుంటే... ఈ గుర్తుల పుణ్యమా అని ఆయా వస్తువుల అమ్మకాలు పెరిగాయని దుకాణదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

197 మండలాల్లో మద్యం దుకాణాలు బంద్

ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వర్తింపు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రంలో మొదటి దశ పంచాయతీ ఎన్నికలు జరగనున్న 197 మండలాల్లో మద్యం దుకాణాలు శనివారం సాయంత్రం మూసేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 సెక్షన్ 228 ప్రకారం పోలింగ్ జరగడానికి రెండు రోజుల ముందు సాయంత్రం 5 గంటలకు మద్యం దుకాణాలు బంద్ చేయాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మూసి ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్ల సమన్వయంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్లు తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశమున్నందున ఎక్సైజ్ సిబ్బంది, అధికారులు గ్రామాల్లో నిరంతర గస్తీ, తనిఖీ నిర్వహించాలని సూచించారు. రెండో విడత ఎన్నికలు ఈ నెల 25న 172 మండలాల్లో, మూడో విడత ఎన్నికలు 30న 166 మండలాల్లో జరగనున్నాయి. వీటిలో కూడా పోలింగ్ తేదీ కంటే రెండు రోజుల ముందు మద్యం దుకాణాలు మూసివేస్తారు.



వరినాట్లు.. 'ఓటు' పాట్లు

పంచాయతీ ఎన్నికలకు ప్రచారం జోరందుకుంది. ఓటర్లు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్‌ఖాన్ పేటకు ఈ నెల 21న (సోమవారం) మొదటి విడతలో భాగంగా ఎన్నికలు జరగనున్నాయి. అయితే గ్రామస్థులు పంట పొలాలకు, వరినాట్లు వేసేందుకు వెళ్లడంతో అభ్యర్థులు కొత్త పంథాను ఎంచుకున్నారు. ప్రచారం చివరి రోజైన శనివారం ఓట్ల కోసం పొలాల బాట పట్టారు. సర్పంచి అభ్యర్థిని మంజుల వార్డు సభ్యులుగా బరిలో నిలిచిన వారితో కలిసి గ్రామ శివారులో వరినాట్లు వేస్తున్న మహిళల వద్దకు వెళ్లి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. – ఈనాడు, సంగారెడ్డి



పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న వెంకటరెడ్డిని అడ్డుకుంటున్న గ్రామస్థులు

సర్పంచి ఎన్నికను రద్దు చేయాలని ఆందోళన

జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో ఓ యువకుడి ఆత్మహత్యాయత్నం

మల్లాపూర్, న్యూస్‌టుడే: సర్పంచి పదవిని డ్రా ద్వారా దక్కించుకోవడాన్ని నిరసిస్తూ, ఆ ఎన్నికను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ యువకులు ఆందోళన చేసిన ఉదంతమిది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి పదవిని ఓ వ్యక్తి రూ.20 లక్షలకు దక్కించుకున్నారు. దాన్ని రద్దు చేసి మళ్లీ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని శనివారం మల్లాపూర్‌లో యువకులు ఆందోళన నిర్వహించారు. ఇదే సమయంలో ఎనుగు వెంకటరెడ్డి అనే యువకుడు పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేయగా గ్రామస్థులు అడ్డుకున్నారు. సర్పంచి ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్థులు కూడా నినాదాలు చేశారు. అనంతరం మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకుపైకి సోమ అశ్విని, మాట్ల అంజయ్య, కొమ్ము ప్రభాకర్, ఆరిగడ్డి సురేష్‌లు ఎక్కి ఎన్నికలను రద్దు చేయకుంటే దూకి చనిపోతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో వారు కిందకు దిగివచ్చారు.

మూడో విడతకు 26 వేల నామినేషన్లు

- 22వ తేదీన ఉపసంహరణలు

ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత ఎన్నికలు నిర్వహించనున్న 4116 పంచాయతీలకు 26,106 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 257 పంచాయతీలకు 2144 నామినేషన్లు వచ్చాయి. ఎన్నికలు జరుగనున్న 36,729 వార్డులకు 93,518 మంది నామినేషన్లు సమర్పించారు. వీటికి 22వ తేదీన ఉపసంహరణలు ఉంటాయి.

అదేరోజు పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాలను ప్రచురిస్తారు. చివరి విడత ఎన్నికలు కావడంతో పెద్దఎత్తున పంచాయతీలను కైవసం చేసుకోవాలని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఉపసంహరణల నాటికి తమ మద్దతుదారుల సంఖ్యను పెంచుకునేందుకు, పోటీలో ఉన్నవారిని బుజ్జగించేందుకు పార్టీల నాయకులు ప్రయత్నిస్తున్నారు.

మూడో విడత పంచాయతీ ఎన్నికలు ఈనెల 30వ తేదీన జరుగుతాయి.

సర్పంచి స్థానానికి ఒకే నామినేషన్ (ఏకగ్రీవం) దాఖలైన పంచాయతీలు

జిల్లా	పంచాయతీల సంఖ్య
రంగారెడ్డి	8
వికారాబాద్	18
సంగారెడ్డి	9
మెదక్	8
సిద్దిపేట	6
మహబూబ్‌నగర్	9
నాగర్‌కర్నూలు	10
జోగులాంబ గద్వాల	2
వనపర్తి	1
జయశంకర్ భూపాలపల్లి	10
కుమురంభీం ఆసిఫాబాద్	18
రాజన్న సిరిసిల్ల	9
ఖమ్మం	15
భద్రాద్రి కొత్తగూడెం	1
కామారెడ్డి	21
నిజామాబాద్	36
నల్గొండ	2
యాదాద్రి భువనగిరి	11

విమానాశ్రయంలో నేటి నుంచి అత్యాయిక స్థితి

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: భారత గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని శంషాబాద్ విమానాశ్రయంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు అత్యాయిక స్థితి కొనసాగుతుంది. విమానాశ్రయ ప్రధాన ద్వారాల వద్ద శనివారం అర్ధరాత్రి నుంచే అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ నెలాఖరు వరకు సందర్శకుల పాసుల జారీని అధికారులు నిలిపివేశారు.

ఆబ్కారీ ఎస్సైల పదోన్నతికి డీపీసీ ఆమోదం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆబ్కారీ శాఖలో పనిచేస్తోన్న 20 మంది ఎస్సైలు త్వరలో సీఐలుగా పదోన్నతి పొందనున్నారు. ఇందుకోసం ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్, మరో ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్న శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) శనివారం ఆమోదం తెలిపింది.

కొంపముంచిన వాట్సాప్ సందేశం

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల నాటి నుంచి వాట్సాప్‌లో రకరకాల జాబితాలు హల్‌చల్ చేయడం మొదలైంది. పంచాయతీ ఎన్నికల్లోనూ రిజర్వేషన్ల జాబితా పేరుతో కొన్ని సందేశాలు (మెసేజ్‌లు) చక్కర్లు కొట్టాయి. అదే నిజమని నమ్మిన ఓ గ్రామంలో రెండు వార్డులకు ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం రంజిత్‌నాయక్‌తండాలో వెలుగు చూసింది. ఎన్నికల అధికారిక ప్రకటనకు ముందే రిజర్వేషన్ జాబితా ఒకటి వాట్సాప్‌లో విస్తృతంగా తిరిగింది. తర్వాత రోజు అధికారులు అసలైన జాబితా ప్రకటించినా గ్రామస్థులు పట్టించుకోలేదు. వాట్సాప్ సమాచారం ఆధారంగా సర్పంచి, వార్డు సభ్యులను ఏకగ్రీవం చేసుకొన్నారు. ఈ మేరకు నామపత్రాల దాఖలు చివరి రోజైన శుక్రవారం సర్పంచి అభ్యర్థితోపాటు ఆరుగురు వార్డు సభ్యుల అభ్యర్థులు పత్రాలు దాఖలు చేయడానికి వెళ్లారు. రద్దీ అధికంగా ఉండడంతో సాయంత్రానికి అవకాశం వచ్చింది. లోనికి వెళ్లిన ఆరుగురు వార్డు సభ్యుల్లో ఇద్దరు కేటాయించిన రిజర్వేషన్లకు విరుద్ధంగా పత్రాలు సమర్పించడంతో అధికారులు వాటిని తిరస్కరించారు. ఎస్టీకి రిజర్వు చేసిన వార్డు స్థానాల్లో బీసీలు వేయడానికి వీలు లేదని చెప్పడంతో అవాక్కయ్యారు. తమ దగ్గర ఉన్న జాబితాలో బీసీలకు ఇచ్చారని వాదించినా ఫలితం లేకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో రెండు వార్డు స్థానాలకు ఎన్నికలు నిలిచిపోనున్నాయి. కేటాయించిన రిజర్వేషన్లను పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు ప్రదర్శించకపోవడంతోనే తమకు అన్యాయం జరిగిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.





పునర్ నిర్మాణంలో శివాలయం ★ కృష్ణ శిలతో రూపొందుతున్న లక్ష్మీనరసింహ ఆలయం

హరిహరులతో యాదాద్రి క్షేత్రం

- ముమ్మరంగా విస్తరణ కార్యక్రమాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని 'యాదాద్రి' పేరిట తీర్చిదిద్దే కృషిలో భాగంగా, కొన్ని మందిరాల వద్ద విస్తరణ, పునర్ నిర్మాణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. శివాలయాన్నీ విస్తరించడం ద్వారా కట్టడాల పనులను మహాశివరాత్రి ఉత్సవాలకల్లా పూర్తిచేసేందుకు శ్రమిస్తున్నారు. యాదాద్రి దేవాలయాభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) ఆధ్వర్యంలో హరిహరుల ఆలయాలు నవీన రూపాలతో ఆవిష్కృతం కానున్నాయి. పంచ నారసింహుల ప్రధానాలయం, సప్తగోపురాల నిర్మాణాలూ పూర్తయ్యాయి. అష్ట భుజ మండప ప్రాకార పనులు కూడా జరుగుతున్నాయి. ముఖ మహామండపంలోనూ ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. అనుబంధంగా రామలింగేశ్వరుడి ఆలయాన్ని అర ఎకరంలో విస్తరించి పునర్ నిర్మిస్తారు. ప్రధానాలయాన్ని కృష్ణ శిలతో రూపొందిస్తున్నారు. గణపతి, సుబ్రహ్మణ్యస్వామి ఉప ఆలయాలతో సహా పార్వతిదేవి మందిర నిర్మాణాలు పూర్తవుతున్నాయి. రాజగోపుర నిర్మాణంలో భాగంగా శ్లాబ్ వరకు రాతి పనులను ముగించారు. నారసింహుడి దక్షిణ రాజగోపురం ఎదుట వాహనశాల, అలంకార మండపాల నిర్మాణాలకు శనివారం శిల్పకళా వేత్త సుందరరాజన్ ఆధ్వర్యంలో మార్కింగ్ వేశారు. యాగశాల నిర్మాణానికి ఆది లేదా సోమవారం మార్కింగ్ పనులవుతాయని నిర్వాహకులు సుందరరాజు తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

హాయ్
ఈనాడు
కరీంనగర్
ఆదివారం, జనవరి 20, 2019



అమాయకంగా చూడండి... అతనిలో 'చంటి' కన్పిస్తాడు. కోపంగా మాట్లాడండి... ఆయనలోని 'ఘర్షణ'ని చూపిస్తాడు. 'ప్రేమ'గా పలకరించండి... 'నువ్వునాకు నచ్చావ్' అంటాడు. ఆనందంగా హాయ్ అనండి... 'ఎఫ్2'లా నవ్వుని నలభైఇంతలు చేస్తాడు. ఇప్పటికే అర్థమైందనుకుంటా... అందరి హీరో వెంకటేశ్ గురించే ఇదంతా అని. 'అంతేగా...అంతేగా' అంటూ ఎఫ్2 విజయాన్ని ఎంజాయ్ చేస్తున్న ఆయన 'హాయ్'తో తన భావాలు పంచుకున్నాడు. జీవితం, సినిమాలు, క్రికెట్... ఇలా అనేక విషయాలు మాట్లాడాడు.

రోజూ పండగలా చేసుకోవాలి

చిన్నప్పుడు చెన్నైలో ఉండేవాళ్లం. భోగి పండగ బాగా జరిగేది. పతంగులు చూడాలంటే హైదరాబాద్ రావాలి. పండగ రోజున ఇంట్లోవాళ్లమంతా కలిసేవాళ్లం. కబుర్లు చెప్పుకుంటూ, భోజనాలు చేయడం అలవాటు. ఇక్కడికి వచ్చాక.. ఆ ఆనందానికి సినిమా తోడైంది. పండగ అనగానే కొత్త సినిమాల హడావిడి ఎక్కువగా కనిపిస్తుంది. పండగ వాతావరణం చూస్తున్నప్పుడల్లా రకరకాల ఆలోచనలు వస్తుంటాయి. పండగల ఉద్దేశం నాకు నాకు తెలిసి ఆనందాన్ని పంచడమే. ప్రతి మనిషి జీవితంలో మంచి, చెడు రెండూ ఉంటాయి. వాటన్నింటినీ పక్కన పెట్టి.. 'ఈరోజైనా సంతోషంగా గడుపుదాం..నలుగుర్నీ కలుద్దాం' అనే సానుకూల దృక్పథాన్ని పండగలు తీసుకొస్తాయి. పండగ అయిపోయాక... 'అరె... ఇన్ని రోజులు ఎంత బాగున్నాం.. మిగిలిన రోజులూ ఇలానే గడుపుదాం' అనిపిస్తుంది. ప్రతి రోజూ ఓ పండగలా చేసుకునే పద్ధతి మెల్లమెల్లగా అలవాటు చేసుకోవాలి.

మనలోనే అద్భుతాలు

ప్రతిక్షణం అందమైనది. ఇన్ని మంచి క్షణాల్ని అందిస్తున్న ప్రకృతికి రుణపడి ఉండాలి. ప్రతీరోజూ ఓ అద్భుతం అని ఫీల్ అవ్వాలి. రాత్రి పడుకుని ఉదయం లేస్తున్నామంటే, స్వచ్ఛమైన గాలి పీలుస్తున్నామంటే, నడుస్తున్నామంటే... ఇవన్నీ అద్భుతాలే. దురదృష్టం ఏమిటంటే అద్భుతాల కోసం ఎక్కడెక్కడో వెదికేస్తుంటాం. అది మనలోనే ఉందన్న విషయం తెలుసుకోం. అది తెలుసుకుంటే జీవితం కొత్తగా అనిపిస్తుంది. ఆ నిజం మర్చిపోయి బతికేస్తుంటాం. ప్రపంచాన్ని రిపేర్ చేద్దామని ప్రయత్నిస్తుంటాం. ముందు నిన్ను నువ్వు బాగుచేసుకో. ప్రపంచం తరవాత.

మరీ ఎక్కువ చేస్తున్నానేమో

క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఇండియా ఎక్కడ మ్యాచ్ ఆడినా వెళ్లి చూడాలనిపిస్తుంటుంది. కొన్నిసార్లు అన్నయ్య నాతో వస్తుంటాడు. ఇంకొన్నిసార్లు రానా వస్తుంటాడు. ప్రపంచకప్పు రాబోతోందని కదా.. ప్లాన్ చేసుకోవాలి. మ్యాచ్ చూస్తున్నప్పుడు భావోద్వేగాలను అదుపులో పెట్టుకోలేను. 120 బంతుల్లో వందసార్లు లేచి గోల చేస్తుంటా.. (నవ్వుతూ). అది మరీ ఎక్కువ అవుతోందేమో... అన్నిసార్లు లేవకూడదేమో అని తరవాత అనిపిస్తుంటుంది. టీ 20ని బాగా ఎంజాయ్ చేస్తున్నా. ఎవరెవరు ఆడినా, ఎక్కడ లీగ్ జరిగినా చూస్తుంటా. ఆఖరి ఓవర్లు మరింత థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంటాయి. ఆస్ట్రేలియాపై భారత జట్టు గెలవడం చూసి చాలా ఎంజాయ్ చేశాను.

జీవితమంటే... అంతేగా.. అంతేగా..

ఈ సంక్రాంతికి మీ సినిమా కూడా విడుదలైంది. పండక్కి సినిమాల్ని విడుదల చేయడం సెంటిమెంట్‌గా మారుతోందా?

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'గోపాల గోపాల' ఇలా సంక్రాంతికి చాలా సినిమాలొచ్చాయి. అవన్నీ బాగా ఆడాయి. పండగ అనగానే ఓ ఉత్సాహభరితమైన వాతావరణం కనిపిస్తుంది. 'సినిమాకి వెళ్లాలి' అని మానసికంగా సిద్ధమైపోతారు. ప్రేక్షకుడికి వినోదం రకరకాల రూపాల్లో దొరికేస్తోంది. వాళ్ల దృష్టిని సినిమాలవైపు మళ్లించే అవకాశం చాలా తక్కువ సందర్భాల్లో వస్తుంటుంది. అందులో సంక్రాంతి ఒకటి.

ఎఫ్ 2 సినిమాపై మీరు ముందు నుంచీ గట్టి నమ్మకంతోనే ఉన్నారు. దానికి గల ప్రత్యేక కారణమేంటి?

వినోదాత్మక చిత్రాల్లో ఉన్న బలమే అది. కథ చిన్నదే కావొచ్చు. కానీ.. రెండుగంటల పాటు హాయిగా నవ్విస్తే సరిపోతుంది. ఆరోగ్యకరమైన వినోదానికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఎఫ్ 2లోనూ ఆ లక్షణాలు కనిపించాయి. అందుకే ఈసినిమాపై ముందు నుంచీ గట్టి నమ్మకం ఏర్పడింది. సంక్రాంతి సీజన్‌లో సినిమా రావడం, మంచి విజయాన్ని అందుకోవడం 2019కి మంచి బూస్టప్ దొరికినట్టు అనిపించింది.

సినిమా అనేది రంగుల ప్రపంచం. ఇలాంటి గ్లామర్ ఫీల్డ్‌లో ఉంటూ వేదాంతం మాట్లాడడం, ఇన్ని విషయాల గురించి లోతుగా ఆలోచించడం మీకు ఎలా అలవాటైంది?

ఇదేదో గ్లామర్ ఫీల్డ్ అని నేను అనుకోను. నా వరకూ ఓ వృత్తి అంతే. ఈ రంగుల లోకానికి నేనేమీ ఆకర్షితుడ్ని అయిపోలేదు. ఇక్కడ ఓ స్టార్ డమ్ ఉంటుందన్న స్పృహ నాకు లేదు. ఏదో వచ్చాను, నటించాను, ప్రేక్షకులు ఆదరించారు. మధ్యలో కొన్ని ఫ్లాపులు ఎదురయ్యాయి. 'నాకు సినిమాలు కరెక్టేనా? నేను సినిమాలకు పనికొస్తానా' అని ఆలోచించాను. విధి నన్ను ఇక్కడే ఉండమని నిర్దేశించిందేమో. అందుకే మెల్లమెల్లగా నిలదొక్కుకున్నా. అవకాశాలు వచ్చినప్పుడు వినియోగించుకున్నా. అప్పగించిన పని కోసం నూటికి నూరుపాళ్లు కష్టపడడం నాన్న, అన్నయ్యల దగ్గర నుంచి నేర్చుకున్నా. 'అదేంటి ఆ హీరోకి అంత మంచి కథ దొరికింది' అని ఎప్పుడూ మధనపడలేదు. 'ఈ సినిమా నా వల్లే ఆడింది' అని అనుకోలేదు. నేనో చుక్కని మాత్రమే. ఎన్నో చుక్కలు కలిస్తేనే ఓ రూపం వస్తుంది. అప్పటికీ ఇప్పటికీ ఇలానే ఉన్నా. ఇలానే మాట్లాడుతున్నా. 'అదేంటి వెంకీ నువ్వింకా అలానే ఉన్నావేంటి?' అని చాలామంది అడిగారు. ఎందుకో నాకూ తెలీదు. ఇది నా మార్గం. దీనికి మించిన మరో మార్గం ఉందేమో. ఆ సంగతి నాకు తెలీదు.

చుట్టూ ఉన్న నెగిటివ్ ఎనర్జీని పాజిటివ్‌గా ఎలా మార్చుకోవాలో ఆలోచిస్తుంటారా?

నేను ఆలోచిస్తా. అందరూ అలానే ఆలోచించాలి. మన దగ్గరకు వచ్చి ఎవడో నాలుగు మాటలు మాట్లాడి వెళ్లిపోతాడు. వాటిని నువ్వు ఎలా స్వీకరిస్తున్నావ్ అనే విషయంలోనే ట్రిక్కంతా ఉంది. సంఘటన జరిగిన తరవాత

నీలో వచ్చిన మార్పే నువ్వేంటో చెబుతుంది. చెప్పినోడు, చేసినవాడు.. వాళ్ల బతుకులు వాళ్లు బతుకుతారు. మరి నీ సంగతేంటి? వాడి గురించి ఆలోచించుకుంటే నీ బతుకేంటి. నీ ఆకలి నీది. నీ పని నీది. నీ గురించి ఎవరూ ఆలోచించరు. నీకు నువ్వే ఆలోచించుకోవాలి. నీ యుద్ధం నువ్వే చేయాలి. ప్రతీ మనిషీ 'నేను సమ్‌థింగ్ స్పెషల్' అనుకోవాలి. అది నిజం కూడా. నాలా ఈ భూ ప్రపంచంలో మరొకడు ఉండడు. ఉండలేడు. లోతైన ఆలోచనల వల్లే అది సాధ్యం అవుతుంది.

మీరెప్పుడూ క్రియేటర్ అంటుంటారు కదా? అంటే దేవుడని అర్థమా? లేదంటే ప్రకృతి అనుకోవాలా?

దేవుడు అనేది ఓ చిన్న పదం. క్రియేటర్ అంటే ప్రకృతి. దాన్ని నమ్మాలి. మనల్ని తీసుకొచ్చి.. ఇక్కడ పడేసింది ఓ శక్తి అనుకోవాలి. దానికి 'దేవుడు' అని పేరు పెట్టుకుంటే పెట్టుకో. శరీరానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకు. అది సెకండ్ హ్యాండ్ వస్తువు. దానికంటే ఆత్మ గొప్పది. కళ్ల ముందు కనిపిస్తున్న దాన్ని నమ్ము. ఏం అడక్కుండానే చూడగలుగుతున్నావ్. మాట్లాడుతున్నావ్. గాలి పీలుస్తున్నావ్. ఇదంతా నిజం కదా? ఈ నిజాన్ని నమ్మాలి.

మీ ఇంట్లో వాళ్లకి ఇలాంటి విషయాలు చెబుతుంటారా? వాళ్ల రియాక్షన్ ఏమిటి?

'ఇప్పుడు వీళ్లకో క్లాస్ పీకాలి' అనుకుని ఎప్పుడూ చెప్పను. కానీ అవసరం అనుకున్నప్పుడు కొన్ని విషయాలు చెబుతుంటా. మనం ఉన్న స్థలం, ఎదుటివాళ్ల మనస్తత్వాలు ఇవన్నీ మన మాటలపై ప్రభావం చూపిస్తుంటాయి. మనలో ఎన్నో భావాలు ఉండొచ్చు. స్వీకరించేవాళ్లు లేకపోతే ఎన్ని చెప్పినా వ్యర్థమే. నాకు పెద్దగా ఆశలు ఉండవు. జీవితంపై ఆశలు ఎక్కువగా ఉన్నవాడ్ని ఆపి నేను స్పీచులు ఇచ్చినా ఎక్కవు.

మీ పిల్లలు మీలా ఆలోచిస్తారా?

నా ఆలోచనల ప్రభావం వాళ్లపై కొంత వరకూ ఉంటుంది. కానీ నేనేదీ రుద్దను. ఎవరి బ్యాగేజీ వాళ్లది. ఎవరి జీవితాన్ని వాళ్లే నడిపించుకోవాలి. ఎవరి తప్పుల్ని వాళ్లు తెలుసుకోవాలి. అందులోంచి నేర్చుకోవాలి. నొప్పి లేకపోతే జీవితం విలువ తెలీదు. కాకపోతే.. వాళ్లని ఓ క్రమ పద్ధతిలో పెంచాను. ఎంత ఉన్నా ఒదిగి ఉంటారు.

నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి.. ఎప్పుడు చూసినా కొత్తగా అనిపిస్తాయి. చాలామంది అభిమాన చిత్రాలవి. ఆ సినిమాలు అలా నిలబడిపోవడానికి కారణమేంటి?

నిజంగా ఆ ఫార్ములా నాక్కూడా తెలీదు. ఓ 'గుండమ్మ కథ'లా మిగిలిపోయిన సినిమాలవి. ఎక్కడకు వెళ్లినా... ఆ సినిమాల గురించి ప్రస్తావిస్తుంటారు. ఎక్కడా ఎలాంటి అసభ్యత లేకుండా తీసిన సినిమాలవి. అందుకే అలా నిలబడిపోయాయి. అలాంటి మంచి పాత్రలు నాకు దక్కడం ఆనందంగా ఉంది. వాటికి మించి సినిమాలు చేయాలని నాకూ అనిపిస్తుంటుంది. నటుడిగా నేను సవాళ్లని ఇష్టపడతాను. కానీ అవి ఎలాంటి పాత్రలు, ఏరకమైన సినిమాలు అనేవి నేనూ చెప్పలేను. 'దంగల్', 'తారే జమీన్ పర్'లాంటి సినిమాల కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నా.

నాన్న, అన్నల్లా వ్యాపార రంగం మిమ్మల్ని ఆకర్షించలేదా?

డబ్బు ఎప్పుడూ ఆకర్షించలేదు. ఇప్పుడు ఇలా ఉండడం సౌకర్యంగా ఉంది. అది చాలు అనిపించింది. కెరీర్ ప్రారంభంలో 'కొంత డబ్బు ఉండాలి' అనుకునేవాడ్ని. అదెప్పుడో వచ్చేసింది. ఇప్పుడు నా అకౌంట్లో పడుతున్నదంతా బోనస్ అనే అనుకోవాలి. డబ్బు అవసరమైనదానికంటే ఎక్కువ సంపాదించినా సమస్యే. తక్కువ ఉన్నా ఇబ్బందే. కావల్సినంత ఉండేలా చూసుకోవాలి.

నాన్నగారు రామానాయుడు లేని లోటు అన్నయ్య సురేష్‌బాబు తీరుస్తున్నారా?

నాన్నగారు లేరు అని అస్సలు అనుకోవడం లేదు. ఆయన అరుదైన బ్రీడ్. చాలామంచి మనిషి. నాకూ మా కుటుంబానికీ పాజిటీవ్ ఎనర్జీ ఇచ్చి వెళ్లారు. అది మా చుట్టూనే తిరుగుతుంటుంది.

మీనాన్నగారి బయోపిక్ తీసే ఆలోచన ఉందా?

ఇంకా ఏం అనుకోలేదు. వస్తుందేమో చూడాలి.

మీ భావాలని, అభిప్రాయాల్ని రాయాలనుకున్నారా?

నేనేదీ ఆలోచించి చేయను. సహజంగా జరగాలి. ప్లాన్ చేసుకుంటే.. లోపలున్న 'ఈగో' బయటకు వచ్చేస్తుంది. 'ఇంత మంచి పుస్తకం రాశాం.. జనాలు చదువుతారా? వాళ్లకు అర్థం అవుతుందా' అనే గోల మొదలవుతుంది. ఉన్న పుస్తకాలే ఎవడూ చదవడం లేదు. రమణ మహర్షి, జీసెస్, బుద్ధుడు, పరమహంస.. ఎంత విజ్ఞానాన్ని ఇచ్చారు. అవన్నీ మనం చదువుతున్నామా? లక్షలు పోసి.. స్టార్ హోటల్‌కి వెళ్లి అక్కడ పర్సనాలిటీ డెవలెప్‌మెంట్ క్లాసులు మాత్రం తీసుకుంటుంటాం. ఎందుకు అదంతా? 'భగవద్గీత'లో ఉన్నదేగా వాళ్లూ చెప్పేది..? అది చదివితే సరిపోతుంది.

వ్యక్తిత్వ వికాస పుస్తకాల వల్ల ప్రయోజనం లేదంటారా?

ఓ ప్రేరణ దొరుకుతుంది. చదివిన వెంటనే ఓ సాంత్వన లభిస్తుంది. అయితే ఆ విషయాల్ని నీ జీవితంలో ఎంత వరకూ అమలు చేస్తున్నావు? అనేది చాలా ముఖ్యం. సమస్య వచ్చినప్పుడు చదువుతావు. అంతా బాగుంది అనుకున్నప్పుడు పక్కన పెట్టేస్తావు. అక్కడే వస్తుంది చిక్కంతా.

ఈ జీవితాన్ని వదిలి ఎక్కడకైనా వెళ్లాలి అనిపిస్తుంటుందా?

కొన్నిసార్లు అనిపిస్తుంది. అలాంటప్పుడు ప్రయాణాలు ఎక్కువగా చేస్తుంటా. అయినా లగ్జరీ ఎక్కడ లేదు..? ఓ చెట్టుకింద కూర్చుంటే లగ్జరీ లేనట్టా...? విలాసవంతమైన వస్తువులు తాత్కాలిక ఆనందాన్నే ఇస్తాయి.

బిగ్ బాస్ 3 సీజన్‌కి మీరే హోస్ట్ అని ప్రచారం జరుగుతోంది?

లేదు.. నిజానికి బిగ్ బాస్, మీలో ఎవరు కోటీశ్వరుడు ముందు నా దగ్గరకే వచ్చాయి. కానీ నేను ఒప్పుకోలేదు.

డబ్బుకి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేస్తున్నారంటారా?

కష్టపడినప్పుడు దానికి గుర్తింపుగా చాలా వస్తాయి. అదంతా నీ కష్టానికి ప్రతిఫలం. కొన్నిసార్లు తక్కువ వస్తుంది. ఇంకొన్నిసార్లు ఎక్కువ వస్తుంది. నువ్వు అడక్కు. ఇస్తే వద్దనకు. పక్కవాడితో పోల్చుకోకు. రెండేళ్లు కష్టపడి ఓ కారు కొనుక్కున్నావ్. పూజ చేసి, దిష్టి తీసేలోగా.. పక్కింట్లో నీకంటే ఖరీదైన కారు కనిపిస్తే.. 'అరె వాడెలా కొన్నాడు?' అంటూ జుట్టు పీక్కోకు. అలా చేశావంటే రెండేళ్ల నీ కష్టం బూడిదలో పోసిన పన్నీరే. నువ్వు ఎంత సంపాదించావ్ అన్నది కాదు. ఆ సంపాదించినదాంట్లో ఎంత సుఖంగా ఉన్నావ్ అనేదే ముఖ్యం.

ఏదీ మార్చలేదు

జీవితంలో, సినిమాలో మూడు దశలుంటాయి. ముందు పని చేయాలి, ఆ తరవాత ఫలితం గురించి ఆలోచించకుండా అందులోంచి మనం బయటకు వచ్చేయాలి. మూడోది స్వీకరణ. ఫలితం ఎలాంటిదైనా స్వీకరించడానికి మనసుని సిద్ధంగా ఉంచుకోవాలి. మంచో చెడో ఏదైనా కావొచ్చు. మనల్ని మనం సిద్ధంగా ఉంచుకోకపోతే చాలా కష్టం. ఓ అట్టర్ ఫ్లాప్ వస్తే.. 'అరె మన పని అయిపోయింది' అనే భయం వెంటాడుతుంది. సడన్‌గా హిట్ వస్తే.. 'మనల్ని మించినవాడు లేడేమో' అన్న అతివిశ్వాసం మొదలైపోతుంది. రెండూ మంచివి కావు. అందుకే ఓ సినిమా చివరి దశలో ఉన్నప్పుడే నేను మానసికంగా బయటకు వచ్చేస్తా. అందుకే హిట్లూ, ఫ్లాపులూ నన్ను ఎప్పుడూ మార్చలేకపోయాయి.



– మహమ్మద్ అన్వర్, ఫొటోలు : జయకృష్ణ

అమ్మాయిలు జీవితాన్ని బ్యాలెన్స్ చేయాలి

ఆమె నడుము వయ్యారంలో చిక్కుకోని అభిమానులుండరు. ఆమె నటనా సౌందర్యంలో ముగ్ధులవ్వని ప్రేక్షకులుండరు. నలభైఏళ్ల వయస్సులోనే అంతే అందంగా కనిపించి మెప్పించింది సిమ్రన్. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ చిత్రాలతో కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్న సిమ్రన్ 'పేట'తో మరోసారి అలరించింది. 100కు పైగా సినిమాల్లో నటించిన ఆ ప్రతిభా శాలి... పెళ్లి, పిల్లలు, కుటుంబ బాధ్యతలు, రెండో ఇన్నింగ్స్... ఇలా అనేక విషయాలకు పంచుకుంది.

● తెరే మేరె సప్నే

ముంబయిలో చదువుకునేటప్పుడే డ్యాన్స్ అంటే క్రేజ్. చిరంజీవి, ప్రభుదేవా, రజనీ సినిమాల్లో పాటలు చూస్తూ, డ్యాన్స్ చేసేదాన్ని. కాలేజీలో థియేటర్ ఆర్టిస్ట్‌గా చేసేదాన్ని. భరతనాట్యం, సాల్స నేర్చుకున్నా. నృత్య కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. అప్పుడే 'అమితాబచ్చన్ కార్పొరేషన్ ఆఫ్ లిమిటెడ్' ప్రొడక్షన్ నుంచి మొదటిసారిగా పిలుపొచ్చింది. అదే నా తొలిసినిమా. 'తెరే మేరె సప్నే'లో హీరోయిన్‌గా చేశా. తరువాత తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాలు వచ్చాయి. ఇక్కడ 'అబ్బాయిగారిపెళ్లి'తో మొదలైన నా కెరీర్‌లో అన్నీ మంచి పాత్రలే దొరికాయి. తెలుగువారు నాపై చూపిన అభిమానాన్ని మరవలేను.

● ఇద్దరు పిల్లలు

బాల్య స్నేహితుడు దీపక్ బగ్గాని పెళ్లి చేసుకున్నా. కలలో సైతం ఊహించనంత మంచి భర్త నాకు దొరికాడు. మాకిద్దరు మగపిల్లలు. అధీప్‌కు 13, ఆదిత్‌కు ఏడేళ్లు. అల్లరి పిడుగులు. పెళ్లికి ముందు సినిమాల కోసం దాదాపు 24 గంటలూ పనిచేసేదాన్ని. పెళ్లైన తరువాత నన్ను నేను మార్చుకున్నా. కుటుంబ బాధ్యతలు, పిల్లల సంరక్షణలో బిజీబిజీగా గడిపా. ఇక ఇప్పుడు పిల్లలు చదువులతో బిజీగా ఉన్నారు. అందుకే నా కెరీర్‌ను కొనసాగిస్తున్నా.

● నా సినిమాలు చూసి..

మా ఆయన, పిల్లలు నా సినిమాలు చూస్తారు. వాళ్లు చేసే విశ్లేషణ చూస్తే ఆశ్చర్యమేస్తుంది. 'ఆ పాత్రను ఇంకోలా చేస్తే మరింత బాగుండేది. ఇంకొంచెం బాగా నటించాల్సింది' అంటారు. నేను చేసిన సినిమాలన్నీ వాళ్లకిష్టం.

● నెంబర్‌వన్‌గా

జీవితమంటే అమ్మాయిలకు బ్యాలెన్స్ ఉండాలి. ప్రతీ దశను అనుభవించి, బాధ్యతలను స్వీకరించాలి. ఇల్లు, భర్త, పిల్లలు సహా ప్రొఫెషన్‌ను సమతుల్యం చేయగలగాలి. నేను చదివేటప్పుడు నెంబర్‌వన్ స్టూడెంట్‌గా, నటించేటప్పుడు నెంబర్‌వన్ హీరోయిన్‌గా ఉన్నానో, ఆ తరువాత ఇంటిబాధ్యతల్లోనూ అలానే నిలిచా.

● 'అమృత' ఘడియలు

మాధురీదీక్షిత్ అంటే ఇష్టం. జ్యోతిక సినిమాలంటే కూడా. దుస్తుల్లో జీన్స్‌పై వదులుగా ఉండే టాప్. మణిరత్నం సినిమా అమృత షూటింగ్‌ను ఎప్పటికీ మరవలేను. సరిత డబ్బింగ్ ఇష్టం.

– సీహెచ్ వసుంధరాదేవి



● నృత్యమే.. నా రహస్యం

నన్ను నేను ఎప్పుడూ అందంగానే ఉంచుకుంటా. ఆహారం, వ్యాయామం, యోగాతోపాటు డ్యాన్స్... ఇవే నా ఫిట్‌నెస్ రహస్యాలు. వారంలో నాలుగురోజుల పాటు రెండు గంటల చొప్పున మాస్టారు వద్ద డ్యాన్స్ చేస్తా. ఇంట్లో పిల్లలతో కలిసి వారాంతంలో చేస్తా.

● ఫోన్‌కు మెసేజ్

పేట చిత్రంలో రజనీగారితో నటించాలంటూ, ఆ యూనిట్ నుంచి నా ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఎగిరి గంతేశా. గతంలో చంద్రముఖిలో ఆయనతో కలిసి నటించే అవకాశాన్ని వదులుకోవలసి వచ్చింది. ఇప్పుడు అవకాశం అంటే వదులుకుంటానా. వెంటనే ఓకే చెప్పేశా. చిన్నప్పటి నుంచి రజనీ స్టైల్స్‌ను చూసి తిరిగి చేసేదాన్ని. సెట్‌లోకి వెళ్లిన వెంటనే ఆయనను చూసి స్టన్ అయ్యా. నన్ను చూసి నవ్వారు. మనపై ప్రేక్షకులను సంతోషపరిచే బాధ్యత ఉంది. దానిని పూర్తిచేయాలి అన్నారు. ఆయన రియల్ హీరో.

హుందాగా ఉండాల్సిందే

"ఎంతైనా కష్టపడటానికి సిద్ధమే. పని విషయంలో నేను గ్యారెంటీ కూడా ఇస్తా. కానీ పని చేసే చోట వాతావరణం మాత్రం హుందాగా ఉండాల్సిందే" అంటోంది రకుల్‌ప్రీత్ సింగ్. ఇటీవల 'ఎన్టీఆర్ కథానాయకుడు'లో శ్రీదేవిగా మెరిసిన ఆమె ప్రస్తుతం తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది. చిత్ర పరిశ్రమల మధ్య తేడాలేమైనా గుర్తించారా? అని అడిగితే... "ఒక్కటంటే ఒక్క తేడా కూడా కనిపించదు. టాలీవుడ్, బాలీవుడ్ అనే మాటలు మనం పరిశ్రమల పేర్లని సూచించడానికే కానీ, పని విషయంలో మాత్రం ఎలాంటి తేడా లేదు. నటుల్ని గౌరవించే విధానంలోనూ తేడా ఉంటుందని తొలినాళ్లలో వినేదాన్ని. అదంతా ఒట్టిదే. వాస్తవానికి ఆ వాతావరణం అస్సలు లేదు. కథానాయికలకి అన్ని చోట్లా ఒకే రకమైన గౌరవం లభిస్తోంది. నేనైతే చుట్టూ సరైన పరిస్థితులు లేవంటే అస్సలు పనిచేయలేన"ని చెప్పింది రకుల్‌ప్రీత్ సింగ్. సామాజిక మాధ్యమాల్లో తనని కించపరిచేలా ఎవరు వ్యవహరించినా ఏ మాత్రం వెరవక గట్టిగా జవాబిస్తోందామె.



రకుల్‌ప్రీత్ సింగ్

యూట్యూబ్‌లో ప్రియాంక



ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటుంది ప్రియాంక చోప్రా. బాలీవుడ్‌లో కొన్నేళ్లుగా అగ్ర కథానాయికగా వెలుగొందు తోంది. హాలీవుడ్‌లోనూ అడుగుపెట్టి సత్తా చూపుతోంది. మరో వైపు గాయనిగానూ అభిరుచిని చాటుకుంటూ ఆల్బమ్స్‌ను రూపొందించింది. ఇప్పుడు మరో కొత్త సాహసానికి సిద్ధమవుతోంది. ఇటీవలి కాలంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ మీడియాలో అడుగుపెడుతోంది ప్రియాంక. యూట్యూబ్ వేదికగా 'ఇఫ్ ఐ కుడ్ టెల్ యూ జస్ట్ వన్ థింగ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించబోతోందామె. ఇందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లోని స్ఫూర్తిదాయక వ్యక్తులతో సంభాషించనుంది. ఆ షో వివరాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది ప్రియాంక. "నా జీవితాన్ని విశ్లేషించుకున్నప్పుడు ఇతర వ్యక్తుల పట్ల నాకున్న కుతూహలమే నేను ఈ స్థాయికి ఎదగడానికి కారణమని అర్థమైంది. ఆ కుతూహలంతోనే మరో కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాను. కొందరు అసాధారణ వ్యక్తులను కలవబోతున్నాను. వారు ఆ స్థాయిని అందుకోవడానికి కారణమేంటో అడిగి తెలుసుకోబోతున్నాను. దాన్నుంచి నాకు అవసరమైన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలనుకుంటున్నాన"ని పోస్ట్ చేసింది ప్రియాంక. తన షోకు తొలి అతిథిగా ఒలింపిక్ బంగారు పతక విజేత సిమోన్ బైల్స్‌ను ఎంచుకుంది.

ఈనాడు సినిమా

మొన్న ఎన్టీఆర్ నిన్న చరణ్ రేపు మహేష్?



ఎన్టీఆర్



రామ్‌చరణ్

తన కథానాయకుణ్ని సరికొత్తగా చూపించడం సుకుమార్‌కి అలవాటు. 'ఆర్య' నుంచీ తనది అదే స్టైల్. 'నాన్నకు ప్రేమతో'లో ఎన్టీఆర్‌ని గుబురు గడ్డంలోకి మార్చేశారు. 'రంగస్థలం'లో రామ్‌చరణ్ లుక్కు కూడా అలాంటిదే. అంతకు ముందువరకూ వీళ్లు గడ్డంతో కనిపించకపోవడంతో ఆ లుక్కులు కొత్తగా అనిపించాయి. ఇప్పుడు మహేష్‌బాబునీ ఇదే అవతారంలోకి మార్చేయబోతున్నట్లు టాలీవుడ్ టాక్. సుకుమార్ దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా ఓ చిత్రం రూపుదిద్దుకో నుంది. ప్రస్తుతం మహేష్ 'మహర్షి'గా ముస్తాబవుతున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ఆ వెంటనే సుకుమార్ సినిమా మొదలవుతుంది. ఇందులో మహేష్‌ని సరికొత్తగా చూపించడానికి సిద్ధమవుతున్నారు సుకుమార్. 'నాన్నకు ప్రేమతో', 'రంగస్థలం' తరహా లోనే మహేష్ కోసం మాసీ లుక్‌ని ప్రయత్నిస్తున్నారట. మహేష్ ఇప్పటి వరకూ గడ్డంతో కనిపించలేదు. తొలిసారి మహేష్‌ని ఆ లుక్కులో చూపిస్తే అభిమానులకు కొత్తగా ఉంటుందన్నది సుకుమార్ ఆలోచన. ఇందుకోసం ఓ ఫొటో షూట్ కూడా చేయబోతున్నారని తెలుస్తోంది. అన్నీ కుదిరితే మహేష్ గడ్డం లుక్కుతో కనిపించడం ఖాయం.



మహేష్ బాబు

గీతోపదేశం

మనసనే ఒక సంపదా ప్రతి మనిషిలోనూ ఉండనీ
మమతలే ప్రతి మనసులో కొలువుండనీ
మనుగడే ఒక పండగై కొనసాగనీ
కొత్త బంగారు లోకం మాకు కావాలి సొంతం
గాలి పాడాలి గీతం పుడమి కావాలి స్వర్గం

గీతం: కొత్త బంగారు లోకం...
చిత్రం: దొంగ దొంగ
రచన: రాజశ్రీ
– పంపినవారు: సి.ప్రశాంతి, బెంగళూరు

కె.జె. యేసుదాసు... సంగీత ప్రియులకు సుపరిచితమైన పేరు. ఆయన గళం, గాత్రం, గానం దైవానుగ్రహం అనిపిస్తాయి. ఆయన గొంతెత్తితే సరిగమలు పరవళ్లు తొక్కుతాయి. భాషలకు, ప్రాంతాలకు అతీతంగా అశేష ప్రజాభిమానాన్ని సొంతం చేసుకున్న కళాకారుడు యేసుదాసు. వేల పాటల్ని సినీ రంగానికి కానుకగా అందించిన ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఇప్పుడు హైదరాబాద్‌లో సంగీత విభావరి నిర్వహించబోతున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో యేసుదాసు సంగీత కార్యక్రమం జరగబోతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

మా ఇద్దరికీ ఒకే మైకు ఉండేది



- పదేళ్ల తరవాత హైదరాబాద్‌లో సంగీత విభావరి నిర్వహించడం ఆనందంగా ఉంది. ఇక్కడ సంగీతాభిమానుల సంఖ్య ఎక్కువ. వారందరి కోసం తెలుగు పాటల్ని ఎక్కువ ఆలపిస్తాను. కొన్ని హిందీ గీతాలు, ఇంకొన్ని మలయాళీ పాటలూ వినిపిస్తాను.
- నేను సాహిత్యం విషయంలో చాలా కఠినంగా ఉంటాను. ఇది మా తల్లిగారి నుంచి సంక్రమించిన అలవాటు. క్రైస్తవ కుటుంబంలో పుట్టాను. కానీ మా అమ్మగారు మాత్రం 'నువ్వు అక్షరాల్ని మాత్రం సంస్కృతంలోనే నేర్చుకో' అని సలహా ఇచ్చారు. చదువు విషయంలో ఎలాంటి ఆంక్షలూ విధించలేదు. ఏనాడూ 'నువ్వు బాగా చదవాల్సిందే' అని ఒత్తిడి పెంచలేదు. కర్నాటక సంగీతం మాత్రం నేర్చుకోమని, అందులో పరిణితి తెచ్చుకోమని చెప్పేవారు. చదువు తరవాతే అన్నీ అనుకునే రోజుల్లో కళల్ని ప్రోత్సహించడం నా అదృష్టం.
- గురువు లేకుండా ఎవ్వరూ గొప్ప వాళ్లు కాలేరు. నా తల్లిదండ్రులు నాకు గురువు, దైవంతో సమానం. మా తోబుట్టువులూ బాగా పాడేవారు. కానీ నాన్నగారు వాళ్లనెప్పుడూ ప్రోత్సహించలేదు. నా భుజం మాత్రం తట్టేవారు. 'నువ్వు బాగా పాడుతున్నావ్' అని నాన్నగారు ఏ రోజూ నాతో చెప్పలేదు. ఆయన మరణించేంత వరకూ ఆ మాట నేను ఆయన నోటి నుంచి వినలేదు. మన బిడ్డల్ని మనమే పొగడకూడదన్న ఉద్దేశం ఆయనది. ఈ విషయంలో ఈ తరం అభిప్రాయాలు వేరుగా ఉండొచ్చు.
- ఎన్నో పాటలు పాడాను. ఎన్నో ఏళ్లుగా సాధన చేస్తున్నాను. అయితే నేనేం సంగీత విద్వాన్‌ని కాను. ఇప్పటికీ నిత్య విద్యార్థినే. ప్రతి రోజూ ఏదో ఓ కొత్త విషయం నేర్చుకుంటూనే ఉన్నాను. సంగీతం ఓ సముద్రం. ఎప్పటికప్పుడు కొత్త అనుభవాలు అందిస్తూ, కొత్త పాఠాలు నేర్పుతుంటుంది. చేసిన తప్పుల్ని దిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే నేను చేయాల్సింది. నిన్న జరిగిన తప్పుల్ని ఈ రోజు సరిదిద్దుకోగలిగితే రేపటి భవిష్యత్తు మనదే. ఈ విషయం విద్యార్థులు బాగా గుర్తుపెట్టుకోవాలి.

> పవిత్రమైన శరీరం, నిర్మలమైన మనసు కలిస్తే ఏ రంగంలో అయినా విజయాన్ని సాధించగలం. మానసిక నిర్మలత్వం రావాలంటే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం అవసరం.

- సాంకేతికంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాం. సంగీతంలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. అప్పట్లో నేనూ, పి.సుశీల కలిసి ఎక్కువ పాటలు ఆలపించాం. మా ఇద్దరికీ ఒకే మైకు ఉండేది. దాన్నే మార్చుకుంటూ పాడేవాళ్లం. ఇప్పుడు అలా కాదు. ఎవరి ట్రాకు వాళ్లదే. ఇటీవల నేను మలయాళంలో ఓ పాట పాడాను. నాతో పాటు పాడిన గాయని మొహం కూడా నాకు తెలీదు. నా ట్రాక్ వేరుగా, తన ట్రాక్ వేరుగా రికార్డు చేశారు. అప్పట్లో కలిసి పాడేవాళ్లం కాబట్టి.. గాయనీ గాయకుల మధ్య చాలా సాన్నిహిత్యం ఉండేది. ఇప్పుడు ఆ అవకాశం ఉండదు. ఈ రోజున విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. సౌకర్యాలు పెరిగాయి. కంపోజిషన్ కొత్త పుంతలు తొక్కుతోంది. ఎవరైనా సరే మార్పుని స్వాగతించాల్సిందే.
- నేటి తరం బాగా పాడుతోంది. గాయనీగాయకులకు క్రమశిక్షణ, ఏకాగ్రత చాలా అవసరం. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుంటుండాలి. గురువులు చెప్పిన విషయాల్ని ఆచరించాలి. సంగీత రంగంలో సుప్రసిద్ధులైన వాళ్లని కలుసుకుని, వారి సలహాలు పాటించాలి. ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. అప్పుడే ఉన్నత శిఖరాలు అందుకోగలరు.



"సినిమాల్లోనైనా, రాజకీయాల్లోనైనా నా పాత్రలకి వంద శాతం న్యాయం చేయడానికే ప్రయత్నించా" అన్నారు ప్రముఖ నటుడు కృష్ణంరాజు. 'చిలకా గోరింక'తో నట ప్రయాణం మొదలుపెట్టిన ఆయన 54 ఏళ్ల సుదీర్ఘ నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకొన్నారు. సొంత నిర్మాణ సంస్థ గోపీకృష్ణ మూవీస్‌పై నట వారసుడు ప్రభాస్‌తో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాజీ కేంద్రమంత్రి అయిన ఆయన, బీజేపీ నాయకుడిగా రాజకీయాల్లోనూ కొనసాగుతున్నారు. ఆదివారం కృష్ణంరాజు 79వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన శనివారం 'ఈనాడు సినిమా'తో పంచుకున్న విషయాలివీ...

అమితాబ్ అదే గుర్తు చేశారు

"పుట్టినరోజు అనగానే నాకు నా అభిమానులే గుర్తుకొస్తారు. 'అమరదీపం' నుంచి పరిశ్రమలో నా జన్మదిన వేడుకలు జరుగుతున్నాయి. దండలు, పుష్ప గుచ్ఛాలతో వచ్చే అభిమానులను ఆ డబ్బుని సమాజ సేవకి ఉపయోగించమని చెప్పేవాణ్ని. వాళ్లూ అదే పాటిస్తున్నారు. ఇతర కథానాయకుల అభిమానులతోనూ సఖ్యతగా మెలిగేవాళ్లు. దాంతో నాకు విలువ పెరిగింది".

✦ "సుదీర్ఘమైన నా సినీ ప్రయాణంలో పరాజయాలు తక్కువే కానీ, కెరీర్ పరంగా చాలా ఒడుదుడుకుల్ని చూశా. నటన పరంగా, నిర్మాణం పరంగానూ కొత్త ట్రెండ్‌కి శ్రీకారం చుడుతూ సినిమాలు చేశా. పౌరాణిక నేపథ్య కథలు పెద్దవాళ్లు, మహిళలకి మాత్రమే పరిమితం అనుకొంటున్న పరిస్థితుల్లో 'భక్తకన్నప్ప' చేశా. హిందీలో మాత్రమే ఇలాంటి సినిమాలు సాధ్యం అనుకొంటున్న పరిస్థితుల్లో 'తాండ్ర పాపారాయుడు' చేశా. రోజూ 5 వేల మందితో, ఏనుగులు, గుర్రాలతో చిత్రీకరణ చేశాం. ట్రెండ్ మారాలని, చిత్ర పరిశ్రమకి మన తోడ్పాటు కూడా ఉండాలనే గోపీకృష్ణ మూవీస్ సంస్థని ప్రారంభించాం".

✦ "పౌరాణికాలు మొదలుకొని అన్ని రకాల కథల్లోనూ నటించా. కలల పాత్రలంటూ ఏమీ లేవు. కానీ కొత్తగా, ఇప్పటిదాకా ఎవ్వరూ చేయని పాత్రలేవైనా వస్తే చేయాలనే తపన ఇప్పుడూ ఉంది. 'కటకటాల రుద్రయ్య'తో పాటు అప్పట్లో నేను చేసిన పాత్రలే నాకు రెబల్‌స్టార్ అనే పేరును తీసుకొచ్చాయి. నటుడిగా ప్రేక్షకుల్లో నాపై ఉన్న గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని, దీటైన పాత్రలొచ్చినప్పుడే సినిమాలు చేస్తున్నా. 'ఎవడే సుబ్రమణ్యం'లో నా పాత్ర చిన్నదే. కానీ అది ఎంతో హుందాగా ఉంటుంది. అలాంటి పాత్రలొస్తే చేయడానికి సిద్ధమే. ప్రస్తుతానికి మా గోపీకృష్ణ మూవీస్‌లో ప్రభాస్ కథానాయకుడిగా నిర్మిస్తున్న చిత్రంపైనే దృష్టి పెట్టా. రోమ్‌లో తొలి షెడ్యూల్‌ని పూర్తి చేశాం. మార్చి తర్వాత మలి షెడ్యూల్ మొదలవుతుంది. చిన్న చిత్రాల్నీ నిర్మించాలని ఉంది. కానీ కథలు రాసేవాళ్లే కనిపించడం లేదు. కథానాయకుడిగా నేను దక్షిణాదిలోనే తెలుసు, కానీ నా వారసుడు ప్రభాస్ జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవడం నాకు ఎక్కువ ఆనందాన్నిచ్చే విషయం. ప్రభాస్ పెళ్లి గురించి కుదిరినప్పుడు మేమే చెబుతాం".

✦ "అప్పట్లో కేంద్రమంత్రిగా నేను బాధ్యతలు నిర్వర్తించిన ప్రతి విభాగంలోనూ కొత్తదనం తీసుకొచ్చేందుకు ప్రయత్నించా. ఎంపీగా నా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశా. 400 ఊళ్లు ఉంటే అన్నిచోట్లా నా ముద్ర కనిపిస్తుంది. కానీ ఆ తర్వాత డబ్బు ఇస్తే కానీ ఓట్లు వేయని పరిస్థితులొచ్చాయి. ప్రభుత్వాలు కూడా ప్రజల్ని సోమరిపోతులుగా మార్చకుండా, వాళ్ల ఉపాధికి పనికొచ్చేలాగా అభివృద్ధి పనులు చేయాలి. రైతాంగానికి, అవసరమైన వాళ్లకి మాత్రమే రాయితీలు ఇవ్వాలి. వచ్చే ఎన్నికల్లో పోటీ విషయం గురించి ఇంకా ఏమీ ఆలోచించలేదు. ప్రస్తుతానికి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టిపెట్టాం".

> రాజకీయాల్లోనూ అరుదైన ప్రయాణం నాది. దేశంలో కేంద్రమంత్రి అయిన తొలి కథానాయకుణ్ని నేనే. అమితాబ్ బచ్చన్‌ని కలిసినప్పుడు అదే విషయాన్ని గుర్తు చేస్తూ... 'మీరు నాకు బాగా తెలుసు, 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమంలో కేంద్రమంత్రి అయిన తొలి కథానాయకుడు ఎవరనే ప్రశ్న అడిగాన'ని చెప్పారు.

నీడతో యుద్ధం



సందీప్‌కిషన్, అన్యసింగ్

సందీప్‌కిషన్, అన్య సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'నిను వీడని నీడను నేనే'. దయా పన్నెం, విజి.సుబ్రహ్మణ్యన్ నిర్మాతలు. కార్తీక్ రాజు దర్శకుడు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. దర్శకుడు మాట్లాడుతూ "కథానాయకుడు తన నీడతో యుద్ధం చేయడమే ఈ చిత్రం ప్రత్యేకత. ఇప్పటివరకూ ఎవ్వరూ తెరకెక్కించని వినూత్నమైన కథ ఇది. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. నాయకానాయికలపై హైదరాబాద్‌లో కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం. ఓ పోరాట దృశ్యం కూడా చిత్రీకరించాల్సి ఉంది. దాంతో సినిమా పూర్తవుతుంద"న్నారు. "అందరినీ ఆకట్టుకుంటుంది. ఫిబ్రవరిలో విడుదల చేస్తామ"న్నారు నిర్మాత.

పరిశ్రమ కళకళలాడుతోంది



నరేష్

"ఇది వరకు పక్క రాష్ట్రాల నుంచి కథల్ని అరువు తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు మన కథల్ని వాళ్లు రీమేక్ చేస్తున్నారు. కొత్త దర్శకులు సరికొత్త ఆలోచనలతో రావడమే అందుకు కారణం. గత కొన్నేళ్లతో పోలిస్తే తెలుగులో విజయాల శాతం పెరిగింది. దాంతో పరిశ్రమ కళకళలాడుతోంద"న్నారు నరేష్. 2018 ఆయనకు కలిసొచ్చింది. దాదాపు డజను చిత్రాల్లో మెరిశారు. అందులో ఎనిమిది చిత్రాలు విజయవంతమయ్యాయి. ఈ రోజు తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు నరేష్.

- "2018లో 12 చిత్రాలు విజయం సాధిస్తే, అందులో ఎనిమిది చిత్రాల్లో నేను నటించాను. 'ఛలో', 'రంగస్థలం', 'మహానటి', 'అరవింద సమేత వీర రాఘవ', 'సమ్మోహనం' సంతృప్తినిచ్చాయి. దర్శకులు నన్ను దృష్టిలో ఉంచుకుని పాత్రల్ని రాసుకుంటున్నారు. అంతకంటే ఓ నటుడికి కావల్సిందేముంది?".
- "పారితోషికం, పాత్ర నిడివి ఇవేం నాకు ముఖ్యం కాదు. నా పాత్ర కొత్తగా ఉంటే చాలు. ప్రతినాయకుడి పాత్రలకూ సిద్ధమే. చిత్రసీమకొచ్చి 47 ఏళ్లయ్యింది. నా క్రమశిక్షణ, అంకితభావమే నన్ను నడిపిస్తున్నాయి".
- 'మా' సభ్యుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాల్ని ప్రవేశపెట్టాం. ఆ ఫలాలు ఇప్పుడు అందుతున్నాయి. త్వరలో 'మా' ఎన్నికలు జరగబోతున్నాయి. అధ్యక్ష పదవి ఏకగ్రీవం కాని పక్షంలో ఎన్నికల బరిలో దిగడానికి నేను సిద్ధం. 'మా' అధ్యక్షుడిగా ఎవరు చేసినా ఒక పర్యాయమే ఆ పదవిలో ఉండాలని అనుకున్నాం. నేనూ దానికి కట్టుబడి ఉంటాను. పదవీ వ్యామోహంతోనో, కుర్చీపై ఆశతోనో ఎన్నికల్లో నిలబడతాననడం లేదు. ధర్మాన్ని రక్షించడానికి అవసరమైతే ముందుకు వస్తా".

ధైర్యం ఎక్కువ



నేహా

రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'గేమర్'. వీడికి ధైర్యం ఎక్కువ అనేది ఉపశీర్షిక. శ్రనిత్‌రాజ్, కల్యాణి పటేల్, అనిరుథ్, నేహా ప్రధాన పాత్రలు పోషించారు. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ "ట్రైలర్ బాగుంది. అన్ని అంశాల్నీ పొందుపరుస్తూ ప్రేక్షకులకు నచ్చేలా తీశారు. చిన్న సినిమాల్ని ప్రోత్సహించడం చాలా అవసరం. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాల్ని అందిస్తోంద"న్నారు. "దర్శకుడిగా ఇది నా ఏడవ చిత్రం. వచ్చే నెలలో విడుదల చేస్తామ"న్నారు రాజేష్.

నాలుగేళ్ల క్రితం వరకూ ఆమె అందరిలాంటి సాధారణ అమ్మాయే.
సంప్రదాయ నృత్యం, సంగీతం, చదువు... ఇవే ఆమె ప్రపంచం.
నాణేన్ని తిరగేసినట్లు ఒక్కసారిగా ఆమె పూర్తిగా మారిపోయింది.
కత్తిరించిన జుట్టు, చేత్తో రైఫిల్‌తో మార్చ్‌పాస్ట్ చేస్తూ...
ఇంటికి దూరంగా, దేశరక్షణే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.
ఆమే తెలుగమ్మాయి, హైదరాబాదీ లెఫ్టినెంట్ భావనాకస్తూరి.

పురుష జవాన్ల నాయకి





రానున్న జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దిల్లీలోని రాజ్‌పథ్‌లో 144 మంది పురుష జవాన్ల బృందాన్ని ముందుండి నడిపించబోతోంది భావన. అదీ ఇరవైమూడేళ్ల తరువాత. ఒక అమ్మాయిగా ఈ అవకాశాన్ని మొదటిసారి అందుకుంది ఆమె. సైన్యంలో ఆర్మీ సర్వీస్ కార్ప్స్‌లో ఆఫీసర్‌గా చేస్తోందామె. ఆ విభాగం 23 సంవత్సరాల తరువాత గణ తంత్ర దినోత్సవంలో భాగం కాబోతోంది. అలా బృందానికి నాయకత్వం వహిస్తోంది భావన. 'ఆర్మీ సర్వీస్ కార్ప్స్ అనేది సైన్యంలో ఓ విభాగం. భారత సైన్యానికి లాజిస్టిక్స్ సహకారం అందించడం మా పని. ఇప్పుడు నాకు వచ్చిన ఈ అవకాశాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. సాధారణంగా మహిళలకు రాదు. ఆరునెలల క్రితం మమ్మల్ని బెంగళూరు రమ్మన్నారు. అక్కడ ఎంపికలు జరిగాయి. సైనిక బృందానికి నాయకత్వం వహిస్తానని అనుకోలేదు. నాతోపాటు మరో అమ్మాయి కూడా ఉంది. శిక్షణ మొదలైంది. పరేడ్, డ్రిల్ ఇలా చాలా జరిగాయి. డిసెంబరు చివరి వారంలో నన్ను కంటింజెంట్ కమాండర్‌గా ఎంపిక చేస్తూ నాయకత్వం వహించమన్నారు...' అని చెబుతుంది భావన.

> శిక్షణలో ఉన్నప్పుడే కాదు, ఇప్పుడు కూడా ఇంట్లోవాళ్లతో రోజూ ఫోను మాట్లాడే అవకాశం ఉండదు. శిక్షణలో ఉన్నప్పుడయితే ఉత్తరాలు రాసేదాన్ని. అప్పుడు అది నాకు కొత్తే కానీ అలవాటైపోయింది. ఇప్పుడు కూడా ఏ మూడునాలుగు రోజులకోసారో అమ్మకు ఫోను చేస్తా. వాళ్ల మాటల్లో నేను వాళ్లకు దూరంగా ఉన్నాననే బాధ కన్నా ఆనందమే ఎక్కువగా ఉంటుంది. అంతకన్నా కావల్సిందేముంటుంది.

నాలుగోసారి సాధించి...

భావనది సంప్రదాయ కుటుంబ నేపథ్యం. పుట్టిపెరిగినదంతా హైదరాబాద్‌లోనే. తండ్రి సీసీఎంబీ ఉద్యోగి. తల్లి స్టెనోగ్రాఫర్. చిన్నప్పుడు ఇష్టంతో నాట్యం, సంగీతం నేర్చుకుంది. ఆ రెండే తన భవిష్యత్తు అనుకుంది. సాధన చేయడం, ప్రదర్శనలు ఇవ్వడమే ప్రపంచంగా గడిపింది. అయితే చదువుకుంటున్నప్పుడు సైన్యం గురించి వింది. దానికి కారణం డిగ్రీలో ఉన్నప్పుడు ఎన్‌సీసీలో చేరడమే. ఎలాగైనా సైన్యంలోకి రావాలనుకుంది. దానికి షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికలు జరుగుతాయని తెలుసుకుంది. ప్రతిఏటా దేశ వ్యాప్తంగా కొన్ని వేలమంది ఈ పరీక్షలు రాసినా అవకాశం మాత్రం నలుగురికే వస్తుందని తెలుసుకున్న ఆమె... ఆ పరీక్షలో అర్హత సాధించేందుకు ప్రణాళికలు వేసుకుంది. అప్పటికే డిగ్రీ పూర్తిచేసిన భావన ఓ వైపు ఆ పరీక్షలకు సిద్ధమవుతూనే... మరోవైపు సమయం వృథా కాకుండా ఉస్మానియాలో ఎంఎస్సీ మైక్రోబయాలజీలో చేరింది. కానీ అమె అనుకున్నది ఒక్కటి. జరిగింది మరొకటి. మొదటిసారి ఎంతో ఉత్సాహంగా పరీక్షలు రాసింది. అవకాశం వస్తుందని అనుకుంది... కానీ రాలేదు. మరో రెండుసార్లు ప్రయత్నించినా సాధించలేకపోయింది. అయినా పట్టు వదల్లేదు. నాలుగోసారి ప్రయత్నించింది. ఈసారి పలు ఇంటర్వ్యూలు, వడపోతల అనంతరం నాలుగోసారి, నాలుగో అమ్మాయిగా అవకాశం అందుకొంది. అలా చెన్నైలోని 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ' (ఓటీఏ)లో శిక్షణకు అర్హత సాధించింది.

జుట్టు కత్తిరించుకుంది...

వచ్చిన అవకాశం గురించి తెలిసి, తన చుట్టూ ఉన్నవారు సంతోషిస్తారనుకుంది భావన. కానీ చాలామంది నుంచి ప్రతికూల సమాధానమే వచ్చింది. 'ఆర్మీ శిక్షణ అంటే చాలా కష్టంగా ఉంటుంది. ఆడపిల్లవి. నీ వల్ల కాదు...' అని కొందరంటే... 'చక్కగా నాట్యం నేర్చుకున్నావ్. సంగీతం కూడా వచ్చు. ప్రయత్నిస్తే ఐటీ ఉద్యోగం వస్తుంది. భవిష్యత్తు బాగుంటుంది. పెళ్లి చేసుకుని హాయిగా స్థిరపడక ఇంత కష్టం అవసరమా' అని మరికొందరు అన్నారు. ఎవరెన్ని చెప్పినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకే సిద్ధమైంది. శిక్షణ కోసం అప్పటివరకూ ఎంతో ఇష్టంగా పెంచుకున్న జుట్టుని కత్తిరించుకోవాల్సి వచ్చింది. అదే చేసింది. అలా 2015లో సైనికురాలిగా శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. అప్పుడే ఆమెకు అసలు సవాళ్లు ఎదురయ్యాయి. శిక్షణలో భాగంగా కఠినమైన పరీక్షలు తప్పలేదు. 'ఒక్క క్షణం ఖాళీ దొరికేది కాదు. ఒక్కోసారి పరుగెడుతున్నప్పుడు కాళ్లు కదపలేని స్థితిలో కూర్చుండిపోయేదాన్ని. కాస్త విశ్రాంతి తీసుకుందామనుకున్నా మరో పని ఉండేది. మొదట్లో మనసూ, శరీరం రెండూ సహకరించేవి కావు. శరీరం పుండులా మారిపోయింది. అలసిపోయినా నిద్రపట్టేది కాదు. గుర్రపుస్వారీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఈత, రాకెట్ లాంచింగ్... ఒకటేమిటి ఎన్నో ఉండేవి. ఓసారి 20 కిలోల బరువైన బ్యాగును భుజాన వేసుకుని నలభై కిలోమీటర్లు పరుగెత్తాలని చెప్పారు. అదీ రాత్రంతా పరుగెత్తి తెల్లారేసరికల్లా చేరుకోవాలి. మా బ్యాచ్‌లో మొత్తం 250 మంది ఉంటే అమ్మాయిల సంఖ్య 30. మొదట మా వల్ల ఆ పని సాధ్యమవుతుందా అని అనుకున్నాం. కానీ ఒకరు వెనకడుగు వేసినా... మరొకరం ప్రోత్సహించుకుంటూ పరుగెత్తాం. అలా నేను చెప్పిన సమయం కన్నా ముందే చేరుకోగలిగా. అప్పుడే అనిపించింది. మహిళలు తలచుకుంటే ఏమైనా చేయగలరని. అలా శిక్షణలో భాగంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా... అన్నింటినీ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో అధిగమించా. ఇంట్లో ఓ పట్టాన నిద్రలేచేదాన్ని కాదు. శిక్షణలో భాగంగా నాలుగ్గంటలకే లేచేదాన్ని. పరేడ్, పరుగు ఇలా అబ్బాయిలతో సమానంగా చాలా చేయాలి. ఒక్కోసారి చేయలేకపోయినా నా లక్ష్యం గుర్తొచ్చినప్పుడల్లా కసిపుట్టేది. చివరకు రోప్‌పుషింగ్, ఫైరింగ్... ఇలా చాలా విభాగాల్లో ముందున్నా. శిక్షణ పూర్తయ్యేసరికి అకాడమీలో టాపర్‌గా నిలిచా. అవన్నీ నాకు గుర్తింపునే కాదు, ఈ అవకాశాన్ని తెచ్చిపెట్టాయి...' అని చెబుతుంది భావన.

ఏడుపొచ్చేసింది..

భామనే సత్యభామే అంటూ జడని వయ్యారంగా తిప్పుతూ... నృత్యం చేస్తూ, దేశవిదేశాల్లో ప్రదర్శన ఇచ్చిన నేను ఇటువైపు వస్తానని అనుకోలేదు. శిక్షణ పూర్తయిన వెంటనే నాకు కార్గిల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఆ క్షణం నాకు మేజర్ పద్మపాణి ఆచార్య గుర్తొచ్చారు. ఒక్క క్షణం భయం అనిపించినా... ఆయన వీర మరణం ఎంత మందిలో దేశభక్తి రగిలించిందో గుర్తొచ్చింది. ఉత్సాహంగా చేరిపోయా. మహిళా జవానుగా భరతమాతకు సేవ చేసే అవకాశం నాకు వచ్చిందని సంతోషించా. మొదటిసారి కార్గిల్‌కి వెళ్లినప్పుడు ఆ ప్రాంతం నాకు చాలా అందంగా కనిపించింది. అక్కడ యుద్ధంలో చనిపోయిన వార్ హీరోల ఉత్తరాలు ఉంటాయి. వాటిని చదివినప్పుడు ఏడుపు వచ్చేసింది. ఒక సైనికురాలిగా నేనెలా ఉండాలో కూడా అర్థమైంది. దేశం కోసం నిస్వార్థ సేవ చేయాలని, చనిపోయినా ఆనందమేనని, దేశం తరువాతే కుటుంబం అని ఆ క్షణానే నిర్ణయించుకున్నా.

శిఖ... స్టంట్ ఉమన్‌గా!



ఈమె పేరు కెప్టెన్ శిఖా సురభి. ఐదేళ్లక్రితం సైన్యంలోకి వచ్చిన ఆమె... అంచెలంచెలుగా ఎదిగింది. ఇప్పుడు గణ తంత్ర దినోత్సవంలో పాల్గొనే మరో అరుదైన అవకాశాన్ని అందుకుంది.

శిఖది సైన్యంలో ఫస్ట్ కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్ విభాగం. ప్రస్తుతం పంజాబ్‌లోని బటిండాలో పనిచేస్తోంది. ఇప్పుడు డేర్‌డెవిల్స్ టీం తరపున జనవరి 26న మోటార్‌సైకిల్‌మీద స్టంట్ చేయబోతోంది. భారత సైన్యం తరపున మొదటిసారి ఇలాంటి అవకాశాన్ని అందుకుందామె. ఇందుకోసం కఠోర శిక్షణ కూడా తీసుకుంది. శిఖా సురభిది జార్ఖండ్. ఆమె కుటుంబసభ్యుల్లో కొందరు ఇప్పటికే సైన్యంలో ఉన్నారు. తల్లి పీటీ టీచర్. దాంతో శిఖను చిన్నతనం నుంచీ... కరాటె, కిక్‌బాక్సింగ్‌తోపాటు ఇతర క్రీడల్లోనూ ప్రోత్సహించిందామె. అలా శిఖ ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు కిక్‌బాక్సింగ్‌లో జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొంది. బీటెక్ పూర్తిచేసిన ఆమె రెండేళ్లు ఓ ఎంఎన్‌సీలోనూ పనిచేసింది. మొదటినుంచీ సైన్యంపై ఆసక్తి ఉండడంతో 2014లో ఇటువైపు వచ్చింది. ఏడాదికే లెఫ్టినెంట్ ఆ తరువాత కెప్టెన్ స్థాయికి చేరుకుంది. ఈ సంవత్సరం భారత సైన్యం మహిళా అధికారుల చేత స్టంట్స్ చేయించాలనే ఉద్దేశంతో కొందరిని ఎంపిక చేయాలనుకుంది. దానికోసం ట్రయల్స్ నిర్వహించింది. శిఖకు ముందే బైక్ నడపడం వచ్చు. అలా డేర్ డెవిల్స్‌కి ఎంపికైన ఆమె... తరువాత ఆ బృందం నేతృత్వంలో స్టంట్స్ చేయడం మొదలుపెట్టింది. 'దీనికి ఎంపికవడం ఆనందం కలిగించినా ప్రారంభంలో భయపడుతూనే సాహసాలు చేయడానికి సిద్ధమయ్యా. మూడునాలుగు నెలలు శిక్షణ తీసుకున్నా. గాయాలు కాలేదు కానీ... క్రమంగా అలవాటైంది. ఇప్పుడు బైక్‌పై నిల్చుని రాజ్‌పథ్‌లో గణతంత్ర కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథికి సెల్యూట్ చేయబోతున్నా. నా వెనుక తొమ్మిది బైకుల్లో ఆర్మీ జవాన్లు పిరమిడ్ ఆకృతిలో వస్తారు. అలా దాదాపు 2.4 కిలోమీటరు బైక్‌పై నిల్చుని వస్తా. ఇదే స్టంట్‌ని ఈ సంవత్సరం జనవరి 15 న ఆర్మీ దినం రోజున కూడా చేశా. డేర్‌డెవిల్స్ బృందం కొన్నేళ్లుగా స్టంట్లు చేస్తోంది. రికార్డులు కూడా ఉన్నాయి. ఇప్పుడు నాకు అవకాశం వచ్చింది...' అని చెబుతుందామె.

సిగరెట్‌ప్యాంట్లు... స్టైలే వేరు!



? నా వయసు పదిహేడేళ్లు. కాలేజీకి వెళ్తున్నా. జీన్స్ వేసుకోవడం సౌకర్యమే కానీ... ఒక్కోసారి బోర్‌గా అనిపిస్తోంది. దాన్ని ఇంకాస్త కొత్తగా ఎలా ఎంచుకోవచ్చు. జీన్స్‌కి ప్రత్యామ్నాయంగా ఇంకేమైనా ప్రయత్నించొచ్చా?

– రిత్విక, హైదరాబాద్

✔ కాలం మారుతున్నా జీన్స్‌కి ఆదరణ తగ్గడం లేదు. అయితే తరచూ వేసుకోవడం వల్ల మీకు బోర్‌గా అనిపిస్తుండొచ్చు. వీటిల్లోనే సిగరెట్, టోర్న్డ్, ప్రింటెడ్ రకాలు ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వాటిని ప్రయత్నించి చూడండి. యాంకిల్, కాఫ్ లెంగ్త్‌లో ఎంచుకుంటే స్టైలిష్ లుక్‌తో అదరగొట్టేయొచ్చు. అదీ కాదనుకుంటే జీన్స్ లుక్‌లోనే ఉండే జెగ్గింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వొచ్చు. వీటిల్లో ఎన్నో రంగులు లభిస్తాయి. అలాగే జెగ్గింగ్స్‌తో పాటు లెగ్గింగ్స్, హారేమ్ ప్యాంట్‌లు, పలాజోలు వంటివి వాడొచ్చు. ఇవేవీ కాదనుకున్నప్పుడు స్కర్ట్స్, పొడవాటి గౌన్‌లు ప్రయత్నించండి. జంప్ సూట్‌లు కూడా బాగుంటాయి. వీటిపై పొడవాటి ష్రగ్, జాకెట్ వంటివి ప్రయత్నిస్తే చూడచక్కగా కనిపిస్తారు. కుచ్చిళ్లు, రఫుల్స్, బెల్ స్లీవ్స్ వంటి డిజైన్లతో కొత్తగా కనికట్టు చేయొచ్చు. సందర్భాన్ని బట్టి చేనేత రకాలు, క్రేప్, జార్జెట్ వంటి వస్త్రాలతోనూ కుట్టించుకోవచ్చు. ఈ గౌన్‌లను పొడుగ్గానే కాకుండా త్రీఫోర్త్‌ల్లోనూ ప్రయత్నించొచ్చు.

డియర్ వసుంధర



నిహారికారెడ్డి
డిజైనర్

– మీ సందేహాలను, సమస్యల్ని vasufash@eenadu.net కు పంపించగలరు.

గ్రామాన్ని కాపాడాలని...

ఈ అమ్మాయి వయసు 17 ఏళ్లే. అయితేనేం... తమ గ్రామంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా గురించి ఓ వీడియోను సోషల్ మీడియాలో ఉంచింది. ఇది వైరల్ కావడమే కాదు, నేషనల్ ట్రిబ్యునల్ యాక్ట్ (ఎన్‌టీఏ) 'దృష్టికి వెళ్లింది. తక్షణం విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ కొల్లం జిల్లా యంత్రాంగాన్ని ఎన్‌టీఏ ఆదేశించింది.



కేరళ, అలప్పాడ్‌కు గ్రామానికి చెందిన ఎస్.కావ్య 12వ తరగతి చదువుతోంది. దక్షిణ కేరళలో కొల్లం, అలపుళా తీరం వెంబడి అలప్పాడ్ సహా పలు గ్రామాలున్నాయి. ఈ ప్రాంతాల్లో విలువైన ఖనిజాలుండే నల్లమట్టి, ఇసుక అధికం. వీటిని గత 50 ఏళ్లుగా అక్రమంగా తరలిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఇప్పటికే చాలా ప్రాంతాలు నిర్జీవంగా మారాయి. ఇదే కొనసాగితే తాము నివసించే ప్రాంతాలన్నీ కూడా భవిష్యత్తులో భారతదేశ పటంలో కనిపించకుండా పోతాయంటుంది కావ్య. 'ఈ అక్రమ రవాణాను ఆపడానికి స్థానికులు గతంలో చాలా ప్రయత్నించారు. పలు పోరాటాలకు కూడా దిగారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. ఇలా ఇసుకను అక్రమంగా తరలించుకుంటూ పోతే... పర్యావరణానికి హాని. దీనికి సంబంధించి నేను ఏదైనా చేయగలనా అని ఆలోచించా. ప్రస్తుతం సోషల్‌మీడియా అన్నింటికీ వేదిక కాబట్టి దాని ద్వారా మా ఊరి సమస్యను ప్రపంచానికి తెలియజేయాలనుకున్నా. ఇక్కడ జరుగుతున్న సమస్యని వీడియో తీశా. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఈ ప్రాంతాన్ని రక్షించాలని కోరా. ఇక్కడ చేపల వేటనే ఉపాధిగా చేసుకుని బతుకుతున్న వేలాదిమందిని కూడా ప్రభుత్వమే కాపాడాలని అభ్యర్థించా. ఈ వీడియోని సోషల్‌మీడియాలో పొందుపరిచా. దీనిని చూసిన వారిని షేర్ చేయాలని కోరా. చాలామంది చూడటమే కాదు, షేర్ కూడా చేశారు. అలా అది వైరల్ అయ్యింది. ఈ వీడియోనే కేరళ న్యాయస్థానం సుమోటోగా స్వీకరించింది. దీంతోపాటు 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' కూడా స్పందించింది. జిల్లా యంత్రాంగం నుంచి తక్షణం నివేదికను కోరింది. నెలలోపు ఈ అంశంపై పూర్తి వివరాలతో నివేదిక అడగడంతో నాకు చాలా సంతోషంగా అనిపించింది. మా వూరికే కాదు, తీర ప్రాంతంలో ఉండే గ్రామాలన్నీ పర్యావరణపరంగా కాపాడాలనేదే నా లక్ష్యం' అని చెబుతుంది కావ్య.

బంగారం వెండి

19న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,091	3,093
వెండి (గ్రా)	42.10	42.50



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,380	33,450	32,900	33,000	32,900	32,900	33,380	33,380	33,200	33,310
ఆర్నమెంట్	31,240	31,250	30,500	30,600	30,410	30,300	30,910	31,040	30,880	30,980
వెండి(కిలో)	40,200	40,330	40,300	40,600	40,200	40,500	40,200	40,300	41,000	41,500

గుండ్రంగా తిప్పేద్దాం!



గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చోవడం, టీవీ చూడటం, ఎక్కువ సేపు తలవంచి పనిచేయడం.... లాంటి పనుల వల్ల మెడ కండరాలు అలసిపోతాయి. ఫలితంగా మెడనొప్పి బాధిస్తుంది. మరి దీన్ని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో చూద్దామా!





కృష్ణశ్రీ
యోగా నిపుణురాలు

1: నువ్వుల నూనె లేదా ఆవ నూనెతో చాలా నెమ్మదిగా మెడ దగ్గర మర్దన చేయాలి. ఇలా ప్రతిరోజూ చేస్తే కండరాలకు సాంత్వన లభిస్తుంది.

2: మంచం మీద పడుకుని తలను కిందకు వాల్చాలి. చేతులు కూడా తలకు ఇరువైపులా వెనక్కి పెట్టి ఇలా వీలైనంతసేపు ఉండాలి. రోజూ నిద్రపోయేముందు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

3: శ్వాసను తీసుకుంటూ తలను పైకి, శ్వాసను వదులుతూ కిందకు దించాలి. అలాగే మెల్లిగా రెండు పక్కలకు చేయాలి. శ్వాస తీసుకుంటూ మెడను కుడి లేదా ఎడమవైపు తిప్పాలి. అలాగే వదులుతూ యథాస్థానానికి రావాలి. మెడ దగ్గర నాడులు సున్నితంగా ఉంటాయి కాబట్టి... చాలా నెమ్మదిగా చేయాలి. మొదట్లో రెండు, మూడు కంటే ఎక్కువసార్లు చేయకూడదు. ఇప్పుడు మెడను నెమ్మదిగా ఒక వైపు భుజానికి ఆనించాలి. ఇలా అయిదు నుంచి పది సెకన్లుండాలి. శ్వాస తీసుకుంటూ రెండో భుజానికి కూడా తలను పూర్తిగా ఆనించే ప్రయత్నం చేయాలి. ఇలా దాదాపు పదిసార్లు చేయాలి. మొదటిసారి చేసేవారు ఒకటి రెండుసార్లు చేస్తే చాలు. ఇప్పుడు తలను భుజాలు, శరీరానికి తాకేలా గుండ్రంగా, సవ్య అపసవ్య దిశల్లో తిప్పాలి. ఇలా చేయడం వల్ల మెడ కండరాలు దృఢంగా తయారవుతాయి.

4: ఒక చేత్తో తలను నొక్కుతూ, మెల్లిగా రెండో వైపు తోయాలి. ఇలాగే రెండో వైపు కూడా చేయాలి. రెండు చేతులు కలిపి తల వెనక పెట్టి తలను గట్టిగా అదమాలి. చేతులతో తలను నొక్కడం వల్ల మెడ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఈ వ్యాయామాలు చేస్తున్నప్పుడు మెడ నొప్పిగా ఉంటే మాత్రం వెంటనే ఆపేయడం మంచిది.

మోమోమియా!

దక్షిణాది ఇడ్లీ, సాంబార్‌కి పరిచయం అక్కర్లేదు. ఉత్తరాది పానీపూరీకి, పావ్‌బాజీకి కుర్రకారులో యమక్రేజు. మరి ఈశాన్య రాష్ట్రాల వారు ఇష్టంగా తినే మోమోల సంగతేంటి? మోమోలని పరిపూర్ణాహారం అంటారు ఆహారప్రియులు. తెల్లని బట్టలో చిన్న మూటకట్టినట్టుగా ఉండే మోమోలు ఉండ్రాళ్లూ, కుడుముల్లానే ఉంటాయి చూడ్డానికి. మనం ఉండ్రాళ్ల మధ్యలో తియ్యని పూర్ణం పెడితే మోమోల్లో కాయగూరలూ, సన్నగా తరిగిన మాంసాహారం పెట్టి ఆవిరి మీద ఉడికిస్తారు. ఒకప్పుడు పరాయి ఆహారంగానే తెలిసిన మోమోలు ఇప్పుడు నూడుల్స్ మాదిరిగానే ఎక్కడంటే అక్కడే రుచిరుచిగా పలకరిస్తున్నాయి. కాయగూరలతో, సన్నగా తరిగిన మాసంతో తయారు చేసుకునే మోమోలకు ఎర్రని మిర్చీ చట్నీ అదిరిపోయే కాంబినేషన్.

చూడ్డానికి మన ఉండ్రాళ్లకు వేలువిడిచిన మేనమామ పిల్లల్లా ఉన్నాయి కదూ! వీటి తయారీ కూడా కాస్త అటుఇటుగా అలానే ఉన్నా.. వీటి కథ వేరు! అవే మోమోలు. ఆవిరి మీద ఉడికే ఇవి పోషకాలకు పెట్టింది పేరు. టిబెట్‌లో పుట్టి... డార్జిలింగ్ వచ్చి ప్రస్తుతం మన రెస్టారెంట్లలో వీరవిహారం చేస్తున్నాయి. కాయగూరలంటే ముఖం ముడుచుకునే పిల్లలకు మోమోలతో మాయ చేసి వాటిని ఎలా పెట్టేయొచ్చో మీరే చూడండి...



మోమోలని వేటితో నింపుతారు(ఫిల్లింగ్): మోమోల్లో క్యారెట్, క్యాబేజీ, క్యాలిఫ్లవర్, పనీర్, కోవా, చాక్లెట్, ఆలూ ఇలా వేటితోనయినా నింపుకోవచ్చు. మోమోల్లో చాలా రకాలు ఉంటాయి.

పాన్ ఫ్రైడ్ మోమో: ఉడికించి పెట్టుకున్న మోమోలని పాన్‌లో దోరగా కాల్చుకుంటే అవి పాన్‌ఫ్రైడ్ మోమో.

హాట్ గార్లిక్ మోమో: ఉడికించిన మోమోలని హాట్ గార్లిక్ సాస్‌లో వేయిస్తారు.

తందూరి మోమో: చికెన్‌ని సన్నని పలుకుల్లా తరిగి ఉప్పు, మిరియాల పొడి కలిపి మోమోల్లో కూరతారు. ఆ తర్వాత వాటిని చిక్కని పెరుగులో ముంచి నిర్ణీత ఉష్ణోగ్రత దగ్గర బేక్ చేస్తారు. అదే తందూరి మోమో.

మలాయ్ మోమో: తందూరి మోమోలని తయారుచేసిన తర్వాత వాటిపై మీగడకానీ, పెరుగుకానీ వేసి కొత్తిమీర చల్లితే మలాయ్ మోమోలు రెడీ.

మోమో బర్గర్: బర్గర్ల మధ్యలో మోమోలని ఫిల్లింగ్‌గా ఉంచే ఈ ఆహారానికి ఈ మధ్యకాలంలో భలేగా డిమాండ్ పెరుగుతోంది.

వెజ్‌మోమో



కావాల్సినవి: మొక్కజొన్న గింజలు- అరకప్పు, తరిగిన క్యారెట్ ముక్కలు- పావుకప్పు, క్యాప్సికమ్ ముక్కలు- అరకప్పు, పచ్చిబఠాణీలు- పావుకప్పు, ఉల్లిపాయ- అరముక్క, క్యాబేజీ తరుగు- పావుకప్పు, వెల్లుల్లి తరుగు- రెండు చెంచాలు, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- రుచికి తగినంత, మిరియాల పొడి- పావుచెంచా, సోయాసాస్- కొద్దిగా, నిమ్మరసం- కొద్దిగా, మ్యాగీ మసాలా- అరచెంచా, కొత్తమీర తరుగు- కొద్దిగా, మైదా: 400గ్రాములు, మెత్తగా దంచిన ఓట్స్ పొడి- రెండు చెంచాలు, బేకింగ్ సోడా- పావుచెంచా, నీళ్లూ, నూనె- తగినంత

తయారీ: మైదా, ఓట్స్‌పొడీ, బేకింగ్ సోడాలని ఒక పాత్రలోకి తీసుకుని తగినంత ఉప్పు వేసి నీళ్లు కలుపుకొంటూ చపాతీపిండిలా ఒత్తుకోవాలి. దీనిపై తడి బట్టను ఉంచి పక్కన పెట్టుకోవాలి. ఒక కడాయిలో నూనె పోసి దాన్లో సన్నగా తరిగిన వెల్లుల్లిపాయలు వేసి దోరగా వేగిన తర్వాత మిగిలిన కాయగూరలు కూడా వేసి వేయించుకోవాలి. అవి కూడా వేగాక దానిలో మ్యాగీ సీజనింగ్, పెప్పర్, ఉప్పు, సోయాసాస్ వేసుకుని పొయ్యి కట్టేసి నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసుకోవాలి. ఇప్పుడు మైదాపిండిని చిన్నచిన్న చపాతీల్లా ఒత్తుకోవాలి. ఇందులో పైన చేసిన మిశ్రమాన్ని ఉంచి చిన్న మూటల్లా తయారుచేసుకోవాలి. వీటిని ఇడ్లీ పాత్రల్లో ఉంచి ఆవిరి మీద ఉడికించుకోవాలి. ఐదు, పదినిమిషాల్లో ఉడికిపోతాయి.

పనీర్ మోమో





కావాల్సినవి: క్యారెట్ తురుము- రెండుచెంచాలు, క్యాబేజీ తురుము- ఐదుచెంచాలు, ఉల్లిపాయ- ఒకటి, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచా, ఉప్పు- తగినంత, మిరియాలపొడి- చెంచా, టేస్టింగ్‌సాల్ట్- చిటికెడు, తురుమిన చీజ్- పావుకప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, వెనిగర్- చెంచా, నీళ్లు- నాలుగు చెంచాలు, నూనె- తగినంత, మైదా- 200గ్రా,

తయారీ: మైదాలో కొద్దిగా ఉప్పు వేసి తగినన్ని నీళ్లు కలిపి చపాతీపిండిలా ఒత్తుకుని పక్కన పెట్టుకోవాలి (ఇరవై నిమిషాలన్నా ఉంచాలి). పాన్‌లో నూనె పోసుకుని వేడిచేసుకోవాలి. అందులో క్యాబేజీ, క్యారెట్, ఉల్లిపాయ తరుగు వేసుకుని వేయించుకోవాలి. పచ్చివాసన పోయిన తర్వాత అల్లంవెల్లుల్లిపాయ పేస్ట్, ఉప్పు, మిరియాలపొడి, టేస్టింగ్‌సాల్ట్, కొత్తిమీర వేసి వెనిగర్ వేసి అన్నీవేగాక పొయ్యికట్టేసి ఒక నిమిషం తర్వాత తరిగిన చీజ్ వేసి కలుపుకోవాలి. కొద్దిగా చల్లారిన తర్వాత మైదాపిండిని చిన్నచపాతీల్లా ఒత్తుకుని అందులో పనీర్ మిశ్రమం ఉంచి నచ్చిన ఆకృతిలో మోమోలు చేసుకోవాలి. వీటిని ఆవిరి మీద ఉడికించుకోవచ్చు. లేదా నూనెలో డీప్ ఫ్రై కూడా చేసుకోవచ్చు.

చికెన్ మోమో





కావాల్సినవి: చిన్నచిన్న ముక్కలుగా తరిగిన చికెన్- కప్పు, మైదా- రెండు కప్పులు, ఉప్పు- తగినంత, ఉల్లికాడలు- మూడు, సన్నగా తరిగిన అల్లం- చెంచా, పచ్చిమిర్చి తరుగు- చెంచా, తరిగిన వెల్లుల్లి- రెండు చెంచాలు, సోయాసాస్- రెండు చెంచాలు

తయారీ: మైదా పిండిలో తగినంత ఉప్పు వేసి నీళ్లు పోసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఒక పాత్రలో చికెన్‌కీమా, ఉల్లికాడల తరుగు, పచ్చిమిర్చితరుగు, వెల్లుల్లి, సోయాసాస్ అన్నీ కలుపుకుని కడాయిలో వేయించుకోవాలి. మరోవైపు పిండితో పెద్ద చపాతీని ఒత్తుకుని ఏదైనా మూతసాయంతో గుండ్రని బిళ్లల్లా కత్తిరించుకోవాలి. ఈ చిన్న చపాతీలను అరచేతిలో ఉంచుకుని ఇందాక మనం తయారుచేసుకున్న మిశ్రమాన్ని చెంచా చొప్పున చపాతీల్లో ఉంచి అంచులని మూసేయాలి. ఆవిరి మీద ఇరవై నిమిషాలు ఉడికించుకోవాలి. లేదంటే.. మిశ్రమాన్ని ముందుగానే పాన్‌లో వేయించుకుని అప్పుడు చపాతీల్లో ఉంచి ఆవిరిమీద ఉడికించుకోవచ్చు. నూనెలో వేయించుకోవచ్చు.

పెప్పర్‌చిల్లీసాస్



ఎండుమిర్చిని చిన్నముక్కలుగా చేసుకుని వెనిగర్‌లో వేసి మూడుగంటల పాటు నానబెట్టుకోవాలి. ఎండుమిర్చి మెత్తబడిన తర్వాత కాస్త ఉప్పువేసి రుబ్బుకుంటే మోమోల్లోకి కావాల్సిన రెడ్‌చట్నీ రెడీ.

మోమో మసాలా



కాస్త చల్లగా ఉన్నప్పుడు ఎర్రకారం చట్నీతో వేడివేడి మోమోలు తింటే జలుబూ, గిలుబూ బలాదూర్! ఎర్రకారం చట్నీ చేసుకోవడానికి వీలుగా మిరియాలు, శొంఠి, యాలకులు, దాల్చిని వేసి మోమో మసాలాపొడి బజారులో దొరుకుతోంది.

స్వీట్‌కార్న్ మోమో



కావాల్సినవి: స్వీట్‌కార్న్- ఒక కప్పు(కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసినది), ఉల్లిపొరక- అరకప్పు(సన్నగా తరిగి పెట్టుకోవాలి), చిల్లీసాస్- మూడుచెంచాలు, మిరియాలపొడి- పావుచెంచా, మైదా- కప్పు, ఉప్పు- తగినంత, నూనె- తగినంత

తయారీ: గంట ముందుగా మైదా పిండిలో కొద్దిగా ఉప్పువేసి తగినన్ని నీళ్లుకలిపి చపాతీపిండిలా కలిపిపెట్టుకోవాలి. ఒకపాన్‌లో కొద్దిగా నూనె పోసుకుని వేడి చేసుకోవాలి. ఇందులో ఇందాక మనం రుబ్బుకున్న కార్న్ వేసి వేగనివ్వాలి. ఇందులోనే ఉల్లిపొరక కూడా వేసి పచ్చివాసన పోయిన తర్వాత సాస్, మిరియాలపొడి, ఉప్పు వేసి అన్నింటిని కలియనిచ్చి దింపేసుకోవడమే. ఇది చల్లారే లోపు మైదాపిండి ముద్దలని తీసుకుని పల్చగా చిన్న చపాతీల్లా చేసుకుని అందులో చెంచా కార్న్ మిశ్రమం పెట్టుకుని మన కజ్జికాయలు ఒత్తుకున్నట్టుగా అంచులని ఒత్తితే సరి. వీటిని ఇడ్లీ పాత్రలో కానీ, డిమ్‌సమ్ మేకర్ అని దొరుకుతుంది అందులో కానీ పెట్టి ఉడికించుకోవడమే. ఇడ్లీ పాత్రలో అయితే అడుగున నూనెకానీ, బటర్‌కానీ రాస్తే మోమోలు అడుగు అంటుకోవు.

గరిటె అదే తిప్పుతుంది!



అస్త్రం

సూపులు, సాసులు వంటివి తయారుచేసేటప్పుడు దగ్గరుండి గరిటెతో ఓపిగ్గా తిప్పుతూ వండాల్సిందే! ఏ మాత్రం ఒక క్షణం అటూఇటూ చూశామా.. పదార్థాల రూపు, రుచిమారిపోవడంతో పాటు పాత్రలకు అడుగు అంటుకుని శుభ్రం చేయడం కష్టమవుతుంది. సూపులు, సాసులే కాదు సాంబారు, కొన్ని రకాల మిఠాయిలు చేసేటప్పుడు కూడా పదార్థాలు ఉండకట్టకుండా గరిటెతో తిప్పాల్సి ఉంటుంది. అలాంటప్పుడు మీ చేతిలో ఆటోమేటిక్ స్టిరర్ ఉంటే చాలు.. ఎంచక్కా దానంతట అదే గరిటెను తిప్పిపెడుతుంది. ఈ పరికరాన్ని పాత్ర అంచులకు ఫిట్ చేసుకుంటే చాలు. బ్యాటరీ సాయంతో నడిచే ఈ పరికరం సుమారు గంటపాటు దానంతట అదే పదార్థాలని కలియతిప్పి పనిని తేలిక చేసిపెడుతుంది.



ట్రెండు గురూ!

సేంద్రియ చేపలు తిందామా..!



మంచి ఆహారంతోనే.. ఆరోగ్యవంతమైన సమాజం. ఈ ఆలోచనే ఆ యువకులను వైవిధ్యమైన లక్ష్యాన్ని ఎంచుకునేలా చేసింది. సేంద్రియ పద్ధతిలో మేకలు, గొర్రెలు, కోళ్లు, చేపల పెంపకానికి శ్రీకారం చుట్టేలా చేసింది. విజయవాడలో మొదలైన ఈ 'ఆర్గానిక్ మీట్' ట్రెండు గురించి తెలుసుకుందాం..

పురుగుమందులు, రసాయనాల ప్రస్తావన లేని సేంద్రియ వ్యవసాయం గురించి మనకు తెలుసు. మరి సేంద్రియ మాంసం గురించి తెలుసా?. కోళ్లు, మేకలు, గొర్రెలు, చేపలు, రొయ్యల పెంపకంలో కూడా ఎటువంటి రసాయనాల ప్రభావం లేకుండా పెంచుతూ ఆరోగ్యకరమైన రీతిలో ఉత్పత్తి చేసే మాంసమే సేంద్రియ మాంసం. బిట్స్ పిలానీలో బీటెక్ చదివిన గౌతమ్, లండన్‌లో విద్యను అభ్యసించిన ప్రమోద్, పుణెలో ఎంటెక్ చదివిన దాట్ల శశిధర్ వర్మ... ఈ ముగ్గురి ఆలోచనల్లోంచి పురుడుపోసుకున్నదే ఈ ఆర్గానిక్ మీట్ ఆలోచన. ఆలోచనైతే వచ్చింది కానీ... ఆచరణలో పెట్టడం అంత తేలిగ్గా అవ్వలేదు వాళ్లకి. ఈ ఆలోచన కార్యరూపంలోకి రావడానికి రెండేళ్లు పట్టింది. ఐటీడీఏ ఆధ్వర్యంలో... కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకంలో అనుభవం ఉన్న కొండప్రాంతవాసులతో ముందుగా మాట్లాడారు. వాళ్లకు మేకలు, గొర్రెలు, కోళ్లు ఇచ్చి... వాటి పెంపకంలో ఎటువంటి యాంటీబయోటిక్స్ వాడకుండా సహజసిద్ధ పద్ధతుల్లో పెంచేవిధంగా వారికి అవగాహన కల్పించారు. ఇచ్చిన వాటిల్లో నూటికి అరవై జంతువులు బతికినా చాలని వాళ్లకి భరోసా ఇచ్చారు. ఐటీడీఏ ద్వారా ఒక్కో కుటుంబానికి ఆరు పిల్లలు ఇచ్చారు. అలా 300 నుంచి 400 కుటుంబాలకు ఇచ్చారు. వాటినుంచి నికరంగా పది కిలోల మాంసం వచ్చే వరకు పెంచాలి. తయారైన గొర్రెలు, మేకలను తమకే ఇవ్వాలని ఒప్పందం చేసుకొని ఇచ్చారు. ఇందుకోసం రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆలోచన విజయవంతం అవ్వడంతో ఏడాది తరువాత విజయవాడ పటమట పంటకాల్వ రోడ్డులో 'ది హార్వెస్ట్ మీట్' కంపెనీ పేరుతో 2018 అక్టోబరులో స్టోర్‌ను ఏర్పాటు చేశారు.



నది చేపలను తీసుకొస్తున్నారు..

ఇక చేపల విషయానికి వస్తే .... పోలవరం డ్యామ్ దగ్గర నదిలో జాలర్లు చేపలు, రొయ్యలు పడుతుంటారు. అక్కడి జాలర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు గౌతమ్ బృందం. అక్కడ దొరికిన గాజు రొయ్యలు, పండుగొప్పలు, వంజరాలు, పీతల్ని తెచ్చుకుంటారు. వాటిని ట్యాంకుల్లో శుద్ధజలంలో పెంచుతున్నారు. సేంద్రియ మాంసానికి, బయట విక్రయించే మాంసానికి తేడా ఏం ఉంటుందనే సందేహం రావొచ్చు. ప్రకృతి సిద్ధంగా పెరిగిన గొర్రెలు, మేకల్లో అదనపు కొవ్వు ఉండదు. రుచిలో తేడా ఉంటుంది. ఎటువంటి రసాయనాల ప్రభావం ఉండదు. మాంసం, చేపలు కడగడానికి, శుభ్రం చేయడానికి దేన్నికైనా శుభ్రమైన ఆర్వో నీటినే వాడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో గొర్రె మాంసం కేజీ రూ.600కు ఇస్తుంటే, హార్వెస్ట్ మీట్ కంపెనీలో కేజీ రూ.700కు విక్రయిస్తున్నారు. నెలకు వెయ్యి కిలోల మటన్, 4వేల కిలోల చికెన్ విక్రయాలు జరుపుతున్నామని శశిధర్ తెలిపారు. ఆదివారానికి రెండు, మూడు రోజులు ముందుగానే కొరమీనులను బుక్ చేసేసుకుంటున్నారట స్థానికులు.

చిరుతిళ్లనీ అందిస్తున్నారు..

మాంసాహార ప్రియులు, నగర వాసులు సాయంసంధ్యవేళ రుచికరమైన మాంసాహార వంటలను ఆరగించేందుకు వీలుగా స్నాక్స్ విభాగాన్ని కూడా ఇటీవల ప్రారంభించారు. నగరంలోని రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులంతా ఇక్కడి ఖాతాదారులే.

- షేక్ ముర్తుజా, అమరావతి

ఆ నేల... ఆ నీరుతో జపాన్ సేక్!



విదేశీ రుచి

అచ్చంగా, స్ఫటికంలా... హిమగిరుల నుంచి సేకరించిన నీళ్లలా ఉండే ఆ పానీయం పేరు సేక్. జపాన్ బియ్యం, జపాన్ నీళ్లతో మాత్రమే తయారయ్యే ఈ సేక్ పానీయానికి ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది..



మా నేల, మా నీరు అనడంలో ఎంతో గర్వం ఉంటుంది. జపనీయులు కూడా అలానే భావిస్తారు. భావించడమే కాదు ఆ గర్వానికి ఓ రుచిని అద్ది చూపిస్తే ఎలా ఉంటుందో కూడా చూపిస్తారు. అవును సేక్ పానీయాన్ని శాకా మాయి అనే బియ్యంతో తయారుచేస్తారు. ఈ రకం బియ్యం జపాన్‌లో మాత్రమే పండుతుంది. అలానే ఇనుము, మాంగనీస్ లేని ప్రత్యేకమైన భూగర్భ జలాలని ఎంచుకుని ఆ నీటితో శాకామాయి బియ్యాన్ని పులియబెట్టి సేక్ పానీయాన్ని తయారుచేస్తారు. ఈ బియ్యం కోసం ఏడాదికి ఒకే పంట వేస్తారు. ఆ తర్వాత ఆ నేలని అలానే వదిలేస్తారు. ఆ బియ్యాన్ని తినడానికి వాడరు. కేవలం సేక్ తయారుచేయడానికి మాత్రమే వాడతారు. ప్రత్యేకమైన రుచితోపాటు ఔషధాలగనిగా పేరొందిన సేక్‌కి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. సేక్‌ని నిల్వ చేయడానికి ప్రత్యేకమైన పాత్రలు వాడతారు. ఒక్కొక్కరు వేడిగా తాగితే... కొందరు పాత్రలతో సహా ఫ్రిజ్‌లో పెట్టి చల్లగా తాగుతారు.